మంగళవారం 10-12-2024

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 259

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'



ఆర్‌బీఐ కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా

బ్యాంకింగ్ రెగ్యులేటర్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) 26వ గవర్నర్‌గా రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రాను ప్రభుత్వం నియమించింది. ఆయన పేరును కేబినెట్ నియామకాల కమిటీ ఖరారు చేసింది. బుధవారం మల్హోత్రా బాధ్యతలు స్వీకరిస్తారు. ప్రస్తుత గవర్నర్ శక్తికాంతదాస్ నేడు పదవీ విరమణ చేస్తారు.

- వివరాలు 15లో

గమ్యం లేని కాంగ్రెస్ నావకు

చుక్కానిగా తెలంగాణ సర్కార్!



- డబ్బుల సంచులు అందుతుండటం వల్లే హైకమాండ్ మద్దతిస్తోంది
- విజయోత్సవాల పేరిట ప్రజాధనం దుర్వినియోగం

'సాక్షి' ఇంటర్వ్యూలో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి

- వివరాలు 12లో



తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమంలో సీఎం రేవంత్, కోమటిరెడ్డి

తెలంగాణ తల్లి.. మన అమ్మ రూపమే

నాలుగు కోట్ల బిడ్డల భావోద్వేగానికి నిండైన రూపమిది

శాసనసభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటన

- వజ్ర వైఢూర్యాలు, భుజకీర్తులు, కిరీటాలతో దేవతలా ఉండాలా? లేదా మన అమ్మలా ఉండాలా? అని చర్చించాం
- అమ్మలాగే ఉండాలని కవులు, కళాకారులు, మేధావులు సూచించారు
- సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక నేపథ్యాల ఆధారంగా విగ్రహాన్ని తీర్చిదిద్దాం... విగ్రహావిష్కరణ కొందరికి నచ్చడం లేదు
- కేవలం ఒక వ్యక్తి, కుటుంబం, పార్టీ ఆలోచనే.. మొత్తం 4 కోట్ల మంది ప్రజల ఆలోచన కాదు
- 2009 డిసెంబర్ 9న తెలంగాణ ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు ప్రకటన వచ్చింది... తెలంగాణ ఇచ్చిన సోనియా జన్మదినం కూడా డిసెంబర్ 9నే..
- ఆమెకు శుభాకాంక్షలు తెలిపి కృతజ్ఞతలు చూపాల్సిన అవసరముంది
- ఇకపై ఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాలు నిర్వహిస్తామని వెల్లడి

విధ్వంసం నుంచి పునర్నిర్మాణం వైపు అడుగులు

- ఉద్యమ ఆకాంక్షలకు భిన్నంగా గత ప్రభుత్వ పాలన
- సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సభలో రేవంత్‌రెడ్డి

3లో

సాక్షి, హైదరాబాద్: ''తెలంగాణ ప్రతీక, భావన, అస్తిత్వం ఉట్టిపడేలా తెలంగాణ తల్లి రూపం ఉండాలని కవులు, కళాకారులతోపాటు తెలంగాణ సంస్కృతి పట్ల అంకితభావం కలిగిన వారందరితో చర్చించాం. తెలంగాణ మూర్తి దేవతలా వజ్ర వైఢూర్యాలు, భుజకీర్తులు, కిరీటాలతో ఉండాలా? మన అమ్మలా ఉండాలా? అనే ప్రస్తావన వచ్చింది. దేవత గుడిలో ఉంటుంది. తల్లి ఇంట్లో ఉంటుంది. తల్లి ప్రతిరూపమే ఉండాలని మేధావులు సూచించారు. తెలంగాణ తల్లిని చూస్తే సొంత మాతృమూర్తిని చూసిన భావన కలుగుతుంది''అని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర సచివాలయం ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణపై సోమవారం ఉదయం శాసనసభలో ఆయన ప్రకటన చేశారు. రేవంత్ చెప్పిన అంశాలు ఆయన మాటల్లోనే..

''తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ దురదృష్ట వశాత్తూ కొందరికి నచ్చలేదు. ఒక వ్యక్తి, ఒక కుటుంబం, ఒక పార్టీ ఆలోచనే 4 కోట్ల ప్రజల ఆలోచన అనుకోవడం సమంజసం కాదు. మధ్యయుగాల నాటి

మిగతా 2వ పేజీలో ▶

అసెంబ్లీలోకి బీఆర్ఎస్‌కు

నో ఎంట్రీ



కేటీఆర్‌ను వాహనంలోకి ఎక్కిస్తున్న పోలీసులు

గేటు వద్దే ఎమ్మెల్యేలను అడ్డుకున్న పోలీసులు

అదానీ-రేవంత్ చిత్రాలున్న టీషర్టులు ధరించినందుకు అనుమతి నిరాకరణ

- పోలీసుల తీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన.. తెలంగాణ భవన్‌కు తరలింపు... అక్కడే నిరసన కొనసాగించిన బీఆర్ఎస్ఎల్పీ
- ప్రభుత్వ నిర్బంధానికి వ్యతిరేకంగా పోరాడతామన్న కేటీఆర్

2లో



'ఈనాడు, ఆంధ్రజ్యోతి'పై

రూ.100 కోట్లకు పరువు నష్టం దావా

'సెకీ'తో విద్యుత్తు కొనుగోలు ఒప్పందంపై ఆ మీడియాల్లో వాస్తవాల వక్రీకరణ

నాపై ప్రచురించిన, ప్రసారం చేసిన కథనాలను తొలగించేలా వాటిని ఆదేశించండి

- బేషరతుగా క్షమాపణలు చెప్పి ప్రముఖంగా ప్రచురించేలా ఆదేశాలివ్వండి
- ఢిల్లీ హైకోర్టును అభ్యర్థించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- జగన్ పరువు నష్టం దావాపై స్పందించిన ఢిల్లీ హైకోర్టు..
- ఈనాడు, ఆంధ్రజ్యోతికి సమన్లు.. ఆ కథనాలు, పోస్టులు తొలగించే వ్యవహారంలో నోటీసులు... ఈ ఉత్తర్వుల తర్వాత ఏ కథనాలు ప్రచురించినా తెలిసే ప్రచురించినట్లు భావిస్తామన్న కోర్టు... తదుపరి విచారణ ఈ నెల 16కి వాయిదా

12లో

అసెంబ్లీలోకి బీఆర్ఎస్‌కు నో ఎంట్రీ



హుందాగా మాట్లాడాలి... ఎవరూ నోరు జారొద్దు

- సభకు రాకపోతే ఎమ్మెల్యేలుగా విఫలమైనట్టే.. ప్రతి పనినీ బీఆర్ఎస్ విమర్శిస్తోంది: సీఎం రేవంత్
- అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎల్పీ భేటీ.. హాజరైన టీపీసీసీ చీఫ్

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యులు హుందాగా మాట్లాడాలని, పొరపాటున కూడా నోరు జారకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సభ జరిగినన్ని రోజులు విధిగా హాజరు కావాలని, సభకు రాకపోతే ఎమ్మెల్యేలుగా విఫలమైనట్టేనని అన్నారు. అసెంబ్లీ శీతాకాల సమావేశాల సందర్భంగా సోమవారం ఉదయం అసెంబ్లీ కమిటీ హాల్‌లో కాంగ్రెస్ శాసనసభాపక్షం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సమావేశమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏడాది పాటు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలను ఎమ్మెల్యేలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. తాము ఏ పని చేసినా విమర్శించడమే పనిగా బీఆర్ఎస్ వ్యవహరిస్తోందని, ఆ పార్టీ తీరును ప్రజల్లో ఎండగట్టాలని పిలుపునిచ్చారు. డిసెంబర్ 9కి ఎంతో ప్రాధాన్యత ఉందని, తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియాగాంధీ జన్మదినంతో పాటు తెలంగాణ ఏర్పాటు చేస్తున్నట్టు చిదంబరం ప్రకటించిన రోజు అని, అందుకే డిసెంబర్ 9ని తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవంగా గుర్తిస్తున్నామన్నారు. పదేళ్లపాటు తెలంగాణ తల్లి విషయంలో గత పాలకులు నిర్లక్ష్యం వహించారని, ఇప్పుడు తెలంగాణ తల్లి రూపకల్పనలో అన్ని జాగ్రత్తలు తీసుకుని, అమ్మను చూసిన భావన రావాలనే ఆలోచనతో నమూనా రూపొందించామన్నారు. ఎమ్మెల్యేలంతా సభా వ్యవహారాలను పూర్తి స్థాయిలో పరిశీలించాలని, ప్రతి నిబంధనను అర్థం చేసుకుని సభా నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలని చెప్పారు. ఈ సమావేశానికి టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ హాజరై ప్రసంగించారు. రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ సమావేశానికి హాజరయ్యారు.

గేటు వద్దే ఎమ్మెల్యేలను అడ్డుకున్న పోలీసులు

అదానీ-రేవంత్ చిత్రాలున్న టీషర్టులు ధరించినందుకు అనుమతి నిరాకరణ



గన్‌పార్కులోని తెలంగాణ అమరుల స్తూపం వద్ద నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ శీతాకాల సమావేశాల తొలిరోజున అసెంబ్లీకి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకున్నారు. 'అదానీ, రేవంత్ భాయ్ భాయ్'అంటూ ఇద్దరి ఫొటోలతో టీ షర్టులను ధరించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. టీ షర్టులను తీసేసి లోనికి రావాలని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పార్లమెంటు సమావేశాలకు అదానీ టీ షర్టులు ధరించి వెళ్తే అక్కడి పోలీసులు అనుమతించారని.. ఇక్కడ అభ్యంతరం ఎందుకని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్రశ్నించారు. అయినా పోలీసులు ససేమిరా అనడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసనకు దిగారు. దీంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని తెలంగాణ భవన్‌కు తరలించగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అక్కడ నిరసనను కొనసాగించారు. సీఎం రేవంత్, కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ తీరును ఎండగట్టారు. సభలో ప్రధాన ప్రతిపక్షం అడుగు పెట్టకుండా ప్రభుత్వం కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. అంతకుముందు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో ఉదయం 9:30 గంటలకు అసెంబ్లీకి ఎదురుగా ఉన్న గన్‌పార్కులోని తెలంగాణ అమరుల స్తూపానికి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నివాళులర్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో కేసీఆర్ నిరాహార దీక్షతో దిగొచ్చిన నాటి కేంద్రం 2009 డిసెంబర్ 9న తెలంగాణ ఏర్పాటుపై ప్రకటన చేసిందన్నారు.

సమాధానం చెప్పే దమ్ములేకే అడ్డుకుంటోంది: కేటీఆర్

'సీఎం రేవంత్ అధికారంలోకి వచ్చాక అదానీకి అనుచిత లబ్ధి చేకూర్చేలా కుట్రలకు పాల్పడుతున్నాడు. ఢిల్లీలో అదానీతో కొట్లాడుతున్నట్లు కాంగ్రెస్ నాటకాలు ఆడుతుంటే తెలంగాణలో మాత్రం ప్రాజెక్టులు, వనరులను దోచిపెట్టే కుట్ర జరుగుతోంది. కాంగ్రెస్‌కు పార్లమెంటులో ఒక నీతి.. శాసనసభలో మరో నీతి ఎలా ఉంటుంది? అసెంబ్లీ సమావేశాల తొలిరోజే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను బయట నిలబెట్టారు. ఢిల్లీలో కుస్తీ, గల్లీలో దోస్తీలా వ్యవహరిస్తున్న రేవంత్ వైఖరిని ఎండగట్టేందుకే నిరసన తెలుపుతున్నాం. బీఆర్ఎస్‌కు సమాధానం చెప్పే దమ్ములేక పోలీసులను అడ్డుపెట్టుకొని ప్రభుత్వం మమ్మల్ని అడ్డుకుంటోంది. 2009 నవంబర్ 29న కేసీఆర్ దీక్ష లేకుంటే డిసెంబర్ 9న తెలంగాణపై ప్రకటన వచ్చి ఉండేదే కాదు. శాసనసభ హక్కులను కాలరాస్తూ అసెంబ్లీలోకి వెళ్లకుండా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అడ్డుకోవడం సరికాదు. స్పీకర్ ఆదేశాలతో పనిలేకుండా ప్రభుత్వంలోని వ్యక్తులు ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. కాంగ్రెస్ సర్కార్ విధిస్తున్న నిర్బంధాలు, చేస్తున్న దాడులకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ చేస్తున్న పోరాటాన్ని ఆపేది లేదు'అని కేటీఆర్ ప్రకటించారు.

భూముల ధరలు పెరుగుతున్నయ్.. మాకూ ఓ ఎకరం ఇస్తారా?

- జిల్లాలకు వచ్చినప్పుడు ఏ పని అడిగినా ఓకే అంటున్నారు
- సెక్రటేరియట్‌కు వచ్చి పని అడిగితే పైసల్లేవంటున్నారు
- నాడు వైఎస్ హయాంలో.. తర్వాత ఇప్పుడే ఆర్థిక క్రమశిక్షణ కనిపిస్తోంది

అసెంబ్లీ లాబీలో భట్టి, కోమటిరెడ్డిల మధ్య సరదా చర్చ

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలు విలేకరుల సమక్షంలో సరదాగా మాట్లాడుకున్నారు. సోమవారం అసెంబ్లీ లాబీలోని డిప్యూటీ సీఎం చాంబర్‌కు మంత్రి వెంకట్‌రెడ్డి వచ్చారు. ఈ సందర్భంగా అక్కడే కొందరు జర్నలిస్టులతో కలిసి కాసేపు సంభాషించారు. తన కొడుకు చనిపోయినప్పుడు పడిన బాధ...బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్టు పూర్తి చేయడం కోసం పడ్డానని ఈ సందర్భంగా కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు. దీంతో స్పందించిన భట్టి...ఈ ప్రాజెక్టు కోసం 2004 నుంచి వెంకట్‌రెడ్డి పోరాడుతున్నాడని, అప్పట్లో వైఎస్‌తో కొట్లాడి ప్రాజెక్టు మంజూరు చేయించుకున్నారని, వెంకన్న జన్మ ధన్యమైందని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే నల్లగొండలో కూడా గోదావరి తరహాలో నీళ్లు పారుతాయని, భూముల ధరలు పెరుగుతాయన్న భట్టి తనకు కూడా ఒక ఎకరం ఇవ్వొచ్చు కదా.. ఇళ్లు కట్టుకుంటాం అని సరదాగా అన్నారు. వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలకు వచ్చినప్పుడు ఏ పని అడిగినా ఓకే అని భట్టి అంటున్నారని చెప్పారు. సెక్రటేరియట్ స్థాయిలో పనుల కోసం వస్తే మాత్రం పైసల్లేవని అంటున్నారని వ్యాఖ్యానించారు. ఆర్థిక క్రమశిక్షణ పాటించకపోతే ఎంతటి ధనిక రాష్ట్రమైనా దివాలా తీస్తుందని, ఆర్థిక క్రమశిక్షణ వైఎస్ హయాంలో ఉందని, మళ్లీ ఇప్పుడు కనిపిస్తోందన్నారు. అప్పట్లో తాము సీఎం రాజశేఖరరెడ్డి దగ్గరకు వెళ్లి ప్రతిపాదనలపై అనుమతి సంతకాలు తీసుకొని ఆర్థిక మంత్రి రోశయ్య దగ్గరకు వెళితే.. ఆయన పెద్దమనిషి తరహాలో ఆయన ఏది అడిగినా ఇచ్చేస్తారు? ఇక్కడ ఉండాలి(నిధులు) కదా అని చమత్కరించేవారని కోమటిరెడ్డి అన్నారు. ఉద్యోగులకు ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు ఇస్తామంటే తాను కూడా నమ్మలేదని, కానీ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఆర్థికశాఖను క్రమశిక్షణతో నడిపిస్తూ సుసాధ్యం చేశారన్నారు. రెసిడెన్షియల్ పాఠశాలలు కట్టి విద్యార్థులకు అందిస్తే చరిత్రలో నిలిచిపోతామని చెప్పారు. తెలంగాణ ప్రజల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదన్నారు. తాము ఇప్పటికీ టీపీసీసీ అని పెట్టుకుంటున్నామని, కానీ వారుమాత్రం టీ తీసేసి బీఆర్ఎస్‌గా మారారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ లేకుండా కేటీఆర్ ఎమ్మెల్యే అయ్యేవాడు కాదని, కేటీఆర్‌కు తమకు పోలికేంటని ప్రశ్నించారు. భవిష్యత్‌లో కేటీఆర్ ముఖ్యమంత్రి అయినా తాము పట్టించుకోబోమని మంత్రి కోమటిరెడ్డి ఎద్దేవా చేశారు.



తెలంగాణ తల్లి.. మన అమ్మ రూపమే

▶ మొదటి పేజీ తరువాయి

చక్రవర్తుల ఆలోచనతో ప్రజాప్రభుత్వం నడవదు. రాష్ట్రానికి గుండెకాయలాంటి సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించబోతున్నాం. ఎలాంటి రాజకీయ వివాదాలకు తావులేకుండా 4 కోట్ల ప్రజలు ఏకమై జరుపుకొంటే బాగుంటుంది.

బిడ్డల భావోద్వేగానికి నిండైన రూపం..

నాలుగు కోట్ల మంది బిడ్డల భావోద్వేగానికి నిండైన రూపం తెలంగాణ తల్లి. మన సాంప్రదాయాలు, సంస్కృతులు, చారిత్రక నేపథ్యాలను పరిగణనలోకి తీసుకుని ఒక నిండైన రూపాన్ని తీర్చిదిద్దడం జరిగింది. ప్రశాంత వదనం, సాంప్రదాయ కట్టూబొట్టు, మెడకు కంటె, గుండు పూసల హారం, చెవులకు బుట్ట కమ్మలు, ముక్కు పుడకతో బంగారు అంచు కలిగిన ఆకుపచ్చ చీరలో, చేతికి గాజులు, కాళ్లకు కడియాలు, మెట్టెలతో, చాకలి ఐలమ్మ, సమ్మక్క - సారలమ్మ పోరాట స్ఫూర్తితో, హుందాతనంతో కూడిన ఆహార్యంతో మన తెలంగాణ తల్లి రూపుదిద్దుకుంది. కుడిచేతితో జాతికి అభయమిస్తూ, ఎడమ చేతిలో తెలంగాణ మాగాణంలో పండే వరి, జొన్నలు, సజ్జలు, మొక్కజొన్నతో... మన సంస్కృతి, సాంప్రదాయానికి నిలు వెత్తు రూపంగా తెలంగాణ తల్లి రూపాన్ని తీర్చిదిద్దడం జరిగింది. తెలంగాణ తల్లి నిలబడిన పీఠం మన చరిత్రకు దర్పణంగా రూపొందించాం. ఉద్యమాలు, పోరాటాలు, అమరుల ఆత్మ బలిదానాలకు సంకేతంగా బిగించిన పిడికిళ్లను పీఠంలో పొందుపరిచాం. పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని ప్రపంచంలోనే సమున్నతంగా నిలబెట్టాలన్న లక్ష్యాన్ని గుర్తు చేస్తూ.. చేతులన్నీ కలిపి పీఠాన్ని మోస్తున్న తీరు తెలంగాణ పునర్నిర్మాణ రీతిని తెలియజేస్తుంది.

ఆ వర్ణాలకు గొప్ప తాత్వికత ఉంది..

తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనలో వాడిన వర్ణాలకు గొప్ప తాత్వికత ఉంది. 'గోదావరి కృష్ణమ్మలు తల్లీ నిను తడుపంగ' అనే అందెశ్రీ గీతంలోని తెలంగాణ జలదృశ్యానికి పీఠంలోని నీలం వర్ణం ప్రతీకగా నిలుస్తుంది. 'పచ్చని మా నేలల్లో పసిడి సిరులు పండంగ' అనే తెలంగాణ సస్యశ్యామల వ్యవసాయ కీర్తికి సంకేతంగా ఆకుపచ్చ వర్ణం కనిపిస్తుంది. మార్పునకు, ప్రగతికి, చైతన్యానికి ప్రతీకగా ఎరుపు వర్ణం నిలుస్తుంది. శుభానికి, ఐశ్వర్యానికి, సమృద్ధికి నిదర్శనంగా బంగారు వర్ణం నిలబడుతుంది. తెలంగాణ సాంస్కృతిక పునరుజ్జీవనంలో భాగంగా ఉద్యమకాలం నాటి ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణ సంక్షిప్త నామంగా 'టీజీ'ని.. రాష్ట్ర అధికారిక గీతంగా 'జయ జయహే తెలంగాణ..'ను ఇప్పటికే ప్రకటించాం.



ఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాలు

స్వరాష్ట్ర పోరాటంలో సకల జనులు, సబ్బండ వర్గాలను ఐక్యం చేసి లక్ష్యసాధన వైపు నడిపించిన శక్తి స్వరూపిణి తెలంగాణ తల్లి. తెలంగాణ తల్లికి సంబంధించి పలు రూపాలు జనబాహుళ్యంలో ఉన్నా దేనికీ అధికారిక గుర్తింపు లేదు. మాతృమూర్తిని గౌరవించుకునేందుకు ప్రజాప్రభుత్వం 'తెలంగాణ తల్లి'కి రూపకల్పన చేసింది. తెలంగాణ ఏర్పడ్డాక 10 ఏళ్ల రాష్ట్ర అధికారిక గీతం, అధికారికంగా తెలంగాణ తల్లి విగ్రహం లేకపోవడం ఒక లోటు. ఇక ఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించాం.

సోనియా పుట్టినరోజు కావడంతో..

తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నామని 2009 డిసెంబర్ 9న నాటి కేంద్ర హోంమంత్రి చిదంబరం ప్రకటించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్ష నెరవేరడానికి పునాది పడిన రోజు అది. సోనియా గాంధీ జన్మదినం ఇదే రోజు. ఆమెకు శుభాకాంక్షలు తెలిపి తెలంగాణ ప్రజలు కృతజ్ఞత చూపాల్సిన అవసరం ఉంది. తెలంగాణ కోసం శ్రీకాంతాచారి, కానిస్టేబుల్ కిష్టయ్య, యాదయ్య, ఇషాన్‌రెడ్డి ఆత్మబలిదానాలు చేశారు. కళ్ల ముందే ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ నేలకొరగడంతో.. బలిదానాల బాధ ఆమెకు తెలుసు. అందుకే ఎన్ని అడ్డంకులొచ్చినా తెలంగాణ ఇచ్చారు.

16కి అసెంబ్లీ వాయిదా

- వచ్చే సోమవారం బీఏసీ భేటీ..

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ శీతాకాల సమావేశాలు సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రారంభ మయ్యాయి. తొలి రోజున తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణపై సీఎం ప్రకటన, దానిపై ప్రసంగాలకే శా సనసభ, మండలి పరిమితం అయ్యాయి. ఉభయ సభలు ఈనెల 16వ తేదీ (సోమవారం)కి వాయిదా పడ్డాయి. అదే రోజున ఉదయం స్పీకర్ అధ్యక్షతన జరిగే బీఏసీ భేటీలో శీతాకాల సమావేశ తేదీలు, ఎజెండాను ఖరారు చేయనున్నారు.

సీఎం ప్రకటన, చర్చతో ముగింపు

సోమవారం ఉదయం 10.30 గంటలకు అసెంబ్లీ ప్రారంభమైన వెంటనే ఈ నెల 11, 12 తేదీల్లో రెండు రోజుల పాటు ఎమ్మెల్యేల శిక్షణ కార్యక్రమం ఉంటుందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ప్రకటించారు. సభ్యులు ఈ అవకాశం వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి ఏటా డిసెంబర్ 9వ తేదీన 'తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవం'లా నిర్వహిస్తామని ప్రకటన చేశారు. దీనిపై సుమారు మూడున్నర గంటల పాటు చర్చ జరగగా.. కాంగ్రెస్, బీజేపీలకు చెందిన 29 మంది సభ్యులు మాట్లాడారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రసంగంతో ఈ చర్చ ముగిసింది. పోలీసులు అడ్డుకోవడంతో సభలోకి రాలేక బీఆర్ఎస్ సభ్యులకు చర్చలో పాల్గొనే అవకాశం రాలేదు. ఎంఐఎం సభ్యులు చర్చలో పాల్గొనలేదు. ఇక సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌కు స్పీకర్ ప్రసాద్‌కుమార్ ధన్యవాదాలు తెలిపారు. అనంతరం శాసనసభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు.

సభ ముందుకు ఐదు చట్ట సవరణ ఆర్డినెన్స్‌లు

సమావేశాల తొలిరోజున 5 ఆర్డినెన్స్‌లను సీఎం సభ ముందు పెట్టారు. తెలంగాణ జీతాలు, పింఛన్ చెల్లింపులు, అనర్హతల తొలగింపు (చట్ట సవరణ) ఆర్డినెన్స్-2024, తెలంగాణ పురపాలక సంఘాల (చట్ట సవరణ) ఆర్డినెన్స్-2024, హైదరాబాద్ మహానగర పాలక సంస్థ (చట్ట సవరణ) ఆర్డినెన్స్-2024, తెలంగాణ వస్తుసేవల పన్ను (చట్ట సవరణ) ఆర్డినెన్స్-2024, తెలంగాణ పంచాయతీరాజ్ (చట్ట సవరణ) ఆర్డినెన్స్‌ను కూడా సభలో ప్రవేశపెట్టారు. 2022-23 సంవత్సరానికి సంబంధించిన తెలంగాణ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ 9వ వార్షిక నివేదిక, 2021-22 సంవత్సరానికి సంబంధించిన రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ 7వ వార్షిక నివేదికలను సంబంధిత మంత్రులు సభకు సమర్పించారు.

విగ్రహాన్ని మార్చకుండా చట్టం!

- శాసన మండలిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటన
- విగ్రహ ఏర్పాటుపై రాజకీయం తగదు: పీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్
- ఆత్మగౌరవానికి ప్రతీక తెలంగాణ తల్లి విగ్రహం: కోదండరాం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ జాతి ఆత్మగౌరవానికి చిహ్నంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. భవిష్యత్తులో తెలంగాణ తల్లి విగ్రహంలో ఎలాంటి మార్పులు చేయకుండా చట్టం చేసేదిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తోందని తెలిపారు. అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో భాగంగా శాసన మండలిలో తొలి రోజున తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణపై భట్టి విక్రమార్క ప్రకటన చేశారు. అనంతరం జరిగిన చర్చలో సభ్యులు మాట్లాడారు తెలంగాణ ఏర్పాటైన పదకొండేళ్లకు తమ ప్రభుత్వం రాష్ట్ర గీతాన్ని ఆమోదించిందని, తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించి, ఆవిష్కరించిన ఘనత కూడా తమదేనని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని వాస్తవ పరిస్థితులకు అద్దంపట్టేలా తెలంగాణ తల్లి విగ్రహం ఉందని ఎమ్మెల్సీ, పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. విగ్రహ ఏర్పాటుపై రాజకీయం చేయడం తగదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని స్వాగతిస్తున్నామని, భవిష్యత్తులో ప్రభుత్వాలు విగ్రహరూపంలో మార్పులు చేయకుండా చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి కోరారు. ఈ చర్చ ముగిసిన తర్వాత మండలిని ఈ నెల 16వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు.

పోరాట వారసురాలిగా విగ్రహం: కోదండరాం

తెలంగాణ సంస్కృతి, ఆత్మగౌరవానికి తెలంగాణ తల్లి ప్రతీకగా నిలుస్తోందని ఎమ్మెల్సీ కోదండరాం అన్నారు. తెలంగాణలో ప్రధాన వృత్తి వ్యవసాయమ ని, తెలంగాణ పోరాటానికి వారసురాలిగా విగ్రహం ఉందని చెప్పారు. ఆత్మగౌరవం ఉట్టిపడేలా కళాకారులు విగ్రహానికి రూపకల్పన చేశారని పేర్కొన్నారు.

క్లుప్తంగా...

నెలకోసారి హాస్టళ్లకు వెళ్తాం: భట్టి

సాక్షి, హైదరాబాద్: ప్రతి నెలా ఒకరోజు రాష్ట్రంలోని సంక్షేమ హాస్టళ్లకు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్లు వెళ్తారని, అక్కడే పిల్లలతో కలిసి భోజనం చేస్తారని, ఈనెల నుంచే రాష్ట్రంలో ఆ కార్యక్రమం ప్రారంభమవుతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. సోమవారం అసెంబ్లీ లాబీల్లో ఆయన విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపర్చేందుకు రూ.5 వేల కోట్లు వెచ్చించబోతున్నామని వెల్లడించారు. పదేళ్ల కాలంలో విద్యార్థుల డైట్ చార్జీలు పెంచలేదని, తాము అధికారంలోకి వచ్చాక 40 శాతం డైట్‌చార్జీలు పెంచి విద్యార్థులకు మెరుగైన ఆహారాన్ని అందిస్తున్నామని భట్టి చెప్పారు.

ట్రాక్టర్‌పై బీజేపీ ఎమ్మెల్యేలు



సాక్షి, హైదరాబాద్: సోమవారం శాసనసభ శీతాకాల సమావేశాలు ప్రారంభమైన సందర్భంగా ముగ్గురు బీజేపీ ఎమ్మెల్యేలు ట్రాక్టర్‌పై అసెంబ్లీ వద్దకు వచ్చారు. బీజేఎల్పీ ఉపనేత పాయల్‌శంకర్ ట్రాక్టర్‌ను నడపగా, వెనక సీట్లో రామారావు పటేల్, పాల్వాయి హరీశ్‌బాబు కూర్చుని వచ్చారు. ఎమ్మెల్యేలు శాసనసభ ప్రాంగణంలోకి వెళ్లేందుకు ఉపయోగించే ప్రధాన ద్వారం వద్ద వీరు ప్రయాణిస్తున్న వాహనాన్ని పోలీసులు నిలిపివేశారు. అనంతరం వారంతా కలిసి అక్కడి నుంచి నడుచుకుంటూ అసెంబ్లీలోకి వచ్చారు. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే టి.రాజాసింగ్ వ్యక్తిగత కారణాల వల్ల తొలిరోజు సమావేశానికి హాజరుకాలేదని పార్టీవర్గాల సమాచారం.

ఇదంజగత్



నెక్స్ట్ మనం అధికారంలోకి వస్తే విగ్రహాన్ని ఇలా మార్చుకుందాం సార్!

నేను ఎమ్మెల్యేనా? కాదా?



మంత్రులు మమ్మల్ని గౌరవించడం లేదు

- ప్రొటోకాల్ ఉల్లంఘించి అడుగడుగునా అగౌరవపరుస్తున్నారు
- శాసనసభలో సర్కారుపై బీజేపీ సభ్యుడు రాకేశ్‌రెడ్డి ధ్వజం
- బెదిరిస్తే భయపడబోమంటూ బదులిచ్చిన మంత్రి శ్రీధర్‌బాబు
- ప్రివిలేజ్ కమిటీ సమావేశం నిర్వహించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి
- తెలంగాణపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదన్న మంత్రి కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్

ప్రొటోకాల్ పాటించకుండా మంత్రులు అడుగడుగునా తమను అవమానిస్తున్నారంటూ బీజేపీ సభ్యుడు పైడి రాకేశ్ రెడ్డి చేసిన ఆరోపణలతో సోమవారం శాసనసభలో అధికార కాంగ్రెస్, విపక్ష బీజేపీ సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణపై చర్చ సందర్భంగా సభకు కాసేపు అంతరాయం కలిగింది. 'ఈ గుర్తింపు కార్డు శాసనసభ ఇచ్చిందా కాదా? నేను ఎమ్మెల్యేనా కాదా? మంత్రులంటే మాకు గౌరవం. వారు మమ్మల్ని గౌరవించకపోతే ఎలా? దక్షిణ తెలంగాణకు నిధులన్నీ దోచుకుపోతున్నారు. సమసమాజం అనే మంత్రి సీతక్క మాకు రూ. 5 కోట్ల ముంత ఇచ్చారు. కాంగ్రెస్ వాళ్లకు బిందె ఇచ్చారు'అని రాకేశ్‌రెడ్డి తీవ్ర ఆవేశంతో విమర్శలు గుప్పించారు. తెలంగాణ మిగులు బడ్జెట్ రాష్ట్రంగా ఉన్నప్పుడు తెలంగాణ తల్లి విగ్రహానికి వజ్రవైఢూర్యాలుండేవని.. ఇప్పుడు అప్పుల రాష్ట్రంగా మారడంతో ఆభరణాలు పోయాయని ప్రజలు చర్చుకుంటున్నారని ఎద్దేవా చేశారు. విగ్రహాల బదులు ప్రజల తలరాతలు మార్చాలని సూచించారు. తెలంగాణ తల్లి విగ్రహానికి ఉన్న అభయ హస్తాన్ని చూసి జనం ఆమెను కాంగ్రెస్ తల్లి అంటున్నారని పేర్కొన్నారు. దీంతో ఆయన వ్యాఖ్యలపై అధికారపక్ష సభ్యులు అభ్యంతరం తెలిపారు.

మంత్రి శ్రీధర్‌బాబు కౌంటర్

'స్పీకర్‌కు ఆపాదించి విమర్శలు చేయొద్దు. ఇలా బెదిరిస్తే బెదరం'అని రాకేశ్‌రెడ్డికి శాసనసభా వ్యవహారాల మంత్రి డి.శ్రీధర్‌బాబు కౌంటర్ ఇచ్చారు. ప్రొటోకాల్ సమస్యలపై చర్చించడానికి ప్రివిలేజ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. బీజేపీ సభ్యులను చర్చకు స్పీకర్ పిలిస్తే తాను కూడా వచ్చి సమస్యను తెలుసుకొని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేస్తానన్నారు. విగ్రహావిష్కరణపై చర్చకు కట్టుబడి మాట్లాడాలని బీజేపీ సభ్యులకు సూచించారు.


కేసీఆర్ వస్తారనుకున్నాం..

బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేత కేసీఆర్ సభకు హాజరై తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణపై రెండు మాటలు చెప్తారనుకున్నామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. సభకు గైర్హాజరయ్యే ఉద్దేశంతోనే అసెంబ్లీ



నిబంధనలకు విరుద్ధంగా బీఆర్ఎస్ సభ్యులు వ్యవహరించారని విమర్శించారు. భేషజాలను, రాజకీయాలను పక్కనపెట్టి విగ్రహావిష్కరణలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం సదుద్దేశంతో తెలంగాణ తల్లి విగ్రహానికి రూపకల్పన చేసిందని బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యానించారు.

ఆ హక్కు బీఆర్ఎస్‌కు లేదు: మంత్రి కోమటిరెడ్డి



తెలంగాణపై మాట్లాడే హక్కు బీఆర్ఎస్‌కు లేదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి విమర్శించారు. టీఆర్ఎస్‌ను బీఆర్ఎస్‌గా మార్చుకోవడం ద్వారా ఆ పార్టీ తెలంగాణ పదాన్ని దూరం చేసుకుందని తప్పుబట్టారు. మరోవైపు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ (టీపీసీసీ)గా తెలంగాణ పదం తమ పార్టీలోనే ఉందని చెప్పారు. చాకలి ఐలమ్మలాగా, మన అమ్మలాగా ఉండేలా తెలంగాణ తల్లి విగ్రహాన్ని రూపొందించామన్నారు. మరోవైపు సీపీఐ పక్ష నేత కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ బీఆర్ఎస్ అనుకున్నట్టే విగ్రహాలు, కవులు, కళాకారులుండాలంటే కుదరదని స్పష్టం చేశారు. గతంలో తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పనలో ప్రతిపక్షాలను పిలిచారా? అని కేసీఆర్‌ను ప్రశ్నించారు. తల్లి ఎప్పుడూ బంగారు వడ్డానం, ఆభరణాలు పెట్టుకోదన్నారు. కాగా, తెలంగాణ తల్లి విగ్రహం మార్పు సహా పలు నిర్ణయాల విషయంలో ప్రభుత్వం అన్ని పక్షాల అభిప్రాయాన్ని తీసుకుంటే బాగుండేదని బీజేపీ సభ్యుడు పాయల్ శంకర్ అభిప్రాయపడ్డారు. అయితే మరో బీజేపీ సభ్యుడైన పాల్వాయి హరీశ్‌బాబు మాత్రం విగ్రహ మార్పును విమర్శించారు. అయితే బీజేపీ సభ్యుల వాదనను మంత్రి పొన్నం ప్రభాకర్ తోసిపుచ్చారు. గతంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని అధికారికంగా ఏర్పాటు చేయలేదని, విగ్రహాలు మార్చామని చెప్పి సభను తప్పుదోవ పట్టించొద్దన్నారు.

ప్రధాన ప్రతిపక్షం సభకు రాకుండా కుట్ర: జగదీశ్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: శాసనసభ సమావేశాలు సజావుగా జరగకుండా ప్రయత్నాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం.. ప్రధాన ప్రతిపక్షం సభకు రాకుండా కుట్ర పన్నుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి విమర్శించారు. శాసనసభలోకి రాకుండా ప్రధాన ప్రతిపక్షాన్ని అడ్డగించడం దారుణమని, అదానీ, రేవంత్ బొమ్మ ఉన్న టీషర్ట్‌లతో సభకు వెళ్తే తప్పేంటని ప్రశ్నించారు. శాసన మండలిలో ప్రతిపక్ష నేత ఎస్.మధుసూదనాచారితో కలిసి తెలంగాణ భవన్‌లో సోమవారం జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఓ వైపు అదానీ దుర్మార్గాలపై రాహుల్ గాంధీ పార్లమెంటులో మాట్లాడుతుంటే.. ఇక్కడ మాత్రం రేవంత్ వెనకేసుకు వస్తున్నాడన్నారు. తెలంగాణ సంపదను అదానీకి దోచిపెట్టేందుకు రేవంత్ కుట్ర పన్నాడని ఆరోపించారు. ఉభయ సభలను స్పీకర్, చైర్మన్‌కు బదులుగా సీఎం నడుపుతున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షాన్ని సభలోకి రాకుండా అడ్డుకోవడం శాసనసభ్యుల హక్కులను కాలరాయడమేనని ఎమ్మెల్సీ మధుసూదనాచారి మండిపడ్డారు.

అసెంబ్లీ చర్చలో ప్రసంగాలు..

ప్రతీ డిసెంబర్ 9న పర్వదినం: భట్టి విక్రమార్క



తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవాన్ని ఏటా డిసెంబర్ 9న అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. శాసనసభలో ఆయన మాట్లాడారు. జాతీయ పర్వదినం మాదిరిగా రాష్ట్ర అవతరణకు అంతే ప్రాధాన్యం ఉంటుందని, ఇందుకు సంబంధించి గెజిట్ కూడా విడుదల చేస్తామని చెప్పారు. ''బీఆర్ఎస్ నేతలకు అధికారంపై ధ్యాసే తప్ప, తెలంగాణ తల్లిపై గౌరవం లేదు. సోనియా గాంధీ చొరవ వల్లే తెలంగాణ ఏర్పడిందని చెబుతూ కేసీఆర్ ఆమెకు ఇదే సభలో ధన్యవాదాలు కూడా తెలిపారు. సచివాలయంలో అద్భుతంగా తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ చేస్తున్నాం. ఇది రాష్ట్రమంతా పండుగలా జరుపుకొంటుంటే బీఆర్ఎస్ నేతలు సభలో లేకపోవడం దారుణం. కేటీఆర్, హరీశ్‌రావు సభలో ఉండి అభిప్రాయాలు చెబితే బాగుండేది. తెలంగాణ తల్లి విగ్రహం చూస్తుంటే మన అమ్మ., నాయనమ్మ కనిపిస్తోంది. చేతులెత్తి మొక్కాలనిపిస్తోంది..''అని చెప్పారు.

అమ్మను చూసినట్టుంది



తెలంగాణ తల్లి విగ్రహాన్ని చూస్తే సొంత తల్లిని చూసినట్టుందని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. శాసనసభలో ఆయన మాట్లాడుతూ.. ''సోనియా త్యాగం వల్లే తెలంగాణ ఏర్పడింది. ఇందుకు ఆమెకు కృతజ్ఞతలు చెబుతున్నాం. అన్ని వర్గాల మనోభావాలకు తగ్గట్టుగానే తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన జరిగింది.''అని చెప్పారు.

తెలంగాణ చరిత్ర చాటి చెప్పాలి



తెలంగాణ ఏర్పాటు చరిత్రను ప్రజలకు గుర్తు చేయాల్సిన అవసరం ఉందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని జిల్లాల్లో కలెక్టర్, ఎస్పీ కార్యాలయాలతోపాటు, మండల స్థాయి కార్యాలయాల్లో ఏర్పాటు చేస్తామని తెలిపారు.

రాష్ట్రం ఇచ్చిన ఘనత సోనియాదే



ఎన్ని రాజకీయ ఒత్తిడులున్నా సోనియా ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. రాష్ట్ర సాధన కోసం ఎన్నో పోరాటాలు చేశామని గుర్తు చేసుకున్నారు. తెలంగాణకు సోనియా చేసిన కృషి శాశ్వతంగా ఉండేందుకు డిసెంబర్ 9న కార్యక్రమాలు ఘనంగా జరుపుకోవాలన్నారు.

అస్తిత్వానికి ప్రతిరూపం



తెలంగాణ బిడ్డల అస్తిత్వానికి ప్రతిరూపంగా తెలంగాణ తల్లి విగ్రహం ఉందని మంత్రి సీతక్క చెప్పారు. ''తెలంగాణ వాళ్లు మట్టిబిడ్డలు. గట్టి వాళ్లు. అంతే తప్ప వెట్టి బిడ్డలు కాదు. బీఆర్ఎస్ సర్కార్ పదేళ్ల పాలనలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయలేదు. ఇప్పుడు మేం ఏర్పాటు చేస్తే రాజకీయం చేస్తున్నారు..''అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, బీజేపీ ఒకే మాటతో నడుస్తున్నాయని విమర్శించారు.




ప్రముఖ రచయిత అందెశ్రీని సన్మానిస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి. చిత్రంలో శాంతికుమారి, పొంగులేటి, కోమటిరెడ్డి, జూపల్లి, మండలి చైర్మన్ గుత్తా, శ్రీధర్‌బాబు, పొన్నం, స్పీకర్ ప్రసాద్‌కుమార్, దామోదర రాజనర్సింహ







తెలంగాణ తల్లి కాంస్య విగ్రహ రూపశిల్పి రమణారెడ్డి, విగ్రహ రూపకర్త గంగాధర్‌ను సన్మానిస్తున్న సీఎం రేవంత్



ప్రభుత్వ పథకాలపై ప్రదర్శించిన డ్రోన్ షో..





విధ్వంసం నుంచి పునర్నిర్మాణం వైపు అడుగులు..

సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సభలో రేవంత్‌రెడ్డి

ఉద్యమ ఆకాంక్షలకు భిన్నంగా గత ప్రభుత్వ పాలన

ఒక వ్యక్తి, కుటుంబం, పార్టీ కోసం తెలంగాణ తెచ్చుకోలేదు

అందరితో చర్చించి కన్నతల్లి ప్రతిరూపంగా తెలంగాణ తల్లి విగ్రహ రూపకల్పన.. ఉద్యమానికి ఊపిరులూదిన 9 మంది కవులకు తగిన గౌరవం

రూ.కోటి, ఫ్యూచర్ సిటీలో 300 గజాల స్థలం ఇస్తామని ప్రకటన

సాక్షి, హైదరాబాద్: ఉద్యమకారుల ఆకాంక్షలకు భిన్నంగా పదేళ్ల పాటు రాష్ట్రంలో పాలన సాగిందని, దాన్ని సరిదిద్దుతూ అందరికీ ఆమోదయోగ్యంగా ప్రజాపాలన సాగిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రాన్ని సంక్షోభం నుంచి సంక్షేమం వైపు, అవినీతి నుంచి అభివృద్ధి వైపు.. విధ్వంసం నుంచి పునర్నిర్మాణం వైపు తీసుకెళుతున్నామని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం సోమవారం సాయంత్రం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభలో సీఎం ప్రసంగించారు. వివరాలు ఆయన మాటల్లోనే..

"భూమిపై ఏ ప్రాంతంలోనైనా, ఎవరికైనా గుర్తింపు తల్లితోనే. మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిరూపం తల్లి. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ సంస్కృతిపై దాడి చేయడమే కాదు, అవమానించారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఒక వ్యక్తి, ఒక రాజకీయ పార్టీ వారి గురించి మాత్రమే ఆలోచించి 4 కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షలను పక్కనపెట్టారు. ప్రజాప్రభుత్వంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని సహచర మంత్రులతో చర్చించి అందరికీ ఆమోదయోగ్యమైన తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నాం.

కన్నతల్లి ప్రతిరూపంగా..

ఉద్యమకాలంలో ఆలె నరేంద్ర, విజయశాంతి, కేసీఆర్ వంటి వారితోపాటు వివిధ రాజకీయ పార్టీలు తెలంగాణ తల్లి ప్రతిమను వివిధ రూపాల్లో ప్రతిష్ఠించుకున్నారు. కానీ ఇప్పటివరకు తెలంగాణ తల్లి రూపాన్ని అధికారికంగా ప్రకటించలేదు. ఈ క్రమంలోనే ప్రజా ప్రభుత్వం బహుజనుల తల్లి రూపమే తెలంగాణ తల్లి రూపంగా అధికారికంగా ప్రకటించింది. తెలంగాణ తల్లిని చూస్తే కన్నతల్లి ప్రతిరూపంగా స్ఫురిస్తోంది. డిసెంబర్ 9న మన ఆలోచనలన్నీ అమ్మ చుట్టూనే ఉండాలని ఒక పండుగలా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

గత సర్కారు ఉద్యమ ఆకాంక్షలను పట్టించుకోలేదు..

తెలంగాణ ఉద్యమ సమయంలో యువతరం తమ వాహనాల మీద, గుండెల మీద టీజీ అని రాసుకున్నారు. కానీ తెలంగాణ ఏర్పడ్డ తర్వాత ఉద్యమకారుల ఆకాంక్షలకు వ్యతిరేకంగా గత పాలకులు టీజీ బదులు టీఎస్ అని పెట్టారు. అందుకే ప్రజా ప్రభుత్వం ఏర్పడిన వెంటనే టీజీ కోడ్‌ను అధికారికంగా వాహనాలకు ఏర్పాటు చేసేలా మార్చాం. ఉద్యమంలో స్ఫూర్తిని నింపిన, ఉస్మానియా, కాకతీయ వర్సిటీలలో నినదించిన 'జయ జయహే తెలంగాణ'గీతాన్ని ఇన్నాళ్లూ రాష్ట్ర గీతంగా ప్రకటించలేదు. ప్రజాప్రభుత్వంలో ఆ గీతాన్ని రాష్ట్ర గీతంగా ప్రకటించుకున్నాం. రాష్ట్ర పరిపాలనకు గుండెకాయ లాంటి సచివాలయంలో ఈ గేయాన్ని రాసిన కవి అందెశ్రీని సన్మానించుకోవడం నాకు జీవితకాలం గుర్తుండే సందర్భం.

9 మంది కవులకు

రూ.కోటి నగదు.. 300 గజాల ఇంటి స్థలం

తెలంగాణ ఉద్యమంలో స్ఫూర్తిని నింపిన కవులు, ఉద్యమకారులను గుర్తించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తెలంగాణ కోసం సర్వం ధారపోసిన కవులను గుర్తించి, గౌరవించాలని, ఆదుకొని అండగా నిలవాలని ఆలోచించింది. గూడ అంజయ్య, గద్దర్, బండి యాదగిరి, అందెశ్రీ, గోరేటి వెంకన్న, సుద్దాల అశోక్ తేజ, జయరాజు, పాశం యాదగిరి, ఎక్కా యాదగిరిరావు తదితరులకు ఫోర్త్ సిటీలో 300 గజాల ఇంటిస్థలంతోపాటు రూ.కోటి నగదు అందించనున్నాం. వారి త్యాగాలు మరువలేనివి. వారిని గుండెల్లో పెట్టుకొని చూస్తూ, భుజాలమీద మోస్తాం. ఇంటి స్థలం, డబ్బు ఇవ్వడమో అనికాదు.. ప్రజాప్రభుత్వం వారి త్యాగాన్ని గుర్తించి, గౌరవిస్తుందనే సంకేతాన్ని ప్రపంచానికి తెలియజేయాలనేదే మా ఉద్దేశం. కొందరికి బాధ, ఆవేదన ఉండొచ్చు. వాళ్ల రాజకీయ మనుగడకు ఈ నిర్ణయాలు ప్రమాదకరమని అనుకోవచ్చు. కానీ ఒక వ్యక్తి కోసమో, కుటుంబం కోసమో, ఒక రాజకీయ పార్టీ కోసమో మనం తెలంగాణ సాధించుకోలేదు. నాలుగు కోట్ల ప్రజల ఆకాంక్ష మేరకే తెలంగాణ. ఉమ్మడి రాష్ట్రంలో అవమానాలు ఎదుర్కొన్నాం.. తెలంగాణలో పదేళ్ల నిర్లక్ష్యానికి గురయ్యాం. ఇక అలాంటి అవమానాలు, నిర్లక్ష్యాలు ఉండకూడదని.. ఏటా డిసెంబర్ 9న తెలంగాణ తల్లి అవతరణ వేడుకలు ప్రభుత్వ పరంగా నిర్వహిస్తాం.."అని సీఎం రేవంత్ ప్రకటించారు.

ఈ రోజు చరిత్రలో నిలిచిపోతుంది: భట్టి విక్రమార్క

తెలంగాణ ప్రజలు తలెత్తుకునే విధంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠించుకున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. విగ్రహావిష్కరణ సభలో ఆయన మాట్లాడారు. "తెలంగాణ తల్లి విగ్రహ ఆవిష్కరణతో ఈరోజు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చుతున్నారని విమర్శలు చేస్తున్నవారు.. గత పదేళ్ల అధికారంలో ఉండి తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎందుకు ప్రతిష్ఠించలేదో చెప్పాలి. మన సాంప్రదాయాలు, సంస్కృతులు, చారిత్రక నేపథ్యాలను పరిగణనలోకి తీసుకొని తెలంగాణ తల్లికి నిండైన రూపాన్ని ఇచ్చాం.."అని భట్టి చెప్పారు.

అదిరిన డ్రోన్ షో.. అలరించిన తమన్ మ్యూజిక్

సాక్షి, హైదరాబాద్/ఖైరతాబాద్: ప్రజాపాలన విజయోత్సవాల ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను అలరించాయి. సచివాలయ ఆవరణలో సోమ వారం సాయంత్రం సీఎం రేవంత్ రెడ్డి చేతులు మీదుగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రముఖ రచయిత అందెశ్రీ, తెలంగాణ తల్లి విగ్రహ రూప కర్త ప్రొఫెసర్ గంగాధర్, కాంస్య విగ్రహ రూపశిల్పి ఎంవీ రమణారెడ్డిలను సన్మానించారు. కాంగ్రెస్ పాలనలో అమలు చేసి న ప్రజా సంక్షేమ పథకాలతో రాత్రి 7:30 గంటలకు డ్రోన్ షో ఏర్పాటు చేశారు. ఇది ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరా మహిళాశక్తి, ఉద్యో గ నియామకాలు, రాజీవ్ ఆరోగ్య శ్రీ, తదితర పథకాలను ఈ డ్రోన్ షోలో ప్రద ర్శించారు. వేలాదిమంది మహిళలు, కాంగ్రెస్ అభిమానులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలతో నెక్లెస్ రోడ్, ఎన్టీఆర్ పార్కు దారులు కిక్కిరిసిపోయాయి. సాగర తీరాన ఏర్పాటు చేసిన బాణసంచా నిప్పులు చిమ్ము తూ, రంగురంగుల్లో, వివిధ ఆకృతులతో ఔరా అనిపించింది. సాగరతీరంలో ప్రముఖ సినీ సంగీత దర్శకుడు తమన్ బృందం సంగీత కచేరి విశేషంగా ఆకట్టుకుంది. పాటలు..మాటలతో ప్రజలను ఉర్రూతలూగించారు. మాంగల్యం తంతునాం.. కళావతి, కళావతి, బుట్టబొమ్మా బుట్టబొమ్మా అంటూ తమన్ పాడిన పాటలకు ప్రేక్షకులతోపాటు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి స్టెప్పులు కలిపారు. ఆహా తెలుగు ఐడల్ విన్నర్స్‌తోపాటు సింగర్ శ్రీకృష్ణ, నజీరుద్దీన్, రజిని, శ్రీపూర్ణిమలతోపాటు రామారావు కీబోర్డు, పవన్‌సాయి డ్రమ్స్‌తో ఆకట్టుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ విజయలక్ష్మి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. విజయోత్సవాల సందర్భంగా ట్యాంక్‌బండ్, నెక్లెస్ రోడ్డు, సచివాలయం, అమరవీరుల స్థూపం, లుంబినీ పార్క్, ఎన్టీఆర్ గార్డెన్, నెక్లెస్ రోడ్డు, ఇందిరాగాంధీ చౌరస్తా తదితర ప్రాంతా లన్నీ రంగు రంగుల విద్యుత్ కాంతులతో మిరుమిట్లు గొలిపాయి.

తలరాతల బదులు 'తల్లి'ని మారుస్తారా?

గండిమైసమ్మ సభలో రాష్ట్ర ప్రభుత్వంపై కేటీఆర్ ధ్వజం

సీఎం రేవంత్ తెలంగాణ అస్తిత్వంపై దాడి చేస్తున్నారని ఆరోపణ

మేడ్చల్ జిల్లా పార్టీ కార్యాలయం ప్రారంభం.. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ



తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

దుండిగల్: ప్రభుత్వాలు మారితే ప్రజల తలరాతలు మార్చాలని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లిని మారుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ అస్తిత్వంపై దాడి చేస్తూ చరిత్ర ఆనవాళ్లను నాశనం చేసేందుకు కుట్రపన్నుతున్నారని ఆరోపించారు. సోమవారం గండిమైసమ్మలో మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. 'రేవంత్‌రెడ్డి రాసిపెట్టుకో.. మా ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన తొలిరోజే సచివాలయం నుంచి రాజీవ్‌గాంధీ, కాంగ్రెస్ తల్లి విగ్రహాలను తొలగించి గాంధీ భవన్‌కు తరలిస్తాం'అని కేటీఆర్ స్పష్టం చేశారు.

కేసీఆర్ దీక్షను తక్కువ చేసి చూపేలా కుయుక్తులు..

తన శవయాత్రనో లేక జైత్రయాత్రనో అనే విధంగా బీఆర్ఎస్ (నాటి టీఆర్ఎస్) అధినేత కేసీఆర్ ఉక్కు సంకల్పంతో 2009 నవంబర్ 29న ఆమరణ నిరాహార దీక్షకు కూర్చున్న రోజును ఏటా దీక్షా దివస్‌గా ఘనంగా జరుపుకుంటున్నామని.. 11 రోజులపాటు ప్రాణాలను పణంగా పెట్టి దేశంలోని అన్ని పార్టీల మద్దతు కూడగట్టి తెలంగాణ దశాబ్దాల కలను నెరవేర్చే విధంగా కేసీఆర్ చేసిన దీక్ష, అమరుల ప్రాణత్యాగాల ఫలితంగానే 2009 డిసెంబర్ 9న ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు దిశగా ప్రకటన వెలువడిందని కేటీఆర్ గుర్తుచేశారు. అలాంటి పవిత్ర దినాన్ని వక్రీకరించే విధంగా.. కేసీఆర్ దీక్షను తక్కువ చేసి చూపేలా కాంగ్రెస్ నేతలు కుయుక్తులు పన్నుతున్నారని దుయ్యబట్టారు. కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ రాష్ట్ర సాధన జరిగిందనే విషయం తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. అదే సమయంలో సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ద్రోహిగా మిగిలిపోతాడని వ్యాఖ్యానించారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో చరిత్ర మాయం..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే చరిత్రను మాయం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ తల్లిని మారుస్తూ కాంగ్రెస్ తల్లిని తీసుకొచ్చిందని విమర్శించారు. టీఎస్‌ను టీజీగా మార్చారని.. ఆర్టీసీ చిహ్నంలోంచి కాకతీయ కళాతోరణాన్ని మాయం చేశారని.. తెలంగాణ తల్లి విగ్రహంలో బతుకమ్మ మాయమైందని, కిరీటాన్ని తొలగించారని కేటీఆర్ మండిపడ్డారు. ఆలిని మార్చే వాళ్లు ఉంటారుగానీ తల్లిని మార్చే వారిని కాంగ్రెస్ నేతలనే చూస్తున్నామని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ తీరుకు నిరసనగా మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలకు పాలాభిషేకాలు చేయాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. అలాగే సోషల్ మీడియా గ్రూపుల్లో డీపీగా తెలంగాణ తల్లి విగ్రహాన్ని పెట్టాలని సూచించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచేలా పనిచేయాలని కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

ఉద్యమ తల్లిని కాంగ్రెస్ తల్లిగా మార్చారు: కవిత

సాక్షి, హైదరాబాద్ : ఉద్యమకాలంలో రూపొందించిన తెలంగాణ తల్లిని కాంగ్రెస్ తల్లిగా మార్చిన సీఎం రేవంత్‌రెడ్డి దుశ్చర్యతో..తెలంగాణ తల్లి కన్నీళ్లు పెడుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాంగ్రెస్ తల్లిని తాము తిరస్కరిస్తున్నామని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని రహదారిపై ఏర్పాటు చేసి తెలంగాణ తల్లిని సచివాలయ ఆవరణలో చెరసాలలో పెట్టినట్టుగా బంధించారన్నారు. తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను దూరం చేసి బతుకును ఆగం చేశారని చెప్పారు. రేవంత్‌రెడ్డికి తెలంగాణ తల్లి పేరును పలికే అర్హత లేదని, విగ్రహ స్వరూపాన్ని మార్చి అవమానించిన సీఎం.. గన్‌పార్కు వద్ద ముక్కు నేలకు రాయాలన్నారు. 'పువ్వులను పూజించే బతుకమ్మ పండుగ తెలంగాణకు మాత్రమే ప్రత్యేకం. బతుకమ్మను తెలంగాణ తల్లి నుంచి మాయం చేయడం దురదృష్టకరం'అని కవిత పేర్కొన్నారు.



తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ సభకు హాజరైన జనం.. (ఇన్‌సెట్‌లో) బాణసంచా కాంతులు..



> జంతువుల పట్ల క్రూరంగా ఉండేవాడు మంచి మనిషి కాలేడు.
> – ఆర్థర్ షోపెన్‌హావర్

సాక్షి

మంగళవారం, 10 డిసెంబర్ 2024

ముందున్న సవాలు

21వ శతాబ్దంలో అత్యంత దీర్ఘకాలం సాగిన యుద్ధం... లక్షలాది ప్రజల ప్రాణాలు తీసి, మరెందరినో వలస బాట పట్టించి, శరణార్థులుగా మార్చిన యుద్ధం... ఎట్టకేలకు ఒక ముగింపునకు వచ్చింది. సంక్షుభిత సిరియా చరిత్రలో కొత్త అధ్యాయం మొదలైంది. అధ్యక్షుడు బషర్ – అల్ – అసద్ పాలనకు ఆదివారం ఆకస్మికంగా తెరపడడంతో సిరియాలో అంతర్యుద్ధం కొత్త మలుపు తిరిగింది. అలెప్పో, హమా, హామ్స్‌ల తర్వాత డమాస్కస్ సైతం తిరుగుబాటు శక్తుల వశం కావడంతో సిరియా రాజకీయ, సైనిక దృశ్యం సమూలంగా మారిపోనుంది. ఈ పరిణామాల ప్రభావం ఆ ప్రాంతమంతటా కనిపించనుంది. దాదాపు 53 ఏళ్ళ పైచిలుకు నిరంకుశ కుటుంబ పాలన పోయినందుకు సిరియన్లు సంబరాలు చేసుకుంటున్నా, తరువాతి పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకంగా మారింది. తిరుగుబాటు తర్వాత డమాస్కస్‌లో సాగుతున్న విధ్వంసం, లూటీ దృశ్యాలు 2021లో అఫ్ఘానిస్తాన్‌లో జరిగిన సంఘటనల్ని తలపిస్తున్నాయి. అక్కడ తాలిబన్ల లానే ఇక్కడ ఇస్లామిస్ట్ బృందాలు సైతం గద్దెనెక్కాక వెనకటి గుణం మానక నిజ స్వభావం చూపిస్తాయని భయాందోళనలు రేగుతున్నాయి. వెరసి, అసలే రగులుతున్న పశ్చిమాసియా కుంపటికి కొత్త సెగ వచ్చి తోడైంది.

చరిత్ర గమనిస్తే, ప్రజాగ్రహ ఉద్యమం 2011 మార్చిలోనే సిరియాను తాకింది. ఎప్పటికప్పుడు కూలిపోవడం ఖాయమని భావించినా, అసద్ ఏలుబడి వాటన్నిటినీ తట్టుకొని, దాటుకొని వచ్చింది. జనాగ్రహాన్ని ఎదుర్కొనేందుకు ఆయన తీవ్ర హింసకు పాల్పడ్డారు. స్వదేశీయులపైనే ఒక దశలో రసాయన ఆయుధాలు వాడినట్లు ఆరోపణలూ వచ్చాయి. సిరియాకు ఆయన పీడ ఎప్పుడు వదులుతుందా అని ఎదురుచూస్తున్న పరిస్థితి తెచ్చాయి. దాదాపు దశాబ్ద కాలం దూరం పెట్టాక, అరబ్ ప్రపంచం గత ఏడాది మళ్ళీ చేరదీయడం అసద్‌కు కలిసొస్తుందని భావించారు. అయితే, అరబ్ రాజ్యాలు తమ స్వలాభం కోసమే ఆ పని చేశాయి. అసద్ పోతే వచ్చే తెలియని దేవత కన్నా తెలిసిన దయ్యం మేలని భావించాయి. వారం రోజుల క్రితం దాకా ఈ పాలనకు చరమగీతం తథ్యమని ఎవరూ ఊహించ లేదు. రష్యా, ఇరాన్, హెజ్బుల్లాల అండతో అసమ్మతిని అణచివేస్తూ, అసద్ అధికారాన్ని నిలబెట్టుకుంటూ వచ్చారు. అయితే, కొద్ది రోజుల క్రితం ఒక్కసారిగా మళ్ళీ తిరుగుబాటు బృందాలు విజృంభించడంతో నాటకీయంగా కథ అడ్డం తిరిగింది.

ఒక పక్క ఉక్రెయిన్‌తో పోరాటం నేపథ్యంలో రష్యా వైమానిక సాయం ఉపసంహరించుకోగా, మరోపక్క ఇజ్రాయెల్‌తో యుద్ధం వల్ల హెజ్బొల్లా వనరులు క్షీణించాయి. ఇదే అదనుగా ఇస్లామిస్ట్ గ్రూప్ హయత్ – తహ్రీర్ అల్ – షామ్ (హెచ్‌టీఎస్) సారథ్యంలోని తిరుగుబాటుదారులు చకచకా ముందుకు చొచ్చుకువచ్చారు. అసద్‌కు పట్టున్న ప్రాంతాలన్నీ కైవసం చేసుకుంటూ, ఆఖరికి అధికార పీఠానికి ప్రతీక అయిన డమాస్కస్‌ను చేజిక్కించుకోవడంతో ఏళ్ళ తరబడి సాగుతున్న నియంతృత్వానికి తెరపడింది. పదవీచ్యుతుడైన అధ్యక్షుడు విమానంలో పలాయనం చిత్తగించాల్సి వచ్చింది. అసద్ పదవీచ్యుతి ప్రభావం ప్రాంతీయంగా గణనీయమైనది. ఆ ప్రాంతంలో ఇంతకాలంగా స్నేహంగా మెలిగిన కీలక దేశం సిరియాలో అనుకూల పాలన పోవడం ఇరాన్‌కు వ్యూహాత్మకంగా ఇబ్బందికరమే. మరోపక్క హెజ్బుల్లా భవిష్యత్తూ అనిశ్చితిలో పడింది. తిరుగుబాటుదారులకు తెర వెనుక అండగా నిలిచిన టర్కీ ఇప్పుడిక అక్కడ చక్రం తిప్పే సూచనలున్నాయి. అయితే, టర్కీ ప్రయోజనాలకూ, ప్రాంతీయ శక్తులకూ మధ్య వైరుధ్యం తలెత్తితే ఉద్రిక్తతలు పెరుగుతాయి.

మానవ హక్కులను సైతం కాలరాస్తున్న నియంతృత్వంపై పోరాటం ఎవరు, ఎక్కడ చేసినా అది సమర్థనీయమే. ప్రపంచం సంతోషించాల్సిన అంశమే. నియంతృత్వం పోయి ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడుతుందని ఆశిస్తాం. కానీ, అసద్ పాలన స్థానంలో రానున్న పాలన ఏమిటన్నది ప్రశ్న. ఒకటికి పది సంస్థలు ఈ సాయుధ తిరుగుబాటును నడిపాయని విస్మరించలేం. అసద్‌ను గద్దె దింపడం సరే కానీ, అనేక వైరుధ్యాలున్న ఇవన్నీ ఒకతాటిపైకి రావడం, రేపు సజావుగా పాలన సాగించడం సాధ్యమేనా అన్నది బేతాళప్రశ్న. తీవ్రవాద అల్‌ఖైదాకు ఒకప్పటి శాఖ అయిన హెచ్‌టీఎస్ లాంటి తీవ్రవాద సంస్థలు తమను తాము జాతీయవాద శక్తులుగా చెప్పుకుంటున్నా, అవి తమ వెనకటి స్వభావాన్ని వదులుకుంటాయా అన్నదీ అనుమానమే. అదే గనక జరగకపోతే... దశాబ్దాలుగా అల్లాడుతున్న సిరియా, అక్కడి సామాన్యుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టవుతుంది.

ఒకప్పటి సంపన్న సిరియా దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురై, అంతర్యుద్ధంలో మగ్గుతూ శిథిలాల కుప్పగా మారింది. అసద్ హయాంలో దాదాపు 1.2 కోట్లమంది దేశం విడిచి పోవాల్సి వచ్చింది. ఉద్రిక్తతా నివారణ జోన్లలో అతి పెద్దదైన ఒక్క ఇడ్లిబ్ ప్రావిన్స్‌లోనే సుమారు 20 లక్షల మంది శరణార్థులుగా బతుకీడుస్తున్నారు. తాజా పరిణామాలతో ఆ దేశాన్ని రాజకీయంగా, సామాజికంగా ఒక గాడిన పెట్టాల్సిన తరుణమిది. స్వేచ్ఛా వాయువులు పీలుస్తున్న సిరియన్లు సైతం ఈ భగీరథ ప్రయత్నంలో భాగస్వాములవ్వాలి. అలాగే, ఆంక్షల విధింపుతో అసద్ పతనానికి దోహద పడ్డ పాశ్చాత్య దేశాలు సైతం సిరియా వాసుల కష్టాల తొలగింపుపై దృష్టి పెట్టాలి. తద్వారా వేలాది సిరియన్ శరణార్థులు స్వచ్ఛందంగా స్వదేశానికి వచ్చి, దేశ పునర్నిర్మాణంలో భాగమయ్యే వీలు చిక్కుతుంది. అసద్ పదవీచ్యుతితో సిరియా పునర్నిర్మాణానికి అవకాశం అంది వచ్చినా, అందుకు సవాలక్ష సవాళ్ళున్నాయి. మితవాద, అతివాద బృందాల సమ్మేళనమైన ప్రతిపక్షం సైనిక విజయం నుంచి సమర్థమైన పరిపాలన వైపు అడుగులేయడం ముఖ్యం. అందులో జయాపజయాలను బట్టే సిరియా భవితవ్యం నిర్ణయం కానుంది. అందుకే, రానున్న కొద్ది వారాల పరిణామాలు కీలకం.

సంబంధాల్లో సహనం అవసరం

విశ్లేషణ



మనోజ్ జోషి

షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూల్చివేసినప్పటి నుండీ... హింస, అశాంతితో బంగ్లాదేశ్ అతలాకుతలమవుతోంది. విస్తృత సరిహద్దు రీత్యా, అక్కడి పాలనా విధానాలు మన దేశ భద్రతపై కీలక ప్రభావం చూపుతున్నాయి. బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఆవిర్భవించడంలో భారత్ పాత్ర ఉన్నప్పటికీ, ఇరు దేశాల సంబంధాలు హెచ్చు తగ్గులను చూస్తూ వచ్చాయి. ఇటీవల శ్రీలంక, మాల్దీవులు, నేపాల్ లాంటి పొరుగు దేశాలతో దెబ్బతిన్న సంబంధాలను విజయవంతంగా నిర్వహించిన అనుభవంతో భారత్ పాఠాలు నేర్చుకోవాలి. బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించే ప్రక్రియలో తోడ్పాటు అందించాలి. హసీనాకు ఏకపక్ష మద్దతివ్వడం వల్ల మన ఉద్దేశ్యాలపై అనుమానం ఏర్పడిందనీ, మన విధానాలను దిద్దుకోవాల్సిన అవసరం ఉందనీ అర్థం చేసుకోవాలి.

షేక్ హసీనా ప్రభుత్వాన్ని ఒక ప్రజా తిరుగుబాటుతో కూల్చివేసినప్పటి నుండీ, హింస, అశాంతితో బంగ్లాదేశ్ అతలాకుతలమవుతోంది. అక్కడి మైనారిటీ హిందూ సమాజాన్ని లక్ష్యంగా చేసుకున్నారు. ఈ సంఘటనల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన భారత ప్రభుత్వం 'మైనారిటీలతో సహా బంగ్లాదేశ్ పౌరులందరి భద్రతకు, రక్షణకు ప్రాథమిక బాధ్యత బంగ్లాదేశ్ ప్రభుత్వానిదే' అని స్పష్టం చేసింది.

బంగ్లాదేశ్ పరిణామాలను రెండు రకాలుగా చూడవచ్చు. మొదటిది, హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ ప్రభుత్వ ఉక్కు పాదాన్ని తొలగించిన తర్వాత... ఇస్లామిస్టులు, పాకిస్తాన్‌కి చెందిన ఇంటర్-సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) పట్టు సాధించారు. ఈ క్రమంలో హిందూ మైనారిటీలు హింసకు గురవుతున్న సందర్భంగా ఆ దేశం పాక్షిక అరాచక స్థితికి చేరుకుంటోంది. రెండవ పరిణామం ఏమంటే, గత దశాబ్ద కాలంగా నిజమైన ప్రజాస్వామ్యం లేని బంగ్లాదేశ్, తాత్కాలిక ప్రభుత్వ ఆధ్వర్యంలో అడుగులేయడానికి ప్రయత్నిస్తూ ఒక తాత్కాలిక దశ గుండా పయనిస్తోంది.

సరిహద్దుల చుట్టూ?

బంగ్లాదేశ్ బహుశా దక్షిణాసియాలో భారతదేశానికి అత్యంత పర్యవసానాలతో కూడిన పొరుగు దేశం. దాని సరిహద్దులను దాదాపు భారత్ పరివేష్టించి ఉంది. 4,367-కిలోమీటర్ల సరిహద్దులో, కేవలం 271 కిలోమీటర్లు మాత్రమే మయన్మార్‌తో ఉండగా, మిగిలిన 4,096 కిలోమీటర్లు భారతదేశంతో ఉంది. త్రిపుర, మిజోరాం, అస్సాం, మేఘాలయ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలతో ఆ దేశం సరిహద్దులను కలిగి ఉంది. అందుకే ఈశాన్య ప్రాంతపు ఆర్థిక అభివృద్ధి, భద్రతకు ఇది కీలకం.

బంగ్లాదేశ్ సరిహద్దు స్వభావాన్ని బట్టి చూస్తే, దానిని పూర్తిగా మూసివేయడం చాలా కష్టం. ఫలితంగా, ఆ దేశంలోని వివిధ ప్రభుత్వాల పాలనా విధానాలు మన దేశ భద్రతపై కీలక ప్రభావం చూపుతున్నాయి. బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఆవిర్భవించడంలో భారత్ పాత్ర ఉన్నప్పటికీ, ఇరు దేశాల సంబంధాలు హెచ్చు తగ్గులను చూస్తూ వచ్చాయి. నియంతలైన జియావుర్ రెహ్మాన్, హెచ్‌ఎమ్ ఎర్షాద్ తమ నియంత్రణను కొనసాగించే ప్రయత్నంలో దేశంలో ఇస్లామీకరణను ప్రోత్సహిస్తూ వచ్చారు. దీంతో ద్వైపాక్షిక సంబంధాల విషయంలో ఈ ఎగుడు దిగుళ్లు తప్ప లేదు. పాకిస్తాన్ లాగే, జమాత్-ఎ-ఇస్లామీ కూడా బంగ్లాదేశ్ స్వాతంత్ర్య ఉద్యమానికి వ్యతిరేకంగా పోరాడినప్పటికీ, ఈ ప్రక్రియలో అది గణనీయమైన పాత్ర పోషిస్తూనే పెరిగింది.

భారత వ్యతిరేక గ్రూపులు

అయితే, బంగ్లాదేశ్‌లో జరుగుతున్నది కేవలం భారతదేశానికి సంబంధించినది మాత్రమే కాదు... చైనా, మయన్మార్, ఆగ్నేయాసియాతో సహా విస్తృత ప్రాంతంపై దీని ప్రభావం ఉంటోంది. దాని అతి



పెద్ద ముస్లిం జనాభాలో పెరిగిపోతున్న సమూల మార్పువాదం (రాడికలైజేషన్) విస్తృత ప్రపంచ పరిణామాలను కలిగి ఉంటుంది. జమాత్-ఎ-ఇస్లామీతో పాటు, హర్కత్-ఉల్-జిహాద్-అల్-ఇస్లామీ, జమాత్-ఉల్-ముజాహిదీన్ బంగ్లాదేశ్, అలాగే అల్-ఖైదా, ఇస్లామిక్ స్టేట్‌ల వంటి ఇతర రాడికల్ గ్రూపులు కూడా ఆ దేశంలో ఉన్నాయి. మదర్సా నాయకుల నెట్‌వర్క్ అయిన హెఫాజత్-ఎ-ఇస్లాం కూడా దేశంలో షరియా పాలనను కోరుకుంటూ, అక్కడ లౌకిక రాజకీయ స్థాపనను వ్యతిరేకిస్తోంది.

బేగం ఖలీదా జియా నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ)తో జమాత్-ఎ-ఇస్లామీ పొత్తు పెద్ద సమస్యగా మారింది. తత్ఫలితంగా, 1991-96లోనూ 2001-06లోనూ ఖలీదా జియా ప్రధానమంత్రిగా ఉన్న పదవీకాలం అనేది... దాదాపుగా ఐఎస్ఐ, ఈశాన్య ప్రాంతంలో భారతదేశానికి వ్యతిరేకంగా క్రియాశీలంగా ఉన్న తిరుగుబాటు గ్రూపుల వర్గానికి విశృంఖల స్వేచ్ఛను ఇచ్చింది.

2009లో హసీనా ప్రభుత్వ స్థాపనతో భారతదేశం, బంగ్లాదేశ్ మధ్య సంబంధం స్థిరపడింది. మరీ ముఖ్యంగా, ఇది ఐఎస్ఐ లేదా వివిధ ఈశాన్య తిరుగుబాటు గ్రూపులు, బంగ్లాదేశ్ భూభాగాన్ని భారత వ్యతిరేక శక్తులకు ఉపయోగించడాన్ని తనిఖీ చేయడంలో సహాయపడింది. రెండు దేశాలను కలిపే భూ మార్గాలను తిరిగి తెరవడానికీ, బంగ్లాదేశ్, భూటాన్, భారతదేశం, నేపాల్ గుండా ప్రాంతీయ ట్రాఫిక్ కదలికను ప్రోత్సహించేందుకు మోటార్ వాహనాల ఒప్పందంపై సంతకం చేయడానికీ ఈ పరిణామం దారి తీసింది.

మయన్మార్‌లోని రఖైన్ రాష్ట్రం పక్కనే బంగాళాఖాతం శిఖర ప్రాంతంలో ఉన్న బంగ్లాదేశ్ స్థానాన్ని ఉపయోగించుకోవడంతో పాటు, భారతదేశాన్ని నియంత్రించడం అనే తన పెద్ద విధానంలో భాగంగా చైనా తొలి నుంచి బంగ్లాదేశ్‌పై గణనీయమైన ఆసక్తిని పెంచుకుంది. ఇక్కడ చైనా ముఖ్యమైన పెట్టుబడులను కలిగి ఉంది. ఇక్కడి నుండి ఒక పైప్‌లైన్ మలక్కా జలసంధిని దాటవేస్తూ చైనాలోని యునాన్‌కు క్యుక్‌పియు నౌకాశ్రయం నుండి చమురును తీసుకువెళుతుంది. బంగ్లాదేశ్‌లో వంతెనలు, రోడ్లు, పవర్ ప్లాంట్‌లను నిర్మించడంలో చైనా ప్రభుత్వం పెద్ద మొత్తంలో డబ్బును పెట్టుబడి పెట్టింది. అంతేకాకుండా దేశానికి అతిపెద్ద సైనిక సరఫరాదారుగా కూడా అవతరించింది.

భారత్ చేయాల్సింది!

పైన ఉదహరించిన అనేక కారణాల వల్ల, బంగ్లాదేశ్‌లోని వ్యవహారాలను భారత్ చాలా జాగ్రత్తగా నిర్వహించాలి. పరిస్థితి చాలా అస్థిరంగా ఉంది. అక్కడ పరిస్థితులు అదుపు తప్పవచ్చు కూడా. ఫలితంగా భారతదేశానికి ప్రతికూల పరిణామాలు ఎదురవుతాయి. అక్కడి ప్రజా ఉద్యమంపై భారత వ్యతిరేక కథనాన్ని రుద్దేందుకు ఐఎస్ఐ ఓవర్‌టైమ్ పని చేసే అవకాశం ఉండటంతో పరిస్థితి మరింత జటిలమైంది.

ఇటీవల పొరుగు దేశాలతో దెబ్బతిన్న సంబంధాలను విజయవంతంగా నిర్వహించడం నుండి భారతదేశం పాఠాలు నేర్చుకోవాలి. ఆర్థిక సంక్షోభం సమయంలో శ్రీలంకకు ఆర్థిక సహాయాన్ని అందించడం ద్వారా, భారత్ గణనీయంగా మంచిపేరు సాధించింది. దీనివల్ల అనూర కుమార దిస్సనాయకే ప్రభుత్వంలో ప్రయోజనాలను పొందుతున్నాం. అదేవిధంగా, మాల్దీవుల అధ్యక్షుడు ముయిజుతో ప్రశాంతంగా వ్యవహరించడం ద్వారా, ఆయన ప్రచారం చేసిన 'భారత్ వైదొలిగిపో' వ్యూహాన్ని మట్టుబెట్టింది.

నేపాల్‌లోనూ ఇలాంటి ప్రయోజనాలే కనిపిస్తున్నాయి. చైనాలో అధికార పర్యటనలో ఉన్న భారత వ్యతిరేక ప్రధాని కేపీ శర్మ ఓలీ, బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ కింద బీజింగ్‌తో తమ దేశం ఎలాంటి కొత్త రుణ ఒప్పందంపై సంతకం చేయదని ముందే స్పష్టం చేశారు. నిజానికి, నేపాలీలు తమ దేశంలో బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్ పరిధిని తగ్గించే కొత్త ఒప్పందంపై చైనాతో సంతకం చేయాలనుకుంటున్నారు.

బంగ్లాదేశ్‌తో కూడా భారతదేశం వ్యూహాత్మక సహన విధానాన్ని అనుసరించాలి. బంగ్లాదేశ్ పరివర్తనలో ఉన్న దేశం. అక్కడ ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించే ప్రక్రియకు న్యూఢిల్లీ మద్దతు ఇవ్వాలి. హిందువులపై దాడులను అతిగా చూసే ధోరణి నెలకొంది. ప్రారంభంలో కాస్త పెరిగిన తర్వాత, అటువంటి దాడులు ఇప్పుడు తగ్గాయి. మనం హసీనాకు ఏకపక్షంగా మద్దతు ఇవ్వడం వల్ల మన ఉద్దేశ్యాలపై అనుమానం ఏర్పడిందనీ, మన బంగ్లాదేశ్ విధానానికి దిద్దుబాటును అందించాల్సిన అవసరం ఉందని కూడా ఇప్పుడు మనం అర్థం చేసుకోవాలి.

వ్యాసకర్త 'అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్'లో డిస్టింగ్విష్డ్ ఫెలో
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఇది విముక్తా?



సిరియాకు 'విముక్తి' జరిగిందనే వాదనను నేను అంగీకరించను. తమ వ్యూహాత్మక ప్రయోజనాల కోసం ఇస్లామిస్టులకు పాశ్చాత్య దేశాలు, ఇజ్రాయెల్ అండగా నిలిచి ఒక నియంతను దించేశాయి. కానీ అది మహిళ లకు, మైనారిటీలకు నరకప్రాయం అవుతుంది.

– సబా నఖ్వీ, రచయిత్రి

నరమేధం చూడరా?



అసద్ పతనానికి ఏడుస్తున్న వాళ్లంతా ప్రాథమికంగా రష్యాకు, ఇరాన్‌కు విధేయులు. సిరియా నరమేధంలో అసద్ పాత్ర, పాలస్తీనా నరమేధంలా ఏ వివాదానికీ తావు లేనిది. చాలామందికి అమాయకుల మరణాల కన్నా తమ రాజకీయ ఎజెండా అమలులో ఉండటమే ముఖ్యం.

– మహమ్మద్ హిజాబ్, రచయిత

పాశ్చాత్య చదరంగం



సద్దాం హుస్సేన్‌ను ఉరితీయి. మహమ్మద్ గడాఫీని నాశనం చెయ్యి. షేక్ హసీనాను దేశం వదిలేలా చెయ్యి. బషీర్ అల్-అసద్‌ను పదవిలోంచి దించు. రాడికల్ ఇస్లామిస్టులను వ్యవస్థాపించు. తాము నియంత్రించలేని పావులతో పాశ్చాత్య దేశాలు చదరంగం ఆడుతూనే ఉన్నాయి.

– అశ్విన్ సంఘీ, రచయిత

ఎందుకంత చిన్న చూపు?



ఆస్ట్రేలియాలోని కిట్-క్యాట్ కన్నా ఇండియాలోని కిట్-క్యాట్‌లో తక్కువ పాలు, తక్కువ చాకొలేట్, ఎక్కువ చక్కెర ఉంటాయి. ఇండియాలో అమ్మే లేస్‌లో పామ్ ఆయిల్ వాడతారు. అదే యూఎస్‌లో అమ్మేవాటిలో వాడరు. విదేశీ కంపెనీలు ఇండియాకు నాసిరకం ఉత్పత్తులను ఇవ్వడం మానాలి.

– రేవంత్ హిమత్‌సింగ్‌కా, ఫుడ్ యాక్టివిస్ట్

ఆకలి తీరే మార్గం



మీకు బాగా ఆకలిగా ఉన్నప్పటికీ సోమరి అయితే, ఆరోగ్యకరమైన వంట చేసుకోకుండా జంక్ ఫుడ్ తింటారు. మీరు జ్ఞానం మీద ఆకలిగా ఉండి కూడా సత్యం తెలుసుకోవడంలో సోమరి అయితే, తప్పుడు సమాచారాన్ని స్వీకరిస్తుంటారు.

– పాల్ గ్రాహమ్, కంప్యూటర్ శాస్త్రవేత్త

అమెరికన్లూ నష్టపోతారు!

అధ్యక్షునిగా ఎన్నికైన డోనాల్డ్ ట్రంప్ 2024 నవంబర్ 25న సోషల్ మీడియాలో తన ఎన్నికల వాగ్దానాలను పునరుద్ఘాటించారు. కుర్చీనెక్కిన మొదటి రోజే మెక్సికో, కెనడా, చైనాల నుండి వచ్చే వస్తువులపై భారీగా పన్నులు పెంచుతానన్నారు. దిగుమతి వస్తువులపై కొత్త సుంకాలను విధించేందుకు, ఆసియాలో అతిపెద్ద వ్యాపార భాగస్వాములతో సంబంధాన్ని మార్చుకుంటానని, అది వారి ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రభావాలను కలిగించగలదని ట్రంప్ ఎన్నికల ప్రచారంలో ప్రతిజ్ఞ చేశాడు. రాబోయే పరిణామాలు అనిశ్చిత మయినా, తమ ఆర్థికాభివృద్ధికి అమెరికాకు అమ్మకాలపై ఆధారపడే ఆసియా దేశాలను దిగుమతి వస్తువులపై పెంచే పన్నులు దెబ్బతీస్తాయి. 2023లో అమెరికాకు అతి పెద్ద పది ఎగుమతి ఆసియా దేశాలలో మొదటిది చైనా. దీని మొత్తం ఎగుమతుల విలువ 3.38 లక్షల కోట్ల డాలర్లు. అందులో అమెరికాకు 50,120 కోట్ల డాలర్ల విలువ (14.8%) కలిగి ఉంది. ఇండియా 43,140 కోట్ల డాలర్ల ఎగుమతులు చేస్తూ తొమ్మిదో స్థానంలో ఉంది. ఇందులో అమెరికా 7,580 కోట్ల డాలర్ల (17.6%) వాటా ఉంది. చైనా వస్తువులపై ట్రంప్ విధించబోయే అధిక సుంకాలతో పరిశ్రమలు చైనా నుండి ప్రక్క దేశాలకు మారే అవకాశం ఉంది. దీంతో ఇతర ఆగ్నేయాసియా దేశాలకు లాభం చేకూరగలదు. ట్రంప్ పన్నులను నివారించడానికి కొన్ని దేశాలు తమ ఉత్పత్తిని బాగా తగ్గించవచ్చు. చైనా, కంబోడియా, వియత్నాం, మెక్సికో, బ్రెజిల్ ఇలా తగ్గించనున్నట్లు ప్రకటించాయి.

అమెరికా 2023లో చైనా, వియత్నాం, థాయ్‌లాండ్, ఇండియా, జపాన్‌ల నుండి ఎగుమతులలో ప్రథమ స్థానంలో, దక్షిణ కొరియా, ఇండోనేసియాల నుండి రెండవ స్థానంలో, మలేసియా, సింగపూర్‌లతో మూడవ స్థానంలో ఉంది. అత్యధికంగా మెక్సికో నుండి తర్వాత చైనా, కెనడాల నుండి దిగుమతి చేసుకుంది. అమెరికా తన వస్తువులను పొందే మొదటి 10 దేశాలలో 6 ఆసియా దేశాలు. అమెరికా దిగుమతుల్లో వాటి శాతం 32. అనేక ఆసియా దేశాలతో అమెరికా వాణిజ్య లోటులో ఉన్నందున వస్తు సరఫరా పరస్పరం కాదు. అంటే అమెరికా ఆ... దేశాలకు ఎగుమతి చేసే దాని కంటే ఎక్కువగా దిగుమతి చేసుకుంటుంది. 2024 మొదటి 9 నెలల్లో అమెరికా అతి పెద్ద వాణిజ్య లోటు చైనాతో, తర్వాత మెక్సికో, వియత్నాంలతో ఉంది. వియత్నాంతో 9,060 కోట్ల డాలర్ల లోటు ఉంది. జపాన్, దక్షిణ కొరియాలతో వాణిజ్య లోటు మొదటి 10 స్థానాల్లో ఉంది. గత ఏడాది కాలంలో చైనా... వస్తువుల దిగుమతి తగ్గించడంతో చైనాతో వాణిజ్య లోటు తగ్గింది. థాయ్‌లాండ్ వంటి దేశాలతో లోటు పెరుగుతోంది.

వాణిజ్య లోటును తగ్గించడానికి దిగుమతులపై సుంకాలను పెంచాలని అనుకుంటున్నట్లు ట్రంప్ చెప్పారు. అయితే ఆయన పన్నుల పెంపును అమెరికన్లు చెల్లించవలసి వస్తుందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు. పెరిగిన దిగుమతుల ఖర్చులను కంపెనీలు వినియోగదారులకు బదిలీచేయడం వల్ల స్వదేశంలో ధరలు పెరుగుతాయి. దిగుమతి పన్నుల ఖర్చులను వినియోగదారునిపై వేస్తామని ఆటోజోన్ ముఖ్య కార్య నిర్వహణా ధికారి ఫిలిప్ డేనియెల్ తెలిపారు.

– సంగిరెడ్డి హనుమంత రెడ్డి,
ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి । 94902 04545

ఈ మార్పులతో ఏం ఒరుగుతుంది?

అభిప్రాయం



రఘునందన్ రావు

తెలంగాణ రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాదయిన సందర్భంలో అన్ని వర్గాల్లోనూ చర్చ చాలా లోతుగానే జరుగుతోంది. తెలంగాణ ఏర్పడిన తొలి పదేళ్లలో కేసీఆర్ నాయకత్వంలోని ప్రభుత్వం తమ ఆకాంక్షలకు అనుగుణంగా లేదని చాలా స్పష్టంగా ప్రజలు చెప్పారు. తెలంగాణ కోసమే ఒక రాజకీయ పార్టీ స్థాపించి, తెలంగాణ పేరుతో ప్రతినిత్యం తన రాజకీయం నడిపించిన కేసీఆర్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడినా ప్రజలు శాశ్వతంగా పట్టం కట్టలేదనీ, కట్టరనీ ఏడాది క్రితం ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు స్పష్టంగా చెబుతున్నాయి.

నిజానికి 2014 ఎన్నికల్లో కేసీఆర్‌కు పట్టం కట్టిన ప్రజలు 2019 ఎన్నికలలోపే ఆ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత చూపిస్తూ వచ్చారు. ఇది కనిపెట్టిన కేసీఆర్ పార్లమెంట్ ఎన్నికలతో (2019) పాటు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే మోదీ సునామీలో అధికారం కోల్పోవడం ఖాయం అని ఇంటెలిజెన్స్ వర్గాలు, ఇతర వర్గాల ద్వారా సమాచారం సేకరించారు. అందుకే ఆరు నెలల ముందుగా ఎన్నికలకు వెళ్లి కేసీఆర్ తనదైన టక్కుటమార విద్యలతో 2018 లోనే అసెంబ్లీకి ప్రత్యేకంగా ఎన్నికలు వచ్చే విధంగా ప్రయత్నం చేసి విజయం సాధించారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ నాలుగు ఎంపీ స్థానాలు గెలిచింది. అసెంబ్లీ ఎన్నికలు కూడా జరిగి ఉంటే అదే స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉండేది.

రెండవ దఫా ప్రభుత్వం ఏర్పడిన తొలి నాళ్ళ నుంచి తెలంగాణ ప్రజలలో తీవ్రమైన వ్యతిరేకత ప్రారంభమైంది. తెలంగాణలో అనుకోకుండా దుబ్బాక నియోజకవర్గంలో వచ్చిన ఉప ఎన్నిక ఈ వ్యతిరేకత చూపించడానికి తొలి వేదిక అయ్యింది. సొంత జిల్లా సిద్దిపేటలో అటు గజ్వేల్, ఇటు సిరిసిల్లకు మధ్యలో ఉన్న ఈ నియోజకవర్గంలో ప్రజలు బీజేపీ తరఫున నిలబడిన నన్ను గెలిపించడం దీనికి నిదర్శనం.

ప్రత్యామ్నాయం కోసం తెలంగాణ ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో కాంగ్రెస్ వైపు మొగ్గుచూపితే అధికారంలోకి వచ్చిన రేవంత్ సర్కారు... ఏడాది కాలంగా సరిగ్గా కేసీఆర్ బాటలోనే నడుస్తున్నది. ఎన్నికలకు ముందు ఆర్భాటంగా ప్రకటించిన మేనిఫెస్టోలో 42 పేజీలలో వారు చెప్పిన ఏ ఒక్క హామీ కూడా పూర్తిగా అమలు కాలేదనే చర్చ జరుగుతోంది. ప్రభుత్వం మారి ఏడాది కూడా గడవక ముందే తెలంగాణలో కొత్త సర్కారుపై తీవ్రమైన అసంతృప్తి, వ్యతిరేకతలు మొదలయ్యాయి.

కేసీఆర్‌పై వ్యతిరేకతను సొమ్ము చేసుకునేందుకు 'ఆరు గ్యారెంటీల' పేరుతో అలవి కాని హామీలను ఇచ్చి ప్రజల ఓట్లను కొల్లగొట్టి గద్దెనెక్కి... ఇప్పుడు ప్రజలపై స్వారీ చేస్తోంది రేవంత్ సర్కార్. 6 గ్యారంటీలలో నెరవేర్చినవి కూడా అరకొరగా మాత్రమే ఉండటం గమనార్హం. ప్రజలకు అవసరం లేని... పేర్లలో మార్పు, విగ్రహాలలో మార్పు చేయడం మాత్రమే ప్రజా పాలనకు నిదర్శనమా? తెలంగాణ తల్లి విగ్రహం మలిదశ ఉద్యమంలో ఎవరికి నచ్చినా, నచ్చకపోయినా ప్రజల మనసుల్లోకి వెళ్లిపోయింది. ఇప్పుడు ఆ విగ్రహం మార్పు చేయడం వల్ల ప్రజల జీవితాల్లో ఏమైనా మార్పు వచ్చే అవకాశం ఉన్నదా? నిజానికి తల్లి... దేవతతో సమానం. అట్లాంటి తెలంగాణ తల్లిని దేవత రూపంలో ఉండకూడదని కాంగ్రెస్ సర్కార్ అనుకోవడమే వారి మూర్ఖత్వానికి పరాకాష్ఠ. మార్పు చేసిన విగ్రహం కూడా తెలంగాణలో బలిదానాలకు మూల కారణమైన సోనియా గాంధీ పుట్టిన రోజున ఆవిష్కరణ చేయడం తెలంగాణ ఆత్మగౌరవ వంచనగా భావించాల్సిందే.



తెలంగాణ తల్లి : అప్పుడు, ఇప్పుడు

'అన్ని బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం' అని ప్రమాణ పత్రంలో చెప్పిన కాంగ్రెస్ పార్టీ... కేవలం 'పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సు'ల్లో మాత్రమే ఆడపడుచులు ప్రయాణించడానికి అర్హులని అవమానిస్తోంది. ఇలా ఆరు గ్యారెంటీలలో అర గ్యారెంటీ కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేని నిస్సహాయ స్థితిలో కాంగ్రెస్ పార్టీ కొట్టు మిట్టాడుతోంది. కేసీఆర్‌కు వ్యతిరేకంగా ఓటేసిన తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఎప్పుడు అమలు అవుతాయని ఎదురుచూస్తూ కూర్చోవాల్సిన పరిస్థితి.

అత్తాకోడళ్ళతో సహా కుటుంబంలోని మహిళలందరికీ ఇస్తానన్న నెలకు రూ. 2,500 ఎక్కడకు పోయినాయి? వరి ధాన్యానికి రూ. 500 బోనస్ అని... ఇప్పుడు కేవలం కొన్ని రకాల సన్న ధాన్యాలకు ఇస్తామని చెప్పడం మోసం చేయడం కాదా? రైతులందరికీ రుణమాఫీ అని చెప్పి, తర్వాత 'షరతులు వర్తిస్తాయ'ని కార్పొరేట్ తరహా మోసం చేసిన ప్రభుత్వం ఇది. 'రైతు భరోసా' పెంచి కౌలు రైతులకు కూడా 15 వేల రూపాయలు ఇస్తామని ముఖం చాటేసిన గొప్ప సర్కారు ఇది. అందుకే మేనిఫెస్టోలో ఉన్న 42 పేజీలపై ప్రజాక్షేత్రంలో చర్చకు రావాలి. వారు అమలు చేశామని చెప్పుకుంటున్న హామీలపై కనీసం కాంగ్రెస్ కార్యకర్తలు కూడా సంతృప్తిగా లేరన్న విషయాన్ని రుజువు చేయడానికి పెద్దగా సమయం పట్టకపోవచ్చు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ తాము ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజల తరఫున విజ్ఞప్తి చేస్తున్నాం. లేనిపక్షంలో ఎన్నికల వరకు కూడా ప్రజలు తిరుగుబాటు చేయకుండా నిలిచే పరిస్థితి మాత్రం కనబడటం లేదు. తిరుగుబాటు సహజ గుణంగా ఉన్న తెలంగాణ ప్రజలకు ఇది కొత్త కూడా కాకపోవచ్చు.

వ్యాసకర్త మెదక్ పార్లమెంట్ సభ్యులు

ముక్తి పొందాలంటే...

శ్రీకృష్ణ నామ మాహాత్మ్యాన్ని ముప్పూటలా పలికే వానికి సకలాభీష్ట సిద్ధిని ఇస్తానని చెప్పే సందర్భంలో విష్ణువు గురువు గురించి చతుర్ముఖుడికి ఇలా చెప్పాడు: ''గురువు ఎవరినైనా సరే ప్రత్యక్షంగా, పరోక్షంగా కొంత కాలం పరీక్షించి అర్హత గ్రహించి శిష్యునిగా చేరదీసుకోవాలి. మనోవాక్కాయములచే గురువును సేవించే భక్తిశ్రద్ధలు కలవాడై ఉంటేనే శిష్యుడని పించుకుంటాడు.

జ్యోతిర్మయం

నా వ్రతం పట్టినవాడు విష్ణుభక్తులకు ఇష్టుడు. నా కథలను వినడంలో ఆసక్తి, నా ఉత్సవాలలో రక్తి కలవాడు, దయాళువు, ఉపకార శీలుడు, కోర్కెలు లేనివాడు, అన్ని విద్యలలో ఆరితేరినవాడు, సందేహాలను తగిన విషయ బోధచే పోగొట్టేవాడు, బ్రహ్మజ్ఞాని, భూత భవిష్యద్వర్తమానాలు తెలిసిన బుద్ధిమంతుడూ అయి ఉండాలి గురువు. నాకిష్టమైన భాగవతమును నిరంతరం నిశ్చింతగా వినాలి. భాగవతంలో ఒక్క శ్లోకం కాని, శ్లోకార్థం కాని నిత్యమూ వింటే కపిల గోవును దానమిచ్చే పుణ్యఫలం కలుగుతుంది.

నిత్యమూ నన్ను అర్చించే వారు, నాకిష్టమైన భాగవతం వినేవారున్నూ కలి దోషాల నుంచి విముక్తులౌతారు. వైష్ణవ శాస్త్రాలను నిత్యమూ గృహంలో అర్చించే వారు సర్వపాపాల నుంచి విముక్తులౌతారు. ఇంట భాగవతమును నిత్యమూ అర్చించే వారిని నేను సమయానుసారంగా ఆదుకుంటాను. భాగవతాన్ని వైష్ణవునకు దానమిచ్చిన వాడు వైకుంఠవాసి అవుతాడు. భాగవతం లేని ఇల్లు ఆ ఇంటి యజమానికి భూలోక నరకమే. నా సంతోషం కోరి నరుడు భాగవతాన్ని ఇంట పదిలపరచుకోవాలి. భాగవతం ఉన్న చోట వేల్పులందరితో నేనుంటాను. సకల తీర్థాలూ పుణ్య నదీనదాలూ, యజ్ఞాలూ ఉంటాయి. పుణ్యాశ్రమాలకూ, పుణ్య తీర్థాలకూ వెళ్ళిన ఫలం భాగవతం చదివితే వస్తుంది. సుగుణరాశియైన భార్యకి బుద్ధిమంతుడైన భర్తలాగా ధూప దీప నైవేద్య సహితమైన పూజకి నేను వశుడను అవుతాను'' అన్నాడు విష్ణుమూర్తి.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** శు.దశమి రా.1.14 వరకు, తదుపరి ఏకాదశి, **నక్షత్రం:** ఉత్తరాభాద్ర ఉ.11.43 వరకు, తదుపరి రేవతి, **వర్జ్యం:** రా.10.53 నుండి 12.20 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.33 నుండి 9.17 వరకు, తదుపరి రా.10.34 నుండి 11.25 వరకు, **అమృతఘడియలు:** ఉ.7.14 నుండి 8.41 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.23, **సూర్యాస్తమయం:** 5.22.

విభజన సమస్యలపై పీటముడే!

ప్రధానంగా భూములు, భవనాలు, నగదు నిల్వల అంశాల్లో వెనక్కితగ్గని తెలంగాణ, ఏపీ

- 'దిల్' భూముల్లో వాటా కావాలంటున్న ఏపీ..ససేమిరా అంటున్న తెలంగాణ
- గతంలో కేటాయించిన భవనాలు అడిగినా సాధ్యం కాదని తేల్చిచెప్పిన రాష్ట్రం
- విద్యుత్ సంబంధిత సమస్యలూ పరిష్కారానికి నోచుకోలేదన్న ఉన్నతాధికారి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య విభజన అంశాలకు సంబంధించి పీటముడి ఇప్పట్లో వీడేలా లేదు. చిన్న చిన్న అంశాల్లో మినహా.. ప్రధానంగా భూములు, భవనాలు, నగదు నిల్వల అంశాల్లో ఇరు రాష్ట్రాలు తమ మాటే చెల్లుబాటు కావాలనే ధోరణిలో వ్యవహరిస్తుండటమే ఇందుకు కారణమని సోమవారం తనను కలిసిన మీడియాతో ఓ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు. 'దక్కన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ ల్యాండ్ హోల్డింగ్స్ (దిల్)కు హైదరాబాద్ నగరం చుట్టుపక్కల దాదాపు 4 వేల ఎకరాల భూములున్నాయి. ఆ భూముల్లో తమకు వాటా కావాలని ఏపీ పేచీ పెడుతోంది. అయితే అవి ఎట్టి పరిస్థితుల్లోనూ ఇచ్చేది లేదని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేసింది..'అని ఆయన తెలిపారు. 'ఉమ్మడి రాష్ట్రంలో 'దిల్'హెడ్ ఆఫీస్ హైదరాబాద్ కేంద్రంగా ఏర్పాటైనందున అందులో తమకు వాటా రావాల్సిందేనంటూ ఏపీ అధికారులు ఇటీవల విజయవాడలో జరిగిన సమావేశంలో కోరారు. మరోవైపు 2014 విభజన చట్టం ప్రకారం కొన్ని భవనాలు పదేళ్ల పాటు ఏపీ కోసం హైదరాబాద్‌లో కేటాయించారని, జూన్ 2వ తేదీతో ఆ గడువు ముగిసినందున గతంలో కేటాయించిన భవనాలు పూర్తిగా తమకే చెందుతాయని తెలంగాణ అంటోంది. ఇంకో వైపు లేక్‌వ్యూ అతిథి గృహం, లక్డీకాపూల్‌లోని పోలీసు భవనాలను ఏపీ అధికారులు మళ్లీ అడుగుతున్నారు. వాటిని ఇవ్వడం సాధ్యం కాదని మన రాష్ట్రం తేల్చిచెప్పింది..'అని ఆ అధికారి వివరించారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వానికి గతంలో స్థలం కేటాయించడంతో వారు అక్కడ భవనం నిర్మించుకున్నారని, ఏపీకి కూడా స్థలం కేటాయిస్తామని, వారు కూడా భవనం కట్టుకోవచ్చని సూచించినట్లు తెలిపారు.

'విద్యుత్' సమస్యలు మరో ప్రధాన అడ్డంకి

'విద్యుత్ బకాయిలు మరో ప్రధాన అడ్డంకిగా మారింది. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పీపీఏ)లు మనుగడలో ఉన్నంతకాలం ఏపీలోని విద్యుత్ సంస్థల నుంచి తెలంగాణకు విద్యుత్ సరఫరా చేయాల్సి ఉంటుంది. కానీ 2016లోనే విద్యుత్ సరఫరాను ఏపీ నిలిపివేసింది. తద్వారా తెలంగాణ బయట నుంచి అధిక ధరకు విద్యుత్ కొనుగోలు చేయాల్సి వచ్చింది. అలాగే దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ(ఎస్‌పీడీసీఎల్) పరిధిలోని కర్నూలు, అనంతపురం జిల్లాల్లో విద్యుత్ వ్యవస్థను మెరుగుపర్చడానికి గతంలో పెద్ద ఎత్తున రుణం తీసుకొచ్చి అభివృద్ధి చేశాం. అయితే రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా ఆయా జిల్లాల కోసం తెచ్చిన రుణాన్ని, దానికి వడ్డీని తెలంగాణే చెల్లిస్తోంది. వాటిని రీయింబర్స్ చేయాలని కోరుతున్నా ఏపీ పట్టించుకోవడం లేదు..'అని ఆ ఉన్నతాధికారి చెప్పారు. 'ఏపీ నుంచి తెలంగాణకు రావాల్సిన రూ.26 వేల కోట్ల బకాయిలు చెల్లించకుండా వారు విక్రయించిన విద్యుత్‌కు సంబంధించిన మొత్తం మాత్రం వెంటనే చెల్లించాలంటున్నారు. అలాగే కృష్ణపట్నం పవర్ ప్లాంట్‌లో తెలంగాణకు వాటా ఉన్నా ఇవ్వడం లేదు. సింగరేణికి ప్రధాన వాటాదారు అయిన 'ఆప్మెల్' విభజనకు కూడా వారు ఒప్పుకోవడం లేదు. 9, 10వ షెడ్యూల్‌లో మొత్తం 95 సంస్థలు ఉంటే.. 53 సంస్థల విషయంలో రెండు రాష్ట్రాలకు అంగీకారం ఉన్నా..మిగిలిన వాటిలో 15పై ఏపీకి, 23 సంస్థలపై తెలంగాణకు అభ్యంతరాలున్నాయి. తొలుత అంగీకరించిన సంస్థలపై ముందుకు వెళ్లాలని కేంద్రం చెప్పినా.. అన్నీ ఒకేసారి కావాలంటూ ఏపీ మొండికేస్తోంది.. అని ఆయన వివరించారు.

గెజిటెడ్‌కు నో..నాన్ గెజిటెడ్‌కు ఓకే

'గెజిటెడ్ అధికారులు కొందరు ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు రావాలని కోరుకుంటుండగా..తీసుకోవడం సాధ్యం కాదని తెలంగాణ తేల్చి చెప్పింది. ఇక్కడ అధికారుల పదోన్నతులు దెబ్బతింటాయని, కొత్త ఉద్యోగాలకు ఇబ్బంది ఏర్పడుతుందని స్పష్టం చేసింది. అయితే నాన్ గెజిటెడ్ ఉద్యోగులను మానవతా దృక్పథంతో తీసుకుంటాం. కానీ వారు ఇక్కడికి వచ్చాక సీనియారిటీ చివరలో ఉండాల్సి రావడంతో ఎక్కువమంది రావడం లేదు.

కేంద్ర, రాష్ట్ర జీఎస్టీ ఆదాయంలో వ్యత్యాసం

జీఎస్టీకి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ఆదాయంలో వ్యత్యాసం ఉంటోందని గుర్తించాం. మూడు నుంచి నాలుగు శాతం తేడా వల్ల రాష్ట్ర ప్రభుత్వం భారీగా ఆదాయం కోల్పోతోంది. ఇది ఎక్కడ జరుగుతోంది.? ఎందుకు జరుగుతోంది..? అన్న అంశంపై లోతైన అధ్యయనం చేస్తున్నాం. ఆదాయం పెంపునకు ఇలాంటి లోపాలను సరిదిద్దుకుంటే మంచిది. భూముల రిజిస్ట్రేషన్ల విలువ పెంపు రాజకీయపరమైనది..' అని ఆయన వ్యాఖ్యానించారు.

రేపు జైపూర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం ఉదయం జైపూర్‌కు వెళ్తున్నారు. అక్కడ దివంగత కాంగ్రెస్ నేత, కేంద్ర మాజీమంత్రి ఎస్.జైపాల్‌రెడ్డి కుటుంబీకుల వివాహ కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. అక్కడి నుంచి ఢిల్లీకి చేరుకుంటారు. గురు, శుక్ర వారాల్లో సీఎం ఢిల్లీలోనే ఉండే అవకాశాలున్నాయి. ఈ సందర్భంగా పార్టీ పెద్దలతో సమావేశమై, మంత్రివర్గ విస్తరణతోపాటు అనేక విషయాలపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. సీఎం రేవంత్ శుక్రవారం సాయంత్రం లేదా శనివారం ఉదయం నగరానికి సీఎం చేరుకోనున్నట్టు తెలుస్తోంది.

వ్యవసాయ వర్సిటీ వజ్రోత్సవాలకు హాజరుకానున్న సీఎం

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పాటై 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించే వజ్రోత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హాజరవుతారని యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు. సోమవారం శాసనసభ ఆవరణలో వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, రైతు, వ్యవసాయ సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డిలతో సీఎంను కలిసిన ఆయన.. 20, 21 తేదీల్లో నిర్వహిస్తున్న వజ్రోత్సవాలకు ఆహ్వానించారు. కోదండరెడ్డి అధ్యక్షతన ఈనెల 20న 3,000 నుంచి 4,000 మంది రైతులతో నిర్వహించే రైతు సదస్సుకు హాజరు కావాలని కోరగా.. సీఎం రేవంత్ అంగీకరించినట్లు తెలిపారు.

కొడుకును చంపితే | భార్య తిరిగొస్తుందని..

- కుమారుడిపై కత్తితో తండ్రి దాడి..
- కాపాడిన స్థానికులు
- వికారాబాద్ జిల్లా తాండూరు మండలం మల్కాపూర్‌లో ఘటన



నిందితుడు హన్మంత్

తాండూరు రూరల్: అలిగి వెళ్లిపోయిన భార్యను తిరిగి ఇంటికి రప్పించేందుకు కన్న కొడుకునే హత్య చేసేందుకు యత్నించాడు ఓ తండ్రి. ఈ ఘటన వికారాబాద్ జిల్లా తాండూరు మండలం మల్కాపూర్‌లో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. కరన్‌కోట్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం గుల్బర్గా జిల్లా మల్కోడ్ గ్రామానికి చెందిన హన్మంత్‌కు తాండూరు మండలం మల్కాపూర్‌కు చెందిన శరణమ్మతో 17 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు కొడుకులు అరవింద్, ధర్మ, కార్తీక్ ఉన్నారు. ఐదు సంవత్సరాల నుంచి మల్కాపూర్‌లో నివాసముంటున్నారు. నాపరాతి గనిలో కార్మికుడిగా పనిచేస్తున్న హన్మంత్ రెండేళ్ల నుంచి శరణమ్మను వేధిస్తున్నాడు. దీంతో ఆమె రెండు నెలల క్రితం ఇద్దరు కొడుకులు ధర్మ, కార్తీక్‌లను తీసుకొని కర్ణాటక రాష్ట్రం బీదర్ సమీపంలోని బాల్కి గ్రామంలో ఉంటున్న సోదరి వద్దకు వెళ్లింది. పెద్ద కుమారుడు అరవింద్ తండ్రి వద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో మల్కాపూర్‌లో ఉంటున్న శరణమ్మ సోదరుడు నాగప్ప ఆదివారం మృతి చెందాడు. విషయం తెలియడంతో అంత్యక్రియల్లో పాల్గొనేందుకు శరణమ్మ గ్రామానికి వచ్చింది. భార్య వచ్చిన విషయం తెలుసుకున్న హన్మంత్ ఆమెతో మాట్లాడేందుకు ప్రయత్నించాడు కానీ ఆమె మాట్లాడలేదు. అంత్యక్రియలు ముగిశాక శరణమ్మ మళ్లీ కర్ణాటక వెళ్లిపోయింది. ఎలాగైనా భార్యను ఇంటికి రప్పించాలని, ఇంట్లో ఉన్న పెద్ద కుమారుడు అరవింద్‌ను హత్య చేస్తే భార్య వస్తుందని హన్మంత్ కుట్ర పన్నాడు. రాత్రి 9 గంటల ప్రాంతంలో ఇంటికి వెళ్లి కత్తితో కుమారుడి మెడ, చేతులపై దాడి చేశాడు. గాయాలు భరించలేక బాలుడు గట్టిగా అరవడంతో ఇంటి పక్కనే ఉన్న అశోక్‌తోపాటు మరికొందరు వచ్చి తలుపులు పగలగొట్టి అరవింద్‌ను కాపాడారు. విషయం పోలీసులకు తెలియజేయడంతో ఎస్‌ఐ విఠల్‌రెడ్డి బాలుడిని తాండూరు ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించారు. ప్రస్తుతం అరవింద్ ఆరోగ్యం బాగున్నట్లు తెలిపారు. హన్మంత్‌ను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

మాజీ సర్పంచుల 'చలో అసెంబ్లీ' భగ్నం

ఎక్కడికక్కడ అరెస్టులు.. సాయంత్రానికి విడుదల

సాక్షి, హైదరాబాద్ : పెండింగ్ బిల్లుల కోసం 'చలో అసెంబ్లీ'పేరిట శాసనసభ వద్దకు వెళ్లేందుకు మాజీ సర్పంచులు చేసిన ప్రయత్నాన్ని పోలీసులు భగ్నం చేశారు. అసెంబ్లీకి సమీపంలోని రవీంద్రభారతి వద్ద కొందరిని, జిల్లాల నుంచి వచ్చిన వారిని నగర శివార్లలో, కొందరు నాయకులను వారి ఇళ్ల వద్ద తెల్లవారుజామునే అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన మాజీ సర్పంచులను నగరంలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో ఉంచి సాయంత్రానికి విడుదల చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించి తమ సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేలు, మంత్రులను కలుసుకునేందుకు వెళుతున్న తమను అరెస్ట్ చేశారని తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు సుర్వి యాదయ్యగౌడ్ తెలిపారు. అసెంబ్లీ వద్దకు ర్యాలీగా చేరుకునేందుకు ప్రయత్నించిన మాజీ సర్పంచులను పోలీస్ కమిషనర్ కార్యాలయం వద్ద అరెస్ట్ చేశారన్నారు. దాదాపు 19 మందిని అరెస్ట్ చేసి షాయనాత్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారని చెప్పారు. తమ పెండింగ్ బిల్లులపై అసెంబ్లీలో ఎమ్మెల్యేలు ప్రస్తావించి, పరిష్కరించకపోతే వారిని గ్రామాల్లో అడ్డుకుంటామని తెలిపారు. తెలంగాణ సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డిని సైదాబాద్‌లోని ఆయన నివాసంలో తెల్లవారుజామున 3.30 గంటలకు అరెస్ట్ చేసి, ఐఎస్ సదన్ పోలీస్‌స్టేషన్‌లో ఉంచి సాయంత్రం 4.30 గంటలకు విడిచి పెట్టారు. సర్పంచుల పెండింగ్ బిల్లుల చెల్లింపులో ప్రభుత్వ వైఖరికి నిరసనగా చలో అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొనకుండా తనను ముందస్తు అరెస్ట్ చేయడం సరికాదని లక్ష్మీనర్సింహారెడ్డి పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో అరెస్టయిన వారిలో రాంపాక నాగయ్య, గుంటి మధుసూదన్‌రెడ్డి, మధు, కేశబోయిన మల్లయ్య, నెమలి సుభాష్‌గౌడ్, వేపూరి జయలక్ష్మి, బొల్లం శారద ఇటుకాల కుమారస్వామి తదితరులున్నారు.

పెండింగ్ బిల్లుల కోసం డిమాండ్ చేస్తే అరెస్టులా: హరీశ్‌రావు

పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్న మాజీ సర్పంచులను ఎక్కడికక్కడ అరెస్టు చేయడాన్ని మాజీమంత్రి హరీశ్‌రావు తీవ్రంగా ఖండించారు. గ్రామాల అభివృద్ధికి కృషి చేసిన మాజీ సర్పంచులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా అని సీఎం రేవంత్‌రెడ్డిని సోమవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. సీఎం, పంచాయతీ శాఖమంత్రి.. మాజీ సర్పంచులను చర్చలకు పిలవాలని, వారి పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు.

ఆశ వర్కర్ల ఆందోళన ఉద్రిక్తం

కోఠిలోని డీఎంహెచ్‌ఎస్ ఎదుట వందలాది మంది నిరసన

- రూ. 18 వేల ఫిక్స్‌డ్ జీతాల హామీని ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్
- బారికేడ్లు పెట్టి అడ్డుకోవడంపై ఆశవర్కర్ల ఆగ్రహం.. పోలీసులతో వాగ్వాదం
- అదుపులోకి తీసుకొనే క్రమంలో కొందరు పోలీసులు అసభ్యంగా ప్రవర్తించారని ఆరోపణ
- ఓ ఇన్‌స్పెక్టర్ చెంప పగలగొట్టిన ఆశవర్కర్, ఆమె కొంగులాగిన ఏసీపీ



కోఠి డీఎంహెచ్‌ఎస్ వద్ద ఆందోళన చేస్తున్న ఆశవర్కర్లు



సొమ్మసిల్లి పడిపోయిన ఆశవర్కర్

సుల్తాన్‌బజార్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం తమకు రూ. 18 వేల ఫిక్స్‌డ్ జీతాలు ఇవ్వాలనే డిమాండ్‌తో సోమవారం హైదరాబాద్ కోఠిలోని డీఎంహెచ్‌ఎస్ కార్యాలయం వెలుపల వందలాది మంది ఆశ వర్కర్లు ఆందోళనకు దిగారు. తమను నియంత్రించేందుకు పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేయడంతో వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బారికేడ్లను తోసుకొని ముందుకు దూసుకెళ్లారు. దీంతో ఇరుపక్షాల మధ్య తీవ్ర వాగ్వాదం, ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో ఇద్దరు ఆశవర్కర్లు సొమ్మసిల్లి పడిపోయారు. అయినప్పటికీ పోలీసులు అక్కడి నుంచి 400 మందిని బలవంతంగా తరలించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా కొందరు పోలీసులు తమను దుర్భాషలాడారని.. మగ పోలీసులు అసభ్యంగా తాకారని పలువురు ఆశ వర్కర్లు ఆరోపించారు. నిరసనకారులను వ్యాన్‌లోకి ఎక్కించే క్రమంలో కొందరి కాళ్లు వెనక డోర్‌లో ఇరుక్కుపోయినా పోలీసులు డోర్ మూసేయడంతో వారు బాధతో విలవిల్లాడారు. బాధను తాళలేక ఓ ఆశవర్కర్ సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారిపై చేయిచేసుకుంది. దీంతో ఇతర పోలీసులు ఆమెపై దాడికి పాల్పడ్డారు. సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్ ఏకంగా ఆమె చీర కొంగుపట్టి లాగారు. అనంతరం నిరసనకారులందరినీ తిరుమలగిరి, బండ్లగూడ, కంచన్‌బాగ్, కార్ఖానా పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఆపై సొమ్మసిల్లిన ఇద్దరు ఆశవర్కర్లను ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం సంతోష అనే ఆశవర్కర్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని ఉస్మానియా వైద్యులు పేర్కొన్నారు.

ఏసీపీ, సీఐ క్షమాపణ చెప్పాల్సిందే: ఆశ వర్కర్లు

తమపట్ల అసభ్యంగా ప్రవర్తించి నోరు పారేసుకున్న సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి క్షమాపణలు చెప్పాల్సిందేనని ఆశవర్కర్లు డిమాండ్ చేశారు. పోలీసులు తమకు క్షమాపణ లు చెప్పకుంటే పరిస్థితి వేరేలా ఉంటుందని హెచ్చరించారు. పోలీసులు అసభ్యంగా దూషించడం, తాకడం వల్లే ఆశవర్కర్లు ఆగ్రహానికి గురయ్యారని బీఆర్‌ఎస్ నేత రాంబాబు ఆరోపించారు.

మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

ఆశవర్కర్లతో అసభ్యంగా ప్రవర్తించి భౌతిక దాడి చేసిన సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్, సీఐ శ్రీనివాసాచారిపై జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు ప్రముఖ న్యాయవాది రామారావు ఇమ్మనేని ఫిర్యాదు చేశారు. పరిధి దాటి ప్రవర్తించిన పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు అధికార కాంగ్రెస్ పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

క్లుప్తంగా...

చర్లపల్లి జైలుకు నరేందర్‌రెడ్డి



కొడంగల్: మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని వికారాబాద్ జిల్లా పోలీసులు సోమవారం చర్లపల్లి జైలుకు తరలించారు. లగచర్ల దాడి ఘటనలో ఏ1 గా ఉన్న నరేందర్‌రెడ్డిని కొడంగల్ న్యాయమూర్తి ఆదేశాల మేరకు విచారణ కోసం రెండు రోజుల పాటు పోలీస్ కస్టడీకి తీసుకున్నారు. పోలీస్ కస్టడీ ముగియడంతో కొడంగల్‌కు తీసుకొచ్చి ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం న్యాయమూర్తి ముందు హాజరుపర్చారు. తర్వాత రిమాండ్ నిమిత్తం జైలుకు తీసుకెళ్లారు.

రైలుకింద పడి టెన్త్ విద్యార్థిని ఆత్మహత్య



లక్ష్మీనక్షత్ర (ఫైల్)

ఖమ్మం క్రైం: తల్లి మందలించడంతో మనస్తాపానికి గురైన పదో తరగతి విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. ఖమ్మం మామిళ్లగూడెంకు చెందిన మెడికల్ రిప్రజెంటేటివ్ మన్నూరి నవీన్‌కుమార్, అనురాధ దంపతులకు కుమారుడు, కుమార్తె లక్ష్మీ నక్షత్ర (14) ఉన్నారు. కుమారుడు విజయవాడలో చదువుతుండగా కుమార్తె ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. మూడు రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్న ఆమె, పాఠశాలకు వెళ్లకుండా మధ్యాహ్నం పరీక్షకు హాజరవుతోంది. సోమవారం పెన్ను కొనుగోలు చేయాలని బయటకు వెళ్లి నక్షత్ర ఆలస్యంగా వచ్చింది. పరీక్ష రాయడానికి వెళ్లాల్సి ఉండగా ఆలస్యం ఎందుకు చేశావని తల్లి మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన నక్షత్ర బయటకు వెళ్లిపోగా.. అనురాధ, ఇంటి పక్కన ఉన్నవారు వెతుకుతూ వెళ్లారు. కాగా, ఖమ్మంలోని మొండి గేట్ ప్రాంతానికి వెళ్లిన నక్షత్ర ఎవరికీ కనిపించకుండా చెట్టపొదల్లో దాక్కుంది. అంతలోనే అనురాధ ఇచ్చిన సమాచారంతో నవీన్‌కుమార్ కూడా వచ్చాడు. ఇద్దరూ కలిసి వెతుకుతూ ముందుకు వెళ్లిపోయారు. ఆ సమయంలో వస్తున్న రైలుకు ఎదురు వెళ్లిన నక్షత్ర తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందింది.

రెండో రోజూ పనిచేయని రైల్వే సిగ్నల్ వ్యవస్థ

కమలాపూర్: హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ రైల్వే స్టేషన్ పరిధిలో రైల్వే సిగ్నల్ వ్యవస్థ రెండో రోజూ పనిచేయలేదు. సిగ్నలింగ్ వ్యవస్థ సోమవారం పనిచేయకపోవడంతో రైల్వేస్టేషన్‌లో రైళ్ల హాల్టింగ్ ఎత్తివేసి సికింద్రాబాద్ నుంచి వచ్చిన రైల్వే అధికారులు, నిపుణుల బృందాలు సిగ్నలింగ్ వ్యవస్థలోని లోపాలను కనుక్కునే పనిలో నిమగ్నమయ్యారు. హుజూరాబాద్-పరకాల మార్గంలో ఉప్పల్ వద్ద ఉన్న రైల్వే గేట్ తెరుచుకునే సమస్య తొలగిపోయినా సిగ్నలింగ్ వ్యవస్థ పనిచేయని కారణంగా ఈ మార్గంలో నడిచే రైళ్లను ఉప్పల్ రైల్వేస్టేషన్ వద్ద వేగం తగ్గించి నెమ్మదిగా నడిపిస్తున్నారు. కాగా, ఉప్పల్ ఆర్వోబీ వద్ద సిగ్నల్ కేబుల్ తెగిపోయి ఉంటుందని భావించి దాన్ని కనుగొనే ప్రయత్నాలు చేస్తున్నారు.

జీవో 46పై కౌంటర్ దాఖలు చేయండి

- రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో పోలీసు ఉద్యోగాల భర్తీకి సంబంధించి జారీ చేసిన జీవో నెంబర్ 46పై రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ జీవోను పోలీసు నియామకాల్లో మినహాయించాలని కోరుతూ కొందరు హైకోర్టును ఆశ్రయించగా.. ప్రతికూలంగా తీర్పు వచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ పలువురు అభ్యర్థులు అక్టోబర్ 19న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కాగా ఈ పిటిషన్‌పై సోమవారం జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ఈ విషయంలో హైకోర్టు తమ వాదనలను పరిగణనలోకి తీసుకోలేదని.. అందువల్ల సుప్రీంకోర్టులో కేసు పూర్తిగా తేలేవరకు మిగిలిన 900 పోలీసు ఉద్యోగాల భర్తీని ఆపాలని బాధితుల తరఫున వాదించిన సీని యర్ న్యాయవాది ఆదిత్య సొంది ధర్మాసనాన్ని కోరారు. కాగా జీవో 46పై వైఖరిని, పోస్టుల భర్తీ అంశంలో అవలంబించిన విధానంపై కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు ఇచ్చింది.

'ఆశ వర్కర్లపై అమానవీయ దాడి'



సాక్షి, హైదరాబాద్ : అసెంబ్లీలో తెలంగాణ తల్లి విగ్రహం గురించి మాట్లాడుతున్న ప్రభుత్వం.. బయట మాత్రం ఆశవర్కర్లపై మగ పోలీసులతో దాడి చేయిస్తోందని మాజీమంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి విమర్శించారు. ఆశవర్కర్లపై దాడులకు ప్రభుత్వం సిగ్గు పడాలని, ఎన్నికల మేనిఫెస్టోలో వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డితో కలిసి సోమవారం తెలంగాణభవన్‌లో సబితా ఇంద్రారెడ్డి మీడియాతో మాట్లాడారు. ఆశవర్కర్ల నాయకురాలు సంతోషి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, ఉత్తమ వైద్యం అందించాలన్నారు.

సన్నాల బోనస్ కాజేతపై విచారణ

సాక్షి ఎఫెక్ట్



నర్వ పీఏసీఎస్‌లో విచారణ చేస్తున్న జిల్లా సివిల్ సప్లయ్ అధికారులు

నర్వ: రాష్ట్ర ప్రభుత్వం సన్నాలకు అందించే బోనస్ డబ్బుల కాజేత వ్యవహారంపై సివిల్ సప్లయిస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు గురురాజారావు, భాస్కర్ నారాయణపేట జిల్లా నర్వ పీఏసీఎస్ కార్యాలయంలో సోమవారం విచారణ చేపట్టారు. ఈ నెల 7న 'సాక్షి' మెయిన్‌లో 'బోనస్ బొక్కేస్తున్నారు'శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ సీఈఓ ఉదయ్‌ను విచారణ అధికారులు వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులు వరి ధాన్యాన్ని రాయికోడ్ కొనుగోలు కేంద్రంలోనే అమ్మారా అన్నది ఆరా తీశారు. ఈ ముగ్గురు రైతులు ఆర్‌ఎన్‌ఆర్ రకం వరి సాగు చేశారని, ఈ ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారి వెంకట్‌రెడ్డికి విక్రయించినట్లు విచారణలో రైతులు పేర్కొన్నారు. కర్ణాటక నుంచి మరికల్‌లోని విశాల్ ఇండస్ట్రీస్ రైస్ మిల్లుకు వచ్చింది మాత్రం బీపీటీ సోనా ధాన్యం అయితే, రైతులు పండించిన ధాన్యం సోనా మసూరిగా విచారణలో తెలిసింది. విచారణలో భాగంగా పేర్కొన్న రైతులను అధికారులు పలుమార్లు ఫోన్‌లో సంప్రదించగా వారు ఫోన్ లిఫ్ట్ చేయలేదు. అలాగే ఫిర్యాదుదారుడైన చిన్నారెడ్డిని కూడా విచారించారు. విచారణ పూర్తిస్థాయి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని వెల్లడించారు.

మైనారిటీల భద్రత ఆందోళనకరం

- బంగ్లా పరిణామాలపై భారత్
- ఢాకాలో పర్యటించిన విదేశాంగ కార్యదర్శి విక్రం మిస్రీ




సోమవారం ఢాకాలో మీడియాతో మాట్లాడుతున్న విక్రం మిస్రీ

ఢాకా: బంగ్లాదేశ్‌లోని మైనారిటీల భద్రతపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. మత, సాంస్కృతిక, దౌత్య సంబంధ ఆస్తులపై కొనసాగుతున్న దాడులను తీవ్రంగా ఖండించింది. భారత విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ సోమవారం బంగ్లా విదేశాంగ శాఖ కార్యదర్శి మహ్మద్ జషీమ్ ఉద్దీన్‌తో ఢాకాలో భేటీ అయ్యారు. రెండు దేశాల మధ్య సానుకూల, నిర్మాణాత్మక, పరస్పర ప్రయోజనకరమైన సంబంధాలు కొనసాగుతాయని ఆశిస్తున్నట్లు ఈ సందర్భంగా మిస్రీ చెప్పారు. పదవీచ్యుతురాలైన ప్రధానమంత్రి షేక్ హసీనా ఆగస్ట్ 5న భారత్‌కు వచ్చాక, రెండు దేశాల మధ్య జరిగిన మొట్టమొదటి ఉన్నత స్థాయి సమావేశం ఇదే కావడం గమనార్హం. సమావేశం అనంతరం ఢాకాలో మిస్రీ మీడియాతో మాట్లాడారు. 'రెండు దేశాల సంబంధాల్లో చోటుచేసుకున్న పరిణామాలపై ఇద్దరం చర్చించాం. భారత్ వైఖరిని స్వేచ్ఛగా, నిర్మొహమాటంగా వివరించాను'అని మిస్రీ పేర్కొన్నారు. బంగ్లాదేశ్‌లోని ఆపద్ధర్మ ప్రభుత్వంతో సన్నిహితంగా పనిచేయాలని భారత్ భావిస్తోందన్నారు. ఆపద్ధర్మ ప్రభుత్వ ప్రధాన సలహాదారు యూనుస్, విదేశాంగ శాఖ సలహాదారు తౌహీద్ హుస్సేన్‌తోనూ సమావేశమయ్యానని చెప్పారు. బంగ్లాదేశ్ అభివృద్ధి, సుస్థిరత కోసం, ప్రజాస్వామ్యం పరిఢవిల్లేందుకు భారత్ తోడ్పాటునందిస్తుందని వారికి చెప్పానని మిస్రీ వివరించారు.ఆగస్ట్‌లో బంగ్లాదేశ్‌లో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల ప్రభావం రెండు దేశాల మధ్య సంబంధాలకు అవరోధంగా మారే అవకాశమే లేదని చెప్పారు. ప్రధాన సలహాదారుగా బాధ్యతలు చేపట్టిన యూనుస్‌కు శుభాకాంక్షలు తెలిపిన విదేశీ నేత మన ప్రధాని మోదీయేనని మిస్రీ వివరించారు. ఇద్దరు నేతలు ఫోన్‌లో మనసు విప్పి మాట్లాడుకున్నారని చెప్పారు. భారత్ సహకారంతో బంగ్లాదేశ్‌లో అమలవుతున్న వివిధ ప్రాజెక్టుల రోజువారీ పురోగతి, వాణిజ్యం, వ్యాపారం, కనెక్టివిటీ, ఇంధన రంగాల్లో పరస్పర ప్రయోజనకరమైన ఒప్పందాలతోనూ రెండు దేశాల సంబంధాలు ముడిపడి ఉన్నాయని ఆయన అన్నారు.

సౌరకుటుంబం ఆవల గడ్డకట్టిన నీరు !

గుర్తించిన జేమ్స్ వెబ్ టెలిస్కోప్ ● గ్రహాల ఆవిర్భావానికి సంబంధించి కీలకాంశాలు వెలుగులోకి



విశాల విశ్వంలో జీవం జాడ కోసం నిరంతరం ఖగోళ శాస్త్రవేత్తలు చేస్తున్న శోధనలో మరో అడుగు ముందుకు పడింది. నక్షత్రాలు పురుడుపోసుకునే ఒరియాన్ నెబ్యులాలోని 114–426 యువతారా వ్యవస్థలో ఈ గడ్డకట్టిన నీటి జాడను గుర్తించారు. జేమ్స్ వెబ్ టెలిస్కోప్ సాయంతో దీని గుట్టుమట్లు కనిపెట్టారు. కొత్తగా ఉద్భవిస్తున్న తారల వ్యవస్థలో నీరు ఏ మేరకు ఉండొచ్చు, కొత్త నక్షత్రాల వ్యవస్థలో గ్రహాలు ఎలా ఏర్పడుతాయనే అంశాలపై మరింత లోతైన అధ్యయనం చేసేందుకు ఇది ఉపయోగపడుతుందని ఖగోళ శాస్త్రవేత్తలు చెప్పారు. భూమికి, సూర్యుడికి మధ్య ఉన్న దూరం కంటే ఏకంగా వేయి రెట్లు పెద్ద పరిమాణంలో ఈ గ్రహవలయం ఉంది. కొత్త నక్షత్రం నుంచి వెలువడుతున్న కాంతి బయటకు ప్రసరించకుండా ఈ గ్రహవలయం మధ్యలోని నల్లని పదార్థం అడ్డుతగులుతోంది. దుమ్మురేణువుల మధ్యలో గడ్డకట్టిన నీటి ఆనవాళ్లు కనిపించాయని శాస్త్రవేత్తలు చెప్పారు. ఈ ప్రాంతంలో హైడ్రోజన్ భారీస్థాయిలో ఉండొచ్చని అంచనావేస్తున్నారు. నక్షత్రాల చుట్టూ తిరిగే దుమ్ము, ధూళి సంఘటితమై దగ్గరకు చేరి గ్రహంగా ఏర్పడాలంటే గడ్డకట్టిన నీరు తప్పనిసరి. గడ్డకట్టిన నీటి అణువులు ఈ దుమ్ము కణాలను పట్టి ఉంచి తర్వాతి పరిణామక్రమంలో గ్రహాల పుట్టుకకు కారణమవుతాయి. గ్రహాలు పురుడుపోసుకునే ప్రక్రియలో నీటి క్రియాశీలక పాత్రను తెల్సుకోవడానికి ఇలాంటి దృగ్విషయాలు ఎంతగానో సాయపడతాయని శాస్త్రజ్ఞులు చెప్పారు. ఆవలి వైపు నక్షత్రం నుంచి వస్తున్న కాంతిని అడ్డుకోవడం ద్వారా ఇవతలి వైపున్న నీటి అణువులు కాంతిని శోషించుకునే విధానం తదితరాలను స్పష్టంగా చూడటానికి ఖగోళవేత్తలకు అద్భుత అవకాశం చిక్కింది. తద్వారా వేర్వేరు ప్రాంతాల్లో జీవి మనుగడకు అనువుగా గ్రహాలు ఎలా ఏర్పడతాయనే అంశాలను తెల్సుకునే వీలు ఏర్పడుతుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

సిరియా పయనమెటు?

నియంత పాలన నుంచి రెబెల్స్ చేతుల్లోకి ● తాలిబన్ల తరహా పరిస్థితులు తలెత్తేనా?

- అంతర్జాతీయంగా ఆందోళనలు
- రెబెల్స్ సర్కారు ముందు సవాళ్లు



అసద్ సైన్యం తాలూకు యుద్ధ ట్యాంకర్‌పైకి ఎక్కి విజయచిహ్నం చూపిస్తున్న సిరియా యువకులు

ఒకే ఒక్క వారం. కేవలం ఏడు రోజుల వ్యవధిలో సిరియాలో సర్వం మారిపోయింది. పాలకుడు బషర్ అల్ అసద్ కాడి పడేసి పారిపోయాడు. దేశం తిరుగుబాటుదారుల చేతిలోకి వెళ్లిపోయింది. అసద్‌ల 50 ఏళ్ల నియంతృత్వ పాలనకు ఎట్టకేలకు తెర పడిందంటూ సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమైనా, రెబెల్స్ పాలనలో సిరియా మరో అఫ్గాన్‌గా మారొచ్చన్న అంచనాలు అంతర్జాతీయ సమాజంలో గుబులు రేపుతున్నాయి. కుట్రలు, అంతర్యుద్ధం తదితరాల పరిణామంగా 1970లో గద్దెనెక్కిన హఫీజ్ అల్ అసద్ నియంతృత్వ పోకడలకు మారుపేరుగా పాలించారు. 1982లో ఇస్లామిక్ ఫ్రంట్ సారథ్యంలో దేశవ్యాప్తంగా చెలరేగిన నిరసనలను అణిచేసే క్రమంలో ఏకంగా 40 వేల పై చిలుకు పౌరులను పొట్టన పెట్టుకున్నారు. 2000లో గద్దెనెక్కిన బషర్ నియంతృత్వ పోకడల్లోనూ, క్రూరత్వంలోనూ తండ్రిని మించిన తనయుడు అనిపించుకున్నారు. 2011 అరబ్ విప్లవాన్ని అణిచివేసేందుకు ఏకంగా 4 లక్షల పై చిలుకు మందిని బలి తీసుకున్నారు. ఆయన పాతికేళ్ల పాలనలో కనీసం 5 లక్షల మందికి పైగా పౌరులు మృత్యువాత పడ్డట్టు అంచనా. అంతటి రక్తసిక్త చరిత్రను వారసత్వంగా మిగిల్చి అవమానకర పరిస్థితుల్లో దేశం వీడి రష్యాలో తలదాచుకున్నారు. సాయుధ మిలిటెంట్ గ్రూప్ హయాత్ తహ్రీర్ అల్–షామ్ (హెచ్‌టీఎస్) సారథి అబూ మొహమ్మద్ అల్ జొలానీ అలియాస్ అహ్మద్ అల్ షరాకు సిరియా ప్రధాని మొహమ్మద్ గాజీ జలాలీ తాజాగా లాంఛనంగా అధికారాన్ని అప్పగించారు. దాంతో అసద్‌ల 54 ఏళ్ల కుటుంబ పాలనకు తెర పడ్డా సిరియా భవితవ్యం మాత్రం ప్రస్తుతానికి ప్రశ్నార్థకంగానే మిగిలింది. హెచ్‌టీఎస్ సారథ్యంలో ఏర్పడబోయే సర్కారుకు ముళ్లబాటే స్వాగతం పలుకుతోంది.

ఇప్పటికైతే మధ్యేమార్గమే!

అసద్ ఇంత త్వరగా పారిపోతారని, దేశం తమ సొంతమవుతుందని నిజానికి హెచ్‌టీఎస్ కూడా ఊహించలేదు. దాంతో మిగతా మిలిటెంట్ గ్రూపులు, రాజకీయ పార్టీలు తదితరాలతో చర్చలు జరపడం, వాటితో అధికార పంపిణీ క్రతువును సజావుగా పూర్తి చేయడం, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం దానికి సవాలుగా మారింది. దాంతో పాటు జొలానీ సారథ్యంలో కొలువుదీరబోయే హెచ్‌టీఎస్ సర్కారుకు అంతర్జాతీయ గుర్తింపు ఏ మేరకు దక్కుతుందనేది కూడా కీలకమే. ఈ విషయంలో కీలక పొరుగు దేశమైన తుర్కియేతో పాటు యూరోపియన్ యూనియన్, అమెరికాలది కీలక పాత్ర కానుంది. హెచ్‌టీఎస్ మూలాలు అల్ ఖైదాతో ముడిపడి ఉండటం పరిస్థితిని సంక్లిష్టంగా మార్చేలా కన్పిస్తోంది. పూర్తి ప్రజాస్వామిక పాలనపై ఎవరికీ ఆశలు లేకపోయినా, అతివాద పోకడలకు హెచ్‌టీఎస్ తాత్కాలికంగానైనా దూరంగా ఉండాల్సి రావచ్చు. అంతేగాక కుర్దిష్‌ల స్వతంత్ర ప్రతిపత్తిని గుర్తించడంతో పాటు అంతర్జాతీయ సమాజం విధించే పలు షరతులకు కట్టుబడాల్సిన పరిస్థితి తలెత్తేలా కన్పిస్తోంది. ఈ దిశగా జొలానీ ఇప్పటికే పలు సంకేతాలైతే ఇచ్చారు. విపక్షాల పట్ల సహయంతో వ్యవహరిస్తామని సీఎన్ఎన్ వార్తా సంస్థకు ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. మతపరమైన మైనారిటీల హక్కులకు అధిక ప్రాధాన్యమిస్తామంటూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ మాదిరిగా మహిళల వస్త్రధారణపై ఆంక్షల వంటి వాటి జోలికి పోబోమని సోమవారం ఆయన కుండ బద్దలు కొట్టారు కూడా. అయితే శరణార్థులుగా దేశాలు పట్టుకుని పోయిన సిరియన్ల తిరిగి రాక మరో పెద్ద అంశం కానుంది. అంతర్గత కల్లోలం నేపథ్యంలో కొన్నేళ్లుగా భారీగా దేశం వీడిన సిరియన్లంతా తిరిగొస్తున్నారు. వారందరికీ ఆశ్రయంతో పాటు ఉపాధి కల్పన సవాలు కానుంది. వీటికి తోడు పలు ప్రాంతాలను ఆక్రమించుకుని గుప్పెట్లో పెట్టుకున్న చిన్నాచితకా మిలిటెంట్ గ్రూపులతో కొత్త ప్రభుత్వం నెట్టుకొస్తుందనేది ఆసక్తికరం.

స్థిరత్వం నెలకొనాలి: భారత్

న్యూఢిల్లీ/మాస్కో/జెరూసలేం: సిరియాలో వీలైనంత త్వరగా స్థిరత్వం నెలకొంటుందని భారత్ ఆశాభావం వెలిబుచ్చింది. సిరియాలోని భారతీయుల క్షేమానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్టు ఒక ప్రకటనలో పేర్కొంది. సిరియాలో అధికార మార్పును ఈయూతో పాటు అమెరికా తదితర దేశాలు స్వాగతించాయి.

అసద్‌కు ఆశ్రయమిచ్చాం: రష్యా

అసద్‌కు రాజకీయ ఆశ్రయం కల్పించినట్టు రష్యా సోమవారం ధ్రువీకరించింది. అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు క్రెమ్లిన్ ఒక ప్రకటన విడుదల చేసింది. రష్యాలో ఆయన ఎక్కడ తలదాచుకున్నదీ వెల్లడించలేదు.

ఇజ్రాయెల్ వైమానిక దాడులు

సిరియాలో పలు ప్రాంతాలపై ఇజ్రాయెల్ సోమవారం భారీ వైమానిక దాడులకు దిగింది. దీర్ఘశ్రేణి రాకెట్లు, రసాయనిక ఆయుధాలు రెబెల్స్ చేతిలో పడకుండా వాటిని ధ్వంసం చేసేందుకే దాడులు చేసినట్టు ప్రకటించింది. అమెరికా కూడా సిరియా లో 75 ఐసిస్ స్థావరాలపై వైమానిక దాడులు చేసింది.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఇది హిందుస్తాన్

మెజారిటీ ప్రజల అభీష్టం మేరకే పాలన నడుస్తుంది


- అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ శేఖర్ యాదవ్ వ్యాఖ్యలు
- బహు భార్యత్వం, ట్రిపుల్ తలాఖ్‌ను తప్పుబట్టిన వైనం



ప్రయాగ్‌రాజ్: దేశంలో మెజారిటీ ప్రజల ఇష్టానుసారం పాలన కొనసాగాలని చెప్పేందుకు మాత్రం సంకోచించనని అలహాబాద్ హైకోర్టు జడ్జి జస్టిస్ డాక్టర్ శేఖర్ యాదవ్ వ్యాఖ్యానించారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో ఆదివారం అలహాబాద్ హైకోర్టు లైబ్రరీ హాల్లో విశ్వహిందూ పరిషత్ హైకోర్టు యూనిట్ లీగల్ సెల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) అంశంపై ఆయన మాట్లాడారు. ''మెజారిటీ ప్రజల అభీష్టం మేరకే చట్టం నడుచుకోవాలి. కుటుంబంగా చూసినా, సమాజంగా చూసినా మెజారిటీ ప్రజల సంక్షేమం, సంతోషమే ముఖ్యం'' అన్నారు. ముస్లింలలో ఉన్న బహుభార్యత్వం, ట్రిపుల్ తలాఖ్, హలాలా వంటి విధానాలను జడ్జి పరోక్షంగా విమర్శించారు. '' మా పర్సనల్ లా వీటికి అంగీకరిస్తోందని అది ఏమాత్రం ఆమోదనీయం కాదు. మన శాస్త్రాలు, వేదాల్లో స్త్రీని శక్తిస్వరూపిణిగా భావించారు. నలుగురు భార్యలను కల్గి ఉంటాను, హలాలా, ట్రిపుల్ తలాఖ్‌ను పాటిస్తానంటే కుదరదు. సామరస్యం, లింగ సమానత, సామ్యవాదమే యూసీసీ ధ్యేయం. అంతే తప్ప వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్, హిందూయిజాలను అది ప్రోత్సహించదు'' అన్నారు.

ఇది టెక్, డేటా శతాబ్ది

- సంస్కరణలు.. పనితీరు.. పారదర్శకత
- ఇదే భారత్ అభివృద్ధి మంత్రం
- రైజింగ్ రాజస్థాన్ గ్లోబల్ సమ్మిట్‌లో మోదీ వ్యాఖ్యలు



జైపూర్: సంస్కరణలు, పనితీరు, పారదర్శకతలను పాటిస్తూ భారత్ సాధించిన అభివృద్ధి ఇప్పుడు ప్రతి రంగంలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తోందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. సోమవారం జైపూర్‌లోని ఎగ్జిబిషన్, కన్వెన్షన్ సెంటర్‌లో మొదలైన 'రైజింగ్ రాజస్తాన్ గ్లోబల్ సమ్మిట్'లో ప్రధాని ప్రసంగించారు. ''ప్రపంచవ్యాప్తంగా ప్రతి పెట్టుబడిదారుడు, నిపుణుడు భారత్‌పై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాడు. గత పదేళ్లలో భారత్ పదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ నుంచి ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ స్థాయికి ఎదిగింది. సంక్షోభాల సమయంలోనూ నిరాటంకంగా ఉత్పత్తిని కొనసాగించే పటిష్టమైన ఆర్థిక వ్యవస్థను ప్రపంచం కోరుకుంటోంది. అలాంటి భారీ ఉత్పత్తి క్షేత్రంగా భారత్ ఎదగాలి. భారత్ వంటి వైవిధ్యభరిత దేశంలో ప్రజాస్వామ్యం పరిఢవిల్లడం కలిసొచ్చే అంశం. ప్రజాస్వామ్యయుతంగా మానవాళి సంక్షేమం కోసం పాటుపడటం భారత విధానం. ప్రజలు సుస్థిర ప్రభుత్వాన్నే ఎన్నుకుంటున్నారు. ఈ సంస్కృతిని యువశక్తి మరింత ముందుకు తీసుకెళ్తోంది. యువభారతంగా మనం ఇంకా చాన్నాళ్లు మనం కొనసాగబోతున్నాం. భారత్‌లో అత్యంత ఎక్కువ మంది యువత, అందులోనూ నైపుణ్యవంతులైన యువత అందుబాటులో ఉన్నారు. డిజిటల్ సాంకేతికతను ప్రజాస్వామీకరణ చేయడం ద్వారా ప్రయోజనాలు ప్రజలందరికీ దక్కుతాయని భారత్ నిరూపించింది. ఈ శతాబ్దిని టెక్నాలజీ, డేటాలే ముందుకు నడిపిస్తాయి'' అన్నారు.

'కేపిటల్' దోషులకు క్షమాభిక్ష

ఉక్రెయిన్‌కు సాయం తగ్గుతుంది: ట్రంప్

వాషింగ్టన్: 2021 యూఎస్ కేపిటల్ భవనంపై దాడిలో పాల్గొన్న వారికి క్షమాభిక్ష ప్రసాదిస్తానని అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్ మరోసారి సంకేతాలిచ్చారు. జనవరి 20న బాధ్యతలు స్వీకరించగానే వలసలు, ఇంధనం, ఎకానమీతో పాటు క్షమాభిక్షకు సంబంధించి కూడా ఉత్తర్వులు జారీ చేస్తానని స్పష్టం చేశారు. ఎన్నికల విజయం తరువాత ఎన్బీసీతో జరిగిన తొలి మీట్ ది ప్రెస్‌లో ట్రంప్ పలు అంశాలపై మాట్లాడారు. ఉక్రెయిన్‌కు తన హయాంలో ఆశించనంత సాయం అందకపోవచ్చన్నారు. ''అమెరికాలో జన్మించిన ప్రతి ఒక్కరికీ దేశ పౌరసత్వం పొందడానికి అర్హత కల్పించే జన్మహక్కు పౌరసత్వాన్ని రద్దు చేస్తా. బైడెన్, ఆయన కుటుంబంపై ప్రత్యేక విచారణ కోరబోను. నాపై విచారణ జరిపిన డెమొక్రటిక్ పార్టీ నేతృత్వంలోని ప్రతినిధుల సభ కమిటీ సభ్యులు మాత్రం జైలుకు వెళ్లాల్సిందే'' అని ట్రంప్ అన్నారు.

నాటోతోనే.. కానీ!

నాటో నుంచి అమెరికా వైదొలిగే విషయమై ట్రంప్ ఆసక్తికరంగా స్పందించారు. మిగతా సభ్య దేశాలు తమ వాటా నిధులను చెల్లిస్తే, నిష్పాక్షికంగా వ్యవహరిస్తున్నాయని భావిస్తే నాటోలో కొనసాగుతామని చెప్పారు. అబార్షన్ మాత్రలపై ఆంక్షలు విధించాలని తాను కోరబోనని చెప్పారు.



మెక్సికో, కెనడా కూడా అమెరికాలో కలిసి పోతే మేలు!

మెక్సికో, కెనడాలకు అమెరికా ఇస్తున్న భారీ రాయితీలను ట్రంప్ తీవ్రంగా తప్పుబట్టారు. 'కెనడాకు ఏటా 100 బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 8,48,700 లక్షల కోట్లు). మెక్సికోకైతే ఏకంగా 300 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.25,46,100 లక్షల కోట్లు). ఇంతటి రాయితీలివ్వడం అమెరికాకు అవసరమా? అసలు రాయితీలు ఎందుకివ్వాలి? దీనికి బదులు వాటిని పూర్తిగా అమెరికాలో కలుపుకుంటే సరిపోతుంది'' అని వ్యాఖ్యానించారు.

పార్లమెంటులో 'సోరోస్'

సంస్థతో సోనియా బంధంపై చర్చ

- సభల్లో పట్టుబట్టిన బీజేపీ
- ఆందోళనలతో అట్టుడికిపోయిన రాజ్యసభ
- ఉభయ సభలు నేటికి వాయిదా

న్యూఢిల్లీ: దేశ వ్యతిరేక కార్యలాపాల ఆరోపణలు ఎదుర్కొంటున్న జార్జ్ సోరోస్ ఫౌండేషన్‌తో కాంగ్రెస్ అగ్ర నేత సోనియాగాంధీ సంబంధాల వ్యవహారం సోమవారం పార్లమెంటును కుదిపేసింది. దీనిపై ప్రభుత్వ, ప్రతిపక్షాల ఆందోళనలు, పరస్పర ఆరోపణ, విమర్శలతో ఉభయ సభలూ అట్టుడికాయి. సోరోస్ ఫౌండేషన్ నిధులతో నడుస్తున్న ఫోరం ఆఫ్ డెమొక్రాటిక్ లీడర్స్ ఆసియా పసిఫిక్ (ఎఫ్‌డీఎల్‌–ఏపీ) అనే సంస్థకు సోనియా కో ప్రెసిడెంట్‌గా ఎందుకున్నారో చెప్పాలని బీజేపీ సభ్యులు పట్టుబట్టారు. వారి ఆరోపణలన్నింటినీ కాంగ్రెస్ సభ్యులు తోసిపుచ్చారు. అదానీ అంశంపై బదులివ్వలేకే ఉద్దేశపూర్వకంగా దీన్ని తెరపైకి తెచ్చారని మండిపడ్డాయి. ఇరు పక్షాల ఆందోళనల నేపథ్యంలో ఉభయ సభలూ కార్యకలాపాలేవీ చేపట్టకుండానే మంగళవారానికి వాయిదా పడ్డాయి. రాజ్యసభ కార్యకలాపాలు మొదలవగానే సోరోస్ అంశంపై చర్చ జరగాలంటూ సభ నాయకుడు జేపీ నడ్డా పట్టుబట్టారు. ఇది దేశ భద్రతకు సంబంధించిన అతి ముఖ్యమైన అంశమని ఆయనన్నారు. నడ్డాకు మద్దతుగా అధికార పక్ష సభ్యులంతా లేచి నిలబడి కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బిగ్గరగా నినాదాలు చేశారు. దాంతో సభ కాసేపు వాయిదా పడింది. తర్వాత కూడా ఈ అంశంపైనే దుమారం సాగింది. జమ్మూ కశ్మీర్‌ను భారత్‌కు సంబంధం లేని ప్రత్యేక ప్రాంతంగా పరిగణించే ఎఫ్‌డీఎల్–ఏపీ సంస్థతో జార్జ్ సోరోస్ లింకులు ఆందోళన కలిగించే అంశమని నడ్డా అన్నారు. ఇలాంటి వాటి చేతుల్లో కాంగ్రెస్ పావుగా మారిందని ఆరోపించారు. ఎన్డీఏ సభ్యులంతా ఆయనతో గొంతు కలిపారు. తమ డిమాండ్లను పట్టించుకోని చైర్మన్, అధికార పక్షం లేవనెత్తగానే ఈ అంశాన్ని మాత్రం చర్చకు ఎలా అనుమతిస్తారని జైరాం రమేశ్, ప్రమోద్ తివారీ (కాంగ్రెస్) అభ్యంతరం వెలిబుచ్చారు. సభలో లేని సభ్యురాలి ప్రతిష్టకు ఇలా భంగం కలిగించడం సరికాదని విపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆక్షేపించారు. ''దేశ ప్రతిష్టకు భంగం కలిగించజూసే శక్తులతో పొంచి ఉన్న ప్రమాదాన్ని నిర్లక్ష్యం చేయజాలం. దేశ వ్యతిరేక కార్యకలాపాలకు దన్నుగా నిలుస్తోందని అభియోగాలున్న సంస్థకు ఈ సభలోని సభ్యురాలే కో ప్రెసిడెంట్ అన్నది మర్చిపోరాదు'' అని చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ బదులిచ్చారు. ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. చైర్మన్ అధికార పక్షం పట్ల పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. లోక్‌సభలోనూ ఇవే దృశ్యాలు కన్పించాయి. అనంతరం పార్లమెంటు బయట కూడా సోరోస్ అంశంపై కేంద్ర మంత్రి కిరెణ్ రిజిజుతో పాటు బీజేపీ నేతలు సోనియాపై విమర్శలు గుప్పించారు. వాటిని కాంగ్రెస్ నేతలు ఖండించారు.


ధన్‌ఖడ్‌పై విపక్షాల 'అవిశ్వాసం'!



రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్‌తో విపక్షాల అభిప్రాయ బేధాలు మరోసారి తెరపైకి వచ్చాయి. ఆయన్ను ఉపరాష్ట్రపతి పదవి నుంచి తొలగించే దిశగా అవి పావులు కదుపుతున్నాయి. ఈ మేరకు రాజ్యసభలో అతి త్వరలో తీర్మానం ప్రవేశపెట్టనున్నట్టు ప్రతిపక్షాలు చెబుతున్నాయి. ''గత ఆగస్టులోనే విపక్ష ఇండియా కూటమి పక్షాలం ఈ దిశగా ప్రయత్నాలు చేశాం. కానీ ధన్‌ఖడ్‌కు మరో అవకాశమివ్వాలనే ఉద్దేశంతో ఊరుకున్నాం. కానీ సోమవారం సభలో ఆయన ప్రవర్తించిన తీరు చూశాక అవిశ్వాస తీర్మానం తప్ప మరో దారి లేదని తేలిపోయింది'' అని విపక్ష నేతలు కొందరు వెల్లడించారు. ''ధన్‌ఖడ్ ప్రవర్తన ఎంతమాత్రమూ ఆమోదయోగ్యం కాదు. బీజేపీకి ఆ పార్టీ అధికార ప్రతినిధి కంటే కూడా విశ్వాసపాత్రునిగా ఆయన వ్యవహరిస్తున్నారు'' అంటూ మండిపడ్డారు. కాంగ్రెస్‌తో పాటు సమాజ్‌వాదీ, తృణమూల్ తదితర పార్టీలు ఈ విషయంలో కలిసొస్తున్నట్టు సమాచారం. ఆర్టికల్ 67(బి) ప్రకారం తీర్మానాన్ని రాజ్యసభ సాధారణ మెజారిటీతో ఆమోదించాక లోక్‌సభ ఆమోదం కూడా పొందితే ఉపరాష్ట్రపతిని తొలగించవచ్చు.

ఉచితాలతో ఇంకెంతకాలం?

ఉద్యోగావకాశాలు ఎందుకు కల్పించరు?: సుప్రీం



న్యూఢిల్లీ: కోవిడ్ మహమ్మారి సమయం నుంచి వలస కార్మికులకు ఉచితంగా రేషన్ పంపిణీ చేస్తుండటంపై సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఉచితాలను ఇంకా ఎంతకాలం ఇస్తారంటూ ప్రభుత్వాలను ప్రశ్నించింది. ఉద్యోగావకాశాల కల్పన, సామర్థ్యాల పెంపుపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందని పేర్కొంది. జాతీయ ఆహార భద్రత చట్టం కింద 81 కోట్ల మందికి ఉచిత/సబ్సిడీ రేషన్ అందజేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం తెలపగా..దీనర్థం పన్ను చెల్లింపుదార్లను మాత్రమే మినహాయించారని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ మన్మోహన్‌ల ధర్మాసనం ఈ మేరకు వ్యాఖ్యానించింది. 2020లో కోవిడ్ మహమ్మారి సమయంలో వలస కార్మికులు ఎదుర్కొన్న అవస్థలపై సుమోటోగా దాఖలైన పిటిషన్‌పై ఎన్జీవో తరఫున ప్రశాంత్ భూషణ్ వాదనలు వినిపిస్తూ.. ఇ–శ్రమ్ పోర్టల్ నమోదైన వలస కార్మికులందరికీ ఉచితంగా రేషన్ ఇవ్వాలని కోరారు. స్పందించిన ధర్మాసనంపై వ్యాఖ్యలు చేసింది. 'వలస కార్మికులందరికీ ఉచితంగా రేషనివ్వాలని రాష్ట్రాలను మేం ఆదేశిస్తే ఒక్కరు కూడా ఇక్కడ కనిపించరు. ఉచిత రేషన్ బాధ్యత ఎలాగూ కేంద్రానిదే కాబట్టి, రాష్ట్రాలు ప్రజలను మభ్యపెట్టడానికి రేషన్ కార్డులను జారీ చేస్తాయి. అసలు సమస్య ఇదే'అని ధర్మాసనం పేర్కొంది. వలస కార్మికుల సమస్యలపై సవివర విచారణ జరపాల్సి ఉందన్న ధర్మాసనం.. తదుపరి విచారణను జనవరి 8వ తేదీన వాయిదా వేసింది.

స్పైస్‌జెట్ విమానాల్లో సాంకేతిక లోపాలు

పట్నా/చెన్నై: సాంకేతిక లోపాలు తలెత్తడంతో సోమవారం స్పైస్‌జెట్‌కు చెందిన రెండు విమానాలను అధికారులు దారి మళ్లించారు. వీటిలో ఒకటి ఢిల్లీ–షిల్లాంగ్ సర్వీసు కాగా, మరోటి చెన్నై–కోచి విమానం. సోమవారం ఉదయం ఢిల్లీ నుంచి షిల్లాంగ్‌కు టేకాఫ్ తీసుకున్న విమానంలో సాంకేతిక లోపం తలెత్తినట్లు పైలట్ గుర్తించారు. అధికారుల సూచనల మేరకు ఉదయం8.52 గంటల సమయంలో పట్నాలోని జయప్రకాశ్ నారాయణ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా ఉన్నారని స్పైస్‌జెట్ ప్రతినిధి తెలిపారు. అదేవిధంగా, చెన్నై నుంచి కోచికి 117 మంది ప్రయాణికులతో టేకాఫ్ తీసుకున్న విమానంలో సాంకేతిక లోపం ఏర్పడింది. దీంతో, విమానాన్ని తిరిగి చెన్నై విమానాశ్రయంలోనే సురక్షితంగా ల్యాండ్ చేశామని అధికారులు తెలిపారు. ఈ రెండు విమానాల ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని చెప్పారు.

మీరు ఆక్రమిస్తుంటే...
మేం లాలీపాప్ తింటామా?

బంగ్లా నేతలకు మమత కౌంటర్

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌ను మరికొద్ది రోజుల్లోనే ఆక్రమించుకుంటామంటూ బంగ్లాదేశ్ రాజకీయ నేతలు కొందరు చేస్తున్న అతి వ్యాఖ్యలపై సీఎం మమతా బెనర్జీ దీటైన సమాధానమిచ్చారు. అవన్నీ మతిలేని వ్యాఖ్యలంటూ ఆమె కొట్టిపారేశారు. 'మీరొచ్చి బెంగాల్, బిహార్, ఒడిశాలను ఆక్రమించుకుంటూ ఉంటే మేం లాలీపాప్ తింటూ కూర్చుంటామనుకుంటున్నారా? అంటూ మండిపడ్డారు. 'మా భూభాగాన్ని మా నుంచి లాక్కునే సత్తా ఎవ్వరికీ లేదు. అటువంటి ఆలోచన కూడా రానివ్వకండి'అని హెచ్చరించారు. రాష్ట్రంలో ఉద్రిక్తతలను ప్రేరేపించే దురుద్దేశంతోనే ఓ రాజకీయ పార్టీ ఫేక్ వీడియోలను ఇక్కడ వ్యాప్తి చేస్తోందని ఆరోపించారు. ఇటువంటి తప్పుడు సమాచారాన్ని పట్టించుకోవద్దని ప్రజలకు ఆమె విజ్ఞప్తి చేశారు. భారత్‌లో పరిణామాలను రాజకీయం చేయాలని చూడటం బంగ్లాదేశీయులతోపాటు బెంగాల్‌కు, ఇక్కడి ప్రజలకు కూడా క్షేమకరం కాదని మమత హెచ్చరించారు. అనవసరమైన వ్యాఖ్యల కారణంగా బంగ్లాదేశ్‌లో పరిస్థితులు మరింతగా విషమించే ప్రమాదముందని కూడా మమతా బెనర్జీ అభిప్రాయపడ్డారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీలపై జరుగుతున్న దౌర్జన్యాలను ఆమె తీవ్రంగా ఖండించారు.

అదానీ, మోదీ పాత్రధారులతో...
రాహుల్ మాక్ ఇంటర్వ్యూ



న్యూఢిల్లీ: అదానీ అంశంపై విపక్షాలు సోమవారం పార్లమెంటు మకరద్వారం వద్ద వినూత్నంగా నిరసన తెలిపాయి. అందులో భాగంగా కాంగ్రెస్ ఎంపీలు పారిశ్రామికవేత్త గౌతం అదానీలా మాణిక్కం ఠాగూర్, ప్రధాన నరేంద్ర మోదీలా సప్తగిరి శంకర్ మాస్కులు ధరించారు. వారితో విపక్ష నేత రాహుల్ గాంధీ మాక్ ఇంటర్వ్యూ నిర్వహించారు. పార్లమెంటును ఎందుకు నడవనీకయకుండా చేస్తున్నారని అదానీ (ఠాగూర్)ను ప్రశ్నించారు. ''ఇది అమిత్ భాయ్ (హోం మంత్రి అమిత్ షా)ను అడగాలి. కానీ ఆయన కన్పించడం లేదుగా'' అంటూ ఆయన బదులిచ్చారు. మీ మధ్య సంబంధమేమిటని రాహుల్ మరో ప్రశ్నించగా, ''మేమిద్దరం ఒకటే. ఎయిర్‌పోర్టయినా, మరొకటయినా నేనేది అడిగినా చేస్తారాయన'' అంటూ ఠాగూర్ మళ్లీ బదులిచ్చారు. దీనిపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారంటూ రాహుల్ రెట్టించగా, ''ఆయన ఈ మధ్య చాలా టెన్షన్‌గా ఉంటున్నారెందుకో'' అని సమాధానమిచ్చారు.



ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి

రైల్వే ప్రయాణికులు తమ వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా సెల్‌ఫోన్లను ఎక్కడపడితే అక్కడ పెట్టి వెళ్లకూడదని రైల్వే డీఎస్పీ (అర్బన్) ఎస్.ఎన్.జావీద్ సూచించారు. -8లో



స్వెట్టీస్.. స్టైల్..

నగరంలో చలి పెరిగింది. చలి నుంచి రక్షణ కోసం నగరవాసులు స్వెటర్లు కొనుగోలు చేస్తున్నారు. దీంతో వెరైటీ స్వెటర్లు, మఫ్లర్లు, చేతి గ్లౌజులు కొలువుదీరాయి. -సిటీప్లస్‌లో..

గరిష్టం/కనిష్టం
29.0/21.0

వాతావరణం

నగరంలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళల్లో పొగమంచు వాతావరణం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో తేలిక పాటి వర్షం లేదా చినుకులు పడే అవకాశం ఉంటుంది.

జీహెచ్ఎంసీ ప్రజావాణికి 118 దరఖాస్తులు



లక్డీకాపూల్ : జీహెచ్ఎంసీ వ్యాప్తంగా సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో హెడ్‌ఆఫీస్‌తో పాటు మొత్తం 118 ఫిర్యాదులు వచ్చాయి. బల్దియా పరిధిలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు పాల్గొని పలు సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా 2 విన్నపాలు రాగా, పరిష్కారం నిమిత్తం ఆయా విభాగాలకు సిఫార్సు చేశారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 52 వినతులు రాగా అందులో టౌన్ ప్లానింగ్ విభాగానికి 22, ఎఫ్ఏ సెక్షన్ 12, ట్యాక్స్ సెక్షన్ 8, ఇంజనీరింగ్ 3, వెటర్నరీ సెక్షన్, శానిటేషన్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ 2 చొప్పున, స్పోర్ట్స్ సెక్షన్‌కు ఒకటి చొప్పున అందాయి. ఇక ఆరు జోన్లలో మొత్తం 66 అర్జీలు అందాయి. అందులో కూకట్‌పల్లి జోన్‌లో 36, ఎల్బీనగర్ జోన్‌లో 10, సికింద్రాబాద్ 8, శేరిలింగంపల్లి 2, ఖైరతాబాద్ 4, చార్మినార్ జోన్‌లో ఆరు ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, నళిని పద్మావతి, గీతా రాధిక, సత్యనారాయణ, రఘు ప్రసాద్, సుభద్ర దేవి, సి.సి.పి శ్రీనివాస్ అడిషనల్ సి.సి.పి గంగాధర్, వాటర్ వర్క్స్ జీఎం సాయిరమణ, హౌసింగ్ ఎస్ఈ పీవీ రమణ రాజేశ్వర్ రావు, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

మహిళా యూనివర్సిటీలో కుక్కల దాడి

ఇద్దరు విద్యార్థినులకు తీవ్ర గాయాలు



సుల్తాన్‌బజార్: కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో విద్యార్థినిలకు రక్షణ లేకుండా పోయింది. యూనివర్సిటీ ప్రాంగణంలో దాదాపు 20 కుక్కలు రోజూ స్వైర విహారం చేస్తుంటాయి. ఆదివారం రాత్రి కళాశాల హాస్టల్ వైపు వెళ్తున్న డిగ్రీ విద్యార్థినులు అంకిత, ప్రవీణలపై కుక్కలు ఒక్కసారిగా దాడిచేసి కరిచాయి. దీంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కుక్కలు దాడి చేయడంతో పరిగెత్తిన ఓ విద్యార్థిని చెవికమ్మ తెగిపోయి తీవ్ర రక్తస్రావమైంది. మరో విద్యార్థినికి ముఖంపై గాయాలు కావడంతో యూనివర్సిటీ నిర్వాహకులు వారిని బర్కత్‌పురాలోని సీసీ షరాఫ్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వారు చికిత్స పొందుతున్నారు. ఈ ఘటనపై విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల అధికారులపై మండిపడ్డారు. యూనివర్సిటీలో కుక్కలతో పాటు పాములు సైతం పెద్ద సంఖ్యలో తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై వర్సిటీ వీసీ సూర్య ధనుంజయ్ మాట్లాడుతూ తాను బాధ్యతలు చేపట్టిన రెండవ రోజే వర్సిటీలో కుక్కల నియంత్రణపై జీహెచ్ఎంసీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కోఠి మహిళా కాలేజీ ఉత్సవాల ముగింపునకు రాష్ట్రపతి రాక

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలో వంద సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన కోఠి మహిళా కాలేజీ శతాబ్ది ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్యఅతిథిగా హాజరు కానున్నారు. గత ఏడాది ప్రారంభమైన ఉత్సవాలు ఈ నెల 21తో ముగియనున్నాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్రపతితో పాటు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డి, ఓయూ వీసీ ప్రొఫెసర్ కుమార్, మహిళా వర్సిటీ వీసీ ప్రొ.సూర్యధనుంజయ్ తదితరులు హాజరుకానున్నారు.

'ముగింపు' అదుర్స్





బాణసంచా వెలుగులు..విద్యుత్ కాంతులు..సాంస్కృతిక సౌరభాలు..నృత్యాలు..కళాకారుల విన్యాసాలు.. తమన్ సంగీత కచేరీ..వెరసి సోమవారం సాయంత్రం తెలంగాణ సచివాలయం, హుస్సేన్ సాగర్ పరిసర ప్రాంతాలు కొత్త శోభను సంతరించుకున్నాయి. తెలంగాణ ప్రజాపాలన విజయోత్సవాల ముగింపు కార్యక్రమం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక ప్రదర్శనలు నగరవాసులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా సినీ సంగీత దర్శకుడు తమన్ మ్యూజిక్ షోకు జనం ఉర్రూతలూగారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి స్టెప్పులేసి అలరించారు.

– సాక్షి, సిటీబ్యూరో





ప్చ్...ఇప్పుడొద్దులే..!

పలుచోట్ల మిగిలిన ప్లాట్ల వేలానికి సన్నాహాలు

- పదిరోజుల క్రితం వరకు హడావుడి
- రియల్ స్తబ్దతతో వెనుకంజ

హెచ్ఎండీఏలో భూముల వేలం డీలా

సాక్షి, సిటీబ్యూరో: ఆన్‌లైన్ బిడ్డింగ్ అన్నారు... హడావుడి చేశారు. లే అవుట్‌లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న స్థలాల జాబితాను సైతం సిద్ధం చేశారు. కానీ అంతలోనే వెనుకడుగు వేశారు. కొద్ది రోజుల క్రితం హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ)లో నెలకొన్న పరిణామం ఇది. గతేడాది భూముల అమ్మకాల ద్వారా ప్రభుత్వానికి పెద్ద ఎత్తున ఆదాయం లభించింది. అదే సమయంలో కొందరు వేలంలో పాల్గొన్నప్పటికీ డబ్బులు చెల్లించకుండా చేతులెత్తేశారు. హెచ్ఎండీఏలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న లే అవుట్‌లలో కనీసం 50 శాతం వరకు ఎగవేతదార్లు ఉన్నట్లు సమాచారం. అలా డబ్బులు చెల్లించకపోవడం వల్ల నిలిచిపోయిన స్థలాలతో పాటు, ఇంకా వివిధ లే అవుట్‌లలో మిగిలిపోయిన స్థలాలకు సైతం బిడ్డింగ్ నిర్వహించాలని అధికారులు భావించారు.

కానీ రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న స్తబ్దత కారణంగా అధికారులు ముందడుగు వేయలేకపోయారు. ఆన్‌లైన్ బిడ్డింగ్ ప్రతిపాదనలను ప్రస్తుతానికి విరమించుకున్నట్లు తెలిసింది. కోకాపేట్, మోకిల్లా, బుద్వేల్ తదితర ప్రాంతాల్లో నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు గతంలో అనూహ్యమైన స్పందన లభించిన సంగతి తెలిసిందే. అప్పట్లో స్థలాలు, ప్లాట్లు కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చిన బిల్డర్లు, రియల్టర్లలో కొందరు పూర్తిగా డబ్బులు చెల్లించి భూములను సొంతం చేసుకున్నారు. కానీ మరి కొంతమంది ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో పాల్గొని స్థలాలను దక్కించుకున్నప్పటికీ ఇప్పటి వరకు డబ్బులు చెల్లించకపోవడం గమనార్హం. అలాంటి వాటిని గుర్తించి మొదట విక్రయించేందుకు హెచ్ఎండీఏ అధికారులు రంగం సిద్ధం చేశారు. కానీ గతంలో విక్రయించిన ధరల కంటే తక్కువ ధరలకు భూములు అమ్ముడైతే పెద్ద మొత్తంలో నష్టపోవలసి వస్తుందనే ఉద్దేశంతో ప్రస్తుతానికి వాయిదా వేసినట్లు ఓ అధికారి తెలిపారు. 'హెచ్ఎండీఏకు నష్టమే కాకుండా మొత్తం రియల్ ఎస్టేట్‌రంగంపైన కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే ఆన్‌లైన్ బిడ్డింగ్‌ను వాయిదా వేసుకోవలసి వచ్చింద'ని చెప్పారు.

అప్పుడు అది హాట్ కేక్ సరే....

హెచ్ఎండీఏకు అనేక చోట్ల సొంత భూములు ఉప్పల్ భగాయత్, హయత్‌నగర్, బాచుపల్లి, బోడుప్పల్, మేడిపల్లి, హెచ్ఎంటీ కాలనీ, కుత్బుల్లాపూర్ తదితర ప్రాంతాలతో పాటు నగరానికి పడమటి వైపున కోకాపేట్‌లోను పెద్ద ఎత్తున భూములు ఉన్నాయి. గత సంవత్సరం కోకాపేట్‌లో రెండు దఫాలుగా వేలం నిర్వహించారు. స్థలాలు హాట్‌కేక్‌ల్లా అమ్ముడయ్యాయి. కోకాపేట్ భూమి బంగారం కంటే విలువైందిగా మారింది. ఆకాశహర్మ్యాలతో అలరారే కోకాపేట్ అంతర్జాతీయ హంగులతో దేశ విదేశాలకు చెందిన వ్యాపార దిగ్గజ సంస్థలను ఇప్పటికీ విశేషంగానే ఆకట్టుకుంటోంది. ఒకవైపు ఔటర్ రింగ్‌రోడ్డు, మరోవైపు ఎయిర్‌పోర్టు అందుబాటులో ఉండడంతో అనేక సంస్థలు కోకాపేట్ పట్ల ఆసక్తి చూపుతున్నాయి. ఈ ట్రెండ్‌ను దృష్టిలో ఉంచుకొని మొదట కోకాపేట్‌లో మిగిలిన స్థలాలకు బిడ్డింగ్ నిర్వహించాలని భావించారు. కానీ అప్పట్లో హాట్‌కేకుల్లా అమ్ముడైన భూములకు ఇప్పుడు కూడా అదే స్థాయి డిమాండ్ ఉండకపోవచ్చుననే అంచనాల దృష్ట్యా వాయిదా వేసుకున్నారు. కోకాపేట్ నియోపోలిస్‌లో గతేడాది హెచ్ఎండీఏ రెండు దశలుగా భూములను విక్రయించింది. మొదట 64 ఎకరాలను విక్రయించగా, రెండో దశలో 45.33 ఎకరాలు విక్రయించారు. ఎకరా గరిష్టంగా రూ.వంద కోట్ల వరకు అమ్ముడైంది. సుమారు రూ.3319 కోట్లకు పైగా ఆదాయం లభించింది. అలాగే బుద్వేల్‌లోని 100 ఎకరాలపైన మరో రూ.3625 కోట్లకు పైగా ఆదాయం లభించింది. కొనుగోలు చేసిన వారిలో కొందరు నిర్మాణాలు చేపట్టారు. కానీ ఇప్పటికీ డబ్బులు చెల్లించని వాళ్లు కూడా కొందరు ఉన్నట్లు అధికారులు తెలిపారు.



హెచ్ఎండీఏకు ఉన్న సొంత భూములతో పాటు వివిధ ప్రాంతాల్లో రైతుల నుంచి భూములను సేకరించి లే అవుట్‌లను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టారు. కుర్మల్‌గూడ, ప్రతాప్‌సింగారం, దండుమల్కాపురం, లేమూరు, ఇన్ముల్‌నెర్వ, కొర్రెములు, నాదర్‌గుల్ తదితర ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న భూములను గుర్తించారు. ఇన్ముల్‌నెర్వలో 96 ఎకరాలు, లేమూరులో మరో 83 ఎకరాల భూములలో రోడ్లు తదితర మౌలిక సదుపాయాల ఏర్పాటు కోసం చర్యలు చేపట్టారు. మిగతా చోట్ల కుర్మల్‌గూడలో 92 ఎకరాలు, బోగారంలో 125, ప్రతాప్‌సింగారంలో సుమారు 153 ఎకరాలు, దండుమల్కాపురంలో మరో 355 ఎకరాల చొప్పున భూమి ఉన్నట్లు గుర్తించారు. కానీ కొన్ని చోట్ల హెచ్ఎండీఏకు భూములు ఇచ్చేందుకు రైతులు ముందుకు రాలేదు. మరికొన్ని చోట్ల సాంకేతిక కారణాల వల్ల జాప్యం చోటుచేసుకుంది. రియల్ రంగంలో నెలకొన్న ప్రస్తుతం అనిశ్చితిని దృష్టిలో ఉంచుకొని భూముల సేకరణ, లేఅవుట్ల అభివృద్ధి, ఆన్‌లైన్ బిడ్డింగ్‌పైన మరి కొంతకాలం వేచి చూసే ధోరణే మంచిదని భావిస్తున్నారు.

సీఆర్ఎంపీ మార్గాల్లో రోడ్ల క్లీనింగ్‌కు టెండర్లు

- గతంలోనే మెషీన్ల పనితీరుపై విమర్శలు
- మళ్లీ ప్రైవేట్‌కు ఇవ్వడంపై అనుమానాలు

ప్రైవేట్‌కు 'స్వీపింగ్'.. ఎవరిని మేపేందుకో?!

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో సీఆర్ఎంపీ (సమగ్ర రోడ్డు నిర్వహణ ప్రాజెక్ట్) కింద ప్రైవేట్ ఏజెన్సీల నిర్వహణలో ఉన్న ప్రధాన రహదారుల్ని శుభ్ర పరిచేందుకు స్వీపింగ్ మెషీన్ వాహనాలను అద్దెకు తీసుకుంటున్నారు. ఇందుకోసం జీహెచ్ఎంసీ సిద్ధమైంది. టెండర్లు పిలిచే ప్రక్రియనూ ప్రారంభించింది. నిర్వహణ పనులు చేస్తున్న ప్రైవేట్ ఏజెన్సీల గడువు ముగుస్తుండటంతో స్వీపింగ్ కోసం టెండర్లు పిలుస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఏజెన్సీల గడువు ముగిస్తే..తిరిగి ప్రైవేట్ ఏజెన్సీలకే నిర్వహణకు ఇవ్వాలి. లేదా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలోనే నిర్వహించాలి. కానీ, అలా కాకుండా రోడ్ల నిర్వహణకు మాత్రం టెండర్లు పిలవకుండా కేవలం స్వీపింగ్ మెషిన్ల కోసమే టెండర్లు పిలుస్తుండటం పలు అనుమానాలకు తావిస్తోంది.

ఆ మెషీన్లతో ప్రయోజనం లేదు..

నగరంలో పారిశుద్ధ్య కార్యక్రమాల్లో భాగంగా వినియోగిస్తున్న స్వీపింగ్ మెషీన్ వాహనాలు చూసేందుకు తప్ప..వాటివల్ల రోడ్లు శుభ్రం కావడం లేదనే విమర్శలున్నాయి. ఇప్పటికే ప్రైవేట్ ఏజెన్సీల స్వీపింగ్ మెషీన్ వాహనాల అద్దెలకు ఏటా కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నా రోడ్లు మాత్రం చెత్తమయంగానే ఉంటున్నాయి. ఈ నేపథ్యంలో స్వీపింగ్ మెషీన్ వాహనాలకు జీపీఎస్ అమర్చాలని, అవి తిరిగే ప్రాంతాలు, రోడ్లను ఊడ్చే దృశ్యాలు, చేసే పనులు కనిపించేలా కెమెరాలు కూడా బిగించాలని కమిషనర్ భావించారు. పారిశుద్ధ్య విభాగం పర్యవేక్షిస్తున్న స్వీపింగ్ మెషీన్లకు సంబంధించి కమిషనర్ ఆలోచన అలా ఉండగా, తాజాగా సీఆర్ఎంపీ మార్గాల్లో కేవలం స్వీపింగ్ మెషిన్ల కోసమే టెండర్లు పిలుస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. స్వీపింగ్ మెషిన్ల పేరిట జరుగుతున్నది నిధుల దుబారానే అనేది ఇప్పటికే పలు పర్యాయాలు వెల్లడైనా కూడా తిరిగి స్వీపింగ్ మెషీన్ల కోసం మాత్రమే టెండర్లు పిలవడం వెనుక ఆంతర్యం ఏమిటో అంతుబట్టడం లేదు.

కూకట్‌పల్లి జోన్‌కు రూ.1.57 కోట్లు

దాదాపు ఐదేళ్ల క్రితం సీఆర్ఎంపీ కింద దాదాపు 811 కిలోమీటర్ల మేర ప్రధాన రహదారుల నిర్వహణ పనుల్ని జోన్ల వారీగా, ప్యాకేజీలుగా ప్రైవేట్ ఏజెన్సీల కిచ్చారు. ఒప్పందం మేరకు వాటి గడువు 2025 జనవరికి అటూ ఇటూగా ముగిసిపోనుంది.

సీఆర్ఎంపీ మార్గాల్లో 811 కి.మీల మేర రోడ్లుండగా, జోన్ల వారీగా వివరాలిలా..

జోన్	రోడ్లు(కి.మీ.)
ఎల్బీనగర్	155
చార్మినార్	132
ఖైరతాబాద్	187
శేరిలింగంపల్లి	110
కూకట్‌పల్లి	87
సికింద్రాబాద్	140

- వీటిల్లో ఖైరతాబాద్ జోన్ పరిధిలో ఎక్కువ రోడ్లుండటంతో రెండు ప్యాకేజీలుగా పనులప్పగించారు.



ఈ నేపథ్యంలో కూకట్‌పల్లి జోన్ పరిధిలోని దాదాపు 87 కిలోమీటర్ల రోడ్ల స్వీపింగ్‌కు గాను 2025 జూన్ వరకు రూ.1.57 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. ఒక వేళ నిర్వహణను తిరిగి ప్రైవేట్ ఏజెన్సీలకివ్వాలి అనుకుంటే మొత్తం నిర్వహణకు టెండర్లు పిలవాలి. కానీ అలా కాకుండా కేవలం స్వీపింగ్ కోసమే టెండర్లు పిలవడం అనుమానాలకు తావిస్తోంది. అన్ని జోన్లలోనూ సీఆర్ఎంపీ మార్గాల్లో స్వీపింగ్‌కు మెషీన్లను అద్దెకు తీసుకోవాల్సిందిగా కమిషనరే ఆదేశించినట్లు చెబుతున్నారు. మిగతా జోన్లకూ టెండర్లు పిలవనున్నట్లు తెలుస్తోంది. వాస్తవానికి గడచిన ఐదేళ్లలోనూ రోడ్ల నిర్వహణతోపాటు స్వీపింగ్, ఫుట్‌పాత్‌లు, గ్రీనరీ, లైటింగ్ వంటి పనులు కూడా కాంట్రాక్టు పొందిన ఏజెన్సీలే చేయాల్సి ఉండగా, రోడ్ల నిర్వహణ తప్ప అవి ఇతర పనులు చేయలేదు. స్వీపింగ్ చేశాయో లేదో ఏజెన్సీలకు, సంబంధిత అధికారులకే తెలియాలి.

సచివాలయానికి సిటీ బస్సులు.. ప్రయాణికులకు తిప్పలు

సాక్షి, సిటీబ్యూరో: సిటీ బస్సులు సచివాలయానికి పరుగులు తీశాయి. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ప్రభుత్వం వివిధ ప్రాంతాల నుంచి మహిళలను పెద్ద ఎత్తున తరలించింది. ఇందుకోసం సిటీబస్సులను ఏర్పాటు చేశారు. రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్, భువనగిరి, చౌటుప్పల్, సంగారెడ్డి తదితర శివారు జిల్లాలతో పాటు నగరంలోని వివిధ నియోజకవర్గాల నుంచి కూడా ప్రజలను పెద్ద సంఖ్యలో తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. దీంతో ప్రైవేట్ వాహనాలతో పాటు ఆర్టీసీ బస్సులు కూడా ఏర్పాటు చేశారు. బస్సులన్నీ సచివాలయం కోసమే ఏర్పాటు చేయడంతో సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ముఖ్యంగా సాయంత్రం విధులు ముగించుకొని ఇళ్లకు చేరుకొనే ప్రభుత్వ, ప్రైవేట్ రంగానికి చెందిన ఉద్యోగులు, వ్యాపారులు, స్కూళ్లు, కాలేజీల నుంచి ఇళ్లకు బయలుదేరిన విద్యార్థులు గంటలతరబడి బస్సుల కోసం పడిగాపులు కాశారు. చివరకు ఆటోలు, తదితర ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లవలసి వచ్చింది. మరోవైపు సచివాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం నేపథ్యంలో నగరంలో ట్రాఫిక్ స్తంభించింది. అమీర్‌పేట్, ఖైరతాబాద్, నెక్లెస్ రోడ్డు, లిబర్టీ, ఇందిరాపార్కు లోయర్‌ట్యాంక్‌బండ్ తదితర చోట్ల వాహనాలు పెద్ద ఎత్తున నిలిచిపోయాయి. వాహనదారులు గంటల తరబడి ట్రాఫిక్‌లోనే ఉండాల్సి వచ్చింది.



సచివాలయం ఎదుట ట్రాఫిక్ జాం

ఎన్ఆర్ఐ అకౌంట్‌లోని రూ.6.5 కోట్లు మాయం

బ్యాంకు సిబ్బంది చేతివాటం

- నగదు డ్రా చేస్తే ఖాతాదారునికి మెసేజ్ వెళ్లకుండా కుట్ర
- బ్యాంకు ఖాతాను క్లోజ్ చేయడంతో బయటపడ్డ విషయం
- పంజగుట్ట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు

పంజగుట్ట: ఓ ఎన్ఆర్ఐ ఖాతా నుండి రూ.6.5 కోట్ల నగదును బ్యాంకు సిబ్బంది మాయం చేసిన ఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఆస్ట్రేలియాకు చెందిన పరితోష్ ఉపాధ్యాయకు బేగంపేటలోని యాక్సిస్ బ్యాంకులో 2017 నుండి ప్రీమియం అకౌంట్ ఉంది. బేగంపేట యాక్సిస్ బ్యాంకు సీనియర్ పార్టనర్ వెంకటరమణ పాసర్ల, వైస్ ప్రెసిడెంట్ హరివిజయ్, బ్రాంచ్ హెడ్ శ్రీదేవి రఘు, సురేఖ సైనాలు కలిసి పరితోష్ ఉపాధ్యాయ పేరుతో మొత్తం 42 నకిలీ చెక్కులను తయారు చేశారు. ఈ చెక్కుల ద్వారా గత రెండు సంవత్సరాలుగా ఆయన సంతకం ఫోర్జరీ చేసి బ్యాంకు నుండి పలుమార్లు మొత్తం రూ.6.5 కోట్లు విత్‌డ్రా చేసుకున్నారు. చెక్కులు డ్రా చేసుకునే సమయంలో ఖాతాదారునికి మెసేజ్ రాకుండా జాగ్రత్త పడ్డారు. అంతటితో ఆగకుండా పరితోష్ ఉపాధ్యాయ బ్యాంకు అకౌంట్‌ను పూర్తిగా క్లోజ్ చేశారు. బ్యాంకు అకౌంట్ క్లోజ్ అయిన విషయంపై పరితోష్‌కు మెయిల్ రావడంతో అతను వివరాలు ఆరా తీయగా తన బ్యాంకు అకౌంట్ నుండి రూ.6.5 కోట్లు మాయం అయిన విషయం తెలుసుకుని అవాక్కయ్యాడు. ఆన్‌లైన్ ద్వారా బ్యాంకు స్టేట్‌మెంట్ అడిగితే సిబ్బంది నిరాకరించారు. వెంటనే తన న్యాయవాది సాయంతో పంజగుట్ట పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన స్కూల్ బస్సు

తప్పిన పెను ప్రమాదం.. విద్యార్థులకు స్వల్ప గాయాలు

- మేడ్చల్ మండలం బండమాదారంలో ఘటన

మేడ్చల్: మేడ్చల్ పట్టణానికి చెందిన చాణక్య విజన్ హైస్కూల్‌కు చెందిన స్కూల్ బస్సు అదుపుతప్పి పొలాల్లోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో విద్యార్థులకు స్వల్పగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే స్కూల్ బస్సు సోమవారం మధ్యాహ్నం మండలంలోని గిర్మాపూర్, రాయిలాపూర్ బండమాదారం గ్రామాల్లో పిల్లలను దింపడానికి బయలు దేరింది. బస్సు డ్రైవర్ సత్యనారాయణ గిర్మాపూర్, రాయిలాపూర్ గ్రామాల్లో పిల్లలను దింపి మిగిలిన 20 మంది పిల్లలను బండమాదారంలో దింపడానికి బయలుదేరాడు. గ్రామ శివార్లకు చేరుకోగానే బస్సు కంట్రోల్ తప్పి రోడ్డు దిగి పక్కనే ఉన్న పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. కొద్ది దూరం స్పీడ్‌గా వెళ్లి ఆగిపోయింది. దీంతో విద్యార్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. సీట్లలో నుంచి కిందకు పడిపోయారు. కొందరికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు, తల్లిదండ్రులను అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కోపంతో బస్సు డ్రైవర్‌పై చేయిచేసుకున్నారు. కాగా స్కూల్ బస్సు నడిపే రెగ్యులర్ డ్రైవర్ సెలవులో ఉండటంతో స్కూల్ యాజమాన్యం సత్యనారాయణను తాత్కాలిక డ్రైవర్‌గా నియమించుకుంది. రోజూ నడిపే అలవాటు లేకపోవడంతో ప్రమాదం జరిగి ఉండవచ్చని అంటున్నారు. దీనిపై డ్రైవర్ సత్యనారాయణ మాట్లాడుతూ బస్సు ఏమాత్రం కండీషన్‌లో లేదని చెప్పాడు. స్టీరింగ్ తిప్పినా తిరగకపోవడంతో ప్రమాదం తప్పించడానికి పొలాల వైపు మళ్లించానని తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి విచారణ చేపట్టారు.



స్కూల్ బస్సు వద్ద విద్యార్థులు

ఒక దొంగ... తొమ్మిది వారెంట్లు!

● మూడున్నరేళ్లుగా పరారీలో ఉన్న ప్రదీప్ ● రాజస్థాన్‌లో పట్టుకున్న సైబరాబాద్ సీసీఎస్

సాక్షి, సిటీబ్యూరో: సొత్తు సంబంధిత నేరాల్లో నిందితుడిగా ఉండి మూడున్నర ఏళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న రాజస్థాన్ వాసి ప్రదీప్‌ను సైబరాబాద్ సీసీఎస్ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఇతగాడిపై మూడు పోలీసుస్టేషన్ల పరిధిలో తొమ్మిది నాన్-బెయిలబుల్ వారెంట్లు (ఎన్‌బీడబ్ల్యూ) పెండింగ్‌లో ఉన్నట్లు క్రైమ్స్ డీసీపీ కె.నర్సింహ్మా సోమవారం తెలిపారు. రాజస్థాన్‌లోని బిచాలా గ్రామానికి చెందిన ప్రదీప్ కొన్నేళ్ల క్రితం నగరానికి వలసవచ్చాడు. నిర్మాణరంగంలో కార్మికుడిగా పని చేసిన ఇతగాడు తేలిగ్గా డబ్బు సంపాదించడం కోసం దొంగగా మారాడు. కన్‌స్ట్రక్షన్ కంపెనీలు, నిర్మాణ స్థలాలను టార్గెట్‌గా చేసుకున్న ఇతగాడు వాటి నుంచి ఇనుము, అల్యూమినియం తదితర వస్తువులు చోరీ చేసి అమ్మేవాడు. ఈ ఆరోపణలకు సంబంధించి ఇతడిపై కొల్లూరు, మోకిలా, నార్సింగి పోలీసుస్టేషన్ల పరిధిలో తొమ్మిది కేసులు నమోదయ్యాయి. ఓ సందర్భంలో మారణాయుధాలతో బెదిరించి దోపిడీకి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2021లో ఇతగాడిని కొల్లూరు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బెయిల్‌పై బయటకు వచ్చిన ప్రదీప్ తన స్వస్థలానికి వెళ్లిపోయారు. ఈ తొమ్మిది కేసుల్లోనూ కోర్టు వాయిదాలకు హాజరుకాకపోవడంతో న్యాయస్థానాలు ఎన్‌బీడబ్ల్యూలు జారీ చేశాయి. మూడున్నరేళ్లుగా ఇతగాడి ఆచూకీ ఎవరికీ లభించలేదు. దీంతో ప్రదీప్ అరెస్టు కోసం ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసిన సైబరాబాద్ సీసీఎస్ అధికారులు రాజస్థాన్‌కు పంపారు. ముమ్మరంగా గాలించిన పోలీసులు శనివారం రాజస్థాన్‌లో పట్టుకున్నారు. అక్కడి న్యాయస్థానంలో హాజరుపరిచిన అధికారులు పీటీ వారెంట్‌పై ఇక్కడకు తీసుకువచ్చారు. కొల్లూరు పోలీసులు కోర్టులో హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. మిగిలిన ఎనిమిది కేసుల్లోనూ ఇతడిని అరెస్టు చూపించనున్నారు.

లొకేషన్‌తో మూడు గంటలపాటు ఛేజింగ్

అదృశ్యమైన వ్యక్తిని పట్టుకున్న పోలీసులు


షేక్ ఫిరోజ్..

బంజారాహిల్స్: అదృశ్యమైన వ్యక్తిని లొకేషన్ సాయంతో మూడు గంటలపాటు ఛేజింగ్ చేసిన పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం... బంజారాహిల్స్ రోడ్డునెంబర్-3లోని షౌకత్‌నగర్ బస్తీకి చెందిన షేక్ ఫిరోజ్ (42), నందినగర్‌కు చెందిన యువతిని ఆరేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. వీరికి మూడేళ్ల కూతురు కూడా ఉంది. ఈ క్రమంలో భార్యాభర్తల మధ్య విభేదాలు వచ్చాయి. దీంతో భార్యతో గొడవ పడి గత సెప్టెంబర్ 1వ తేదీన ఫిరోజ్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తన భర్త కనిపించడం లేదంటూ బాధితురాలు అదే రోజు బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదైంది. అయితే ఇంటి నుంచి వైజాగ్‌కు వెళ్లిపోయిన ఫిరోజ్ తన ఫోన్‌లో పాత సిమ్‌కార్డు తొలగించి కొత్తది వేసుకొని వినియోగిస్తున్నాడు. అయితే ఫిరోజ్‌పై ప్రత్యేక దృష్టిపెట్టిన బంజారాహిల్స్ ఎస్‌ఐ కె. రమేష్ నెలరోజుల నుంచి తన తల్లి, సోదరుడు, మిత్రుడితో ఫోన్‌లో మాట్లాడుతున్నట్లుగా గుర్తించాడు. ఈ క్రమంలో ఫిరోజ్ వాడే ఫోన్ లొకేషన్ ద్వారా రైలులో హైదరాబాద్ వస్తుండగా గుర్తించి సోమవారం ఉదయం 11 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు వెళ్లారు. అయితే అప్పటికే ఫిరోజ్ మెట్రో రైలు ఎక్కాడు. మళ్లీ ఫోన్ లొకేషన్ తీసుకున్న ఎస్‌ఐ మెట్రో రైల్‌లో బేగంపేట వైపు వెళ్తున్నట్లు గమనించి రోడ్డు మార్గంలో ఛేజ్ చేస్తూ యూసుఫ్‌గూడ మెట్రో రైల్వేస్టేషన్ వరకు వెళ్లాడు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగడంతో అంతకుముందే ఫిరోజ్ మెట్రో దిగి రహమత్‌నగర్ వైపు వెళ్లాడు. మళ్లీ ఎస్‌ఐ లొకేషన్ తీసుకోగా రహమత్‌నగర్ పీజేఆర్ విగ్రహం చూపించింది. వెంటనే అక్కడికి వెళ్లగా పోలీసులకు దొరక్కుండా మాస్క్ ధరించి ఉన్న ఫిరోజ్‌ను గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. అనంతరం విచారించి అతడి భార్యకు అప్పగించారు. సుమారు మూడు గంటలపాటు సికింద్రాబాద్ స్టేషన్ నుంచి రహమత్‌నగర్ వైపు ఫిరోజ్‌ను పట్టుకోవడానికి ఎస్‌ఐ చేసిన ప్రయత్నాన్ని పలువురు అభినందించారు.

ప్రజావాణి ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి వెంటనే పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు రంగారెడ్డి కలెక్టర్ సి.నారాయణరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఆయన అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌ఓ సంగీతతో కలిసి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో శాఖలవారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వరమే స్పందించి, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ఈ వారం 52 ఫిర్యాదులు అందినట్టు తెలిపారు.

నాంపల్లిలో ఢిల్లీ స్పెషల్ సెల్ ఆపరేషన్

హ్యూమన్ ట్రాఫికర్ కర్మాన్ హైదర్ కోసం గాలింపు	వారం రోజులు మాటు వేసి ఉన్న ప్రత్యేక బృందం	దాదాపు 2500 కిమీ 'ఛేజ్' చేస్తూ వచ్చిన అధికారులు	ఎట్టకేలకు ఆదివారం పట్టివేత, విమానంలో తరలింపు	నిందితుడిపై రూ.2 లక్షల రివార్డు ప్రకటించిన ఎన్ఐఏ

సాక్షి, సిటీబ్యూరో: ఢిల్లీ పోలీసు విభాగానికి చెందిన స్పెషల్ సెల్ అధికారులు నాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో భారీ ఆపరేషన్ చేపట్టారు. దాదాపు వారం రోజులు మాటు వేసి, గుట్టుగా జరిగిన దీని ఫలితంగా జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) సహా వివిధ రాష్ట్ర పోలీసులకు మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న కర్మాన్ హైదర్ చిక్కాడు. మారు పేరుతో ఓ లాడ్జిలో తలదాచుకున్న ఇతగాడిని పట్టుకున్న స్పెషల్ సెల్... ఆదివారం విమానంలో ఢిల్లీకి తరలించారు. ఓ కన్సల్టెన్సీ ముసుగులో విదేశీ ఉద్యోగాల పేరుతో వివిధ ప్రాంతాలకు చెందిన యువతను ఆకర్షించడం, థాయ్‌లాండ్, లావోస్‌కు తరలించి అక్కడి సైబర్ క్రైమ్ ముఠాలకు అప్పగించడం, ఆ కాల్ సెంటర్ల ద్వారా విదేశీయులను బెదిరించిన దండుకోవడంలో హైదర్ గ్యాంగ్ కీలకమని ఎన్ఐఏ గుర్తించింది.

చైనీయుల పరిచయంతో మారిన కథ...

ఢిల్లీలోని జసోలా ప్రాంతానికి చెందిన హైదర్ అక్కడే అలీ ఇంటర్నేషనల్ కన్సల్టెన్సీ సర్వీసెస్ పేరుతో ఓ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా దీన్ని ఏర్పాటు చేసినప్పటికీ... తొలినాళ్లల్లో కేవలం జాబ్, స్టడీ, విజిట్ వీసాల ప్రాసెసింగ్ మాత్రమే చేసేవాడు. అయితే సోషల్‌మీడియా ద్వారా కొందరు చైనీయులతో ఏర్పడిన పరిచయాలు హైదర్ పంథాను మార్చేశాయి. కమీషన్లకు ఆశపడిన ఇతగాడు తన కన్సల్టెన్సీ ద్వారా సైబర్ నేరాలు చేసే చైనీయులకు సహకరించడానికి అంగీకరించాడు. మనోజ్, సాహిల్, ఆశిష్, పవన్ యాదవ్‌లతో ముఠా కట్టి చైనీయుల ఆదేశాల మేరకు పని చేయడం మొదలెట్టాడు. దేశంలోని అనేక మెట్రో నగరాల్లో నెట్‌వర్క్ ఏర్పాటు చేసుకున్న హైదర్ నేతృత్వంలోని గ్యాంగ్ విదేశాల్లో ఉద్యోగాల పేరుతో యువతను ఆకర్షించడం ప్రారంభించింది.


నిందితుడు కర్మాన్ హైదర్

ఆ రెండు దేశాలకు అక్రమ రవాణా చేసి...

చైనీయుల నేతృత్వంలో పని చేసే సైబర్ ముఠాలకు థాయ్‌లాండ్, లావోస్ అడ్డాలుగా మారిపోయాయి. తాము తెర వెనుక ఉండి, ఆయా దేశాలకు చెందిన వారినే ముందు పెట్టి కథ నడిపిస్తున్నారు. ఇక్కడ నుంచి ఉద్యోగాల పేరుతో అక్రమ రవాణా చేసి తీసుకువెళ్లిన యువకుల్ని ఆ రెండు దేశాల్లో కాల్ సెంటర్లు నడిపే ముఠాలకు అప్పగిస్తున్నారు. అక్కడి కాల్ సెంటర్ల నిర్వాహకులు వీరికి బస ఏర్పాటు చేయడంతో పాటు పాస్‌పోర్టులు, ఇతర పత్రాలు తమ ఆధీనంలోకి తీసుకుంటున్నారు. యువకుల్ని బానిసలుగా మార్చుకుని, వారికి ఇష్టం ఉన్నా, లేకపోయినా సైబర్ నేరాలకు సంబంధించిన కాల్ సెంటర్లలో టెలీ కాలర్లుగా పని చేయిస్తున్నారు. ఈ మోసాలు చేయడం ఇష్టం లేక ఎవరైనా తిరిగి రావాలని భావించినా... పాస్‌పోర్టు, వీసా, ఇతర పత్రాలు తమ వద్ద లేకపోవడంతో అది సాధ్యమయ్యేది కాదు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో అక్కడే పని చేస్తున్నారు.

న్యూ ఫ్రెండ్స్ కాలనీ యువకుడి ఫిర్యాదుతో...

ఆ రెండు దేశాల్లో ఉన్న కాల్ సెంటర్ల ద్వారా టెలీ కాలర్లుగా మారిన యువకులు అమెరికా, యూరప్ దేశాలకు చెందిన వారిని టార్గెట్ చేస్తున్నారు. అక్రమ లావాదేవీలు, కేసులు సహా వివిధ రకాలుగా భయపెట్టి తాము డిమాండ్ చేసిన మొత్తం క్రిప్టో కరెన్సీ ద్వారా చెల్లించేలా చేస్తున్నారు. ఈ మొత్తం మాత్రం చైనీయులు ఏర్పాటు చేసిన నెట్‌వర్క్‌కు చేరేలా ఏర్పాట్లు జరిగాయి. ఏళ్లుగా ఈ దందా చేస్తున్న హైదర్ వ్యవహారం ఈ ఏడాది మేలో వెలుగులోకి వచ్చింది. ఇతడి కన్సల్టెన్సీ ద్వారా లావోస్‌లో ఉద్యోగం కోసం ఢిల్లీలోని న్యూ ఫ్రెండ్స్ కాలనీకి చెందిన ఓ యువకుడు వెళ్లాడు. అక్కడ పరిస్థితులు చూసి చాకచక్యంగా తప్పించుకుని వచ్చాడు. ఆపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. హైదర్ గ్యాంగ్‌లో మిగిలిన వారిని పట్టుకున్న పోలీసులు భారీ నెట్‌వర్క్ ఉందని గుర్తించారు. దీంతో ఈ కేసు ఎన్ఐఏకు బదిలీ కాగా... హైదర్‌పై అధికారులు రూ.2 లక్షల రివార్డు ప్రకటించారు.

ఏడు నెలలు... 2500 కిలోమీటర్లు ఛేజింగ్...

హైదర్‌ను పట్టుకోవడానికి ఢిల్లీ స్పెషల్ సెల్ ఏసీపీ వేద్ ప్రకాష్ నేతృత్వంలో ప్రత్యేక బృందం ఏర్పాటైంది. ఈ అధికారులు మే నుంచి హైదర్ కదలికలపై నిఘా ఉంచి గాలింపు చేపట్టారు. పోలీసుల నిఘాను తప్పించుకోవడానికి ఇతగాడు తరచు తన మకాం మారుస్తూ వచ్చాడు. ప్రతి ఆదివారం ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వెళ్లిపోయేవాడు. ఢిల్లీ, హర్యానా, తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్‌ల్లో వివిధ నగరాల్లో తిరిగిన ఇతడు నాంపల్లి చేరుకున్నాడు. ఇలా దాదాపు 2500 కిమీ అతడు ప్రయాణించగా... స్పెషల్ సెల్ వెంటాడుతూనే వచ్చింది. ప్రతి సందర్భంలోనూ కాస్తలో పోలీసుల నుంచి తప్పించుకున్నాడు. హైదర్ రైల్వే స్టేషన్ సమీపంలోని ఓ సాధారణ లాడ్జిలో బస చేశాడు. ఖర్చులకు అవసరమైన డబ్బు కోసం తన ఏటీఎం కార్డు ద్వారా రూ.25 వేలు డ్రా చేశాడు. ఈ లావాదేవీ ఆధారంగా హైదర్ హైదరాబాద్‌లో ఉన్నట్లు ఢిల్లీ స్పెషల్ సెల్ గుర్తించింది. దీంతో గత సోమవారం ఇక్కడకు వచ్చిన ఆ పోలీసులు బృందం రహస్యంగా గాలించిన అధికారులు ఆదివారం పట్టుకున్నారు. నాంపల్లి నుంచి కేరళ వెళ్లే ప్రయత్నాల్లో చిక్కిన హైదర్‌ను పోలీసులు విమానంలో ఢిల్లీ తరలించారు.

పుష్పశ్రీ ఫ్యాక్టరీ ప్రారంభం


ఆదిత్య బిర్లా గ్రూప్ వైస్ చైర్‌పర్సన్ రాజశ్రీ. చిత్రంలో రాచకొండ సీపీ సుధీర్‌బాబు

ఇబ్రహీంపట్నం: రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలోని వినోభానగర్ వైట్‌గోల్డ్‌లో పుష్పశ్రీ ఫ్యాక్టరీని ఆదిత్య బిర్లా గ్రూప్ వైస్ చైర్‌పర్సన్ రాజశ్రీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబుతో ఆమె పలు అంశాలపై ముచ్చటించారు. రాచకొండ కమిషనరేట్ భౌగోళిక పరిస్థితులు, నేర నియంత్రణ విధానాలు, షీ టీమ్స్ పనితీరు, సీసీ కెమెరాలు, టీవీల నిర్వహణ వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అప్పా డైరెక్టర్ అభిలాష బిస్త్, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కృష్ణా ఎక్స్‌ప్రెస్‌రైలులో బిహార్ వాసి మృతి

సికింద్రాబాద్: కృష్ణా ఎక్స్‌ప్రెస్‌రైలులో బిహార్ వాసి మృతి చెందిన ఘటన సోమవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో సోమవారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు..సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ 8వ నెంబర్ ప్లాట్‌ఫామ్‌పైకి చేరుకున్న కృష్ణాఎక్స్‌ప్రెస్ రైలులో వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్టు రైల్వేపోలీసులకు ప్రయాణికులు సమాచారం అందించారు. పోలీసులు అంబులెన్స్‌ను రప్పించినప్పటికీ అప్పటికే అతను మృతిచెంది ఉండడాన్ని గుర్తించారు. ఆధార్ కార్డు ఆధారంగా మృతుడు బిహార్ రాష్ట్రం నలందా జిల్లాకు చెందిన ఉమేశకుమార్‌గా గుర్తించారు. ఉమేశ్‌కుమార్ అనారోగ్యంతో మృతిచెందినట్టు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించిన రైల్వేపోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలి

● సీఈఐఆర్ పోర్టల్ ద్వారా 110 సెల్‌ఫోన్లు రికవరీ
● బాధితులకు అందజేసిన రైల్వే పోలీసులు


బాధితులకు సెల్‌ఫోన్లను అందజేసిన రైల్వే డీఎస్పీ జావిద్

అడ్డగుట్ట: రైల్వే ప్రయాణీకులు తమ వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా సెల్‌ఫోన్లను ఎక్కడపడితే అక్కడ పెట్టి వెళ్లకూడదని రైల్వే డీఎస్పీ అర్బన్ ఎస్.ఎన్. జావీద్, డీఎస్పీ రూరల్ కే. శ్రీనివాసరావు సూచించారు. రైల్వే ప్రయాణికులు పోగొట్టుకున్న, చోరీలకు గురైన సెల్‌ఫోన్లను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి రికవరీ చేశారు. సోమవారం లాలాగూడలోని రైల్వే ఎస్పీ కార్యాలయంలో యజమానులకు వారి వారి సెల్‌ఫోన్లను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో రైల్వే డీఎస్పీ ఎస్.ఎన్. జావీద్ మాట్లాడుతూ. రైల్వే ప్రయాణికులు పోగొట్టుకున్న లేదా చోరీలకు గురైన వారి సెల్‌ఫోన్లను గుర్తించేందుకు సీఈఐఆర్ పోర్టల్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. సెల్‌ఫోన్ ఎక్కడైనా మరిచిపోయినా, పోగొట్టుకున్నా వెంటనే మీసేవా కేంద్రానికి వెళ్లి సీఈఐఆర్ పోర్టల్‌లో ఐఎంఈఐ నంబర్ ద్వారా సెల్‌ఫోన్‌ను బ్లాక్ చేయించాలని సూచించారు. తద్వారా వీలైనంత తొందరగా సెల్‌ఫోన్లు రికవరీ చేసేందుకు ఆస్కారం ఉంటుందని చెప్పారు. గత సంవత్సరం ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు సుమారు రూ. 87 లక్షల విలువగల 870 సెల్‌ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు తెలిపారు. అందులో భాగంగా సోమవారం రూ. 11 లక్షల విలువగల 110 సెల్‌ఫోన్లను బాధితులకు అందజేశామన్నారు. రైల్వే ఐజీ రమేష్ నాయుడు, రైల్వే ఎస్పీ చందనా దీప్తిల సమక్షంలో సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు వివరించారు. ప్రయాణికులు కూడా తమ వస్తువుల పట్ల జాగ్రత్తలు వహించాలని, నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. ఈ సమావేశంలో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్లు ఆర్. ఎల్లప్ప, సాయి ఈశ్వర్‌గౌడ్ ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయం మార్చుకునేలా ప్రయత్నిస్తా

● వైస్ చాన్సలర్ ఘంటా చక్రపాణి.
● వీసీ హామీతో అంబేడ్కర్ వర్సిటీ ఉద్యోగుల నిరసనలు వాయిదా


నిరసన చేస్తున్న ఉద్యోగులనుద్దేశించి మాట్లాడుతున్న నూతన వీసీ ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ భూమిలో కొంత భాగాన్ని వేరే యూనివర్సిటీకి కేటాయిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకునేలా ప్రయత్నం చేస్తామని నూతన వైస్ చాన్సలర్ ఘంటా చక్రపాణి, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఎల్వీకే రెడ్డిలు జేఏసీకి హామీనిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ పదెకరాల స్థలం జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయానికి కేటాయించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని జేఏసీ సభ్యులు, ఉద్యోగులు, విద్యార్థులు గత 81 రోజులుగా మధ్యాహ్నం భోజన విరామ సమయంలో పరిపాలనా భవనం ముందు బైఠాయించి నిరసనలు చేస్తున్నారు. ఈ ధర్నా జరుగుతున్న ప్రాంతానికి నూతన వీసీతో పాటు ఇన్‌చార్జి రిజిస్ట్రార్లు విచ్చేసి నిరసనలో ఉన్న ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. సమస్య పరిష్కారానికి అందరం కలిసి పనిచేద్దామని, తన మీద నమ్మకంతో కొంత కాలం నిరసన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలని సూచించారు. అనంతరం జేఏసీ అత్యవసరంగా సమావేశమై సమగ్రంగా చర్చించారు. వీసీ హామీ మేరకు నిరసన కార్యక్రమాలను కొంతకాలంపాటు వాయిదా వేస్తున్నట్లు జేఏసీ చైర్‌పర్సన్ పల్లవీ కాబడే, కన్వీనర్ వడ్డాణం శ్రీనివాస్, సెక్రటరీ జనరల్ వేణుగోపాల్‌రెడ్డిలు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నేతలు రవీంద్రనాథ్ సోలమన వెంకటేశ్వర్లు, కాంతం ప్రేమకుమార్, యాకేశ్ దైద, చంద్రకళ, వేణుగోపాల్, నారాయణరావు, రుషేంద్రమణి, రజనీకాంత్, పాండు, షబ్బీర్, కిషోర్, రాఘవేంద్ర, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డిస్కం.. యాక్షన్ ప్లాన్

డిమాండ్‌కు తగ్గట్టు ప్రణాళికలు

- 88 కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటు
- 2026 నాటికి అందుబాటులోకి నూతన 33/11 కేవీ సబ్‌స్టేషన్లు
- రంగారెడ్డి జోన్‌లో 34, మెట్రో జోన్‌లో 36, మేడ్చల్ జోన్‌లో 18

సాక్షి, రంగారెడ్డి జిల్లా: పెరుగుతున్న గృహ, వాణిజ్య, పారిశ్రామిక అవసరాలకు దీటుగా విద్యుత్ సరఫరా వ్యవస్థను విస్తరించేందుకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ యాక్షన్‌ప్లాన్ తయారు చేసింది. రాబోయే పదేళ్ల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని, ఇప్పటి నుంచే ఆ దిశగా ఏర్పాట్లు చేస్తోంది. ఇప్పటికే రోజువారీ సగటు డిమాండ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించింది. ప్రస్తుతం డిస్కం పరిధిలో మొత్తం 164 కొత్త 33/11 కేవీ సబ్‌స్టేషన్లు నిర్మించాలని నిర్ణయించగా, వీటిలో గ్రేటర్ జిల్లాల పరిధిలోనే రూ.420 కోట్ల అంచనాతో 88 సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు. బంజారాహిల్స్ సర్కిల్లో ఐదు, హైదరాబాద్ సెంట్రల్ సర్కిల్‌లో తొమ్మిది, హైదరాబాద్‌సౌత్‌సర్కిల్‌లో తొమ్మిది, సికింద్రాబాద్‌సర్కిల్‌లో 13, రాజేంద్రనగర్ సర్కిల్‌లో 13 చొప్పున, సైబర్‌సిటీ సర్కిల్‌లో ఆరు, సరూర్‌నగర్ సర్కిల్‌లో 5, వికారాబాద్‌లో పది, మేడ్చల్‌లో 18 చొప్పున కొత్త సబ్‌స్టేషన్లు అందుబాటులోకి తేనుంది. 2026 మేనెల నాటికి ఈ కొత్త సబ్‌స్టేషన్లు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

మెట్రోజోన్‌లో..

బంజారాహిల్స్ సర్కిల్‌లో రోడ్‌నంబర్ 10లోని జహీరానగర్, జూబ్లీహిల్స్, మాదాపూర్ టీజీఐఐసీ, ఛాతి ఆస్పత్రి, ఆల్విన్‌కాలనీ సహా హైదరాబాద్ సెంట్రల్ పరిధిలో ప్రైడ్ ఇండియా కాలనీ, శాతం తలాబ్, మిర్జాకాలనీ, ఎర్రమంజిల్ ఐసీ క్వార్టర్స్, మెహిదీపట్నం బస్‌డిపో, ముషీరాబాద్ బస్‌డిపో, చాచా నెహ్రూపార్క్, కింగ్‌కోఠి ఆస్పత్రితో పాటు హైదరాబాద్ సౌత్ సర్కిల్ పరిధిలో అత్తాపూర్ ఎస్టీపీ, పూల్‌బాగ్, ఫరూఖ్‌నగర్, నిజామియా యునానీ ఆస్పత్రి, సుల్తాన్‌షాహి, శాలివాహననగర్, దిల్‌సుఖ్‌నగర్ ఆర్టీసీ డిపో, సోమనాథనగర్ జీహెచ్‌ఎంసీ ప్లేగ్రౌండ్, శ్రీ వెంకటేశ్వర ఎన్‌క్లేవ్‌ల్లో కొత్త సబ్‌స్టేషన్లు నిర్మించనున్నారు. సికింద్రాబాద్ సర్కిల్‌లో భవానీనగర్, తుకారాంగేట్, హస్మత్‌పేట్, రసూల్‌పుర, గాంధీమెడికల్ కాలేజీ, అల్వాల్‌హిల్స్ మంగాపురం, జ్యోతినగర్, బాలానగర్ సీఐఈ, ఐడీఏ కూకట్‌పల్లి, జెబీఎస్ బస్‌డిపో, రాణిగంజ్ బస్‌డిపో, ఖాంజీగూడ, అల్వాల్‌హిల్స్‌లో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు నిర్మించనున్నారు.

మేడ్చల్ జోన్‌లో..

హబ్సీగూడ సర్కిల్ పరిధిలో వెంకటాపూర్, మేడిపల్లి సహా మేడ్చల్ సర్కిల్ పరిధిలో శంభీపూర్, సాయినగర్, అంతాయిపల్లి ఐడీఓసీ, షాపూర్‌నగర్‌లలో కొత్త సబ్‌స్టేషన్లు నిర్మించనున్నారు. సంగారెడ్డి సర్కిల్ పరిధిలోని పోచారం, లక్దారం, పెద్దాపూర్, సదాశివపేట, సింఫనీ పార్క్‌కాలనీ, అందోల్, రాజంపేట్, అరుట్ల, జహీరాబాద్ రైల్వేస్టేషన్, గోపనపల్లి, గుడిపల్లి, తిమ్మాపూర్‌లో 33/11 కేవీ సబ్‌స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి.

రంగారెడ్డిజోన్‌లో..

సైబర్‌సిటీ సర్కిల్ పరిధిలోని మోకిల (అపర్ణ కొండకల్), నెక్నంపూర్, బొటానికల్ గార్డెన్, నల్లగండ్ల హుడా, హఫీజ్‌పేట్, 8వ బెటాలియన్ సహా రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో గొల్సనగర్, కింగ్స్‌కాలనీ, నూరినగర్, మీరాలంపార్క్, బైరాగిగూడ, హుడాహెచ్‌ఎస్‌బీ, సాతంరాయి, పీఅండ్‌టీ కాలనీ (హిమాయత్‌సాగర్), ఓమన్‌నగర్(కిస్మత్‌పూర్), లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీ, రాజేంద్రనగర్ ఆర్టీఓ ఆఫీసు, అమ్మపల్లి, గుంజల్‌పహాడ్ వద్ద కొత్తగా 33/11 కేవీ సబ్‌స్టేషన్లు నిర్మించనున్నారు. సరూర్‌నగర్ సర్కిల్ పరిధిలోని మన్సూరాబాద్ పెద్దచెరువు, బీఎన్‌రెడ్డినగర్ హెచ్‌ఎండబ్ల్యూఎస్ సాహెబ్‌నగర్, బడంగ్‌పేట్ డంపింగ్‌యార్డ్, బండ్లగూడ ఎస్టీపీప్లాంట్, కుంట్లూరు మదర్‌డెయిరీ వద్ద కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నారు.

అసెంబ్లీ ముట్టడికి యత్నించిన సర్పంచులు

అరెస్టు చేసిన పోలీసులు


సర్పంచులను అరెస్టు చేసి తరలిస్తున్న పోలీసులు

నాంపల్లి: పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడికి బయలుదేరిన తెలంగాణ సర్పంచులను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం సర్పంచుల సంఘం జేఏసీ అధ్యక్షుడు సుర్వీ యాదయ్య గౌడ్ నేతృత్వంలో సర్పంచులు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. డీజీపీ ఆఫీసు నుంచి రవీంద్ర భారతి సిగ్నల్ మీదుగా వస్తున్న సర్పంచులను పోలీసులు అడ్డుకున్నారు. వారిని అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు. ఈ సందర్భంగా అక్కడ కాసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పెండింగ్ బిల్లులు చెల్లించే వరకు ఆందోళన కొనసాగిస్తామని సుర్వీ యాదయ్య గౌడ్ పేర్కొన్నారు.

ట్రాఫిక్‌తో సతమతం!

గంటల తరబడి నిలిచిపోతున్న వాహనాలు



మూల మలుపు వద్ద నిలిచిపోయిన వాహనాలు

రహమత్‌నగర్: రహమత్‌నగర్ మూల మలుపు వద్ద నిత్యం ట్రాఫిక్ జామ్ కావడంతో వాహనదారులు సతమతమవుతున్నారు. అసలే హేయిర్ పిన్ మూలమలుపు కావడంతోపాటు వైన్‌షాపు ఎదుట వాహనాలు అడ్డదిడ్డంగా నిలపడంతో నిత్యం ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుంది. ఈ క్రమంలో ఈ ప్రాంతంలో ఒకేసారి రెండు బస్సులు ఎదురెదురుగా వస్తే అంతే సంగతులు అవి ముందుకు వెళ్లలేక, వెనుకకు కదలలేక గంటలతరబడి వాహనాలు నిలిచిపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. గత కొనేళ్లుగా ఈ సమస్య వెంటాడుతున్న పట్టించుకునే నాథుడు మాత్రం కనిపించడం లేదని స్థానికులు వాపోతున్నారు. ప్రధానంగా రాత్రి వేళల్లో ఈ సమస్య మరింత జఠిలంగా మారుతుంది. పలుమార్లు ఈ రహదారి గుండా వెళ్తున్న అంబులెన్స్ సైతం ఈ ట్రాఫిక్‌లో చిక్కుకొని ఇబ్బందులు పడిన సందర్భాలు అనేకం ఉన్నాయి. బోరబండ, అమీర్‌పేట్, యూసుఫ్‌గూడ ప్రాంతాలకు వెళ్లే రహదారుల్లో ఒక్కటైన ఈ ప్రాంతంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని వాహనదారులు వేడుకుంటున్నారు.

స్వెటర్ల పంపిణీ

సనత్‌నగర్: చలి తీవ్రత పెరిగిన దృష్ట్యా బల్కంపేటలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతిగృహంలో విద్యార్థినుల ఇబ్బందులకు చలించిన బీజేపీ సీనియర్ నేత వెల్లాల రామ్మోహన్ వారికి స్వెటర్లు అందజేశారు. హాస్టల్ చిన్నారులు చదువుకునే సమయంలో చలికి వణుకుతున్నట్లు రామ్మోహన్ దృష్టికి వచ్చింది. దీంతో ఆయన స్పందించి స్వెటర్లను కొనుగోలు చేసి హాస్టల్‌లో ఉంటున్న వారందరికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవా కార్యక్రమాలకు ఎల్లవేళలా ముందుంటానని పేర్కొన్నారు. చదువుకు ఏదీ అడ్డంకి కాకూడదన్నారు. బీసీ బాలికల వసతిగృహంలో విద్యార్థులు చలితో ఇబ్బందిపడకూడదనే ఉద్దేశంతో పంపిణీ చేసినట్లు చెప్పారు.

శంకర కంటి ఆస్పత్రికి బస్సు అందజేత



బస్సును అందజేస్తున్న చోళ మండలం ఎంఎస్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ప్రతినిధులు

బంజారాహిల్స్: నిరుపేదలకు కంటి చికిత్సలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ముందడుగు వేస్తున్నట్లు శంకర కంటి ఆస్పత్రి యూనిట్ అధిపతి గన్నంరాజు విశ్వమోహన్ తెలిపారు. చోళమండలం ఎంఎస్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సూర్యనారాయణ, అధ్యక్షుడు సీఓఓ ఆశిష్ హలన్, సీఎఫ్ఓ, సీసీఓ వేణుగోపాలన్, కంపెనీ సెక్రటరీ మహేంద్రకుమార్ త్రిపాఠిలు తమ సంస్థ ఉదారంగా అందజేసిన బస్సును యూనిట్ హెడ్ గన్నంరాజు విశ్వమోహన్, విట్రియో రెటీనా సర్జన్ డాక్టర్ శ్రీరామ్ సిమకుర్తి, క్యాటరాక్ట్ సర్జన్ డాక్టర్ శిరీష పోల్కంపల్లి, క్యాటరాక్ట్ సర్జన్ డాక్టర్ వింతిదుర్గా కిరణ్మయి సమక్షంలో శంకర్ ఆస్పత్రికి అందజేశారు.

ఈ సందర్భంగా గన్నంరాజు విశ్వమోహన్ మాట్లాడుతూ ఉదారంగా సహకరించిన చోళ ఎంఎస్ జనరల్ ఇన్సూరెన్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ బస్సు గ్రామీణ రోగులకు అవసరమైన కంటి వైద్య సేవలను మెరుగుపరుస్తుందన్నారు. నివారించదగిన అంధత్వాన్ని నిర్మూలించడం, అవసరమైన సమాజాలకు ఉజ్వల భవిష్యత్తును సృష్టించడం అనే తమ లక్ష్యాన్ని నెరవేర్చడానికి ఇలాంటి సహకారాలు తమకు శక్తినిస్తాయన్నారు. చోళ ఎంఎస్ జనరల్ ఇన్సూరెన్స్ వారి విరాళం కార్పొరేట్ సామాజిక బాధ్యత పట్ల నిబద్ధతను తెలియజేస్తుందన్నారు. నిరుపేద వర్గాలకు అంతర్జాతీయ స్థాయి కంటి వైద్యం అందించాలనే దృక్పథంతో స్థాపించిన ఈ ఆస్పత్రి 27 లక్షలకు పైగా ఉచిత కంటి శస్త్ర చికిత్సలను చేసిందన్నారు.

'60 ఏళ్లుగా ఉంటున్న మా ఇళ్లను కూల్చారు'

పంజగుట్ట: సుమారు 60 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న తమ 19 ఇళ్లను కూల్చేశారని ప్రభుత్వం, అధికారులు స్పందించి తమకు ప్రత్యామ్యాయం చూపాలని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితులు వడ్డెపల్లి ఎం.బి.కృష్ణ ఆనంద్, జ్ఞానేశ్వర్, సువర్ణలు మాట్లాడుతూ ముషీరాబాద్ నియోజకవర్గం, గాంధీనగర్ మున్సిపల్ డివిజన్‌లోని వివేకానందనగర్ బస్తీ 1957లో ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. 1974లో బస్తీకి రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ అన్ని సదుపాయాలు కల్పించారని తెలిపారు. ఇక్కడ మొత్తం 23 దళితుల ఇండ్లు ఉంటాయన్నారు. కాగా ఈ బస్తీకి ఆనుకునే 1988లో జనప్రియ వారు డవలప్‌మెంట్ చేసి బస్తీ రోడ్డుకు అడ్డంగా ఉందని, దీన్ని తొలగించాలని కోర్టులో కేసు వేశారని తెలిపారు. కోర్టు కలెక్టర్‌ను వివరణ కోరగా అప్పటి కలెక్టర్ వీరు ఎంతో కాలం నుంచి అక్కడ ఉంటున్నారని వీరికి ప్రత్యామ్యాయం చూపించిన తరువాత నివాసాలు తొలగించి రోడ్డు విస్తరిస్తామని లిఖిత పూర్వకంగా చెప్పినట్లు తెలిపారు. తదనంతరం మరో డవలపర్స్ సంస్థ వచ్చి తమ ఇండ్లు కూల్చేయ్యాలంటూ తిరిగి కోర్టును ఆశ్రయించారని తమ కేసు కోర్టులో ఉండగానే ఈ సంవత్సరం జనవరి 29వ తేదీన తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, ప్రత్యామ్యాయం చూపకుండా 23 ఇండ్లల్లో 19 ఇండ్లను కూల్చివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కూల్చేసిన 19 ఇండ్లల్లో 5 ఇండ్లకు రిజిస్ట్రేషన్ ఉందని, ప్రతీ సంవత్సరం ప్రభుత్వానికి ట్యాక్స్‌లు కూడా చెల్లిస్తున్నామని తెలిపారు. తాము ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల వద్దకు వెళ్లినా న్యాయం దక్కలేదని, దీంతో ఢిల్లీలోని జాతీయ ఎస్సీ కమిషన్‌ను ఆశ్రయించామని తెలిపారు. సంపన్నుల ఒత్తిడి మేరకు దళిత కుటుంబాలను రోడ్డుపాలు చేయడం ఎంతవరకు సబబని ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

కలాం కల సాకారం కోసమే డీఎస్ఆర్ఎస్ఎల్‌వీ -2027



మాట్లాడతున్న బి.విష్ణు, పూజిత, గ్రీష్మ, ఇషాంత్ దుబే తదితరులు

- అక్టోబర్ 18, 2027న స్టూడెంట్ శాటిలైట్ రాకెట్ ప్రయోగం

కాచిగూడ: మన దేశ భవిష్యత్తు గురించి విజన్ 2047 అంటూ ఎంతో ఉన్నతమైన కలలు కన్న అబ్దుల్ కలాం కలను సాకారం చేసేందుకే విద్యార్థులతో కలిసి 'డీఎస్ఆర్ఎస్ఎల్వీ -2027' పేరుతో రాకెట్ తయారు చేస్తున్నామని సిస్మీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఇషాంత్ దుబే వెల్లడించారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన దేశాన్ని ప్రపంచంలోనే ఒక గొప్ప మేధా సంపత్తి కలిగిన దేశంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో సిస్మీ ఫౌండేషన్, అంతరిక్ష్ ఇండియాల సంయుక్త ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా దాదాపు 1.80 లక్షల మంది విద్యార్థుల భాగస్వామ్యంతో తయారవుతున్న రాకెట్‌కు ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచిన డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ పేరు మీద డీఎస్ఆర్ఎస్ఎల్‌వీ-2027 పేరుతో ప్రయోగించబోతున్నామని తెలిపారు. అబ్దుల్ కలాం స్ఫూర్తితో తయారవుతున్న ఈ రాకెట్ ను 2027లో కలాం జయంతి రోజైన అక్టోబర్ 18న అంతరిక్షంలోకి పంపుతున్నామని తెలిపారు. లక్షలాదిమంది విద్యార్థులు, దాదాపు కోటి యాభై లక్షల వ్యయంతో, మూడు సంవత్సరాలు శ్రమించి డీఎస్ఆర్ఎస్ఎల్‌వీ -2027 పేరుతో ఒక అద్భుతాన్ని సృష్టించబోతున్నామని పేర్కొన్నారు. ఒక మంచి లక్ష్యంతో రూపుదిద్దుకుంటున్న డీఎస్ఆర్ఎస్ఎల్‌వి-2027కి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాలల యాజమాన్యాలు అందరూ సహకరించి, ఈ రాకెట్ ప్రయోగంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో చీఫ్ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి.విష్ణు, గ్రీష్మ, పూజిత, సుష్మిత, అక్షయ, సృజన తదితరులు పాల్గొన్నారు.

'ప్రచారాలతోనే కాంగ్రెస్ ప్రభుత్వం పబ్బం'

లిబర్టీ: తెలంగాణ ప్రభుత్వం ప్రచారాలతోనే పబ్బం గడుపుతుందని లోక్‌దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు జాతీయ కార్యదర్శి పి.వి. రాజేశ్వరరావు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేసింది ఏమి లేదని ఆయన విమర్శించారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని మరచిన కాంగ్రెస్ విజయోత్సవాలు జరుపుకోవడం శోచనీయమన్నారు. ఆరు గ్యారంటీలో మహాలక్ష్మి పథకం కింద ఒక్కొక్క మహిళలకు రూ. 2500లు, రైతు భరోసా డబ్బులు ఇవ్వకుండా మోసం చేస్తుందన్నారు. ప్రజా సమస్యలు గాలికివదిలి ఏదో సాధించినట్లు ప్రజాపాలన విజయోత్సవాలు జరుపుకోవడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో పి.వి.శ్రీనివాసరావు, పి.వి.సంకీర్త తదితరులు పాల్గొన్నారు.

నత్తనడకన రోడ్డు పనులు..!

- పనులపై కాంట్రాక్టర్, ఇంజినీరింగ్ అధికారుల నిర్లక్ష్యం
- జాప్యంతో స్థానికులకు తప్పని ఇక్కట్లు

నెలన్నర రోజులుగా సా..గుతున్న సీసీ రోడ్డు పనులు



బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12 ఎమ్మెల్యే కాలనీ-ఏసీబీ ఆఫీసు రోడ్డులో చేపడుతున్న సీసీ రోడ్డు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-12లోని ఎమ్మెల్యే కాలనీ నుంచి ఏసీబీ కార్యాలయం, చర్చి మీదుగా రోడ్డునెంబర్-12 ప్రధాన రహదారికి అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయి. గడిచిన 45 రోజులుగా సా..గుతున్న ఈ రోడ్డు పనులతో ఇటు ఎమ్మెల్యే కాలనీ నివాసితులు, అటు ఎన్‌బీటీనగర్ వాసులతో పాటు హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌కు వచ్చే భక్తులతో పాటు షారోన్ ఫుల్ గాస్పెల్ చర్చికి వచ్చే వారికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

గత అక్టోబర్ 25వ తేదీన ఈ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. అప్పటి నుంచే పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుంది. 45 రోజుల్లో చర్చి వరకు మాత్రమే కొంతవరకు రోడ్డు పనులు పూర్తిచేశారు. ఇంకా చర్చి దగ్గర నుంచి మెయిన్ రోడ్డు వరకు రోడ్డు వేయాల్సి ఉంది. ఇప్పటికే నెలన్నర రోజులుగా నరకయాతన అనుభవిస్తున్న స్థానికులు ఇంకో 20 రోజుల వరకు ఈ కష్టాలు తప్పేలా లేవని ఇక్కడి పనులను బట్టి చూస్తే అర్థమవుతుంది. కాంట్రాక్టర్ల నిర్వాకం, అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు మెల్లిగా జరుగుతున్నాయని పెద్ద ఎత్తున ఆరోపణలు వస్తున్నాయి. ప్రణాళిక లేకుండా ఇక్కడ రోడ్డు పనులు జరుగుతున్నాయని స్థానికులు విమర్శలు చేస్తున్నారు. బంజారాహిల్స్ డివిజన్ ఏఈ, వర్క్ ఇన్‌స్పెక్టర్ నిర్వాకంతోనే ఈ రోడ్డు పనుల్లో జాప్యం తీవ్రంగా జరుగుతున్నదని స్థానికంగా చర్చసాగుతుంది.

వివాహితను మోసగించిన యువకుడిపై కేసు నమోదు

బంజారాహిల్స్: వివాహితను ప్రేమ పేరుతో మోసం చేసిన యువకుడిపై జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. వివరాల్లోకి వెళితే... కర్ణాటకకు చెందిన యువతికి 2016లో పెళ్లి కాగా ఎనిమిదేళ్ల కొడుకు కూడా ఉన్నాడు. భార్యాభర్తల మధ్య ఏర్పడిన విభేదాలతో ఆమె భర్తను వదిలి కొడుకుతో హైదరాబాద్‌లో జూనియర్ ఆర్టిస్ట్‌గా జీవనం సాగిస్తుంది. అదే సమయంలో ఫిలిం కో-డైరెక్టర్‌గా పనిచేస్తున్న షేక్‌గౌస్ మొహినుద్దీన్ అలియాస్ చిన్నా (36)తో ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసింది. కొడుకును, నిన్ను బాగా చూసుకుంటానంటూ నమ్మించి ఆమెతో సహజీవనాన్ని ప్రారంభించాడు. దీంతో ఆమె గర్భం దాల్చగా తనకు పిల్లలు ఇష్టం లేదని బలవంతంగా అబార్షన్ చేయించాడు. ఈ నెల 16వ తేదన షేక్‌గౌస్ మొహినుద్దీన్ మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. ఈ విషయంపై బాధితురాలు నిలదీయగా నిన్ను పెళ్లి చేసుకుంటే నా తల్లి సూసైడ్ చేసుకుంటానని బెదిరించిందని, అందుకే మరో యువతిని పెళ్లి చేసుకున్నట్లుగా చెప్పాడు. ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరగ్గా యువతిని మొహినుద్దీన్ సోదరి కొట్టింది. తాను మోసపోయానని తెలుసుకుని బాధిత యువతి జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-14లోని మాజీ సీఎం కేసీఆర్ ఇంటి వెనుక అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాలంటూ స్థానికులు జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్-18 ఏసీపీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. దర్జాగా సెట్ బ్యాక్ వదలకుండా రోడ్డును ఆక్రమించి ఐదంతస్తుల నిర్మాణం చేపట్టారని, తాము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు.అంతేకాకుండా సీసీ రోడ్డును తవ్వి డ్రైనేజీ పైప్‌లైన్‌తో పాటు మంచినీటి పైప్‌లైన్ నిర్మాణాన్ని కూడా చేపట్టడం జరిగిందని, తాము కొంతకాలంగా అడ్డుకుంటున్నా ఎవరూ లేని సమయంలో రాత్రికిరాత్రే ఈ తవ్వకాలు చేపట్టి పైపులు వేయడం జరిగిందన్నారు. పలుమార్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినా పట్టించుకోకుండా దర్జాగా ఈ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వీటిని వెంటనే కూల్చివేయాలని స్థానికులు డిమాండ్ చేశారు.

11న గ్రాడ్యుయేషన్ సెర్మని వేడుకలు

రహమత్‌నగర్: బోరబండ డివిజన్ సాయిబాబా నగర్‌లో ఈనెల 11న జరిగే ఒలీవల ఇంటర్నేషనల్ బైబిల్ కాలేజీ గ్రాడ్యుయేషన్ సెర్మని వేడుకలు విజయవంతం చేయాలని ఒలీవల ప్రార్థనా మందిరం నిర్వాహకులు రెవరెండ్ పి.మోజెస్, దీవెనకుమారిలు కోరారు. సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 11న సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే ఈ వేడుకల్లో ప్రముఖ దైవ సందేశకులు రెవరెండ్ డా. ప్రశాంత్ బెంజిమన్ హాజరై ప్రసంగిస్తారని తెలిపారు.

అవినీతిని రూపుమాపుతేనే ప్రజలకు మెరుగైన సేవలు

యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆధ్వర్యంలో అవగాహన వాక్



అవగాహన వాక్ ర్యాలీలో సంస్థ ప్రతినిధులు తదితరులు

బంజారాహిల్స్: అవినీతి రూపుమాపినప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని మాజీ అదనపు చీఫ్ సెక్రటరీ అజయ్‌మిశ్రా అన్నారు. ప్రపంచ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గత 14 సంవత్సరాలుగా అవినీతిపై ఎన్నో రకాల కార్యక్రమాలు చేస్తున్న యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కేబీఆర్ పార్కు వద్ద సోమవారం అవగాహన వాక్ నిర్వహించారు. ఈ వాక్‌ను మాజీ అదనపు చీఫ్ సెక్రటరీ అజయ్‌మిశ్రా, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటిలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అజయ్‌మిశ్రా మాట్లాడుతూ దేశంలో అవినీతి రూపుమాపడానికి ప్రపంచవ్యాప్తంగా అవినీతి వ్యతిరేక దినం 2003లో ప్రారంభమైందన్నారు. అవినీతిని రూపుమాపితేనే ప్రతి సామాన్యుడి జీవితం ఆనందంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా యువత హక్కులపై అవగాహన పెంచుకుని ప్రశ్నించే విధానాన్ని అలవాటు చేసుకోవలన్నారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు మాట్లాడుతూ ఒక మంచి మార్పు కోసం మొదటగా కొద్దిమందే కదం తొక్కుతారని, మంచి ఆలోచనలతో మొదలయ్యే ఏ ఉద్యమమైనా రోజురోజుకూ యువతలో, ప్రజల్లో ఆలోచన రేకెత్తిస్తుందన్నారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థతో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు చేయడం మంచి పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ బృందం కొన్నె దేవేందర్, కొమటి రమేష్‌బాబు, హరిప్రకాశ్, జోగినిపల్లి సతీష్, బత్తిని రాజేష్, కొక్కుల ప్రశాంత్, పాశిగంటి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చేనేతకారుల అభ్యున్నతికి కృషి

హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్



ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న శైలజా రామయ్యార్

శ్రీనగర్‌కాలనీ: తెలంగాణా చేనేతకారులకు పొదుపు, బీమాతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో వారి ఉత్పత్తులకు మార్కెటింగ్‌ను చేస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నామని తెలంగాణా హ్యాండ్లూమ్ టెక్స్‌టైల్స్, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్ అన్నారు. సోమవారం శ్రీనగర్‌కాలనీలోని సత్యసాయి నిగమాగమంలో ఇండియన్ సిల్క్ గ్యాలరీ పేరిట ఏర్పాటు చేసిన సిల్క్ ఎగ్జిబిషన్‌ను ఆమె ప్రారంభించారు. చేనేతకళాకారుల ఉత్పత్తులను తిలకించి వారిని అభినందించారు. ఇండియన్ సిల్క్ గ్యాలరీలో నాణ్యమైన పట్టు, కాటన్ వస్త్రాలు లభిస్తాయని, దేశంలోని అన్ని ప్రాంతాల చేనేతకారులకు ఒకచోట చేర్చి వారి ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు అందిస్తున్న నిర్వాహకులు శ్రీనివాసరావు, వినయ్‌కుమార్‌లను ప్రశంశించారు. మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ సహకారంతో చేనేతకారుల ఉత్పత్తులను ఈ ఎగ్జిబిషన్‌లో వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని, దేశంలోని ప్రముఖ నగరాలకు చెందిన చేనేత కళాకారులు వారి ఉత్పత్తులను సుమారు 80 స్టాల్స్‌లో ఏర్పాటు చేశామని సిల్క్ ఇండియా సీఈఓ వినయ్‌కుమార్ తెలిపారు. పలు నగరాలకు చెందిన విభిన్నమైన, అరుదైన చీరలను స్టాల్స్‌లో ఏర్పాటు చేశామని, ఈనెల 15 వరకూ ఈ ఎగ్జిబిషన్ వినియోగదారులకు అందుబాటులో ఉంటుందన్నారు. మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ వీవర్స్ సర్వీస్ టర్ హెడ్, డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్, హ్యాపీ శ్రీదేవి, ఎడ్యూ ఎంట్రపీనర్ వై. శైలజ తదితరులు పాల్గొన్నారు.

కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన నానల్‌నగర్ డివిజన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. టోలిచౌకీ చౌరస్తా వద్ద జరుగుతున్న బాక్స్ డ్రైన్ పనులను పరిశీలించి కాంట్రాక్టర్లకు పలు సూచనలు చేశారు. వారం రోజుల్లో ఈ పనులన్నీ పూర్తి కావాలని ఆయన ఆదేశించారు. అత్యంత బిజీగా ఉండే ఈ చౌరస్తా వద్ద జరుగుతున్న పనులతో పాదచారులతో పాటు వాహనాదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా తోపుడు బండ్ల వ్యాపారులు గుంతల కారణంగా బండ్లను ముందుకు తీసుకువెళ్లలేకపోతున్నారన్నారు. అనంతరం ఆయన హకీంపేట్‌లో పర్యటించి ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులతో మాట్లాడుతూ.. అన్ని బస్తీల్లో వీడీసీసీ రోడ్లు వేయడానికి తాను పంపిన ప్రతిపాదనలు మంజూరయ్యాయని ప్రాధాన్యత క్రమంలో పనులను పూర్తి చేస్తామన్నారు. ముఖ్యంగా ఇరుకుగా ఉన్న గల్లీల్లో సైతం వీడీసీసీ రోడ్లు ఏర్పాటు చేస్తే స్థానికులకు అనువుగా ఉంటుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మజ్లిస్ నాయకులు హరూన్‌ఫరాన్, అలీముద్దీన్ తదితరులున్నారు.



జీటీఎస్ హుండీ ఆదాయం రూ.2.82,146



జీటీఎస్ హుండీని లెక్కిస్తున్న భక్తులు

వెంగళరావునగర్: వెంగళరావునగర్ డివిజన్ పరిధిలోని జీటీఎస్ దేవాలయం హుండీని సోమవారం లెక్కించారు. మొత్తం హుండీ ఆదాయం రూ. 2,82,146 వచ్చినట్టు ఆలయ ఎగ్జిక్యూటివ్ అధికారి గుమ్మడిదల సుధాకర్ తెలియజేశారు. గత రెండున్నర నెలలకు గాను భక్తులు సమర్పించిన ఆదాయంగా తెలిపారు. హుండీ ద్వారా లభించిన ఆదాయాన్ని ఆలయ అభివృద్ధికి దేవాదాయ ధర్మాదాయశాఖ నిబంధనలకు అనుగుణంగా వెచ్చించడం జరుగుతుందని ఈ.ఓ.పేర్కొన్నారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ డి.మధుబాబుతో పాటుగా పలువురు జీటీఎస్ దేవాలయ పూజారులు, భక్తులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు మరో ప్రతిష్టాత్మక అవార్డు



అవార్డులను అందుకుంటున్న మురళీముకుంద్, కాంచనవల్లి

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు మరో ప్రతిష్టాత్మకమైన అవార్డు వరించింది. వినూత్న పద్ధతులు, ఉత్తమ మౌలిక సదుపాయాలు, ఉన్నత విద్యా ప్రమాణాలను పాటిస్తున్న పాఠశాలగా ముందువరుసలో ఉందనడానికి నిదర్శంగా బ్రెయిన్ ఫీడ్ సంస్థ ఇటీవల హైటెక్స్‌లో నిర్వహించిన 'ఈటీ టెక్ఎక్స్' స్కూల్ ఎక్స్‌లెన్స్ జ్యూరీ అవార్డు లభించింది. దీనిని అధ్యక్షులు మురళీముకుంద్ అందుకున్నారు. అలాగే ఈటీ టెక్ఎక్స్ ట్రైల్ బ్లేజర్ స్కూల్ ఆఫ్ ది ఇయర్ అవార్డును ప్రిన్సిపాల్ కాంచనవల్లి అందుకున్నారు. ఈ సందర్భంగా డైరెక్టర్ వరలక్ష్మి మాట్లాడుతూ విద్యాపరమైన ఆవిష్కరణలలో జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ అగ్రగామిగా నిలుస్తుందన్నారు. ఈ అవార్డు తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు. మరింత నాణ్యమైన విద్యకు, విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు కృషి చేస్తామన్నారు. ఈ ప్రతిష్టాత్మకమైన అవార్డును సాధించడంలో తమవంతు పాత్ర పోషించిన ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

వైభవంగా 18వ మహాపడిపూజ

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని దుర్గాభవానీనగర్ బస్తీలో సోమవారం అయ్యప్పస్వామి 18వ మహాపడిపూజా మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక రాజ్‌కుమార్ గురుస్వామి 18వసారి మాల ధరించడమే కాకుండా మహాపడిపూజ కూడా నిర్వహించారు. ఫిలింనగర్ 18 బస్తీల నుంచే కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అయ్యప్ప భక్తులు పెద్ద సంఖ్యలో ఇందులో పాల్గొన్నారు. 18 కలశాల పూజ, గురుపూజలో భాగంగా స్వాములంతా రాజ్‌కుమార్ గురుస్వామిని ఘనంగా సత్కరించారు. స్వామియే శరణం అయ్యప్ప అంటూ అయ్యప్పలు నినాదాలు చేస్తుండగా ఈ ఘట్టం అత్యంత వైభవంగా జరిగింది. స్థానికంగా ఆధ్యాత్మికత వెల్లివిరిసింది.

సామాజిక సేవలో ఎన్‌సీసీ విద్యార్థులు



సిగ్నల్ వద్ద ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న విద్యార్థులు..

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని సుల్తాన్ ఉల్ ఉలూం ఫార్మసీ కాలేజీ ఎన్‌సీసీ విద్యార్థులు సోమవారం బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సాగర్ సొసైటీ, పంజగుట్ట జంక్షన్లలో ట్రాఫిక్ విధుల్లో నిమగ్నమయ్యారు. ఈ సందర్భంగా వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, సిగ్నల్ జంప్ చేయవద్దని అవగాహన కల్పించడంతోపాటు ప్లకార్డులు ప్రదర్శిస్తూ వాహనదారులను అప్రమత్తం చేశారు.

వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందాలి

కాచిగూడ: వినియోగదారుల ఫోరం ద్వారా నాణ్యమైన సేవలు అందాలని బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్‌రావు అన్నారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అడ్వొకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (ఆస్రా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్రా ఆధ్వర్యంలో ఈనెల 15వ తేదీన బెంగుళూరులో జరిగే 6వ జాతీయ సదస్సు వాల్ పోస్టర్‌ను ఆస్రా వ్యవస్థాపక అధ్యక్షుడు హబీబ్ సుల్తాన్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం హబీబ్ సుల్తాన్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించడం, వారి హక్కులకు భంగం వాటిల్లినప్పుడు ఉచితంగా న్యాయం అందించడమే ప్రధాన ఉద్దేశంగా ఆస్రా ఏర్పడిందన్నారు. సంస్థ 2016లో ప్రారంభమై 12 రాష్ట్రాల్లో 1000 మంది స్వచ్ఛంద సేవకులు పనిచేస్తున్నారన్నారు. డిసెంబర్ 15న బెంగుళూరులో జరిగే జాతీయ సదస్సుకు ముఖ్య అతిథిగా కర్ణాటక పౌర సరఫరాల వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంత్రి మునియప్ప, ఐఏఎస్ విజయ్ జోష్న తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్రా తెలంగాణ అధ్యక్షుడు వెంకటేష్ గుప్తా, ప్రతినిధులు కీర్తి, సుమన్, కైలాష్, ప్రశాంత్, శిరీష, తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి

పంజగుట్ట: గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులు ఒక్క సంవత్సరంలోనే 42 మంది వివిధ కారణాల వల్ల చనిపోవడం బాధాకరమని ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం అధ్యక్షుడు మచ్చ నర్సయ్య కోరారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 1009 వివిధ గురుకులాలు ఉన్నాయని నిత్యం ఏదో ఒక ఘటన జరగటం బాధాకరమన్నారు. ముఖ్యంగా బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో విద్యార్థులకు సరైన పౌష్టికాహారం అందటం లేదన్నారు. పెండింగ్ నిధులు వెంటనే విడుదల చేయడంతోపాటు, మూడు నెలల బిల్లులు అడ్వాన్స్‌గా చెల్లించాలన్నారు. చాలా గురుకులాలు అద్దెభవనాల్లో అరకొర వసతులతో ఉన్నాయని, అన్నింటికీ సొంత భవనాలు నిర్మించాలని కోరారు. గురుకులాల కొత్త చైర్మన్ తల్లిదండ్రులు పిల్లల్ని కలవకూడదు అని జీవో తీసుకువచ్చారని దాన్ని వెంటనే ఉపసంహరించుకుని పిల్లల్ని కలిసే అవకాశం కల్పించాలని కోరారు. అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులతో పాఠశాల యాజమాన్య కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కార్యదర్శి ఎస్.వెంకటేశ్, మెట్ల శంకర్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం



రహమత్‌నగర్: ఓ మహిళ అదృశ్యమైన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం ... రహమత్‌నగర్ డివిజన్‌లోని హెచ్ఎఫ్‌నగర్ ఫేజ్-2 బస్తీకి చెందిన హమీదాబేగం (54) కొంతకాలంగా ఆరోగ్య సమస్యలతో బాధపడుతుందేది. ఈ క్రమంలోనే ఈ నెల 6 తేదీన ఇంట్లో వారికి ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లి మళ్లీ తిరిగిరాలేదు. దీంతో హమీదాబేగం కోసం కుటుంబసభ్యులు తెలిసిన వారి వద్ద విచారించగా ఫలితం లేకపోవడంతో బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్న పోలీసులు హమీదాబేగం ఆచూకీ తెలిసిన వారు 87126-61431 ఫోన్ సంప్రదించాలని తెలిపారు.

సాక్షి
మంగళవారం। 10 । డిసెంబర్। 2024

ఎస్సీ రిజర్వేషన్లను జనాభా
ప్రాతిపదికన వర్గీకరించాలి



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకుడు గోవిందు నరేష్

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్

బౌద్ధనగర్: ఎస్సీ రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన వర్గీకరణ చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేష్ అన్నారు. పార్శిగుట్టలోని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యాలయంలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశం టీవీ నరసింహ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా హాజరైన గోవిందు నరేష్ మాట్లాడుతూ అంబేడ్కర్ ఎస్సీల్లోని అన్ని కులాలకు న్యాయం చేకూరాలనే ఉద్దేశంతోనే రాజ్యాంగంలో రిజర్వేషన్లను పొందుపరిచారన్నారు. కానీ 75 ఏళ్లుగా ఎస్సీ రిజర్వేషన్లు తెలుగు నేల మీద కేవలం ఒక్క కులానికే పరిమితం అయ్యాయని పేర్కొన్నారు. జనాభా శాతాన్ని మించి రిజర్వేషన్లను పొందడం వల్ల ఒక్క మాల సామాజిక వర్గమే అన్ని రంగాల్లో లబ్ధి పొందిందన్నారు. జనాభాకు తగినట్లుగా రిజర్వేషన్లు లభించని కారణంగా మాదిగ, ఉప కులాలకు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. బీసీ రిజర్వేషన్లలో వర్గీకరణ ఉన్నట్లుగానే ఎస్సీ రిజర్వేషన్లలో కూడా వర్గీకరణ చేయాలని మంద కృష్ణమాదిగ నేతృత్వంలో పోరాటం జరిగిందన్నారు. ఈ పోరాటం ఫలితంగానే సుప్రీంకోర్టు రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేసుకోవచ్చని తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు సిద్ధపడిన సమయంలో కొంత మంది స్వార్థపరులు అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణ మీద నియమితులైన ఏకసభ్య కమిషన్ జనాభా ప్రాతిపదికన ఎస్సీ వర్గీకరణను అమలు జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బొర్రా భిక్షపతి, వెంకట్ స్వామి, దప్పు మల్లికార్జున్, శ్రీనివాస్, విజయ్, వీఎస్.రాజు, విష్ణు, అరుణ్, కళ్యాణ్, కిషన్, మహేష్, రాజీవ్, రామకృష్ణ, రాజశేఖర్, రవి, గాంధీ, ప్రభాకర్, సుజాత, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో స్ట్రెచర్‌పైనే రోగి మృతి

- ఎమర్జెన్సీలో వైద్యుల నిర్లక్ష్యానికి రోగి బలి
- వేడుకున్నా కనికరించలేదన్న బంధువులు
- నిమ్స్ వైఖరిపై వైద్యశాఖ మంత్రి సీరియస్



లక్డీకాపూల్: ఎమర్జెన్సీ వార్డులు ఎందుకుంటాయి..? చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న వారిని కాపాడాలి.. కానీ నిమ్స్‌లో ఇందుకు విరుద్ధంగా ఎమర్జెన్సీ విభాగం పనిచేస్తుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇందుకు ఉదాహరణే సోమవారం జరిగిన ఓ ఉదంతం. పైరవీ లేనిదే.. చేయి పట్టేది లేదన్నట్టు ఈ విభాగం పనిచేస్తోందంటే అతిశయోక్తి కాదు. ఎంత ఎమర్జెన్సీ కేసు అయినప్పటికీ ప్రజాప్రతినిధుల సిఫారసులు లేనిదే చేర్చుకునే పరిస్థితి లేదు. ప్రశ్నిస్తే బెడ్స్ లేవు.. ఏం చేయాలంటూ అలవోకగా, నిర్లక్ష్యమైన సమాధానం ఎదురవుతోంది. ఇక కాళ్లో వేళ్లో పట్టుకుని ఈఎండీలో అడ్మిట్ అయితే సకాలంలో చికిత్స అందించే నాథుడు ఉండడు. నిమ్స్‌లోని ఎమర్జెన్సీ విభాగంలో ప్రతిరోజూ ఇది సర్వసాధారణ పరిస్థితి.

3 గంటల పాటు స్ట్రెచర్‌పైనే..

జీడిమెట్లకు చెందిన ఓ వ్యక్తిని సోమవారం ఉదయం 11 గంటలకు ఈఎండీకి తీసుకొచ్చారు. అప్పటి నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అతడిని స్ట్రెచర్‌పైనే ఉంచారు. కనీసం అప్పటి వరకు ఏమైందని అడిగిన నాథుడే అక్కడ కనిపించలేదు. రోగి తరఫున బంధువులు అక్కడి సిబ్బందిని వేడుకున్నా కనికరించలేదు. 4 గంటల తర్వాత రోగి ఆరోగ్య పరిస్థితి విషమించడంతో హడావుడిగా సీపీఆర్ చేశారు. స్ట్రెచర్‌పైనే రోగి ప్రాణాలు విడిచాడని బంధువులు తెలిపారు.

పడకల్లేవనే సాకుతో..

సూపర్ స్పెషాలిటీ కావడంతో నగరంతో పాటు రాష్ట్రంలోని పలు ఆస్పత్రుల నుంచి డాక్టర్లు ఇక్కడికి రెఫర్ చేస్తారు. ఇక్కడికి వస్తే ప్రాణాలు దక్కించుకోవచ్చనే ఆశతో నిమ్స్‌ను ఆశ్రయిస్తారు. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. అధికారుల మధ్య సమన్వయ లోపం.. రోగులకు శాపంగా మారింది. నిమ్స్ డైరెక్టర్ బీరప్ప.. ప్రస్తుత ఎమర్జెన్సీ విభాగాన్ని ఆధునీకరించి.. ఒక రకంగా పురుడు పోయడంలో కీలకపాత్ర పోషించారు. రోగులకు సత్వర చికిత్స అందేలా చర్యలు తీసుకున్నారు. కానీ అధికారులు, కిందిస్థాయి సిబ్బంది సహకారం లేకపోవడంతో పరిస్థితులు నానాటికీ తీసికట్టుగా మారిపోయాయి. మెరుగైన వైద్యం అటుంచితే.. నిమ్స్‌కు వస్తే కనీసం ప్రాణాలు ఉంటాయో.. పోతాయో అన్న భయం ప్రజల్లో ప్రారంభమైంది. పలు సందర్భంల్లో రోగులను స్వయంగా డాక్టర్లు ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. ప్రత్యేకంగా ఈఎండీ (ఎమర్జెన్సీ విభాగం) వద్ద దళారీ వ్యవస్థ రాజ్యమేలుతోంది. కొంతమంది అధికారుల అండదండలతో ఆరు అడ్మిషన్లు, మూడు ఎల్‌వోసీలను దళారులు తీసుకువస్తున్నారు. ఇప్పటికైనా వైద్యశాఖ మంత్రి, అధికారులు దృష్టి సారించి.. పేదల కార్పొరేట్ ఆస్పత్రి అయిన నిమ్స్ నిర్వహణను గాడిన పెట్టాలని రోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

నగరంలో నేడు

- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ కొనసాగుతుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.
- తిరుపతి ఎస్వీ వర్సిటీ హిస్టరీ విభాగం విశ్రాంతి ప్రొఫెసర్ దేవిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి రచించిన 'లాజ్ అండ్ గైన్ ఇన్ బ్రిటీష్ ఇండియా' పుస్తకాన్ని సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో ఉదయం 10.30గంటలకు సాక్షి తెలుగు డైలీ ఎడిటోరియల్ డైరెక్టర్ వర్ధెల్లి మురళి ఆవిష్కరిస్తారు.
- హ్యూమన్ రైట్స్ సొసైటీ తెలంగాణ ఆధ్వర్యంలో బేగంపేటలోని పర్యాటక భవన్‌లో ఉదయం 11 గంటలకు బంగ్లాదేశ్‌లోని హిందువుల మానవ హక్కులపై సదస్సు ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామం సందర్శనకు ఉదయం 10.30గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అవకాశం ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటలకు ఇండియన్ ఫొటో ఫెస్టివల్ కొనసాగుతుంది.
- దళిత్ స్త్రీ శక్తి ఆధ్వర్యంలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ డే పురస్కరించుకుని లక్డీకాపూల్‌లోని స్మార్ట్ కమర్షియల్ కాంప్లెక్స్‌లో ఉన్న అంబేడ్కర్ రీసోర్స్ సెంటర్‌లో ఉదయం 11 గంటలకు ఉమెన్ రైట్స్ ఆర్ హ్యూమన్ రైట్స్ అంశంపై సదస్సు నిర్వహిస్తున్నారు.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

చేనేతకారుల అభివృద్ధికి అన్నివిధాలా కృషి


మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

శ్రీనగర్‌కాలనీ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత కారుల కోసం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని, వారి ఉత్పత్తులకు అధిక డిమాండ్ కలిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని టెక్స్‌టైల్స్, హ్యాండ్లూమ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. అమీర్‌పేట కమ్మ సంఘంలో ప్రజాపాలన–ప్రజావిజయోత్సవాల సందర్భంగా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చేనేత ఎగ్జిబిషన్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ టెస్కో బకాయిలను చెల్లించామని, వేములవాడలో నూలు డిపో ఏర్పాటుకు జీవో జారీ చేశామని, నేతన్నలకు సబ్సిడీ, అభయహస్తం, రుణమాఫీ, బీమా, పొదుపు, పావలావడ్డీ పథకాలను అందిస్తూ వారికి చేయూత అందిస్తున్నామన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ పేరుతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీని ఏర్పాటు చేశామని, ఈ సంవత్సరం నుంచే తరగతులు జరుగుతున్నాయని, ఇన్‌స్టిట్యూట్ అభివృద్ధికి రూ.2.5 కోట్ల నిధులను విడుదల చేశామన్నారు. చేనేతకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకారం అందిస్తుందని, వారి అభ్యున్నతే మా ధ్యేయమని హ్యాండ్లూమ్, టెక్స్‌టైల్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్ అన్నారు. కార్యక్రమంలో చేనేత, జౌళి, శాఖ, చేనేత అభివృద్ధి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

స్టోర్స్‌లో మెటీరియల్ కొరత లేకుండా చూడాలి

- తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విజ్ఞప్తి



సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ స్టోర్స్‌లో మెటీరియల్ కొరత రాకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సోమవారం హోటల్ ప్లాజాలో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం జరిగింది. కాంట్రాక్టర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై చర్చించింది. వెండర్ వర్క్ ఆర్డర్లతో తాత్కాలికంగా ఉపశమనం దొరికినా.. భవిష్యత్తులో ప్రతి ఒక్కరూ వెండర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అసోసియేషన్ అధ్యక్షుడు కందుకూరి శ్రీనివాస్ సూచించారు. కొన్ని పరిమితులతో వెండర్ రిజిస్ట్రేషన్ క్లాస్–1, క్లాస్–2 ఇవ్వడానికి డిపార్ట్‌మెంట్ వారు ఇవ్వడానికి చొరవ చూపుతున్నారు. అలాగే స్టోర్‌లో మెటీరియల్ కొరత లేకుండా సీఎండీతో చర్చించాలని ప్రధాన కార్యదర్శి మద్దునూరి వెంకటేష్ చెప్పుకొచ్చారు. సమావేశంలో అన్ని సర్కిల్స్ అధ్యక్షులు పాల్గొన్నారు. ఏదైనా సమస్య ఉంటే స్టేట్ కమిటీతో చర్చించాలని మాజీ బోర్డ్ సభ్యుడు సక్కా యాదగిరి, జి.నాగయ్య, ఎ.మహేందర్, జీవన్‌రెడ్డి, గాడిగ సత్యనారాయణ, మహేష్‌రెడ్డి స్పష్టం చేశారు. సమావేశంలో రాజు మహారాజు, వేణుగోపాల్ రెడ్డి, వెంకటేష్, ప్రదీప్, కనకాచారి, రెడ్డి, సుబ్బారావు, శ్రీనివాస్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

- 13 నుంచి వివిధ పథకాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ మరూ
- మూసీ నిర్వాసితులకు రూ.2లక్షల రుణాలు
- 10 వేల మైనార్టీ మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ
- మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహ్మద్ ఉబేదుల్లా కొత్వాల్



సాక్షి, సిటీబ్యూరో: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక కార్యచరణ రూపొందించారు. ప్రత్యేకంగా మైనార్టీలో ఉన్న పేదరిక నిర్మూలన కోసం పలు సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టారని, కార్పొరేషన్ ఆధ్వర్యంలో మైనార్టీల కోసం పలు పథకాలను ప్రకటించామని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ మహ్మద్ ఉబేదుల్లా కొత్వాల్ అన్నారు. నాంపల్లి హజ్‌హౌస్‌లోని తన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో పథకాలకు సంబంధించి వివరాలు వెల్లడించారు. 'ఇందిరమ్మ మహిళా శక్తి' పథకం కింద ఉచిత దేశీయ కుట్టు మిషన్లు మైనార్టీ మహిళలకు అందజేస్తామన్నారు. చిరు వ్యాపార యూనిట్లు/వీధి వ్యాపారుల ఏర్పాటు కోసం 'ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన' కింద మైనార్టీ మహిళలకు ఆర్థిక సహాయం చేయనున్నట్లు వివరించారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో మూసీ నదిలో నివాసం ఉండే మైనార్టీ కుటుంబాలకు 'ప్రత్యేక జీవనోపాధి ప్రాజెక్ట్' కింద సెర్ప్/స్త్రీనిధి ద్వారా సబ్సిడీ రుణాల ద్వారా రూ.2 లక్షలు (రూ.1,40,000) పునరావాసం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రూ.60 వేల రుణం(స్త్రీనిధి) అందించనున్నట్లు తెలిపారు. దీనికి కోసం ఇప్పటికే మూసీ నిర్వాసిత కుటుంబాలపై అధికారులు సర్వే కూడా చేశారని, 138 కుటుంబాలను గుర్తించినట్లు తెలిపారు. కుట్టు మిషన్లు పొందడానికి మైనార్టీల్లోని అన్ని వర్గాల మహిళలు తమ దరఖాస్తు ఫారాలను 13వ తేదీ నుంచి 31వ తేదీ వరకు సమర్పించాలన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులు, అవసరమైన పత్రాలతో పాటు దరఖాస్తు సెట్ హార్డ్ కాపీని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుందన్నారు.

ఏజీ వర్సిటీ వజ్రోత్సవాలకు సీఎంకు ఆహ్వానం


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన వీసీ జానయ్య

ఏజీవర్సిటీ: ఈ నెల 20, 21వ తేదీల్లో జరగనున్న ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాలకు హాజరు కావాల్సిందిగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని విశ్వవిద్యాలయం ఉపకులపతి అల్దాస్ జానయ్య సోమవారం ఆహ్వానించారు. రాష్ట్ర శాసనసభ ఆవరణలో ముఖ్యమంత్రి కార్యాలయంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి, రైతు వ్యవసాయ సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితో కలిసి ఆహ్వాన పత్రికను అందించారు.

రాష్ట్రపతి శీతాకాల విడిది

రసూల్‌పురా: రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది నేపథ్యంలో బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం మంగళవారం నుంచి 23వ తేదీ వరకు ప్రజల సందర్శన నిలిపివేస్తున్నట్లు పరిపాలనాధికారి రజనిప్రియా సోమవారం తెలిపారు. ప్రజల సందర్శన తిరిగి డిసెంబర్ 23వ తేదీ తర్వాత ఉంటుందని చెప్పారు. 24 నుంచి సందర్శన కోసం ఆన్‌లైన్‌లో టికెట్ బుక్ చేసుకోవాలని కోరారు.

'రాజస్థానీ మార్వాడీ' పురస్కారాలకు ఆహ్వానం


గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను సత్కరిస్తున్న రాజస్థానీ జాగృతి సమితి ప్రతినిధులు

కాచిగూడ: రాజస్థానీ జాగృతి సమితి ఆధ్వర్యంలో వచ్చేనెలలో నిర్వహించనున్న 'రాజస్థానీ మర్వాడీ సమాజ్ రతన్' పురస్కారాల ప్రదానోత్సవ వేడుకలకు హాజరుకావాలని కోరుతూ రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మను సమితి ప్రతినిధులు సోమవారం కలిసి విజ్ఞప్తి చేశారు. రాజస్థానీ జాగృతి సమితి చైర్మన్ శ్రీనివాస్ సోమాని నేతృత్వంలో ప్రతినిధులు మహేష్ అగర్వాల్, ప్రేమ్‌చంద్ మునోత్, సంజయ్‌రాఠీ, రమేష్ మోదానీ, మనీష్ సోమానీ ఈ సందర్భంగా గవర్నర్‌కు శాలువా, రాజస్థానీ తలపాగా, ముత్యాల తీగతో ఘనంగా సత్కరించారు. 50 ఏళ్లుగా రాజస్థానీ సమాజానికి సేవలందిస్తున్న ప్రముఖులకు రాజస్థానీ మర్వాడీ సమాజ రత్న పురస్కారాలతో సత్కరించనున్నట్లు తెలిపారు. పురస్కారాల ప్రధానం అనంతరం నగరంలోని ప్రముఖ హిందీ కవుల కవి సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

12, 13 తేదీల్లో టీజీ-ప్యాకాన్ సదస్సు



సీఐఐ టీజీ-ప్యాకాన్ సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చైర్మన్ ఏవీపీఎస్ చక్రవర్తి

హాజరుకానున్న 200 మందికి పైగా డెలిగేట్స్

సనత్‌నగర్: కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) టీజీ–ప్యాకాన్ సదస్సును ఈ నెల 12, 13 తేదీల్లో హోటల్ ది పార్క్‌లో నిర్వహించనున్నారు. బేగంపేటలోని టూరిజం ప్లాజా హోటల్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీజీ–ప్యాకాన్ సదస్సు చైర్మన్, ఎకోబ్లిస్ ఇండియా సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ చక్రవర్తి సదస్సు వివరాలను వెల్లడించారు. సుస్థిరత, ఆర్థిక వృద్ధిని ముందుకు నడిపించడంలో ప్యాకేజింగ్ రంగం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్యాకేజింగ్ రంగంలో నూతన సాంకేతికతలను అన్వేషించడానికి, నూతన పద్ధతులను చర్చించడానికి సీఐఐ ప్యాకాన్–2024 వేదికగా నిలుస్తోందన్నారు. ప్యాకేజింగ్ వృత్తి నిపుణులు, సప్లయి చైన్ మేనేజర్లు, సస్టెయినబులిటీ అడ్వకేట్లు, ఇతర బిజినెస్ లీడర్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్యాకేజింగ్‌లో తాజా ఉత్తమ పద్ధతులు, అభివృద్ధి చెందుతున్న ఉత్పత్తులు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అన్వేషించాల్సిన అవసరాన్ని తెలిపారు. సదస్సులో ఇన్నోవేషన్ అండ్ గ్రోత్‌పై దృష్టిసారించినట్లు తెలిపారు. బయోడిగ్రేడబుల్, రీసైక్లింగ్ తదితర అంశాలపై చర్చించనున్నట్లు వివరించారు. సదస్సుకు జాతీయ, అంతర్జాతీయంగా 200 మందికి పైగా ప్యాకేజింగ్ నిపుణులు హాజరవుతారన్నారు. 20కి పైగా ఎగ్జిబిటర్లు హాజరై ప్యాకేజింగ్ ఉత్పత్తులను ప్రదర్శించనున్నట్లు చెప్పారు. సమావేశంలో సదస్సు వైస్ చైర్మన్ ఆర్ఎస్ రెడ్డి, అనిల్‌కుమార్ ఏపూరి, షేక్ సమీవుద్దీన్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ అసిస్టెంట్లుగా 44 మంది ట్రాన్స్‌జెండర్స్

చాదర్‌ఘాట్: దేశంలోనే మొదటి సారిగా ట్రాన్స్‌జెండర్స్‌ను ట్రాఫిక్ అసిస్టెంట్‌గా నియమించడంతో మన రాష్ట్రానికి గుర్తింపు వచ్చిందని డైరెక్టర్ బి.శైలజ అన్నారు. ట్రాఫిక్ అసిస్టెంట్‌గా ట్రాన్స్‌జెండర్స్‌ను 44 మందికి వివిధ జిల్లాల నుంచి వచ్చిన వారికి ఉద్యోగాలు ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ అసిస్టెంట్‌కు 58 మంది దరఖాస్తులు రాగా అందులో 44 మందికి ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. మొదటి బ్యాచ్ పనితీరును బట్టి రెండో బ్యాచ్‌కు త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

అతిగా యాంటీబయాటిక్స్ వాడకాన్ని నియంత్రించాలి


గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు జ్ఞాపిక అందజేస్తున్న ప్రభు కుమార్ తదితరులు

బంజారాహిల్స్: అవసరం లేకున్నా యాంటీ బయాటిక్స్‌ను విచ్చలవిడిగా వినియోగిస్తున్నారని, దీనిపై నియంత్రణ అవసరమని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ బంజారాహిల్స్ బ్రాంచ్ అధ్యక్షుడు కుమార్ చల్లగాలి పేర్కొన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని కోవాలని ఆయన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కోరారు. సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను ఆయన ఐఎంఏ గౌరవ కార్యదర్శి డాక్టర్ వి.అశోక్, డాక్టర్ విక్రాంత్‌తో కలిసి వైద్య ఆరోగ్యానికి సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా రిజిస్టర్ కానీ వైద్యులను తొలగించాలని కోరారు. అనంతరం గవర్నర్‌కు జ్ఞాపికను అందజేశారు.

ముగిసిన జీవీకే ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్



జీవీకే ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్ టైటిల్‌ను అందుకుంటున్న శ్రీధర్

లక్డీకాపూల్: తెలుగు సినీ నిర్మాత, ఔత్సాహిక టెన్నిస్ క్రీడాకారుడు లగడపాటి శ్రీధర్ డబుల్ ధమాకా చూపించాడు. మూడు రోజుల పాటు ఉత్సాహంగా సాగిన జీవీకే ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్(ఐఏఎస్‌టీఏ)లో లగడపాటి శ్రీధర్ పురుషుల సింగిల్స్‌తో పాటు డబుల్స్‌లోనూ విజేతగా నిలిచాడు. ఎల్బీ స్టేడియంలోని శాట్ టెన్నిస్ కాంప్లెక్స్‌లో ఆదివారం జరిగిన ఫైనల్స్‌లో శ్రీధర్ రెండు విభాగాల్లోనూ టైటిల్స్ సొంతం చేసుకున్నాడు. మెన్స్(55 ప్లస్) డబుల్స్ ఫైనల్లో ఆర్ఎస్ రమేశ్, పాల్ మనోహర్‌తో మ్యాచ్ వర్షం కారణంగా సాగలేదు. దీంతో ఇరువురినీ సంయుక్త విజేతలుగా ప్రకటించారు. మెన్స్ సింగిల్స్‌లోనూ ఆర్ఎస్ రమేశ్‌తో మ్యాచ్‌కు వర్షం ఆటంకం కలిగించింది. ఆర్ఎస్ రమేశ్‌తో కలిసి శ్రీధర్ టైటిల్‌ను పంచుకున్నారు. గత ఏడాది ఐఏఎస్‌టీఏలో చాంపియన్‌గా నిలిచిన శ్రీధర్.. వరుసగా రెండోసారి ఇక్కడ టైటిల్ నిలబెట్టుకున్నాడు.

బంగ్లాదేశ్‌లో మానవ హక్కుల ఉల్లంఘన


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ రామ్‌చందర్‌రావు

- సెమినార్‌లో పలువురు వక్తల ఆందోళన
- వెంటనే కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకోవాలని వినతి
- తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెమినార్

లాలాపేట: బంగ్లాదేశ్‌లో మానవ హక్కుల ఉల్లంఘన అనే అంశంపై తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సెమినార్ నిర్వహించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ డా.పి.మోహన్‌రావు అధ్యక్షతన నిర్వహించిన సెమినార్‌లో మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామ్‌చందర్‌రావు, ఓయూ మాజీ వైస్ చాన్సలర్ ప్రొ.టి.తిరుపతిరావు, మహారాష్ట్ర ఓపెన్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ప్రొ.వాయునందన్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బంగ్లాదేశ్‌లో మానవ హక్కుల ఉల్లంఘనపై వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం చొరవ తీసుకుని అక్కడి హిందువుల పరిరక్షణకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. దాదాపు 69 హిందూ దేవాలయాలపై దాడి జరగడం దురదృష్టకరం అన్నారు. ఒకప్పుడు బంగ్లాదేశ్‌లో 30 శాతం ఉన్న హిందువులు ప్రస్తుతం కేవలం 8 శాతానికి పడిపోయారని పేర్కొన్నారు. బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు వస్తున్న వలసలను వెంటనే నిలిపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మన దేశంలో అన్ని మతాలు, సంస్కృతులను గౌరవించే సంప్రదాయం ఉందన్నారు. అది బంగ్లాదేశ్‌లో లేకపోవడం బాధాకరం అన్నారు. కార్యక్రమంలో తార్నాక వెల్ఫేర్ అసోసియేషన్ సెక్రటరీ పి.రామ్మోహన్‌రెడ్డి, డా.టీవీ రావు, నాగార్జున నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి జలంధర్‌రెడ్డి, సంక్షేమ సంఘం నాయకులు హరికుమారి, గోఖుల్‌నగర్ పాల్గొన్నారు.

బస్సు కింద పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

సనత్‌నగర్: బైక్‌పై వెళ్తూ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు కిందపడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ హరీష్ తెలిపిన మేరకు.. కేపీహెచ్‌బీకాలనీకి చెందిన నాగరాజు (36) బేగంపేటలోని ఓ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం 7.30 గంటల సమయంలో విధులు ముగించుకుని తన బైక్‌పై ఇంటికి వెళ్తుండగా మూసాపేట లక్ష్మీకళ థియేటర్ వద్ద రాము ట్రావెల్స్‌కు చెందిన ప్రైవేట్ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో బైక్ అదుపుతప్పింది. దీంతో నాగరాజు కిందపడిపోగా బస్సు వెనుక చక్రాల కింద నలిగి నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకుని నాగరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. భార్య సౌజన్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని సనత్‌నగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

'జలమండలి' ఎన్నికల్లో రాజిరెడ్డి నామినేషన్


నామినేషన్ దాఖలు చేస్తున్న రాజిరెడ్డి

సాక్షి, సిటీబ్యూరో: జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో పోటీ చేసేందుకు వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్(2873) పక్షాన కే.రాజిరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. కార్మిక భవన్‌లో కార్మికుల, నేతలు సతీష్, జహంగీర్, రాఘవేంద్ర రాజు, శేఖర్‌తో కలిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సోమవారం ఆయన నామినేషన్ పత్రాలను సమర్పించారు. అంతకుముందు వివిధ డివిజన్ల నుంచి కార్మికులు పెద్ద ఎత్తున ర్యాలీగా కార్మిక భవన్‌కు చేరుకున్నారు. నామినేషన్ దాఖలు అనంతరం రాజిరెడ్డి మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారమే తమ లక్ష్యమన్నారు. రెండు పర్యాయాలు గెలిచిన రాంబాబు కార్మికులకు చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. ఈ ఎనికల్లో ఆయనను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్మిక నాయకుడు సతీష్ మాట్లాడుతూ గుర్తింపు సంఘం కార్మికులకు రాంబాబు అన్యాయం చేశారన్నారు. కార్మికులను ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. వాటర్ వర్క్స్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శేఖర్, జలమండలి యూనియన్ ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర రాజు, నాయకులు లక్ష్మణ్, శ్రావణ్ కుమార్, రాజా, హషమ్, నరసింహారెడ్డి, దేవేందర్ అజయ్, గౌస్‌పాషా, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నగర కేంద్ర గ్రంథాలయం చైర్మన్‌గా ఉపేందర్‌రెడ్డి



చిక్కడపల్లి: చిక్కడపల్లి హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా కేశిరెడ్డి ఉపేందర్ రెడ్డి నియమితులయ్యారు. పాఠకులకు మెరుగైన సదుపాయాలను కల్పించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. సోమవారం సాయంత్రం అఫ్జల్‌గంజ్‌లోని కేంద్ర గ్రంథాలయ పరిషత్‌లోని కార్యాలయంలో ఆయనను కలిసి నగర కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పొట్లూరి పద్మజ, ఉద్యోగులు, అవినాష్, వేంకటేశ్వర్‌రెడ్డి, సుకేష్, రాంమోహన్, వెంకటేష్ యాదవ్ పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్ పాల్గొని అభినందించారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, మంగళవారం, 10, డిసెంబర్, 2024





నగరంలో చలికాలం ప్రారంభమైంది. చలికాలం వస్తుందంటే చాలు స్వెటర్ల కోసం నగరవాసి కళ్లు వెతుకుతుంటాయి. మార్కెట్‌లోకి స్టైలిష్ స్వెటర్లు కొనేందుకు చూస్తుంటారు. నవంబర్ రాగానే నగరంలో స్వెటర్ దుకాణాలు భారీగా వెలుస్తుంటాయి. ఈ ఏడాది కూడా నగరంలోని పలు ప్రాంతాల్లో స్వెటర్ దుకాణాలు వెలిశాయి. రంగురంగుల ఉన్ని దుస్తులతో పాటు రగ్గులు, దుప్పట్లు, టోపీలు, మఫ్లర్లు, చేతి గ్లౌజులు కొనేందుకు నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు.

- సాక్షి సిటీబ్యూరో

హైదరాబాద్ వైబ్స్

స్వెటీస్.. స్టైల్..

చలి దుస్తులకు పెరిగిన గిరాకీ

స్టైల్ కోసం ధరిస్తున్న నేటితరం యువత

చలితో సంబంధం లేకున్నా వినియోగం

ఇబ్బడిముబ్బడిగా నగరంలో స్టాళ్ల ఏర్పాటు

మార్కెట్‌లోకి అధునాతన మోడళ్లు

నవంబర్ రెండో వారం నుంచి జనవరి మూడో వారం వరకూ నగరంలో చలికాలం ఉంటుంది. ప్రత్యేకంగా డిసెంబర్, జనవరి నెలలో నగర ఉష్ణోగ్రతలు 12.5 డిగ్రీల కనిష్ట స్థాయిలో నమోదు అవుతాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ ఏడాది నవంబర్ రెండో వారంలో చలి ప్రారంభమైంది. కానీ తుఫాను ప్రభావంతో చలి తీవ్రత తగ్గింది. ఈ వారం నుంచి చలి వాతావరణం మళ్లీ పుంజుకుంది. దీంతో స్వెటర్ల వ్యాపారాలు జోరుగా పెరిగాయి.

నేపాల్ నుంచి వచ్చి..

చలికాలం ప్రారంభం కాగానే నేపాల్ వ్యాపారులు నగరానికి భారీగా తరలివచ్చి స్టాళ్లు ఏర్పాటు చేసుకుని మరీ అమ్మకాలు జరుపుతుంటారు. కోఠికి వెళ్లేవారు ఇలాంటి దుకాణాలను వరుసగా చూసే ఉంటారు. వీటితోపాటు నగరంలోని పలు ప్రాంతాల్లో రోడ్ల వెంబడి స్టాళ్లు ఏర్పాటు చేస్తారు. చాలా మంది నగర వాసులు ఇక్కడే కొనుగోలు చేస్తుంటారు. మూడు నెలల పాటు ఇక్కడే ఉండి విక్రయిస్తుంటామని, తమ ఉత్పత్తులకు ఇక్కడ డిమాండ్ ఉంటుందని నిర్వాహకులు చెబుతున్నారు.



స్టైల్ కోసం..

చలిని తట్టుకోడంతో పాటు.. ధరించినప్పుడు హుందాగా కనబడేందుకు పలు స్వెటర్ తయారీ సంస్థలు వివిధ రకాల మోడల్స్‌ను రూపొందిస్తున్నాయి. ఇవి వినియోగదారులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని పలువురు నిర్వాహకులు చెబుతున్నారు. ఏఎన్ఆర్, ఎన్టీఆర్, చిరంజీవి లాంటి ఆ తరం నటులు సినిమాల్లో ధరించిన స్వెటర్లను అప్పట్లో వాడేవారని, ఇప్పుడు ఈ తరం హీరోలు, హీరోయిన్లు ధరించే స్వెటర్లను వాడేందుకు ఇప్పటి యువత ఆసక్తి చూపిస్తోందని పేర్కొంటున్నారు. కొంత మంది యువతీ యువకులు ఫలానా సినిమాల్లో హీరోహీరోయిన్ ధరించిన స్వెటర్ తయారు చేసి ఇవ్వాలని ఆర్డర్లు కూడా చేస్తుంటారని చెబుతున్నారు.



బ్రాండెడ్ దుకాణాలు సైతం..

ఇటీవల స్వెటర్ల వ్యాపారం రోడ్లపై నుంచి బ్రాండెడ్ షాపుల వరకూ చేరింది. గతంలో చేతితో తయారు చేసిన స్వెటర్లు మాత్రమే అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పేరుందిన బ్రాండెడ్ కంపెనీలు తయారు చేస్తున్న స్వెటర్లను కొనుగోలు చేసేందుకు నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా పలు సినిమాల్లో హీరో, హీరోయిన్లు వేసుకుంటున్న స్వెటర్ల కోసం బ్రాండెడ్ దుకాణాల్లో వెతుకుతున్నారు. వారి అభిరుచిని బట్టి వ్యాపారులు కూడా బ్రాండెడ్ ఉన్ని దుస్తులను తెప్పిస్తున్నారు. ధర ఎక్కువైనా కూడా వాటిని కొనేందుకు ముందుకొస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు.

తగ్గిన వ్యాపారం..


నగరంలో ఏటా చలికాలం ప్రారంభానికి ముందు నుంచే పలువురు వ్యాపారులు తాత్కాలిక స్వెటర్ల షాపులు, రోడ్డుల పక్కన స్టాళ్లు ఏర్పాటు చేసి, మైదానాల్లో అమ్మకాలు చేస్తుండేవారు. అయితే ఈ ఏడాది నవంబర్ రెండో వారం నుంచి చలి ప్రారంభమైనప్పటికీ బంగాళాఖాతంలో తుపాన్ రావడంతో నగరంలో ఉష్ణోగ్రతలు పెరిగాయి. చలి తగ్గింది. తిరిగి డిసెంబర్ నెల్లో కూడా సైక్లోన్ రావడంతో ఉష్ణోగ్రతలు మళ్లీ పెరగడం ప్రారంభమయ్యాయి. దీంతో చలికాలం కోసం నగర వ్యాపారులు దేశ, విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న వివిధ రకాల స్వెటర్లతో పాటు ఇతర దుస్తువుల వ్యాపారం అనుకున్న స్థాయిలో జరగడంలేదని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు.



ఉలెన్‌తో పాటు క్యాష్మిలన్ ఫ్యాబ్రిక్..

గతంలో ఉన్నితో తయారు చేసిన స్వెటర్లు ధరించేందుకు నగరవాసులు ఆసక్తి చూపేవారు. మందంగా ఉండే ఉన్ని దుస్తులను ధరించేందుకు ఇప్పుడు కొందరు ఆసక్తి చూపట్లేదు.. దీంతో తయారీదారులు తేలికగా ఉండే క్యాష్మిలన్ ఫ్యాబ్రిక్‌తో స్వెటర్లను తయారు చేస్తున్నారు. చలికాలంతో పాటు సాధారణ సీజన్‌లో కూడా ధరించేందుకు వీలుగా ఉండటంతో పాటు స్టైల్‌గానూ ఉంటున్నాయని యువత ఎక్కువగా ఈ ఫ్యాబ్రిక్‌తో తయారు చేసిన స్వెటర్లను వాడుతున్నారు. తేలికగా ఉండే చలిని తట్టుకునే స్వెటర్లు, గ్లౌజ్‌లతో పాటు సాక్స్ ఎక్కువగా అడుగుతున్నారు.

– మహ్మద్ ఇల్యాస్ బుఖారీ, వ్యాపారి, మదీనా సర్కిల్





సరసమైన ధరల్లో..

ఏటా కోఠిలో వెలిసే స్వెటర్ దుకాణాల్లో కొనుగోలు చేస్తుంటాం. తక్కువ ధరల్లో అందుబాటులో ఉంటాయి. డిజైన్స్‌తో పాటు మంచి నాణ్యమైనవి ఇక్కడ దొరుకుతాయని మేం వస్తుంటాం. పిల్లలతో పాటు పెద్ద వారికి కూడా ఇక్కడ లభిస్తుంటాయి.

– మల్లికార్జున్, హైకోర్టు లాయర్





మేడ్చల్‌లో పదినెట్టాంపడి

40 ఏళ్లుగా అయ్యప్ప మాలలకు కేంద్ర బిందువుగా..



మేడ్చల్: పట్టణంలోని అయ్యప్ప ఆలయం భక్తుల కోసం అన్ని సౌకర్యాలూ కలిపిస్తోంది. 40 ఎళ్ల క్రితం మేడ్చల్ హౌసింగ్ బోర్డు కాలనీలో ప్రారంభమైన అయ్యప్ప ఆలయం భక్తుల కొంగు బంగారంగా ఉంది. ఆలయంలో శబరిమల తరహాలో 18 బంగారు మెట్లు(పదినెట్టాంపడి) నిత్యాభిషేకం నిర్వహిస్తున్నారు. అయ్యప్ప మాలలు ధరించే భక్తులు ఆర్థిక పరిస్థితులు, ఇతర కారణాలతో శబరిమల వెళ్లలేకపోతే ఇక్కడే 18 మెట్లు ఎక్కి, ఇరుముడి సమర్పించి, స్వామి మూల విరాట్‌కు అభిషేకం చేసుకునే వసతి నగరశివార్లలోని ఆలయల్లో మాత్రమే ఉంది. ఈ ఆలయంలో ప్రతి యేటా శబరిమలకు వెళ్లలేని వారు ఆలయంలోనే పదినెట్టాంబడి అధిరోహించి, ఇరుముడి సమర్పించి అభిషేకం చేసుకుంటారు. ఆలయంలో దాదాపు 3 నెలల పాటు రెండు పూటలా నిత్యాన్నదానం ఉంటుంది. ఆలయాన్ని గురుస్వాములు రాజేశ్వర, కృష్ణమూర్తి, నందారెడ్డి 40 ఎళ్లుగా నిర్వహిస్తున్నారు. 40 యేళ్ల క్రితం పందిరితో ప్రారంభమైన మేడ్చల్ ఆలయం నేడు రెండంతస్తులతో సువిశాల ప్రాంగణంతో మేటి ఆలయంగా కొనసాగుతుంది.

బ్లాక్ బెర్రీస్ వెడ్డింగ్ కలెక్షన్..



సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ పురుషుల దుస్తుల బ్రాండ్ బ్లాక్‌బెర్రీస్ పెళ్లి వేడుకలకు ప్రత్యేకించిన 'బీయింగ్ రియల్ సూట్స్ యు' ను రూపొందించింది. దీనిని నగర మార్కెట్‌లోకి విడుదల చేసినట్టు బ్రాండ్ ప్రతినిధులు తెలిపారు. ప్రీమియం ఫాబ్రిక్‌లో వెరైటీ కలర్ ప్యాలెట్‌ను ఉపయోగించి రూపొందిన ఫార్మల్, క్యాజువల్ వేర్‌లతో పాటు, వెడ్డింగ్ కలెక్షన్ ప్రత్యేకంగా అందిస్తున్నామని తెలిపారు. టూ–పీస్, త్రీ–పీస్ సూట్‌లు, బ్లేజర్‌లు, ట్రౌజర్స్‌తో జత చేసిన వెయిస్ట్ కోట్.. వగైరా వెరైటీలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. పెళ్లిళ్ల సీజన్‌ను పురస్కరించుకుని క్రియేటివ్ ఏజెన్సీ లియో బర్నెట్ సహకారంతో ప్రచార చిత్రాన్ని రూపొందించామన్నారు.


వాహ్.. వ్యాక్స్ మినియేచర్

సెలిబ్రిటీలను అబ్బురపరుస్తున్న ఆర్టిస్ట్

డిజిటల్ వ్యాక్స్‌తో కొత్త తరహా పోట్రెయిట్స్

పలువురు ఔత్సాహికులకు బొమ్మలు గీస్తూ..

సోషల్‌మీడియాలో ఆర్టిస్ట్ నరేష్‌కి గుర్తింపు







ఎవరి దగ్గరా శిక్షణ తీసుకోలేదు.. తనలోని ప్రతిభకు పదునుపెట్టి చిన్నప్పుడు హాబీగా వేస్తున్న ఆర్ట్‌ని కొంగొత్త రీతిలో చూపెడుతూ తనకంటూ ఓ మార్క్‌ను క్రియేట్ చేసుకున్నాడు. ఆర్ట్‌లో రాణించడానికి శిక్షణ లేకపోయినా తన సృజనాత్మకతను జోడించి ప్రత్యేక డిజైన్స్ చేస్తూ సెలిబ్రిటీస్‌ని సైతం ఆకట్టుకుంటున్నాడు. ఆయనే నగరానికి చెందిన డిజిటల్ వ్యాక్స్ ఆర్టిస్ట్ నరేష్ రావులపల్లి.. తన ఆర్ట్ విషయాలను సాక్షితో పంచుకున్నారు.. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

– శ్రీనగర్‌కాలనీ



నాకు అసలు ఆర్టిస్ట్ అవ్వాలనే ఆలోచనే లేదు.. ఏదైనా నచ్చిన బొమ్మ కనబడితే వాటిని అలాగే వచ్చేలా గీసేవాడిని. ఆటోలు, బస్సులు, చెట్లు, జంతువులు, పక్షులు ఇలా ఏది కనబడితే వాటిని పేపర్ మీద పెట్టేవాడిని. నేను కేపీహెచ్‌బీలో ఉంటాను. స్కూలింగ్ సమయంలో పెయింటింగ్‌లో బహుమతులు వచ్చేవి. నా బొమ్మలు చూసి అందరూ మెచ్చుకునేవారు. కానీ తనలోని ప్రవృత్తి అయిన ఆర్ట్‌ని అలాగే అప్పుడప్పుడూ పదును పెడుతూ సివిల్ ఇంజినీరింగ్ చేసి జాబ్ చేయడం మొదలుపెట్టాను.

డిజిటల్ ఆర్ట్స్..

సోషల్ మీడియా, డిజిటలైజేషన్ సరికొత్త పుంతలు తొక్కుతున్న తరుణంలో డిజిటల్ ఆర్ట్స్‌నే చేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన మొదలైంది. అందరిలా కాకుండా కొత్తగా ట్రై చేద్దామని ఏడాది కష్టపడి డిజిటల్ వ్యాక్స్ ఆర్ట్‌ను నేర్చుకున్నాను. నా స్నేహితుడు మినియేచర్ (చిన్నచిన్న బొమ్మలు) కొనడానికి షాప్‌కి తీసుకెళ్ళాడు. చిన్నచిన్న బొమ్మలే ఐదు వేల, పదివేలు, ఇంకా ఎక్కువ ధర ఉండటం చూసి షాక్ అయ్యాను. అప్పుడే నాలో కొత్త ఆలోచన మొదలైంది. మినియేచర్ బొమ్మల్లా కార్టూన్ ఫార్మాట్‌లో ఫినిషింగ్‌తో డిజిటల్ వ్యాక్స్ పెయింటింగ్స్ వేస్తే ఎలా ఉంటుందనే ఆలోచన వచ్చింది. వెంటనే ఆచరణలో పెట్టాను.

సోషల్‌మీడియాతోనే గుర్తింపు..

నేను చేసిన డిజిటల్ వ్యాక్స్ ఆర్ట్ బొమ్మలను ఇన్‌స్టాగామ్, ఫేస్‌బుక్ ద్వారా పోస్ట్ చేసేవాడిని. అంతేకాకుండా తెలిసిన వారు కూడా నా ఆర్ట్ గురించి చెప్పేవారు. అలా ఆర్డర్స్ వచ్చేవి.. నా ఆర్ట్స్‌కి డబ్బుతోపాటు వినియోగదారుల ఆదరణ మరింత సంతోషాన్నిచ్చేది. ఆర్ఆర్ఆర్ చిత్రంలో రామ్‌చరణ్ అల్లూరి సీతారామరాజు, ఎన్టీఆర్ కొమరం భీమ్ గెటప్స్‌ని చిన్నపిల్లలుగా నడిపించే రాజమౌళిగా ఆర్ట్ గీశాను. అప్పటికీ చిత్ర ఫస్ట్ లుక్ రిలీజ్ కాకపోవడంతో నా ఆర్ట్‌కి సోషల్‌మీడియా చాలా హైప్ వచ్చింది. చిత్ర అఫీషియల్ టీం ఆ పెయింటింగ్‌ని తమ సోషల్‌మీడియాలో పోస్ట్ చేసింది. ఇది చాలా గర్వంగా అనిపించింది. ఆ ఇన్‌స్పిరేషన్‌లో కొత్త కాన్సెప్ట్స్‌ని చేయడం మొదలుపెట్టాను.



డిజిటల్ వ్యాక్స్ ఆర్ట్స్‌కి ఆదరణ..

పెయింటింగ్, పెన్సిల్ స్కెచ్ గీయాలన్నా చాలా సమయం పడుతుంది. అయితే డిజిటల్ వ్యాక్స్ ఆర్ట్ తక్కువ సమయంలోనే పూర్తి చేయవచ్చు. చూడటానికి కొంగొత్తగా అందంగా కనిపిస్తుంది. ముఖం మాత్రమే తీసుకొని వాటికి డిజిటల్ హంగులు అద్దుతాము. ఫ్రెండ్స్, ఫ్యామిలీ, పలు సందర్భాల్లో ఫొటోలను కాన్సెప్ట్స్‌గా తీసుకొని బొమ్మలను గీస్తాను. మినియేచర్ ఫినిషింగ్‌తో బొమ్మగీసి వారికి మెయిల్ చేస్తాము. దీనికి ఐదువందలు మాత్రమే ఛార్జ్ చేస్తాము. ఎంచుకున్న కాన్సెప్ట్ బట్టి ధరల్లో మార్పు ఉంటుంది. హీరోయిన్ నందితశ్వేత, కిరణ్ అబ్బవరం, మధుబాల, వెన్నెల కిషోర్, గోపిచంద్ మలినేని, సప్తగిరితో పాటు చాలా మంది ఆర్ట్స్‌ని చేశాను.

ఆకట్టుకున్న ఎపిక్స్ షో..

వినూత్న ఆవిష్కరణలను ప్రదర్శించిన విద్యార్థులు

సాక్షి, సిటీబ్యూరో : కేఎల్‌హెచ్ డీమ్డ్ టు బీ యూనివర్శిటీ ఆధ్వర్యంలో అజీజ్‌నగర్ క్యాంపస్‌లో నిర్వహించిన ఎపిక్స్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో సాంకేతికత, సామాజిక ఆవిష్కరణల కలయికకు వేదికగా మారింది. ఇందులో భాగంగా ఆరోగ్యం, వ్యవసాయం, విద్య, పర్యావరణ స్థిరత్వం, విద్యుత్ పొదుపు వంటి అంశాలలో వినూత్న పరిష్కరణలను విద్యార్థులు ప్రదర్శించారు.. పలు సామాజిక సమస్యలకు పరిష్కార సామర్థ్యాలను తెలిపేలా రహదారి భద్రతా వ్యవస్థలు, డ్రోన్–ఆధారిత వ్యవసాయ సాంకేతికత, వేగవంతమైన ఆరోగ్య సంరక్షణ మార్గాలు, పర్యావరణ అనుకూల వాహనాల బ్యాటరీ నిర్వహణ వంటి ప్రాజెక్ట్‌లు సందర్శకులను ఆకట్టుకున్నాయి. సాంకేతిక పరిజ్ఞానం సామాజిక మార్పుకు శక్తివంతమైన సాధనమని అర్థం చేసుకోవాలని, తదనుగుణంగా బాధ్యతతో కూడిన ఆవిష్కర్తలను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి పార్థసారథి వర్మ తెలిపారు.

గమ్యం లేని కాంగ్రెస్ నావకు చుక్కానిగా

తెలంగాణ సర్కార్!



'సాక్షి' ఇంటర్వ్యూలో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి

- డబ్బుల సంచులు అందుతుండటం వల్లే హైకమాండ్ మద్దతిస్తోంది
- విజయోత్సవాల పేరిట ప్రజాధనం దుర్వినియోగం
- ఏడాది పాలనలోనే అంతా చేశామంటూ ప్రజలను మభ్య పెడుతున్నారు
- ఏ హామీ పూర్తిస్థాయిలో అమలు చేయలేదు.. ఇస్తామన్నవి ఇవ్వలేదు
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తాం.. ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తాం
- బీజేపీ అధికారంలోకి వచ్చేవరకు అలుపెరగకుండా పోరాడతాం

సాక్షి, హైదరాబాద్: జాతీయ స్థాయిలో ప్రస్తుతం గమ్యం లేని కాంగ్రెస్ పార్టీ నావకు రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం చుక్కానిగా మారిందని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ హైకమాండ్‌కు ఎప్పటికప్పుడు, వివిధ రాష్ట్రాల ఎన్నికలప్పుడు డబ్బుల సంచులు అందుతుండటంతో, రాష్ట్ర సర్కారు ఏడాది పాలనలో ఎన్నికల హామీలు అమలు చేయక పోయినా కూడా మద్దతునిస్తోందని ఆరోపించారు. విజయోత్సవాల పేరిట ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు అనేక హామీలిచ్చి ఏడాది పాలనలో అంతా చేశామంటూ ప్రజలను మభ్య పెడుతున్నారని విమర్శించారు. వాస్తవానికి సంవత్సర కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత వ్యక్తమౌతోందని, రాబోయే రోజుల్లో అది మరింత తీవ్రస్థాయికి చేరుకుంటుందని చెప్పారు. సర్కార్ తీరును ఎండగట్టేందుకు వివిధ రూపాల్లో తాము ఉద్యమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ సర్కార్ ఏడాది పాలన, ప్రభుత్వ సంబరాలపై...'సాక్షి'కిచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో కిషన్‌రెడ్డి తన అభిప్రాయాలను వెల్లడించారు. ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

ప్రభుత్వం ఆత్మవిమర్శ చేసుకోవాలి

కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న సంబరాలను చూసి తెలంగాణ ప్రజలతో పాటు కాంగ్రెస్ కేడర్ సైతం ఆశ్చర్యపోతున్నారు. ఏమి చేశామని, ఎందుకీ సంబురాలని ఆ పార్టీ ఎమ్మెల్యేలకు కూడా అర్థం కావడం లేదు. గత ఏడాదంతా దంచుడు, కొట్టుడు, కూల్చుడుతోనే సరిపోయింది. ఉత్సవాలకు బదులు ఇప్పటికైనా ప్రభుత్వం తామిచ్చిన హామీలేమిటీ? వాటి అమలుకు నిధుల సమీకరణ ఎలా? అనే దానిపై ఆలోచించాలి. ఆత్మవిమర్శ చేసుకోవాలి.

గత ప్రభుత్వ నోటిఫికేషన్లను వారి ఘనతగా చెప్పుకుంటున్నారు..

వివిధ వర్గాల ప్రజలకు తక్షణ ప్రయోజనం చేకూర్చే హామీలను ప్రభుత్వం అమలు చేయలేదు. ఇళ్లు, స్కూళ్లు, ప్రాజెక్టులు వంటివి కట్టడానికి సమయం పడుతుంది. కానీ వంద రోజుల్లో, ఏడాదిలో పూర్తి చేయగలిగేవి కూడా చేయలేదు. దశల వారీగా రెండు లక్షల ఉద్యోగాల భర్తీ అంటూ పత్రికల్లో ఫుల్‌పేజీ ప్రకటనలిచ్చి ఊదరగొట్టారు. కానీ గత ప్రభుత్వంలో ఇచ్చిన నోటిఫికేషన్ల ఆధారంగా పరిమిత సంఖ్యలో ఉద్యోగాల భర్తీ చేసి అంతా తమ ఘనతేనంటూ గొప్పలు చెప్పుకుంటున్నారు.

ఏడాదిలో బీసీలకు రూ.20 వేల కోట్లు ఖర్చు చేశారా?

బీసీలకు ఐదేళ్లలో లక్ష కోట్లు ఖర్చుచేస్తామన్నారు. ఏడాది అయ్యింది కదా రూ.20 వేల కోట్లు ఖర్చు చేశారా? గత డిసెంబర్ 7న అధికారంలోకి వచ్చాక, 9వ తేదీనే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఏడాది గడిచినా పూర్తిస్థాయిలో చేయలేదు. మహిళలకు ఉచిత బస్సు అన్నారు కానీ అది కూడా అంతంత మాత్రంగానే ఉంది. మహిళలకు నెలకు రెండున్నరవేల చొప్పున భృతి, ఆసరా పింఛన్ల పెంపుదల, బీసీ, ఎస్సీ కుటుంబాలకు డబ్బులు ఇస్తామన్నారు. వీటితో పాటు కల్యాణలక్ష్మి కింద తులం బంగారం, అమరవీరుల కుటుంబాలకు రూ.25 వేల పింఛన్, ఉద్యమకారులకు 250 గజాల ఇంటిస్థలం, వంటివేమీ అమలు కాలేదు.

'మూసీ'కి లక్షన్నర కోట్లు ఎక్కడినుంచి తెస్తారు?

మూసీ ప్రాజెక్టు కోసం లక్షన్నర కోట్లు ఎక్కడి నుంచి తెస్తారు? అంత పెద్దమొత్తంలో అప్పులు రేవంత్‌కు ఎవరిస్తారు? కాబట్టి ఆ ప్రాజెక్టు ఆగిపోక ఏమవుతుంది? హైడ్రా పేరిట కూల్చివేతలు సాగిస్తే..ఎంతమేర అవి సాగుతాయో అంతస్థాయిలో ప్రజల నుంచి వ్యతిరేకత ఎదుర్కోక తప్పదు. మా ఉద్దేశంలో బీఆర్‌ఎస్ పాలనకు, కాంగ్రెస్ పాలనకు ఎలాంటి తేడా లేదు. ఈ రెండు పార్టీలు కవల పిల్లల మాదిరిగానే వ్యవహరిస్తున్నాయి. పార్టీ ఫిరాయింపులు, అవినీతి, బెదిరింపులు, రాజకీయపరమైన అంశాల విషయంలో కేసీఆర్ బాటలోనే రేవంత్ సాగుతున్నారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ తెలంగాణను పూర్తిగా దెబ్బతీస్తే...ఏడాది కాలంలోనే రాష్ట్రం మరింతగా అప్పుల ఊబిలో కూరుకుపోయేలా రేవంత్ చేశారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాం

సంవత్సర కాలంలో ప్రధాన హామీలేవీ అమలు కాలేదని, వివిధ వర్గాల ప్రజలకు ఎలాంటి ప్రయోజనాలు చేకూరలేదంటూ మేం వారం రోజులు వివిధ రూపాల్లో కార్యక్రమాలు చేపట్టాం. రైతులు, నిరుద్యోగ యువత, మహిళలు ఇతర వర్గాలకు చేసిన వాగ్దానాలు అమలుకు నోచుకోలేదనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాం. జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పాల్గొన్న బహిరంగ సభ ద్వారా పార్టీ వైఖరిని స్పష్టం చేశాం. ఇది ఆరంభం మాత్రమే. భవిష్యత్తులో కూడా ప్రతిరోజూ, ప్రతిచోటా ప్రభుత్వ వైఫల్యాలను, పాలనా తీరు, అవలంబిస్తున్న అప్రజాస్వామిక విధానాలు ప్రజలకు వివరిస్తూనే ఉంటాం. ఇప్పుడు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలను ఇక ముందూ ప్రణాళికా బద్ధంగా కొనసాగిస్తాం. వచ్చే నాలుగేళ్ల పాటు పార్టీ నాయకులు, కేడర్ ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యలపై పోరాడేలా ఉద్యమ కార్యాచరణకు తుదిరూపునిస్తున్నాం.

మేం ఆచరణకు నోచుకోని హామీలివ్వం

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లకు భిన్నంగా ఉంటేనే బీజేపీ గెలుస్తుంది. ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో దీన్ని ఆచరణలో చూపించాం. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ల మాదిరిగా కాకుండా ఏదైతే చెబుతామో అది చేసి చూపిస్తాం. అలవికాని, ఆచరణకు నోచుకోని హామీలివ్వం. అవినీతి, అక్రమాలకు ఎలాంటి అవకాశం ఇవ్వం. తెలంగాణలోనూ మోదీ నాయకత్వంలో డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తేనే రాష్ట్రం నిజమైన అభివృద్ధిని సాధించడంతో పాటు అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందుతాయనే విషయాన్ని అందరికీ అర్థమయ్యేట్లు వివరిస్తాం. బీజేపీ గుజరాత్‌లో వరుసగా ఆరు పర్యాయాలు, గోవాలో మూడు, మధ్యప్రదేశ్‌లో మూడు, తాజాగా మహారాష్ట్రలో వరుసగా మూడుసార్లు అధికారంలోకి రావడం ప్రజలు చూస్తున్నారు. కేంద్రంలోనూ హ్యాట్రిక్ విజయాన్ని సొంతం చేసుకున్నాం. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికార పార్టీతో సమానంగా బీజేపీ 8 సీట్లు గెలిచిందంటేనే ప్రజల్లో పెరిగిన సానుకూలత స్పష్టమౌతోంది. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించి బీజేపీ ప్రభుత్వం ఏర్పడే దాకా విరామం లేకుండా ఉద్యమ కార్యాచరణను కొనసాగిస్తాం. త్వరలో జరగనున్న మూడు ఎమ్మెల్సీ సీట్లకు మరో వారం రోజుల్లో అభ్యర్థులను ఖరారు చేస్తాం.

క్లుప్తంగా...

గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ బీఆర్‌ఎస్ నేత దాసోజు శ్రవణ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ సందర్భంగా దాసోజు శ్రవణ్ తరఫున సీనియర్ అడ్వొకేట్ ముకుల్ రోహిత్గి సుప్రీంకోర్టులో వాదనలు వినిపించారు. సుప్రీంకోర్టు ఈ కేసులో స్టే ఇచ్చినప్పటికీ, కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ ఎమ్మెల్సీల ప్రమాణ స్వీకారం జరిగిందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీంతో విచారణ జరిపిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ ప్రసన్నల ధర్మాసనం తదుపరి విచారణను ఫిబ్రవరి 12కు వాయిదా వేసింది. 12న తుది వాదనలు, తుది తీర్పు ఉంటుందని ధర్మాసనం తెలిపింది.

హెచ్‌ఎం పదోన్నతులు ఇవ్వాలి: పీఆర్టీయూటీఎస్

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ, పంచాయతీరాజ్ ఉన్నత పాఠశాలల్లో ఉన్న హెచ్‌ఎంల పోస్టులకు అడ్‌హాక్ పద్ధతిలో పదోన్నతులు కల్పించి భర్తీ చేయాలని పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ఎన్. శ్రీధర్‌ను సోమవారం నేతలు కలిశారు. ఏకీకృత సర్వీస్ రూల్స్, మిగిలిపోయిన పండిట్, పీఈటీలకు పదోన్నతులు, మోడల్ స్కూల్ టీచర్లకు వేతనాలు, సర్వశిక్షా అభియాన్ పథకం కింద పనిచేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం అంశాలను ముఖ్య కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు.

ఉద్యోగుల హామీలు ఏడాదైనా అమలు కాలేదు: దేవీప్రసాద్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన హామీలు ఏడాది గడిచినా అమలు కాలేదని ఉద్యోగ సంఘాల మాజీ నేత దేవీ ప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఉద్యోగుల సమస్యలపై హామీలు గుప్పించిందన్నారు. కేసీఆర్ హయాంలో పీఆర్సీతోపాటు 5 శాతం ఐఆర్ ఇచ్చారని పేర్కొన్నారు. కానీ ప్రస్తుతం వేతనాల పెంపు, డీఏ బకాయిలు, సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ విధానం అమలు, జీఓ 317 సమస్యల పరిష్కారం తదితరాలన్నీ అటకెక్కాయని దేవీప్రసాద్ విమర్శించారు. ఇంకా నాలుగేళ్లు ఎలాంటి పరిస్థితులు ఎదుర్కోవాల్సి వస్తుందోనన్న ఆందోళన ఉద్యోగుల్లో ఉందన్నారు. హామీల గురించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా ఉద్యోగ సంఘాల కార్యాచరణ ఉండాలన్నారు.

'ఈనాడు, ఆంధ్రజ్యోతి'పై

రూ.100 కోట్లకు పరువు నష్టం దావా



'సెకీ'తో విద్యుత్తు కొనుగోలు ఒప్పందంపై ఆ మీడియాల్లో వాస్తవాల వక్రీకరణ..

నాపై ప్రచురించిన, ప్రసారం చేసిన కథనాలను తొలగించేలా వాటిని ఆదేశించండి

- బేషరతుగా క్షమాపణలు చెప్పి ప్రముఖంగా ప్రచురించేలా ఆదేశాలివ్వండి
- ఢిల్లీ హైకోర్టును అభ్యర్థించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- జగన్ పరువు నష్టం దావాపై స్పందించిన ఢిల్లీ హైకోర్టు..
- ఈనాడు, ఆంధ్రజ్యోతికి కోర్టు సమన్లు.. ఆ కథనాలు, పోస్టులు తొలగించే వ్యవహారంలో నోటీసులు
- ఈ ఉత్తర్వుల తరువాత ఏ కథనాలు ప్రచురించినా తెలిసే ప్రచురించినట్లు భావిస్తామన్న న్యాయస్థానం
- తదుపరి విచారణ ఈ నెల 16కి వాయిదా
- అది.. కేంద్రం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య కుదిరిన ఒప్పందం
- సెకీ నుంచి అత్యంత చౌకగా యూనిట్ రూ.2.49కే సౌర విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం
- ప్రత్యేక ప్రోత్సాహకం కింద అంతరాష్ట్ర పంపిణీ చార్జీల నుంచి సైతం సెకీ మినహాయింపు
- సెకీ స్వయంగా ముందుకొచ్చి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది.. ఇందులో మూడో పార్టీ ప్రమేయం లేదు
- దీనివల్ల 25 ఏళ్లలో ఖజానాకు రూ.లక్ష కోట్లకుపైగా ఆదా.. అతి తక్కువ ధరకే సౌర విద్యుత్
- రైతులకు నిరాటంకంగా ఉచిత విద్యుత్తు అందించేలా చర్యలు తీసుకున్నాం
- ఆ నేరారోపణల్లో ఎక్కడా నాకు లంచం ఇచ్చినట్లుగానీ.. నేను తీసుకున్నట్లుగానీ లేదు
- తప్పుడు కథనాలతో నా హక్కులను హరించారు
- పరువు నష్టం దావాలో న్యాయస్థానానికి నివేదించిన వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ) నుంచి సౌర విద్యుత్ కొనుగోలు ఒప్పందం వ్యవహారంలో తనకు ముడుపులు అందాయంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి దినపత్రికలు ప్రచురించిన తప్పుడు, దురుద్దేశపూర్వక కథనాలపై మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దాఖలు చేసిన పరువు నష్టం దావాపై ఢిల్లీ హైకోర్టు స్పందించింది. తప్పుడు కథనాలు ప్రచురించిన, ప్రసారం చేసిన ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ ప్రైవేట్ లిమిటెడ్ పబ్లిషర్, దాని ఎడిటర్ ఎం.నాగేశ్వరరావు, ఆమోద పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ పబ్లిషర్, దాని ఎడిటర్ ఎస్.రాహుల్ కుమార్‌కు ఢిల్లీ హైకోర్టు సోమవారం సమన్లు జారీ చేసింది. తనపై ప్రచురించిన, ప్రసారం చేసిన తప్పుడు కథనాలను, ఆర్టికల్స్, పోస్టులు, వీడియోలు, పోస్టులను తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలన్న జగన్ అనుబంధ పిటిషన్‌లో కూడా ఈనాడు, ఆంధ్రజ్యోతి మీడియా సంస్థలకు న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. అంతేకాక ఇకపై అలాంటి తప్పుడు కథనాలు ప్రచురించకుండా ఆదేశాలు ఇవ్వాలన్న జగన్ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, ఆ మేరకు ఈనాడు, ఆంధ్రజ్యోతికి నోటీసులు ఇచ్చింది. నోటీసులు ఇస్తూ జారీ చేసిన ఈ ఉత్తర్వుల తరువాత మీరు ఏ కథనాలు ప్రచురించినా, ప్రసారం చేసినా వాటిని కోర్టు ఉత్తర్వుల గురించి తెలిసీ ప్రచురించినట్లుగానే భావిస్తామని ఈనాడు, ఆంధ్రజ్యోతికి హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్రమోణియమ్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై తదుపరి విచారణను ఈ నెల 16వతేదీకి వాయిదా వేశారు.

రూ.100 కోట్లకు పరువు నష్టం దావా

సౌర విద్యుత్ ఒప్పందం కొనుగోళ్లలో తనకు ముడుపులు అందాయంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి ప్రచురించిన, ప్రసారం చేసిన తప్పుడు, అసత్య కథనాలపై వైఎస్ జగన్ ఢిల్లీ హైకోర్టులో రూ.100 కోట్లకు పరువు నష్టం దావా దాఖలు చేశారు. తనపై ప్రచురించిన, ప్రసారం చేసిన తప్పుడు కథనాలను, ఆర్టికల్స్, పోస్టులు, వీడియోలు, పోస్టులను తొలగించేలా ఈనాడు, ఆంధ్రజ్యోతిని ఆదేశించాలని దావాలో కోరారు. తనకు కలిగిన పరువు నష్టానికి రూ.వంద కోట్లు చెల్లించేలా ఆదేశించాలని కోరారు. ఇకపై తన విషయంలో ఎలాంటి తప్పుడు, అసత్య, దురుద్దేశపూర్వక కథనాలు ప్రచురించకుండా, ప్రకటనలు ఇవ్వకుండా, నిందారోపణలు చేయకుండా ఈనాడు, ఆంధ్రజ్యోతిని ఆదేశిస్తూ శాశ్వత నిషేధ ఉత్తర్వులు జారీ చేయాలని దావాలో కోర్టును అభ్యర్థించారు. తనపై తప్పుడు కథనాలను ప్రచురించినందుకు బేషరతుగా క్షమాపణలు చెబుతూ, దానిని ప్రముఖంగా ప్రచురించేలా, ప్రసారం చేసేలా ఈనాడు, ఆంధ్రజ్యోతిని ఆదేశించాలని దావాలో హైకోర్టును అభ్యర్థించారు. తనపై ప్రచురించిన, ప్రసారం చేసిన కథనాలు, ఆర్టికల్స్, పోస్టులు, వీడియోలు, ట్వీట్లు, ఇతర లింకులను గూగుల్ దృష్టికి తెచ్చిన వెంటనే వాటిని తొలగించేలా ఆ సంస్థకు సైతం ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తావన ఎక్కడా లేదు...

ఈ పరువు నష్టం దావాపై ఢిల్లీ హైకోర్టు సోమవారం విచారణ జరిపింది. వైఎస్ జగన్ తరఫున సీనియర్ న్యాయవాది దయాన్ కృష్ణన్, న్యాయవాదులు అమిత్ అగర్వాల్, సాహిల్ రావిన్, రాహుల్ కుక్రేజా వాదనలు వినిపించారు. సెకీ నుంచి సౌర విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారంలో జగన్‌మోహన్‌రెడ్డికి ముడుపులు అందాయంటూ ఈనాడు, ఆంధ్రజ్యోతి ప్రచురించిన, ప్రసారం చేసిన కథనాలు నిరాధారమైనవన్నారు. రాజకీయ కారణాలతో ఉద్దేశపూర్వకంగా ఈ తప్పుడు కథనాలను ప్రచురించారన్నారు. యూఎస్ కోర్టులో దాఖలు చేసిన నేరారోపణలను ఉటంకిస్తూ తప్పుడు కథనాలను ప్రచురించారని తెలిపారు. ఆ నేరారోపణల్లో ఎక్కడా కూడా జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తావన గానీ, ఆయనకు ముడుపులు ఇచ్చినట్లు గానీ, ఆయన తీసుకున్నట్లుగా గానీ లేనే లేదని వారు కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ వ్యవహారంలో యూఎస్ కోర్టు నుంచి జగన్ ఎలాంటి నోటీసు అందుకోలేదని తెలిపారు. అయినా కూడా ఈనాడు, ఆంధ్రజ్యోతి తమ కథనాల్లో జగన్‌మోహన్‌రెడ్డి ప్రస్తావన తెస్తూ తప్పుడు కథనాలు ప్రచురించాయని నివేదించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ సుబ్రమోణియమ్ ప్రసాద్.. తప్పుడు కథనాలు ప్రచురించిన, ప్రసారం చేసిన ఈనాడు, ఆంధ్రజ్యోతికి సమన్లు జారీ చేశారు.



జల్‌పల్లిలోని మంచు టౌన్

మనోజ్ ఆధీనంలోకి 'మంచు టౌన్'!

- బౌన్సర్ల సాయంతో జల్‌పల్లిలోని ఫామ్‌హౌస్ స్వాధీనం
- మధ్యాహ్నం సోదరుడితో మంచు లక్ష్మి చర్చలు
- రాత్రి పహాడీషరీఫ్ పోలీసుస్టేషన్‌కు వెళ్లిన మనోజ్
- తనకు, తన భార్యకు, పిల్లలకు ముప్పు ఉందని ఫిర్యాదు
- మోహన్‌బాబుపై 329, 351, 115 సెక్షన్ల కింద కేసు నమోదు
- కొద్దిసేపటికే మనోజ్, మౌనికపై వాట్సాప్ ద్వారా మోహన్‌బాబు ఫిర్యాదు
- తన భద్రత, ఆస్తుల విషయంలో భయపడుతున్నానని వెల్లడి
- అవన్నీ తప్పుడు, నిరాధార ఆరోపణలు: 'ఎక్స్'లో మనోజ్



పహాడీషరీఫ్ పీఎస్‌లో ఫిర్యాదు చేస్తున్న మనోజ్

సాక్షి, హైదరాబాద్: సినీ నటుడు మంచు మోహన్‌బాబు కుటుంబంలో రేగిన కలకలానికి సంబంధించి సోమవారం కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. హైదరాబాద్ శివార్లలోని జల్‌పల్లిలో ఉన్న ఆయన ఫామ్‌హౌస్ 'మంచు టౌన్'ను ఆయన కుమారుడు మంచు మనోజ్ స్వాధీనం చేసుకున్నారు. మనోజ్‌పై దాడి జరిగిందనే వార్తల నేపథ్యంలో ఆదివారం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరిన మనోజ్.. సోమవారం ఉదయం డిశ్చార్జి అయ్యారు. వెంటనే బౌన్సర్లతో కలిసి వెళ్లి ఫామ్‌హౌస్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆపై సోమవారం రాత్రి.. తనపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారంటూ పహాడీషరీఫ్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఇది జరిగిన గంటలోనే మోహన్‌బాబు వాట్సాప్ ద్వారా రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబుకు ఫిర్యాదు పంపారు. అందులో తన కుమారుడు మనోజ్, అతని భార్య మౌనికపై చర్యలు తీసుకోవాలని కోరారు. అసాంఘిక శక్తుల నుంచి తన ప్రాణానికి, తన ఆస్తులకు రక్షణ కల్పించాలని కోరారు.

పోలీసులకు వైద్య పరీక్షల రికార్డులు

బంజారాహిల్స్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరిన మనోజ్‌కు వైద్యులు సిటీ స్కాన్, అల్ట్రాసౌండ్, ఎక్స్‌రే తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు రికార్డులు డిశ్చార్జి సమయంలో మనోజ్‌కు ఇచ్చారు. వాటిని మనోజ్ వెంటనే వాట్సాప్ ద్వారా పహాడీషరీఫ్ పోలీసులకు పంపారు. తొలుత తన ఇంటికి వెళ్లారు. తర్వాత కొందరు బౌన్సర్లతో కలిసి జల్‌పల్లిలోని మంచు టౌన్‌కు వెళ్లారు. వీరి వెంట కర్నూలు నుంచి వచ్చిన కొందరు భూమా మౌనిక అనుచరులు కూడా ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం దుబాయ్‌లో ఉన్న మంచు విష్ణు సైతం కొందరు బౌన్సర్లను ఫామ్‌హౌస్ వద్దకు పంపారు. ఇలా మనోజ్, విష్ణులకు సంబంధించిన దాదాపు 70 మంది బౌన్సర్లు అక్కడకు చేరుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ప్రస్తుతం ఈ ఫామ్‌హౌస్ చుట్టూ, గేట్ వద్ద కొందరు మహిళ బౌన్సర్లు కూడా పహారా కాస్తున్నారు. అయితే పహాడీషరీఫ్ పోలీసులతో ఫోన్‌లో మాట్లాడిన మనోజ్.. తన ఇంట్లో, చుట్టుపక్కల ఉన్నది పని మనుషులు, దగ్గరి వారేనని, బౌన్సర్లు లేరని చెప్పినట్లు తెలిసింది. కాగా మనోజ్ ఇంట్లో ఉండగానే మధ్యాహ్నం మంచు టౌన్‌కు వచ్చిన మోహన్‌బాబు కుమార్తె మంచు లక్ష్మి దాదాపు గంటకుపైగా మనోజ్‌తో చర్చలు జరిపి వెళ్లారు.

సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్ మాయం: మనోజ్

తర్వాత రాత్రి 7 గంటల ప్రాంతంలో మనోజ్ హఠాత్తుగా పహాడీషరీఫ్ పోలీసుస్టేషన్‌కు వచ్చారు. ఆదివారం ఉదయం తనపై పది మంది గుర్తుతెలియని వ్యక్తులు విచక్షణారహితంగా దాడి చేశారని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇచ్చారు. తనకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరారు. సీసీ కెమెరాల హార్డ్‌డిస్క్ మాయం అయిందని, దీని వెనుక కిరణ్, విజయ్ రెడ్డి అనేవారి పాత్ర ఉన్నట్లు అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. పహాడీషరీఫ్ ఇన్‌స్పెక్టర్ గురవారెడ్డి మాట్లాడుతూ.. మనోజ్ తనపై ఎవరు, ఎందుకు దాడి చేశారో తెలియదని, తనకు, తన భార్యకు, పిల్లలకు ముప్పు ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారని చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు. కాగా మనోజ్ ఫిర్యాదుపై పహాడీషరీఫ్ పోలీసులు 329, 351, 115 సెక్షన్ల కింద మోహన్‌బాబుపై కేసు నమోదు చేశారు.

మనోజ్ నా ఇంటిని ఆక్రమించుకున్నాడు: మోహన్‌బాబు

మోహన్‌బాబు సైతం మనోజ్, అతని భార్యపై చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. 'జల్‌పల్లిలో 10 ఏళ్లుగా నివసిస్తున్నా. నాలుగు నెలల క్రితం చిన్న కుమారుడు మనోజ్ ఇంటిని విడిచిపెట్టి వెళ్లాడు. మనోజ్ కొందరు సంఘ వ్యతిరేకులతో కలిసి నా ఇంటి వద్ద కలవరం సృష్టించాడు. తన ఏడు నెలల కుమార్తెను ఇంటి పని మనిషి సంరక్షణలో విడిచిపెట్టాడు. మాదాపూర్‌లోని నా కార్యాలయంలోకి 30 మంది వ్యక్తులు చొరబడి సిబ్బందిని బెదిరించారు. మనోజ్, మౌనిక నా ఇంటిని అక్రమంగా ఆక్రమించుకుని ఉద్యోగులను బెదిరిస్తున్నారు. నా భద్రత, విలువైన వస్తువులు, ఆస్తుల విషయంలో భయపడుతున్నా. నేను దాదాపు 78 ఏళ్ల సీనియర్ సిటిజన్‌ని. నా ఆస్తుల నుంచి మనోజ్, మౌనికలను బయటకు పంపండి. వారు, వారి సహచరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. నా భద్రత కోసం అదనపు సిబ్బందిని కేటాయించండి..' అని ఫిర్యాదులో మోహన్‌బాబు కోరారు. మోహన్‌బాబు లెటర్ హెడ్‌పై, ఆయన సంతకంతో ఉన్న ఈ ఫిర్యాదు లేఖ వాట్సాప్ ద్వారా రాచకొండ పోలీసు కమిషనర్‌కు అందింది. ఆయన దాన్ని పహాడీషరీఫ్ పోలీసులకు ఫార్వర్డ్ చేశారు. కమిషనర్ సుధీర్‌బాబు 'సాక్షి'తో మాట్లాడుతూ...'మనోజ్ నేరుగా పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. మోహన్‌బాబు ఫిర్యాదు వాట్సాప్ ద్వారా వచ్చింది. రెండింటి పూర్వాపరాలు పరిశీలించి, కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తాం..' అని తెలిపారు.

అర్ధరాత్రి 'ఎక్స్'లో మనోజ్ పోస్టు

తన తండ్రి మోహన్‌బాబు తనపై, తన భార్య మౌనికపై దురుద్దేశపూర్వక, తప్పుడు, ఆధారాల్లేని ఆరోపణలు చేశారని మనోజ్ సోమవారం అర్ధరాత్రి 'ఎక్స్'లో పేర్కొన్నారు. తన పరువు తీయడంతో పాటు తన గొంతు నొక్కడం, అనవసర కుటుంబ కలహాలు సృష్టించడంలో భాగంగానే ఈ ఆరోపణలు చేశారన్నారు. 'అవన్నీ పూర్తిగా కల్పితం. నేనెప్పుడూ ఆర్థిక అవసరాలకు నా కుటుంబంపై ఆధారపడలేదు. ఎలాంటి ఆస్తులూ అడగలేదు. నేను గత ఏడాదిగా ఎక్కడ ఉంటున్నానో నా మొబైల్ ఫోన్ టవర్ లొకేషన్ ఆధారంగా అధికారులు గుర్తించాలి. నా 7 నెలల కుమార్తెను ఈ వివాదంలోకి లాగడం భయానకం, అమానుషం. విష్ణు అనుచరులు విజయ్‌రెడ్డి, కిరణ్ సీసీటీవీ డ్రైవ్‌లు ఎందుకు తొలగించారు?..' అని మీడియా ప్రకటన పేరిట పెట్టిన పోస్టులో మనోజ్ ప్రశ్నించారు. ఎంబీయూ విద్యార్థులు, ఆర్థిక అవకతవకలు, ఇతర కుటుంబ అంశాలకు సంబంధించి సుదీర్ఘ వివరణ ఇచ్చారు.

రూ.10 వేల కోట్ల రుణానికి గ్రీన్‌సిగ్నల్!

- పరిశ్రమల భూముల తాకట్టు, ప్రభుత్వ గ్యారంటీతో రుణమిచ్చేందుకు ఐసీఐసీఐ సుముఖత
- నెలాఖరులోగా ప్రభుత్వ ఖాతాలో సొమ్ము జమ అయ్యే అవకాశం
- రుణ సేకరణలో సహకరించిన మర్చంట్ బ్యాంకర్‌కు రూ.100 కోట్లు
- తీసుకుంటున్న రుణానికి ప్రతి నెలా రూ.100 కోట్లు వడ్డీ చెల్లింపు?
- ఇదే తరహాలో వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి మరో రూ.10 వేల కోట్ల రుణ సేకరణ

సాక్షి, హైదరాబాద్: వివిధ కార్యక్రమాలు, పథకాల అమలుకు అవసరమైన నిధుల సేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నం సఫలమైనట్టు తెలిసింది. భూములను తాకట్టు పెట్టుకుని, ప్రభుత్వ గ్యారంటీ తీసుకుని రూ.10 వేల కోట్ల రుణం ఇచ్చేందుకు ఐసీఐసీఐ బ్యాంకు ముందుకొచ్చినట్టు సమాచారం. ఈ రుణ సేకరణ సమాచారాన్ని రిజర్వు బ్యాంక్‌కు కూడా ఇచ్చిన నేపథ్యంలో ఈ నెలాఖరులోగానే రూ.10వేల కోట్లు ప్రభుత్వ ఖాతాలో జమ అయ్యే అవకాశాలు ఉన్నట్టు ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ మొత్తం నుంచే సంక్రాంతి తర్వాత రైతుల ఖాతాల్లో 'రైతు భరోసా'ను వేసే అవకాశం ఉందని పేర్కొంటున్నాయి. ఇదే తరహాలో వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి తెలంగాణ పారిశ్రామిక మౌలిక వసతుల కల్పన సంస్థ (టీజీఐఐసీ) ద్వారా మరో రూ.10 వేల కోట్లు సేకరించాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు తెలిసింది.

మర్చంట్ బ్యాంకర్‌కు రూ.100 కోట్లు కమీషన్!

హైదరాబాద్‌లో అత్యంత ఖరీదైన ప్రాంతాలైన కోకాపేట, రాయదుర్గంలలో ఉన్న రూ.20 వేల కోట్ల విలువైన 400 ఎకరాల భూమిని తాకట్టు పెట్టాలని గతంలోనే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ప్రభుత్వ భూములను తనఖా పెట్టి రుణం తీసుకున్న అనుభవం ప్రభుత్వ శాఖలకు లేదు. దీనితో రుణాలు ఇప్పించడంలో అనుభవమున్న 'మర్చంట్ బ్యాంకర్'లను ఈ ఏడాది జూలైలో ఆహ్వానించారు. చివరికి 'క్యాపిటల్ ట్రస్ట్' అనే మర్చంట్ బ్యాంకర్‌ను ఎంపిక చేసి రూ.10 వేల కోట్ల రుణ సేకరణ బాధ్యత అప్పగించారు. ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలేవీ భారీ రుణం ఇచ్చేందుకు ముందుకు రాకపోవడంతో.. బ్యాంకులను సంప్రదించారు. ప్రస్తుతం రుణం ఇచ్చేందుకు ఐసీఐసీఐ బ్యాంకు ముందుకురావడంతో.. రూ.10 వేల కోట్ల రుణంలో ఒక శాతం అంటే రూ.100 కోట్లను క్యాపిటల్ ట్రస్టుకు కమీషన్ రూపంలో టీజీఐఐసీ చెల్లించనుంది.

మూడు బ్యాంకులతో సంప్రదింపులు జరిపి...

సుమారు 6 శాతం వడ్డీకి రుణాలు ఇచ్చే ప్రైవేటు ఫైనాన్స్ సంస్థలు పరిశ్రమల భూములను తాకట్టు పెట్టుకునేందుకు ఆసక్తి చూపలేదు. దీనితో బ్యాంకులను ఆశ్రయించగా... కరూర్ వైశ్యా బ్యాంక్, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ రూ.10 వేల కోట్ల రుణం ఇచ్చేందుకు ముందుకు వచ్చాయి. వీటిలో కరూర్ వైశ్యా బ్యాంక్, ఎస్‌బీఐ 10.5 శాతం వడ్డీని కోట్ చేయగా... ఐసీఐసీఐ బ్యాంకు డాక్యుమెంటేషన్ చార్జీలు కలుపుకొని 9.6 శాతం వడ్డీతో రుణం ఇచ్చేందుకు అంగీకరించింది. అంటే ప్రభుత్వం తీసుకుంటున్న రుణం మొత్తానికి ప్రతి నెలా రూ.100 కోట్ల వరకు వడ్డీ రూపంలో చెల్లించాల్సి ఉంటుందని అంచనా. ఒకవేళ టీజీఐఐసీ సకాలంలో రుణం చెల్లించని పక్షంలో.. రిజర్వు బ్యాంకు ద్వారా రాష్ట్రానికి వచ్చే రుణం నుంచి ఆటోమేటిక్‌గా బ్యాంకులకు చెల్లింపులు జరుగుతాయి. అయితే తీసుకుంటున్న రుణాన్ని ఎన్ని సంవత్సరాల్లో తిరిగి చెల్లించే ప్రతిపాదన ఉందనేది ప్రభుత్వ వర్గాలు వెల్లడించడం లేదు.

ప్రభుత్వ గ్యారంటీతో లైన్ క్లియర్

పరిశ్రమల భూముల తాకట్టు ద్వారా మూలధన వ్యయం, ఇతర అవసరాల కోసం టీజీఐఐసీ తీసుకునే రుణానికి ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వాలని బ్యాంకర్లు మెలికపెట్టారు. అయితే ప్రభుత్వం గ్యారంటీ ఇస్తే తాకట్టు ద్వారా తీసుకునే రుణాలకు కూడా ఎఫ్‌ఆర్‌బీఎం నిబంధన వర్తిస్తుందని ఆర్‌బీఐ వర్గాలు స్పష్టం చేశాయి. అయినా నిధులు అత్యవసరం కావడంతో అక్టోబర్ 26న సీఎం రేవంత్ అధ్యక్షతన జరిగిన జరిగిన రాష్ట్ర కేబినెట్ సమావేశం ప్రభుత్వ గ్యారంటీకి ఆమోదం తెలిపింది. తాజాగా రుణ వితరణకు ఐసీఐసీఐ అంగీకరించడంతో ప్రభుత్వం ఆర్‌బీఐకి రూ.10 వేల కోట్ల రుణ సేకరణ సమాచారం ఇచ్చినట్టు తెలిసింది.





సింగరేణిలో ఎలక్ట్రికల్ విభాగంలో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులు

• గనుల్లోకి మహిళలు

ఉ'మైన్' ఫోర్స్

'సిరి వెలుగు విరజిమ్మే
సింగరేణి బంగారం
అణువణువున ఖనిజాలు
నీ తనువుకు సింగారం'...
తెలంగాణ రాష్ట్ర గీతంలో సింగరేణి వైభవానికి అద్దం పట్టే అక్షరాలు ఇవి.

ఇప్పుడు ఆ వైభవానికి మహిళా సామర్థ్యం, శక్తి మరింతగా తోడు కానున్నాయి.

బీటెక్ చదివిన అమ్మాయిలు పెద్ద పట్టణాల్లో సాఫ్ట్‌వేర్ రంగంలో ఉద్యోగం చేయడానికి మాత్రమే ఆసక్తి చూపుతారనేది కేవలం అపోహ మాత్రమే అనేది... సింగరేణిలో తాజాగా ఉద్యోగాలు సాధించిన మహిళల మాటలు వింటే అర్థం అవుతుంది.

సింగరేణిలో ఉద్యోగం అంటే 'కష్టం' అనే అభిప్రాయం ఉంది,

అయితే విజేతలకు మాత్రం అది కష్టమైన కాదు అత్యంత ఇష్టమైన ఉద్యోగం. తమ సంస్కృతి, కుటుంబ బాంధవ్యాలతో ముడిపడిన ఉద్వేగాల ఉద్యోగం. సింగరేణి వాకిట 'సిరి' వెన్నెలగా మెరిసే అపూర్వ అవకాశం.



ఆర్జీ–2లో రిపోర్టింగ్ చేసేందుకు వచ్చిన మహిళా ఉద్యోగులు



ఆర్జీ–1లో రిపోర్టింగ్ చేసేందుకు వచ్చిన మహిళా ఉద్యోగులు

మూడో తరం



మా తాత సింగరేణిలో పనిచేసి రిటైర్ అయ్యిండు. మా నాన్న ప్రస్తుతం సింగరేణిలో క్లర్క్‌గా పనిచేస్తుండు. వారి స్ఫూర్తితో నేను కూడా సింగరేణిలో చేరాలనుకున్నా. మైనింగ్‌లో బీటెక్ చేశాను. తాజాగా సింగరేణి నిర్వహించిన పరీక్షలో ఉద్యోగం సాధించాను. గనిలో పనిచేయటం గురించి ఉత్సాహం తప్ప ఎటువంటి ఆందోళన, భయం లేదు. కష్టపడి పనిచేసే ఆసక్తి ఉంటే ఏ ఉద్యోగమైనా ఒక్కటే.

– మోగారం బాంధవి

యస్... మేము 'రాణి'ంచగలం!



మా నాన్న గారు చిన్నప్పుడే చనిపోయారు. ఇల్లందులో బీటెక్ పూర్తి చేశాను. అమ్మ, అన్నయ్య ప్రోత్సాహంతోనే మైనింగ్ కోర్సులో జాయిన్ అయ్యా. ఇంట్లో కూర్చొనే పరీక్షకు ప్రిపేర్ అయ్యా. తాజాగా వెలువడిన ఫలితాల్లో వీవీటీగా ఎంపికయ్యాను. పురుషులకు దీటుగా మహిళలు రాణించగలరు అని చాటి చెప్పేందుకే ఈ ఉద్యోగం ఎంచుకున్నా.

– షేక్ హసియా బేగం

అలా మొదలైంది...

బ్రిటిష్ కాలంలో, 1952కి ముందు బొగ్గు గనుల్లో మహిళలు, బాలురు పనిచేసేవారు. వీరిని గనుల్లోకి పంప కూడదని గనుల చట్ట సవరణ చేయడం వల్ల 70 ఏళ్లుగా మహిళలు భూగర్భ గనుల్లో పనిచేయడం లేదు. అయితే మహిళా సాధికారతను దృష్టిలో పెట్టుకొని 1952 నాటి గనుల చట్టాన్ని సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం 2019 జనవరి 29న గెజిట్‌ను జారీ చేసింది. సింగరేణిలో పురుషులకు మాత్రమే ఉద్యోగాలు పరిమితం చేయడం సరికాదంటూ గతంలో కొందరు హైకోర్టులో కేసు వేశారు. విచారణ అనంతరం మహిళలకు కూడా కార్మికులుగా ఉద్యోగాలు ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. దీంతో వేలాదిమంది ఆడబిడ్డలు వారసత్వం ఆధారంగా సింగరేణిలో ఉద్యోగం సాధించారు. భర్త చనిపోయిన భార్యకు, భర్త వదిలేసి ఒంటరిగా పుట్టింట్లో ఉంటున్న మహిళకు, తండ్రి అనారోగ్యం పాలైతే అతని స్థానంలో కూతురికి ఉపాధి కల్పించేలా నిర్ణయం తీసుకున్నారు. అప్పటి నుంచి సింగరేణి కార్మిక బలగంలో మహిళల శ్రామిక బలం పెరిగింది. వారిని బదిలీ వర్కర్‌గా తరువాత జనరల్ మజ్దూర్ హోదాలో జీఎం కార్యాలయాలు, డిపార్ట్‌మెంట్‌లు, ఏరియా ఆసుపత్రులు, వర్క్‌షాపులు, స్టోర్స్‌లలో రిక్రూట్ చేశారు. మహిళా కార్మికుల సంఖ్య పెరుగుతుండటంతో భూగర్భ గనుల్లోకి పంపాలని సింగరేణి యాజమాన్యం నిర్ణయించింది.

సింగరేణి చరిత్రలో మొట్టమొదటిసారిగా భూగర్భ బొగ్గు గనుల్లో మహిళా అధికారులను నియమిస్తూ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది. ఇటీవల సింగరేణి యాజమాన్యం మేనేజ్‌మెంట్ ట్రైనీ(మైనింగ్) ఎక్స్‌టర్నల్ పరీక్ష నిర్వహించింది. ఎంపిక చేసిన 88మందిలో 28మంది మహిళలు ఉన్నారు. ఈ మేరకు శనివారం సింగరేణి యాజమాన్యం నియామక ఉత్తర్వులు విడుదల చేసింది. ఎంపికైన మహిళలను వివిధ ఏరియాల్లోని భూగర్భ గనుల్లో విధులు నిర్వహించేందుకు కేటాయించింది.

సింగరేణి వ్యాప్తంగా వివిధ ఏరియాలకు మహిళా ఇంజనీర్‌లను కేటాయించి, సోమవారంలోగా వారిని ఆయా ఏరియా జీఎంలకు రిపోర్ట్ చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆర్జీ–1 ఏరియాకు అయిదుగురు, ఆర్జీ–2కు ఆరుగురు, భూపాలపల్లి ఏరియాకు ఆరుగురు, కొత్తగూడెం ఏరియాకు ఆరుగురు, మణుగూరు ఏరియాకు ఇద్దరు, శ్రీరాంపూర్ ఏరియాకు ముగ్గురికి పోస్టింగ్ ఆర్డర్స్ ఇచ్చారు. రిపోర్ట్ చేసిన వారందరికీ రెండు వారాల పాటు ఓరియంటేషన్ ట్రైనింగ్ ఉంటుంది. అందులో మొదటి మూడు రోజులు రక్షణపై ఎంవీటీసీలలో శిక్షణ ఇస్తారు. ఓరియెంటేషన్ ట్రైనింగ్ పూర్తయిన తరువాత వారికి కేటాయించిన గనులలో పనిచేయాల్సి ఉంటుంది. సంవత్సరం పాటు ట్రైనీగా పనిచేయాలి. ఆరు నెలలకోసారి రెండుసార్లు పరీక్ష నిర్వహిస్తారు. అందులో ఉత్తీర్ణులైన వారిని కొనసాగించటం జరగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

– గుడ్ల శ్రీనివాస్, సాక్షి, పెద్దపల్లి

నా కల నెరవేరింది



మాది రాజన్న సిరిసిల్ల జిల్లా. వ్యవసాయ కుటుంబం. మంథని జేఎన్‌టీయూలో బీటెక్ పూర్తి చేశా. మైనింగ్ కోర్సు చేయడానికి కారణం మా నాన్న. మహిళలు ఎన్నో రంగాల్లో రాణిస్తున్నారు. అయితే మైనింగ్‌లో మహిళలు తక్కువగా ఉన్నారు. ఈ నేపథ్యంలోనే మైనింగ్ ఫీల్డ్‌లో ఉద్యోగం చేయడానికి మా నాన్న ప్రోత్సహించేవారు. ఆయన ప్రోత్సాహంతోనే మైనింగ్ కోర్సులో చేరాను. తాజాగా సింగరేణి నిర్వహించిన పరీక్షల్లో ఉద్యోగం సాధించాను. సింగరేణిలో ఉద్యోగం చేయటం నా కల. నా కల నెరవేరినందుకు చాలా సంతోషంగా, గర్వంగా ఉంది.

– బైరి అఖిల



• రేఖ, లతా మంగేష్కర్

నా బిడ్డవు కదూ..!

రేఖ 'క్వీన్ ఆఫ్ ఇండియన్ సినిమా'! లత 'క్వీన్ ఆఫ్ మెలడీ'! ఈ ఇద్దరు రాణుల మధ్య దూరం వయసులో 25 ఏళ్లు. ఇప్పుడైతే ఇంకా దూరం. లత రెండేళ్ల క్రితం నింగికేగారు. ఆ దేవరాగానికి ఒక 'శ్రావ్యరూపం'గా రేఖ ఈ భువిని వెలిగిస్తూ ఉన్నారు. ''కానీ అది దూరం కాదు. మరింతగా దగ్గరితనం'' అంటారు రేఖ!

'నెట్‌ఫ్లిక్స్'లో ఈ నెల 7న స్ట్రీమింగ్‌లోకి వచ్చిన 'ఎవర్‌గ్రీన్ ఐకాన్ రేఖ' అనే ఎపిసోడ్‌లో ప్రేక్షకులకు కనువిందు చేసిన అందాల నటి రేఖ.. గాయని లతా మంగేష్కర్‌తో తనకున్న 'రక్త సంబంధాన్ని' గుర్తు చేసుకున్నారు.

''ఒకసారి లతాజీ నన్ను తన బర్త్‌డే పార్టీకి ఆహ్వానించారు. ఆ పార్టీలో నేను స్టేజి ఎక్కి, 'లతా అక్కా... నేను మీకు బిగ్ ఫ్యాన్‌ని' అని గట్టిగా అరిచి చెప్పాను. ఆ వెంటనే, 'దేవుడా, నువ్వు కనుక వింటున్నట్లయితే నాదొక కోరిక. వచ్చే జన్మలోనైనా లతా అక్కను నాకు కూతురిగా పుట్టించు..'' అని వేడుకున్నాను. అందుకు లతాజీ వెంటనే, 'వచ్చే జన్మ దాకా ఎందుకు. ఈ జన్మలో కూడా నేను నీ కూతురిని కాగలను' అంటూ.. నేరుగా స్టేజి పైకి వచ్చి నన్ను 'మమ్మా.. మమ్మా' అని పిలిచారు. ఆ పిలుపు ఈనాటికీ నా చెవుల్లో ప్రతిధ్వనిస్తూనే ఉంది''.. అని లతకు, తనకు మధ్య ఉన్న 'తల్లీకూతుళ్ల బంధం' గురించి కపిల్ షోలో.. చెప్పారు రేఖ.

లతకు, రేఖకు మధ్య ఉన్న గాన మాధుర్య బాంధవ్యం గురించైతే చెప్పే పనే లేదు. 'తేరే బినా జియా జాయే నా', 'నీలా ఆస్మాన్ సో గయా', 'ఆజ్‌కల్ పాన్ జమీ పర్ నహీ పడ్తే', 'సలామే ఇష్క్ మేరీ జాన్', 'దేఖా ఏక్ ఖ్వాబ్' వంటి మనోహరమైన గీతాలను రేఖ కోసం లత పాడారో, లత కోసం రేఖ అభినయించారో చెప్పటం అంటే.. ఎన్ని జన్మలకైనా వాళ్లిద్దరిలో తల్లెవరో, కూతురెవరో గుర్తు పట్టే ప్రయత్నమే!

బ్యూటిప్



క్రమం తప్పకుండా కొన్ని రోజుల పాటు చిటికెడు పసుపు, మీగడ కలిపి ముఖానికి రాసుకుని అరగంట తర్వాత స్నానం చేయాలి లేదంటే పాలలో బ్రెడ్ ముక్కలు నానవేసి ముఖానికి రాసుకుని పది నిముషాల తర్వాత కడిగేయాలి. ఇలా చేస్తుంటే మచ్చలు, చారల్లాంటివి తొలగి ముఖం మృదువుగా నిగనిగలాడుతుంటుంది.

• కొత్తిమీర, పుదీనా మెత్తగా నూరి చర్మానికి రాస్తే నల్లమచ్చలు తొలగిపోతాయి. .

సాగుబడి
జ్యేష్ఠ కార్తె : డిసెంబర్ 16 వరకు



- నిరంతర పని ఒత్తిడి, అసంతృప్తితో 19 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి స్వస్తి
- పాలేకర్ శిక్షణ పొంది 8 ఏళ్లుగా సంతృప్తికరంగా ప్రకృతి సేద్యం
- 3 ఎకరాల్లో వరి, మినుము, పెసలు, నువ్వులు తదితర పంటల సాగు
- 6 కుటుంబాలకు ఏడాది పొడవునా ఆరోగ్యదాయకమైన దేశీ వరి బియ్యం, పప్పులు సరఫరా
- మిగతా రైతుల కన్నా తన నికారాదాయం ఎక్కువే అంటున్న మునిపల్లె హరినాథ్ ప్రస్థానంపై ప్రత్యేక కథనం



వరి సాగు గురించి వివరిస్తున్న హరినాథ్

సాఫ్ట్‌వేర్ నుంచి ప్రకృతి సేద్యంలోకి..

దేశ విదేశాల్లో అధికాదాయాన్నిచ్చే సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో అంతకంతకూ పెరిగే పని ఒత్తిడి, తీవ్ర అసంతృప్తి నుంచి బయటపడటానికి ప్రకృతితో తిరిగి మమేకం కావటం ఒక్కటే మార్గమని మునిపల్లె హరినాథ్(52) భావించారు. గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మునిపల్లె గ్రామానికి చెందిన కేంద్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగి కుమారుడు హరినాథ్. 1994లో బీటెక్ పూర్తి చేసి చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అంచెలంచెలుగా ఎదుగుతూ ఆస్ట్రేలియా, అమెరికా, యూకేలలో పనిచేశారు. నెలకు రూ. 1.5 లక్షల జీతంతో మిడిల్ మేనేజ్‌మెంట్ స్థాయిలో ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ 2013లో ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఎడతెగని పని వత్తిడితో నలుగుతూ కుటుంబానికి సమయం ఇవ్వలేని స్థితిలో ఎంత చేసినా సంతృప్తినివ్వని ఉద్యోగాన్ని కొనసాగించటం కన్నా.. సొంతూళ్లో కుటుంబ సభ్యులతో కలసి ప్రశాంతంగా జీవిస్తూ వారసత్వ భూమిలో సాధారణ రైతుగా కొత్త జీవితాన్ని ప్రారంభించటంలో నిజమైన ఆనందం ఉందని ఆయన భావించారు.

ముందు నుంచే అధ్యయనం

విదేశాల్లో ఉన్న సమయంలో అక్కడి సూపర్ మార్కెట్‌లలో లభించే ఆర్గానిక్ ఉత్పత్తులకు ఆకర్షితులయ్యారు. ఖర్చు ఎక్కువైనా కల్తీలేని ఆహార పదార్థాలను తాను కూడా ఎందుకు పండించేలేననే పట్టుదలతో ఇంటర్నెట్‌లో ప్రకృతి వ్యవసాయం ఎలా చేయాలనే అంశాలపై మూడేళ్లపాటు అధ్యయనం చేశారు. రసాయనిక అవశేషాల్లేని, పోషకాల సమతుల్యతతో కూడిన ఆరోగ్యాదాయకమైన ఆహారాన్ని పండించటమే ముఖ్యమైన పనిగా తలచి ఉద్యోగానికి 2013లో రాజీనామా ఇచ్చారు.

ఆ కొత్తలోనే మధురైలో జరిగిన పద్మశ్రీ పురస్కార గ్రహీత డా. సుభాష్ పాలేకర్ శిక్షణా శిబిరంలో హరినాథ్ పాల్గొన్నారు. అక్కడికి వచ్చిన ఇతర రైతులతో పరిచయాలు పెంచుకొని వారి క్షేత్రాలను సందర్శించి, వ్యవసాయం చేస్తూ నేర్చుకున్నారు. వారసత్వంగా సంక్రమించిన 2.5 ఎకరాల మాగాణి, అర ఎకరం మెట్టలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు.

దిబ్బపై ఉద్యాన పంటలు

మాగాణిలో సార్వాలో వరి, దాళ్వాలో మినుములు, పెసలు, నువ్వులు తదితర పంటలను హరినాథ్ సాగు చేస్తున్నారు. మాగాణి పక్కనే 3 అడుగుల ఎత్తు దిబ్బగా ఉన్న అరెకరంలో పండ్లు, దుంపలు తదితర పంటలు పండిస్తున్నారు. అరటి, జామ, బొప్పాయి, కొబ్బరి, మునగ, కంద, అల్లం, కంద, మద్ది, మామిడి, టేకు పెంచుతున్నారు.

తమ ప్రాంతంలో ఖరీఫ్‌లో వరి కోతలు అయ్యాక, రబీలో మొక్కజొన్న పూర్తయ్యాక పంట వ్యర్థాలను ఉత్తరాదిలో మాదిరిగా తగుల బెడుతున్నారని హరినాథ్ తెలిపారు. గత ఏడాది ఇతర పొలాల నుంచి వ్యాపించిన మంటలకు తమ అరెకరంలోని ఉద్యాన పంటలు కాలిపోయాయన్నారు.

ఈ ఏడాది జీవామృతమూ లేదు!



పొలం దుక్కి చేయటం, రొటోవేటర్ వేయటం, దమ్ము చేయటం వంటి పనులను సొంత చిన్న ట్రాక్టర్‌తో స్వయంగా చేసుకోవటం నేర్చుకున్నారు హరినాథ్. పచ్చిరొట్ట పంటలను కలియదున్నటం, జీవామృతం పిచికారీ, కాలువ నుంచి తోడుకునే నీటితో కలిపి ఆవు మూత్రం పారించటం చేస్తుంటారు. ఈ సంవత్సరం అవేవీ చెయ్యలేదన్నారు. అయినా, గోదావరి ఇసుకలు రకం ధాన్యం ఎకరానికి 20 బస్తాలకు తగ్గకుండా వస్తాయని సంతోషంగా తెలిపారు.

నాట్లు, కలుపు తీత, కోతలు మనుషులతోనే చేయిస్తున్న హరినాథ్‌కు ఎకరా వరి సాగుకు రూ. 35 వేల నుంచి 40 వేల వరకు ఖర్చు అవుతోంది. అన్నీ అనుకూలిస్తే రసాయనిక రైతులకు 40–45 బస్తాలు, తనకు 25 బస్తాల వరకు ధాన్యం దిగుబడి వస్తుందని, అయినా తనకు మంచి ఆదాయమే వస్తున్నదన్నారు. ఆ ప్రాంతంలో అందరూ కౌలు రైతులే. కోత కోసి ఆ రోజే అమ్మేస్తుంటారు. హరినాథ్ నెలకోసారి ధాన్యం మర పట్టించి కనీసం 6 కుటుంబాలకు నెల నెలా పంపుతూ ఉంటారు. కిలో బియ్యం రూ. వందకు అమ్ముతున్నారు. తాను నిర్ణయించిన ధరకు నేరుగా వినియోగదారులకు అమ్మటం వల్ల తనకు ఇతర రైతుల కన్నా అధికాదాయమే వస్తోందని హరినాథ్ తెలిపారు. నేలను బాగు చేసుకుంటూ ఇతరులకూ ఆరోగ్యదాయక ఆహారాన్ని అందిస్తున్నానన్న సంతృప్తితో చాలా ఆనందంగా ఉన్నానని ఆయన తెలిపారు.

సంపూర్ణ సంతృప్తి, సంతోషం!

ఉద్యోగ బాధ్యతల్లో అసంతృప్తి, పని ఒత్తిడితో ఏదో తెలియని వేదనకు గురయ్యాను. వారానికి 5 గంటలు నిద్రతో సరిపెట్టుకొని, పర్సనల్ పనులనూ మానుకొని, 3–4 నెలల పాటు పనిచేసి ప్రాజెక్టు పూర్తి చేసిన రోజులున్నాయి. డబ్బు వస్తుంది. కానీ, ఆ వత్తిడిమయ జీవితంలో సంతృప్తి, ఆనందం లేవు. గత 9 ఏళ్లుగా కుటుంబీకులతో ఉంటూ ప్రకృతి సేద్యం చేసే భాగ్యం కలిగింది. కుటుంబం అంతా మద్దతుగా నిలిచారు. రసాయనాల్లేకుండా వరి ధాన్యం తొలి ఏడాది 10 బస్తాల దిగుబడి తీయటం ఆశ్చర్యం కలిగించింది. ఇప్పుడు 25 బస్తాల దిగుబడినిచ్చే స్థాయికి పొలం సారవంతమైంది. ఈ ఏడాది జీవామృతం కూడా ఇవ్వలేదు. పూర్తి ప్రకృతి వ్యవసాయం అంటే ఇదే. రైతుగా మారి 6 కుటుంబాలకు ఏడాది పొడవునా ఆరోగ్యదాయకమైన ఆహారం అందిస్తున్నా. అనేక ఆరోగ్య సమస్యలు తగ్గాయని, షుగర్‌ను నియంత్రించటం సులువైందని వారు చెబుతుంటే సంతృప్తిగా ఉంది. సొంతూళ్లో ప్రకృతి సేద్యం సంపూర్ణంగా సంతృప్తిని, సంతోషాన్ని ఇస్తోంది.



చిన్న ట్రాక్టర్‌ను వినియోగిస్తున్న దృశ్యం

– మునిపల్లె హరినాథ్ (93805 16443).
మునిపల్లె, పొన్నూరు మండలం, గుంటూరు జిల్లా

గోదావరి ఇసుకలు, కట్టుయానం...

ప్రకృతి సేద్యానికి అనువైన దేశీ వరి రకాల సాగుపై హరినాథ్ దృష్టి కేంద్రీకరించారు. వ్యవసాయం చేసిన అనుభవం లేకపోయినా కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఒక్కో పని నేర్చుకుంటూ నిలదొక్కుకున్నారు. కాశీవిశ్వనాథ్ (130 రోజులు) అనే సన్న తెల్ల వరి రకాన్ని 8 ఏళ్ల పాటు వరుసగా సాగు చేశారు. బీపీటీ కన్నా సన్నని ఈ రకం ధాన్యాన్ని పూర్తిగా ప్రకృతి సేద్యంలో ఎకరానికి అత్యధికంగా 25 బస్తాల దిగుబడి పొందారు. ఈ ఏడాది నుంచి 1.25 ఎకరాల్లో గోదావరి ఇసుకలు (110 రోజులు) సాగు చేస్తున్నారు. ఇది తెల్ల, సన్న రకం. త్వరలో నూర్పిడి చేయనున్నారు. ఎకరానికి 20 బస్తాల దిగుబడి వస్తుందని భావిస్తున్నారు. మరో 1.25 ఎకరాల్లో కట్టుయానం (180 రోజులు) అనే రెడ్ రైస్‌ను సాగు చేస్తున్నారు. ఇది 15 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి రావచ్చని చెప్పారు.

– సయ్యద్ యాసిన్,
సాక్షి, పొన్నూరు, గుంటూరు జిల్లా

నిర్వహణ: పంతంగి రాంబాబు, సాగుబడి డెస్క్

• అద్భుత ఆవిష్కరణ

పండ్లు, కూరగాయలు 30 రోజులైనా పాడుకావు!

- నెల రోజులు తాజాగా ఉంచే పౌడర్ ప్యాకెట్లను రూపొందించిన ఉగాండా స్టార్టప్
- ఎఫ్ఎఓ ఇన్నోవేషన్ పురస్కార ప్రదానం







అభివృద్ధి చెందుతున్న దేశాల్లో చిన్న, సన్నకారు రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పండ్లు, కూరగాయలు వినియోగదారుల నోటికి చేరే లోగా దాదాపు 30–40 శాతం వరకు కుళ్లిపోతున్నాయని ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఎఓ) అంచనా. దుంపలైతే ఏకంగా 40–50% పాడవుతున్నాయి. కోత అనంతర రవాణా వ్యవస్థ, శీతల సదుపాయాలు లేకపోవటం పెద్ద సమస్య. ఈ సమస్యను సమర్థవంతంగా అధిగమించడానికి ఉపయోగపడే గొప్ప ఆవిష్కరణ వెలుగులోకి వచ్చింది. ఉగాండాకు చెందిన ఫ్రెజా నానోటెక్ లిమిటెడ్ అనే స్టార్టప్ సంస్థ సేంద్రియ పదార్థాలతో రూపొందించిన ఇన్‌స్టంట్ టీ బ్యాగ్ అంత సైజు ఉండే పౌడర్ ప్యాకెట్ కూరగాయలు, పండ్లను కుళ్లిపోకుండా నెల రోజుల వరకు రక్షించగలుగుతుంది. ఎటువంటి రిఫ్రిజిరేషన్ అవసరం లేకుండా, రసాయన రహితంగానే షెల్ఫ్ లైఫ్‌ను గణనీయంగా పెంచే ఈ ఆవిష్కరణ 'ఎఫ్ఎఓ ఇన్నోవేషన్ అవార్డు–2024'ను ఇటీవల దక్కించుకుంది.

శీతల గదుల్లో పెట్టని పండ్లు, కూరగాయలు మగ్గిపోయి కొద్ది రోజుల్లోనే కుళ్లియే ప్రక్రియ 'ఫాస్ఫోలిపేస్ డి' అనే ఎంజైమ్ కారణంగానే జరుగుతుంటుంది. ఫ్రెజా నానోటెక్ సంస్థ రూపొందించిన పౌడర్ ఈ ప్రక్రియను నెమ్మదింపజేయటం ద్వారా కూరగాయలు, పండ్లను దీర్ఘకాలం పాటు తాజాగా ఉంచుతుంది.

టీ బ్యాగ్ అంతటి చిన్న ప్యాకెట్ (దీని ధర రూ. 20)ను 5 కిలోల పండ్లు, కూరగాయల మధ్య ఉంచితే చాలు.. నెల రోజులైనా అవి కుళ్లిపోకుండా ఉంటాయని ఎఫ్ఎఓ తెలిపింది. పండ్లు, కూరగాయల ఉత్పత్తి మెరుగవుతుంది, పోషకాల లభ్యత పెరుగుతుంది, పర్యావరణ కాలుష్యం తగ్గుతుంది, జీవనోపాధులు మెరుదలపై ఈ ఆవిష్కరణ సానుకూల ప్రభావం చూపుతుందంటూ ఎఫ్ఎఓ డైరెక్టర్ జనరల్ క్యు డోంగ్యు ప్రశంసించారు. కోత అనంతర దశలో రైతులకు ఎదురయ్యే నష్టాలను ఇది తగ్గిస్తుంది. త్వరగా పాడుకావు కాబట్టి రిటైల్ వ్యవస్థలో జరిగే నష్టాల భారం తగ్గుతుంది. ఆవిధంగా వినియోగదారులపై కూడా భారం తగ్గుతుందని ఆయన అన్నారు.



పోరాడి ఓడిన శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టు

దేశవాళీ ఫుట్‌బాల్ లీగ్ ఐ–లీగ్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టుకు రెండో పరాజయం ఎదురైంది. ఢిల్లీ ఎఫ్‌సీతో సోమవారం డెక్కన్ ఎరీనాలో జరిగిన లీగ్ మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు 0–1 గోల్ తేడాతో ఓడిపోయింది. మ్యాచ్ 71వ నిమిషంలో స్టీఫెన్ సమీర్ బినోంగ్ చేసిన గోల్‌తో ఢిల్లీ జట్టు 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. ఆ తర్వాత చివరి నిమిషం వరకు ఈ ఆధిక్యాన్ని కాపాడుకున్న ఢిల్లీ జట్టు ఈ సీజన్‌లో తొలి విజయం నమోదు చేసుకుంది. మొత్తం 12 జట్లు పోటీపడుతున్న ఈ లీగ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు నాలుగు మ్యాచ్‌లు ఆడింది. రెండింటిలో గెలిచి, రెండింటిలో ఓడిపోయి ఆరు పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. ఈనెల 13న జరిగే తదుపరి మ్యాచ్‌లో డెంపో స్పోర్ట్స్ క్లబ్‌తో శ్రీనిధి జట్టు తలపడుతుంది. గత మూడు సీజన్‌లుగా ఐ–లీగ్‌లో ఆడుతున్న శ్రీనిధి డెక్కన్ జట్టు నిలకడగా రాణిస్తోంది. 2021–2022లో మూడో స్థానంలో, 2022–2023లో రెండో స్థానంలో, 2023–2024లోనూ రెండో స్థానంలో నిలిచింది.

దీపిక ‘హ్యాట్రిక్’


దీపిక

మస్కట్ (ఒమన్): జూనియర్ మహిళల ఆసియా కప్ హాకీ టోర్నమెంట్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు వరుసగా రెండో విజయం నమోదు చేసింది. మలేసియా జట్టుతో సోమవారం జరిగిన గ్రూప్ ‘ఎ’ రెండో లీగ్ మ్యాచ్‌లో జ్యోతి సింగ్ నేతృత్వంలోని భారత జట్టు 5–0 గోల్స్ తేడాతో ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ దీపిక మూడు గోల్స్‌తో ‘హ్యాట్రిక్’ నమోదు చేసింది. దీపిక 37వ, 39వ, 48వ నిమిషాల్లో గోల్స్ చేసింది. వైష్ణవి ఫాల్కే (32వ నిమిషంలో), కనిక సివాచ్ (38వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. మ్యాచ్ మొత్తంలో భారత జట్టుకు ఎనిమిది పెనాల్టీ కార్నర్‌లు... రెండు పెనాల్టీ స్ట్రోక్‌లు లభించాయి. ఇందులో మూడు పెనాల్టీ కార్నర్‌లను, ఒక పెనాల్టీ స్ట్రోక్‌ను భారత జట్టు గోల్స్‌గా మలిచింది. మిగతా ఐదు పెనాల్టీ కార్నర్‌లను, మరో పెనాల్టీ స్ట్రోక్‌ను భారత్ లక్ష్యానికి చేర్చి ఉంటే విజయం తేడా మరింత భారీగా ఉండేది. మరో మ్యాచ్‌లో దక్షిణ కొరియా 7–2 గోల్స్ తేడాతో చైనీస్ తైపీ జట్టును ఓడించింది. ఐదు జట్లున్న గ్రూప్ ‘ఎ’లో రెండేసి విజయాలు సాధించిన భారత్, చైనా జట్ల ఖాతాలో ఆరు పాయింట్ల చొప్పున ఉన్నాయి. అయితే చైనా చేసిన గోల్స్ (27) సంఖ్యకంటే భారత్ చేసిన గోల్స్ (17) తక్కువగా ఉండటంతో చైనా టాప్ ర్యాంక్‌లో, భారత్ రెండో ర్యాంక్‌లో ఉన్నాయి. బుధవారం జరిగే మూడో లీగ్ మ్యాచ్‌లో చైనాతో భారత్ తలపడుతుంది.

ఆంధ్ర అవుట్

ప్రిక్వార్టర్ ఫైనల్లో ఉత్తరప్రదేశ్ చేతిలో ఓటమి

- యూపీని గెలిపించిన రింకూ సింగ్, విప్‌రాజ్

బెంగళూరు: దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో ఆంధ్ర జట్టు కథ ముగిసింది. లీగ్ దశలో ఆడిన ఆరు మ్యాచ్‌ల్లో ఐదింట గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరుకున్న ఆంధ్ర ఈ అడ్డంకిని అధిగమించడంలో విఫలమైంది. చిన్నస్వామి స్టేడియంలో ఉత్తరప్రదేశ్ జట్టుతో సోమవారం జరిగిన రెండో ప్రిక్వార్టర్ ఫైనల్లో రికీ భుయ్ నాయకత్వంలోని ఆంధ్ర జట్టు నాలుగు వికెట్ల తేడాతో ఓడిపోయింది. ఆంధ్ర జట్టు నిర్దేశించిన 157 పరుగుల విజయలక్ష్యాన్ని ఉత్తరప్రదేశ్ (యూపీ) జట్టు 19 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. భారత స్టార్ రింకూ సింగ్ (22 బంతుల్లో 27 నాటౌట్; 3 ఫోర్లు, 1 సిక్స్), విప్‌రాజ్ నిగమ్ (8 బంతుల్లో 27 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) ధాటిగా ఆడి ఉత్తరప్రదేశ్ జట్టుకు విజయాన్ని అందించారు. ఒకదశలో ఉత్తరప్రదేశ్ జట్టు విజయానికి 24 బంతుల్లో 48 పరుగులు అవసరమయ్యాయి. ఆంధ్ర మీడియం పేసర్ కేవీ శశికాంత్ వేసిన ఇన్నింగ్స్ 17వ ఓవర్లో రింకూ, విప్‌రాజ్ 22 పరుగులు పిండుకోవడంతో ఫలితం యూపీ జట్టు వైపునకు మొగ్గింది. చివరి 3 ఓవర్లలో యూపీ విజయానికి 26 పరుగులు అవసరంకాగా... ఆ జట్టు 2 ఓవర్లలోనే 26 పరుగులు సాధించి విజయాన్ని ఖరారు చేసుకుంది. విప్‌రాజ్‌కు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ అవార్డు లభించింది. ఆంధ్ర బౌలర్లలో కొడవండ్ల సుదర్శన్ 22 పరుగులిచ్చి 3 వికెట్లు, త్రిపురాన విజయ్ 21 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టారు. మరో వికెట్ సత్యనారాయణ రాజుకు దక్కింది. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 156 పరుగులు సాధించింది. ఎస్‌డీఎన్‌వీ ప్రసాద్ (22 బంతుల్లో 34 నాటౌట్; 5 ఫోర్లు), కేవీ శశికాంత్ (8 బంతుల్లో 23 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) మెరిపించారు. శ్రీకర్ భరత్ (11 బంతుల్లో 4), అశ్విన్ హెబ్బర్ (11 బంతుల్లో 11; 1 ఫోర్, 1 సిక్స్), షేక్ రషీద్ (14 బంతుల్లో 18; 3 ఫోర్లు), పైలా అవినాశ్ (20 బంతుల్లో 19; 1 ఫోర్, 1 సిక్స్), రికీ భుయ్ (18 బంతుల్లో 23; 1 ఫోర్, 2 సిక్స్‌లు), త్రిపురాన విజయ్ (16 బంతుల్లో 16; 1 ఫోర్, 1 సిక్స్) క్రీజులో నిలదొక్కుకుంటున్న దశలో వెనుదిరిగారు. ఉత్తరప్రదేశ్ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్, విప్‌రాజ్ నిగమ్ 2 వికెట్ల చొప్పున తీయగా... మొహసిన్ ఖాన్, శివమ్ మావిలకు ఒక్కో వికెట్ లభించింది. అంతకుముందు జరిగిన తొలి ప్రిక్వార్టర్ ఫైనల్లో బెంగాల్ జట్టు మూడు పరుగుల తేడాతో చండీగఢ్‌పై గెలిచింది. బుధవారం జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో మధ్యప్రదేశ్‌తో సౌరాష్ట్ర; బరోడాతో బెంగాల్; ముంబైతో విదర్భ; ఢిల్లీతో ఉత్తరప్రదేశ్ తలపడతాయి.


సహచరుడు విప్‌రాజ్ నిగమ్‌తో రింకూ సింగ్ గెలుపు సంబరం... పక్కన ఆంధ్ర క్రికెటర్ అశ్విన్ హెబ్బర్

సిరాజ్ మ్యాచ్ ఫీజులో కోత

- ట్రవిస్ హెడ్‌కు డీమెరిట్ పాయింట్
- భారత్, ఆసీస్ క్రికెటర్ల అనుచిత ప్రవర్తనపై ఐసీసీ చర్యలు


హెడ్, సిరాజ్

అడిలైడ్: మైదానంలో భారత పేస్ బౌలర్ మొహమ్మద్ సిరాజ్, ఆస్ట్రేలియా స్టార్ బ్యాటర్ ట్రవిస్ హెడ్‌ల అనుచిత ప్రవర్తనపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) క్రమశిక్షణ చర్యలు తీసుకుంది. డే నైట్ రెండో టెస్టు సందర్భంగా ధాటిగా శతకం బాదిన హెడ్‌ను సిరాజ్ క్లీన్‌బౌల్డ్ చేశాడు. ప్రత్యర్థి బ్యాటర్ నిష్క్రమిస్తుంటే చేతిని అతనివైపు చూపిస్తూ ‘పో... పో...’ అని సంజ్ఞలు చేశాడు. దీనికి బదులుగా హెడ్ కూడా ఏదో పరుషంగా మాట అని పెవిలియన్ వైపు నడిచాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం ఇద్దరు ఆటగాళ్లను మ్యాచ్ రిఫరీ రంజన్ మదుగలె పిలిచి మాట్లాడారు. ఇద్దరు తమ తప్పును అంగీకరించడంతో తదుపరి విచారణేది లేకుండా ఐసీసీ శిక్షలు ఖరారు చేసింది. నోరు పారేసుకోవడం, దూషించడంతో ఐసీసీ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.5ను అతిక్రమించినట్లేనని ఇందుకు శిక్షగా మ్యాచ్ ఫీజులో 20 శాతం జరిమానా విధించింది. పరుషంగా మాట అని వెళ్లిపోయిన హెడ్ నియమావళిలోని 2.13 ఆర్టికల్‌ను అతిక్రమించాడని, దీంతో అతను జరిమానా నుంచి తప్పించుకున్నప్పటికీ... డీ మెరిట్ పాయింట్‌ను విధించింది. సిరాజ్‌కు జరిమానాతో పాటు ఒక డీ మెరిట్ పాయింట్‌ను విధించింది. వచ్చే 24 నెలల్లో ఇలాంటి ప్రవర్తనతో మళ్లీ డీ మెరిట్ పాయింట్లకు గురైతే మ్యాచ్ నిషేధం విధించే అవకాశాలుంటాయి. ఇదిలా ఉండగా ఆదివారం మ్యాచ్ ముగియగానే ఇద్దరు కరచాలనం చేసుకొని అభినందించుకున్నారు. మా మధ్య వివాదమేమీ లేదని చెప్పారు.

సిరాజ్...ఏమైనా పిచ్చిపట్టిందా?

సిరాజ్ ప్రవర్తనను భారత దిగ్గజాలు విమర్శిస్తున్నారు. ఇదివరకే గావస్కర్, రవిశాస్త్రిలాంటి వారు అలా సంజ్ఞలు చేయాల్సింది కాదని అన్నారు. తాజాగా కృష్ణమాచారి శ్రీకాంత్ ఘాటుగా విమర్శించారు. ‘హెడ్ మనతో ఓ ఆట ఆడుకున్నాడు. నిర్దాక్షిణ్యంగా బాదాడు. సిరాజ్ నీకేమైనా మతి చెడిందా? నువ్వేం చేశావో తెలుసా? నీ బౌలింగ్‌లో అతను అదేపనిగా దంచేశాడు. చకచకా 140 పరుగులు సాధించాడు. అతని ప్రదర్శనకు ప్రశంసించాల్సింది పోయి ఇలా చేస్తావా? ఒకవేళ నీవు అతన్ని డకౌట్ లేదంటే 10 పరుగుల లోపు అవుట్ చేస్తే సంబరాలు చేసుకోవాలి. కానీ నువ్వు అదరగొట్టిన ఆటగాడిపై దురుసుగా ప్రవర్తించావు’ అని శ్రీకాంత్ తీవ్రంగా విరుచుకుపడ్డారు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ–పేపర్‌లో

గుకేశ్‌కు చుక్కెదురు

12వ గేమ్‌లో తెల్ల పావులతో ఆడి డింగ్ లిరెన్ విజయం

- ప్రస్తుతం ఇద్దరూ 6–6తో సమం



సింగపూర్ సిటీ: ప్రపంచ చాంపియన్ స్థాయికి తగ్గట్టు ఆడిన చైనా గ్రాండ్‌మాస్టర్ డింగ్ లిరెన్... ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో పుంజుకున్నాడు. భారత గ్రాండ్‌మాస్టర్, 18 ఏళ్ల దొమ్మరాజు గుకేశ్‌తో సోమవారం జరిగిన 12వ రౌండ్ గేమ్‌లో తెల్ల పావులతో ఆడిన 32 ఏళ్ల డింగ్ లిరెన్ 39 ఎత్తుల్లో గెలుపొందాడు. తాజా విజయంతో డింగ్ లిరెన్, గుకేశ్ 6–6 పాయింట్లతో మళ్లీ సమఉజ్జీ అయ్యారు. ఆదివారం జరిగిన 11వ రౌండ్ గేమ్‌లో గుకేశ్ గెలుపొంది 6–5తో ఆధిక్యంలోకి వెళ్లాడు. మిగిలిన మూడు గేమ్‌లను గుకేశ్ ‘డ్రా’ చేసుకొని ఉంటే విశ్వనాథన్ ఆనంద్ తర్వాత క్లాసికల్ చెస్ ఫార్మాట్‌లో ప్రపంచ చాంపియన్ అయిన రెండో భారతీయ ప్లేయర్‌గా, ఈ ఘనత సాధించిన పిన్న వయస్కుడిగా గుర్తింపు లభించేది. నేడు విశ్రాంతి దినం. 13వ గేమ్ బుధవారం, 14వ గేమ్ గురువారం జరుగుతాయి. ఈ రెండు గేమ్‌లు కూడా ‘డ్రా’గా ముగిస్తే ఇద్దరూ 7–7తో సమంగా నిలుస్తారు. ఇలా జరిగితే విశ్వ విజేతను టైబ్రేక్ గేమ్‌ల ద్వారా నిర్ణయిస్తారు. రష్యా గ్రాండ్‌మాస్టర్ నిపోమ్‌నిషితో జరిగిన గత ప్రపంచ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో డింగ్ లిరెన్ ఏకంగా మూడుసార్లు వెనుకబడి ఆ తర్వాత పుంజుకొని వరల్డ్ చాంపియన్ అయ్యాడు. తొలిసారి ప్రపంచ చాంపియన్‌షిప్ మ్యాచ్ ఆడుతున్న గుకేశ్ ఒత్తిడిని అధిగమించి తదుపరి రెండు గేముల్లో ఒక విజయం, మరో ‘డ్రా’ చేసుకుంటే విశ్వవిజేత అవుతాడు. ‘ఓవరాల్‌గా ప్రస్తుతమున్న 6–6 స్కోరు సంతృప్తికరంగానే ఉంది. ఆదివారం రోజు ముగిశాక నేను ఆధిక్యంలో ఉన్నాక ఓడిపోవడం కాస్త నిరాశ కలిగిస్తోంది’ అని గుకేశ్ వ్యాఖ్యానించాడు. లిరెన్ ఇంగ్లిష్ ఓపెనింగ్‌తో గేమ్‌ను మొదలుపెట్టగా... గుకేశ్ బెనోని డిఫెన్స్‌తో బదులు ఇచ్చాడు. మిడిల్ గేమ్‌లో గుకేశ్ తడబడగా ... 15వ ఎత్తు తర్వాత లిరెన్ గేమ్‌ను శాసించే స్థితిలో నిలిచాడు. 39 ఎత్తులయ్యాక నెగ్గే పరిస్థితి లేదని తేలిపోవడంతో గుకేశ్ ఓటమి అంగీకరించాడు.

సినిమా

వీర ధీర శూరన్



విక్రమ్

విక్రమ్ హీరోగా రూపొందిన తాజా చిత్రం ‘వీర ధీర శూరన్ పార్ట్ 2’. ఎస్‌యు అరుణ్ కుమార్ దర్శకత్వం వహించారు. ఎస్‌జే సూర్య, సూరజ్ వెంజరమూడు, దుషారా విజయన్ ఇతర పాత్రల్లో నటించారు. హెచ్‌ఆర్ పిక్చర్స్‌పై రియా శిబు నిర్మించిన ఈ చిత్రం టీజర్‌ను సోమవారం విడుదల చేశారు. ‘‘వీర ధీర శూరన్ పార్ట్ 2’ చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ సినిమా నుంచి ఇప్పటికే రిలీజ్ చేసిన గ్లింప్స్ అందర్నీ ఆకట్టుకోవడంతో యూట్యూబ్‌లో 14 మిలియన్ల వ్యూస్ వచ్చాయి. తాజాగా విడుదల చేసిన టీజర్‌లో విక్రమ్ నటన, యాక్షన్ సీక్వెన్సులు, విజువల్స్, నేపథ్య సంగీతం వంటివి అభిమానుల అంచనాలను మించిపోయాయి. విక్రమ్ డిఫరెంట్ లుక్స్, యాక్టింగ్, పోలీస్ ఆఫీసర్‌గా ఎస్‌జే సూర్య పెర్ఫామెన్స్ ఆడియన్స్‌ని ఆకట్టుకుంటాయి. ఈ జనవరిలో తమిళ, తెలుగు, హిందీ భాషల్లో ఈ సినిమాని విడుదల చేస్తాం’’ అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకి కెమెరా: తేని ఈశ్వర్, సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్.

ఆ బూచోడు ఎవరు?



వేదిక

హీరోయిన్ వేదిక లీడ్ రోల్‌లో నటించిన చిత్రం ‘ఫియర్’. డా. హరిత గోగినేని దర్శకత్వంలో డా. వంకి పెంచలయ్య, ఏఆర్ అభి నిర్మించిన ఈ సస్పెన్స్ థ్రిల్లర్ మూవీలో అరవింద్ కృష్ణ ఓ ప్రత్యేక పాత్ర చేశారు. ఈ నెల 14న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ను నటుడు మాధవన్ సోషల్ మీడియా ద్వారా షేర్ చేసి, ‘‘ట్రైలర్ చాలా థ్రిల్లింగ్‌గా ఉంది’’ అన్నారు. సింధును బాల్యం నుంచి వెంటాడుతున్న బూచోడు ఎవరు? ఆమెను ఎందుకు భయపెడుతున్నాడు? అనే అంశాలతో ట్రైలర్ సాగుతుంది. ట్రైలర్ చివరలో వేదిక ద్విపాత్రాభినయంలో కనిపించారు. ‘‘ఇప్పటికే మా సినిమా పలు అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్లో 70కి పైగా అవార్డులు అందుకుంది. ప్రేక్షకులనూ ఆకట్టుకుంటుందనే నమ్మకం ఉంది’’ అని చిత్రబృందం పేర్కొంది.

అస్సలు పడను


రష్మికా మందన్నా

‘ఇదేదో పికప్ లైన్ అయితే కాదుగా... అస్సలు పడను ’ అంటున్నారు హీరోయిన్ రష్మికా మందన్నా. రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో రష్మికా మందన్నా, దీక్షిత్ శెట్టి జంటగా నటించిన చిత్రం ‘ది గర్ల్ ఫ్రెండ్’. అల్లు అరవింద్ సమర్పణలో గీతా ఆర్ట్స్, మాస్ మూవీ మేకర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్స్‌పై ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం టీజర్‌ని హీరో విజయ్ దేవరకొండ రిలీజ్ చేశారు. ‘నయనం నయనం కలిసే తరుణం, ఎదనం పరుగే పెరిగే వేగం...’ అంటూ విజయ్ దేవరకొండ మాటలతో ప్రారంభమైంది ఈ టీజర్. ‘ఇదేదో పికప్ లైన్ అయితే కాదుగా... అస్సలు పడను ’ అంటూ రష్మిక చెప్పే డైలాగ్‌తో టీజర్ ముగుస్తుంది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ– ‘‘ది గర్ల్ ఫ్రెండ్’ టీజర్‌లోని ప్రతి విజువల్ ఆకట్టుకుంది. ఎనిమిదేళ్ల క్రితం రష్మికను సెట్‌లో కలిశా. తను ఎన్నో గొప్ప విజయాలు సాధిస్తున్నా వ్యక్తిగతంగా ఇప్పటికీ అంతే వినయంతో ఉంది. నటిగా ఆమెకు ‘ది గర్ల్ ఫ్రెండ్’ మరింత బాధ్యతను ఇచ్చింది. ఆ బాధ్యతని తను విజయవంతంగా నిర్వర్తిస్తుందని ఆశిస్తున్నాను. ఈ సినిమాని చూసేందుకు వేచి చేస్తున్నా. ప్రతి ప్రేక్షకుడిని కదిలించే మంచి కథను ఈ సినిమాలో రాహుల్ చూపిస్తాడని నమ్ముతున్నాను’’ అని చెప్పారు.

రికార్డుల్లో అస్సలు తగ్గేదే లే



అల్లు అర్జున్

- నాలుగు రోజుల్లో రూ. 829 కోట్ల వసూళ్లు

పుష్పరాజ్ అస్సలు తగ్గడం లేదు. వసూళ్ల విషయంలో అస్సలు తగ్గేదే లే అంటూ సరికొత్త రికార్డులు నెలకొల్పారు. నాలుగు రోజుల్లోనే ‘పుష్ప 2: ది రూల్’ ప్రపంచవ్యాప్తంగా రూ. 829 కోట్ల వసూళ్లు సాధించి, సరికొత్త రికార్డు సృష్టించినట్లు మేకర్స్ ప్రకటించారు. అల్లు అర్జున్, రష్మికా మందన్నా జంటగా నటించిన చిత్రం ‘పుష్ప 2: ది రూల్’. సుకుమార్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో శ్రీలీల ఓ పాటలో అలరించారు. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి మైత్రీ మూవీ మేకర్స్‌పై యలమంచిలి రవిశంకర్, నవీన్ ఎర్నేని నిర్మించిన ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా 6 భాషల్లో ఈ నెల 5న విడుదలైంది. ‘‘బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లతో రికార్డుల మోత మోగిస్తున్నాడు పుష్పరాజ్. ఈ చిత్రం ప్రీమియర్స్ నుంచే సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ టాక్ అందుకుంది. అల్లు అర్జున్ నట విశ్వరూపం, సుకుమార్ వరల్డ్ క్లాస్ టేకింగ్‌కి ప్రపంచ సినీ ప్రేమికులు ఫిదా అయిపోయారు. ఇక విడుదలైన నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 829 కోట్లు వసూలు చేసిన తొలి భారతీయ చిత్రంగా సరికొత్త అధ్యాయాన్ని, భారతీయ చిత్ర పరిశ్రమ చరిత్రలో ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది’’ అని మేకర్స్ తెలిపారు. ‘‘పుష్ప 2’ బాలీవుడ్‌లో జైత్రయాత్రను కొనసాగిస్తోంది. నాలుగో రోజైన ఆదివారం రూ. 86 కోట్లు వసూలు చేసి సరికొత్త సంచలనానికి తెరలేపింది. ఇప్పటివరకు ఏ హిందీ చిత్రం కూడా ఒక్క రోజులో 86 కోట్ల నెట్‌ను సాధించలేదు. హిందీలో నాలుగు రోజులకుగానూ రూ. 291 కోట్లు కలెక్ట్ చేసిన తొలి చిత్రంగా నిలిచింది. ఒక రికార్డు ప్రకటించేలోపే మరో కొత్త రికార్డును ‘పుష్ప 2’ సాధిస్తుండటం యావత్ భారతీయ సినీ పరిశ్రమను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తోంది. రష్మికా మందన్నా నటన, దేవిశ్రీ ప్రసాద్ సంగీతం, కూబా ఫొటోగ్రఫీ మా సినిమాకు అదనపు ఆకర్షణలు. ఈ చిత్రం సాధించిన, సాధిస్తున్న వసూళ్లతో అల్లు అర్జున్ ఇండియా నంబర్ వన్ హీరోగా అందరూ కొనియాడుతున్నారు. సుకుమార్ కూడా భారత దేశం గర్వించదగ్గ దర్శకుడిగా టాప్ పొజిషన్‌లో ఉన్నారు’’ అని కూడా చిత్రయూనిట్ పేర్కొంది.

అల్లు అర్జున్‌కు అమితాబ్ ప్రశంస

‘పుష్ప–2’లో అద్భుతమైన నటన కనబరచిన అల్లు అర్జున్‌ని పలువురు బాలీవుడ్ ప్రముఖులు సైతం అభినందిస్తున్నారు. అలాగే ‘పుష్ప 2’ సాధిస్తున్న విజయంపైనా స్పందిస్తున్నారు. తాజాగా బిగ్ బి అమితాబ్ బచ్చన్ ట్విట్టర్ వేదికగా అల్లు అర్జున్‌పై ప్రశంసలు కురిపించారు. ఇటీవల ‘పుష్ప 2’ ప్రమోషన్స్‌లో పాల్గొన్న అల్లు అర్జున్‌కి ‘మిమ్మల్ని ఎక్కువగా ఇన్‌స్పైర్ చేసిన నటుడు ఎవరు? అనే ప్రశ్న యాంకర్ నుంచి ఎదురైంది. ఇందుకు అల్లు అర్జున్ స్పందిస్తూ– ‘‘అమితాబ్ బచ్చన్‌గారు. ఆయన సినిమాలు చూస్తూ పెరిగాను. అందుకే ఆయనంటే ఎంతో ఇష్టం’’ అని చెప్పారు. వైరల్‌గా మారిన ఈ వీడియోపై ట్విట్టర్ వేదికగా స్పందించారు అమితాబ్ బచ్చన్. ‘‘అల్లు అర్జున్... మీ మాటలు నా హృదయానికి చేరాయి. మీరు నా అర్హతకు మించిన కితాబులు ఇచ్చారు. మేమందరం మీ నటన, ప్రతిభకి అభిమానులం. మీరు మమ్మల్ని ఇంకా ఇన్‌స్పైర్ చేయాలి. ఇలానే విజయాలు సాధిస్తుండాలని ఆ దేవుణ్ని కోరుకుంటున్నాను’’ అంటూ పోస్ట్ చేశారు. అమితాబ్ బచ్చన్ పోస్ట్‌కి అల్లు అర్జున్ స్పందిస్తూ– ‘‘అమితాబ్‌గారూ... మీరు సూపర్ హీరో. మీరు నా గురించి ఇలా మాట్లాడటం ఆనందంగా ఉంది. మీ హృదయం నుండి వచ్చిన ఈ ప్రశంసలను ఎప్పటికీ గుర్తుంచుకుంటాను. మీ మంచి మనసుకు నా కృతజ్ఞతలు’’ అంటూ పోస్ట్ చేశారు.

ఎన్టీఆర్... ఏఎన్నార్ చేయాల్సిన పాత్రని చేశా!

\- రాజేంద్రప్రసాద్



‘‘సినిమా ఇండస్ట్రీలో నాది 48 ఏళ్ల జీవితం. ఇంత కాలం కొనసాగడం సాధారణ విషయం కాదు. నటుడిగా నాకు ఇప్పటికీ ‘హరికథ’ లాంటి గొప్ప కథలు రావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఇందులో ఎన్టీఆర్, ఏఎన్నార్ వంటి వారు చేయాల్సిన పాత్ర నాకు దక్కడం సంతోషంగా ఉంది. ఈ సిరీస్‌లో హరికథలు చెబుతూ హరి నామస్మరణ చేసే రంగాచారి పాత్రలో కనిపిస్తాను’’ అని నటుడు రాజేంద్రప్రసాద్ తెలిపారు. శ్రీరామ్, రాజేంద్రప్రసాద్, దివి, పూజిత పొన్నాడ, మౌనికా రెడ్డి, అర్జున్ అంబటి, రుచిర సాధినేని, శ్రియా కొట్టం, ఉషా శ్రీ కీలక పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ ‘హరికథ’. మ్యాగీ దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్ నిర్మించిన ఈ సిరీస్ డిస్నీ ప్లస్ హాట్‌స్టార్‌లో ఈ నెల 13 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ‘హరికథ’ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ– ‘‘ఈ రోజు సినిమా అనేది థియేటర్ నుంచి ఇంటికి వచ్చేసింది. అలాంటప్పుడు కథ బలంగా ఉండాలి. అలాంటి కథని ‘హరికథ’లో చూపిస్తున్నాం’’ అన్నారు.

గర్ల్ ఫ్రెండ్ ఇంట్లో నవ్వులు


సత్య, అంకిత్, శ్రీహర్ష

అంకిత్ కొయ్య, శ్రియా కొంతం జంటగా నటించిన చిత్రం ‘14 డేస్ గర్ల్ ఫ్రెండ్స్ ఇంట్లో’. శ్రీ హర్ష దర్శకత్వంలో సత్య నిర్మించారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ప్రెస్ మీట్‌లో నిర్మాత సత్య మాట్లాడుతూ– ‘‘కొత్త కంటెంట్‌ను టాలీవుడ్‌కు ఇవ్వాలనుకుని టీ హబ్‌లో మా ప్రొడక్షన్ కంపెనీని స్టార్ట్ చేశాం. మా ‘14 డేస్ గర్ల్ ఫ్రెండ్స్ ఇంట్లో’ సున్నితమైన సందేశం ఇస్తూనే ఆద్యంతం నవ్వించేలా ఉంటుంది’’ అన్నారు. ‘‘అమృతం’ సీరియల్‌ను ఎంత ఎంజాయ్ చేశారో మా సినిమాని కూడా అంతే ఎంజాయ్ చేస్తారు. తన గర్ల్ ఫ్రెండ్ ఇంటికి వెళ్లిన హర్ష డోర్ లాక్ అవడంతో ఇంట్లోనే పద్నాలుగు రోజులు ఉండిపోతాడు. అప్పుడు ఎలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయి? అనేది కథ. ఆద్యంతం నవ్వుకునేలా ఉంటుంది’’ అన్నారు అంకిత్ కొయ్య. ‘‘కొత్తవాళ్లంతా కలిసి చేసిన ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి’’ అన్నారు శ్రీ హర్ష. ‘‘ఈ చిత్రంలో అంకిత్, ‘వెన్నెల’ కిశోర్‌గారి ట్రాక్ బాగుంటుంది. త్వరలోనే సినిమాని విడుదల చేయనున్నాం’’ అని చిత్ర సహ నిర్మాత నాగు చెప్పారు.

వాస్తవ ఘటనలతో...


ఐశ్వర్య శర్మ, ధర్మ

ధర్మ, ఐశ్వర్య శర్మ జంటగా నటించిన చిత్రం ‘డ్రింకర్ సాయి’. ‘బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్’ అనేది ట్యాగ్ లైన్. బసవరాజు శ్రీనివాస్, ఇస్మాయిల్ షేక్, బసవ రాజు లహరీధర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 27న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఇస్మాయిల్ షేక్ మాట్లాడుతూ– ‘‘డ్రింకర్ సాయి’ వంటి మంచి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాం... అందరి ఆదరణ కావాలి’’ అన్నారు. ‘‘ఫ్యామిలీ ఆడియన్స్‌తో పాటు యూత్‌కు బాగా నచ్చే సినిమా ఇది’’ అని లహరీధర్ చెప్పారు. కిరణ్ తిరుమలశెట్టి మాట్లాడుతూ– ‘‘కొన్ని వాస్తవ ఘటనల ఆధారంగా ఈ మూవీ తీశాను. యువతరం ప్రేక్షకులను థియేటర్స్‌కు రప్పించేందుకు కొంత యూత్‌ఫుల్ కంటెంట్ పెట్టాల్సి వచ్చింది’’ అని తెలిపారు. ‘‘మా మూవీ ట్రైలర్ చూసి కొంతమంది నన్ను తిడుతున్నారు. కానీ, సినిమా చూస్తే ఒక్కరు కూడా తిట్టరు’’ అన్నారు ధర్మ. ‘‘నేను ముంబై నుంచి వచ్చాను. ఈ మూవీలో అవకాశం ఇచ్చిన డైరెక్టర్, ప్రొడ్యూసర్స్‌కి థ్యాంక్స్’’ అని ఐశ్వర్య శర్మ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కెమెరామేన్ ప్రశాంత్ అంకిరెడ్డి, నటి కిర్రాక్ సీత, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ లక్ష్మి మాట్లాడారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
10-12-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
201	59
81,508	24,619

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	19,766	▽	94
డోజోన్స్	44,591	▽	51
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,352	△	43
డాక్స్	20,354	▽	31
షాంఘై	3,403	▽	2
నికాయ్	39,161	△	69

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	76,692
బంగారం (99.5 స్వచ్ఛత)	76,385
వెండి (కిలో)	91,800

ఫారెక్స్ రేట్లు రూ.లలో

		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	84.09	85.26
£	బ్రిటన్ పౌండ్	105.70	108.52
€	యూరో	88.11	90.71
¥	జపాన్ ఎన్ (100)	55.56	56.99
AUS$	ఆస్ట్రేలియా డాలర్	53.98	56.21
S$	సింగపూర్ డాలర్	60.58	65.30
SAR	సౌదీ రియాల్	21.63	23.19
UAE D	యూఏఈ దిర్హామ్	22.11	23.89
¥	చైనా యువాన్	10.79	12.61

ఎల్ఐసీ 'బీమా సఖి యోజన'

- మహిళలకు ఉపాధి అవకాశం
- మూడేళ్లపాటు స్టైపెండ్‌తో శిక్షణ



పానిపట్: జీవిత బీమా దిగ్గజం ఎల్ఐసీ మహిళా సాధికారత లక్ష్యంతో 'బీమా సఖి యోజన' పథకాన్ని తీసుకొచ్చింది. ప్రధాని నరేంద్ర మోదీ పానిపట్‌లో దీన్ని ప్రారంభించారు. వచ్చే 12 నెలల్లో లక్ష మంది బీమా సఖులను నియమించుకోనున్నట్టు ఎల్ఐసీ ఎండీ, సీఈవో సిద్ధార్థ మహంతి ప్రకటించారు. మహిళల నమోదుకుగాను రూ.840 కోట్లను ఖర్చు చేయనున్నట్టు చెప్పారు. తాము చేసే ఖర్చుకు ఐదు రెట్ల వ్యాపారం (రూ.4,000 కోట్లు) బీమా సఖి ద్వారా వస్తుందన్నారు.

పథకం వివరాలు..

పదో తరగతి విద్యార్హత కలిగి, 18 నుంచి 70 ఏళ్లలోపు వయసు కలిగిన మహిళలు బీమా సఖి యోజన పథకంలో చేరొచ్చు. మూడేళ్లపాటు ఆర్థిక అంశాలు, బీమాపై శిక్షణ ఇస్తారు. తొలి ఏడాది ప్రతి నెలా రూ.7,000, రెండో ఏడాది ప్రతి నెలా రూ.6,000, మూడో ఏడాది ప్రతి నెలా రూ.5,000 చొప్పున స్టైపెండ్ కూడా అందుతుంది. శిక్షణ అనంతరం ఎల్ఐసీ ఏజెంట్‌గా పనిచేయవచ్చు. ఎల్ఐసీ ఏజెంట్లు, ఎల్ఐసీ ఉద్యోగుల బంధువులకు అర్హత లేదు. అలాగే రిటైర్డ్ ఉద్యోగులు కూడా అనర్హులే.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

10-12-2024

విశాఖ	615-00
చిత్తూరు	633-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	625-00
విజయవాడ	625-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	620-00
వరంగల్	622-00
రిటైల్ ధర	6.80

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఈ వారమంతా ఐపీవోల సందడి..
600 ఫాస్ట్ ఈవీ ఛార్జింగ్ స్టేషన్ల ఏర్పాటులో హుండాయ్

ఆర్‌బీఐ కొత్త గవర్నర్ సంజయ్ మల్హోత్రా

26వ గవర్నర్‌గా నియామకం ● బుధవారం బాధ్యతల స్వీకారం ● నేడు శక్తికాంతదాస్ పదవీ విరమణ




న్యూఢిల్లీ: బ్యాంకింగ్ రెగ్యులేటర్ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) 26వ గవర్నర్‌గా రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రాను ప్రభుత్వం నియమించింది. ఆయన పేరును కేబినెట్ నియామకాల కమిటీ ఖరారు చేసింది. బుధవారం మల్హోత్రా బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయన పదవీ కాలం మూడేళ్లు. ప్రస్తుత గవర్నర్ శక్తికాంతదాస్ మంగళవారం పదవీ విరమణ చేస్తారు.

అపార అనుభవం...

56 సంవత్సరాల మల్హోత్రా కాన్పూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) నుండి కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ పట్టభద్రుడయ్యారు. అమెరికాలోని ప్రిన్స్‌టన్ విశ్వ విద్యాలయం నుంచి పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ పట్టా పొందారు. 1990 బ్యాచ్ రాజస్తాన్ కేడర్ ఐఏఎస్ అధికారిగా ఎంపికయ్యారు. 33 సంవత్సరాలకు పైగా తన కెరీర్‌లో విద్యుత్, ఫైనాన్స్, పన్నులు, సమాచార సాంకేతికత, గనులుసహా పలు రంగాలలో కీలక బాధ్యతలు నిర్వహించారు. ప్రస్తుతం ఆర్థిక మంత్రిత్వ శాఖలో కార్యదర్శి (రెవెన్యూ)గా కీలక బాధ్యతల్లో ఉన్నారు. ఇంతక్రితం ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక సేవల విభాగంలో కార్యదర్శిగా పనిచేశారు. రాష్ట్రంతో పాటు కేంద్ర ప్రభుత్వ స్థాయిలలో ఆర్థిక, పన్నుల విషయంలో ఆయనకు విస్తృత అనుభవం ఉంది. ప్రత్యక్ష, పరోక్ష పన్నుల విధాన రూపకల్పనలో అయన కీలక పాత్ర పోషిస్తున్నారు.

సమన్వయానికి మారుపేరు...



ఉర్జిత్ పటేల్ ఆకస్మిక నిష్క్రమణ తర్వాత 2018 డిసెంబర్ 12న దాస్ ఆర్‌బీఐ 25వ గవర్నర్‌గా నియమితులయ్యారు. మూడేళ్ల పదవీకాలం పూర్తయిన తర్వాత ఆయన పదవీ కాలాన్ని మరో మూడేళ్లు కేంద్రం పొడిగించింది. ఈ పొడిగించిన పదవీ కాలం మంగళవారంతో ముగియనుంది. సెంట్రల్ బ్యాంక్ వద్ద మిగులు నిధుల బదిలీ సమస్యపై ఆర్‌బీఐ- ప్రభుత్వానికి మధ్య సంఘర్షణ నేపథ్యంలోనే పటేల్ ఆకస్మిక రాజీనామా చోటుచేసుకుందన్న వార్తలు అప్పట్లో వెలువడ్డాయి. ఉర్జిత్ రాజీనామా నేపథ్యంలో అనిశ్చితిని ఎదుర్కొన్న మార్కెట్‌కు తిరిగి విశ్వాసాన్ని అందించిన వ్యక్తిగా శక్తికాంతదాస్ నిలిచారు. పలు క్లిష్ట సందర్భాల్లో కేంద్రం-ఆర్‌బీఐ మధ్య చక్కటి సమన్వయం సాధించడంలో ఆయన విజయం సాధించారు. ద్రవ్యోల్బణం కట్టడే లక్ష్యంగా పనిచేశారు.

ప్రభుత్వ బ్యాంకులు, ఎఫ్‌ఎంసీజీ షేర్లలో అమ్మకాలు



ముంబై: ఎఫ్‌ఎంసీజీ, ప్రభుత్వ బ్యాంకుల షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో స్టాక్ సూచీలు సోమవారం నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ 201 పాయింట్లు నష్టపోయి 81,508 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 59 పాయింట్లు పతనమై 24,619 వద్ద నిలిచింది. బలహీన అంతర్జాతీయ సంకేతాలు, అధిక వెయిటేజీ హెచ్‌యూఎల్(-3%), యాక్సిస్ బ్యాంక్(-2%), రిలయన్స్ ఇండస్ట్రీస్(-1%) షేర్ల పతనం సెంటిమెంట్‌పై ఒత్తిడి పెంచాయి. ఉదయం స్వల్ప నష్టాలతో మొదలైన సూచీలు రోజంతా తీవ్ర ఒడిదుడుకులకు లోనవుతూ పరిమిత శ్రేణిలో కదలాడాయి. సెన్సెక్స్ 81,783 – 81,411 పరిధిలో ట్రేడైంది. నిఫ్టీ 24,580 వద్ద కనిష్టాన్ని, 24,705 వద్ద గరిష్టాన్ని తాకాయి. క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రియల్, సర్వీసెస్, టెలికమ్యూనికేషన్, కన్జూమర్ డ్యూరబుల్స్, మెటల్స్, ఐటీ, విద్యుత్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు 0.46%, 0.32 శాతం చొప్పున లాభపడ్డాయి.


జీవితకాల కనిష్టానికి రూపాయి



డాలర్ మారకంలో రూపాయి విలువ 20 పైసలు క్షీణించి తాజా జీవితకాల కనిష్టం 84.86 స్థాయి వద్ద ముగిసింది.ఉదయం ఫారెక్స్ మార్కెట్లో 84.70 వద్ద మొదలైంది. భౌగోళిక ఉద్రిక్త పరిస్థితులు, దేశీయ ఈక్విటీ మార్కెట్ బలహీన ట్రేడింగ్, దిగుమతిదారులు, విదేశీ బ్యాంకుల నుంచి డాలర్లకు డిమాండ్ కొనసాగడం మన కరెన్సీ కోతకు కారణమైనట్లు ఫారెక్స్ నిపుణులు తెలిపారు.

రెండున్నర నెలల్లో 800 కోట్ల స్పామ్ కాల్స్

- 80 కోట్ల స్పామ్ మెసేజ్‌లు
- ఏఐ సాఫ్ట్‌వేర్‌తో గుర్తించిన ఎయిర్‌టెల్
- అత్యధిక స్పామ్ కాల్స్ జాబితాలో రెండో స్థానంలో ఆంధ్రప్రదేశ్



న్యూఢిల్లీ: స్పామ్ కాల్స్‌ను కట్టడి చేసే దిశగా టెలికం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ గణనీయంగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించింది. కృత్రిమ మేధా (ఏఐ) ఆధారిత సొల్యూషన్‌ను ప్రవేశపెట్టిన రెండున్నర నెలల వ్యవధిలో ఏకంగా 800 కోట్ల స్పామ్ కాల్స్‌ను, 80 కోట్ల మెసేజీలను గుర్తించినట్లు తెలిపింది. అలాగే ప్రతీ రోజుదాదాపు పది లక్షల మంది స్పామర్లను గుర్తిస్తున్నట్లు వివరించింది. తమ నెట్‌వర్క్‌కు సంబంధించి మొత్తం కాల్స్‌లో ఆరు శాతం, మొత్తం ఎస్ఎంఎస్‌లలో రెండు శాతం స్పామ్ ఉంటున్నట్లు కంపెనీ పేర్కొంది. ఢిల్లీ వాసులకు అత్యధికంగా ఇలాంటి కాల్స్ వస్తున్నాయి. అలాగే అత్యధిక కాల్స్ కూడా అక్కడి నుంచే జనరేట్ అవుతున్నాయి. పెద్ద ఎత్తున ఇలాంటి కాల్స్‌ను అందుకుంటున్న కస్టమర్లకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉండగా, పశ్చిమ ఉత్తర్ ప్రదేశ్ తర్వాత స్థానంలో ఉంది.

ఈ రెండున్నర నెలల్లో సందేహాస్పద కాల్స్, ఎస్ఎంఎస్‌ల గురించి దాదాపు 25.2 కోట్ల మందిని అప్రమత్తం చేశామని, దీంతో వాటికి స్పందించే వారి సంఖ్య సుమారు 12 శాతం తగ్గిందని ఎయిర్‌టెల్ వివరించింది. స్పామర్లలో అత్యధికంగా 35 శాతం మంది ల్యాండ్‌లైన్ ఫోన్లను ఉపయోగిస్తున్నారని గుర్తించినట్లు పేర్కొంది. అలాగే, పురుష కస్టమర్లే లక్ష్యంగా 76 శాతం కాల్స్ ఉంటున్నాయని వివరించింది. లావాదేవీలు, సర్వీస్‌కి సంబంధించిన కాల్స్ చేసేందుకు బ్యాంకులు, మ్యూచువల్ ఫండ్స్, బీమా కంపెనీలు, స్టాక్‌బ్రోకర్లు, ఇతర ఆర్థిక సంస్థలు, కార్పొరేట్లు, ఎస్ఎంఈలకు ప్రభుత్వం 160 సిరీస్‌తో ప్రారంభమయ్యే 10 అంకెల నంబర్లను కేటాయించినట్లు వివరించింది. డు-నాట్-డిస్టర్బ్‌ని (డీఎన్‌డీ) ఎంచుకోని వారికి, ప్రమోషనల్ కాల్స్‌ను అందుకునేందుకు అంగీకరించిన వారికి యథాప్రకారం 140 సిరీస్‌తో ప్రారంభమయ్యే 10 అంకెల నంబర్ల నుంచే కాల్స్ వస్తాయని పేర్కొంది.

మిగతా వివరాల్లోకి వెళ్తే..

- ఢిల్లీ, ముంబై, కర్ణాటక అత్యధికంగా స్పామ్ కాల్స్ జనరేట్ అవుతున్న ప్రాంతాల్లో వరుసగా టాప్ 3లో ఉన్నాయి. ఎస్ఎంఎస్‌లపరంగా (టెక్స్ట్ మెసేజీలు) గుజరాత్, కోల్‌కతా, ఉత్తర్ ప్రదేశ్‌లు ఈ స్థానాల్లో ఉన్నాయి.
- 36-60 ఏళ్ల వయసు గల కస్టమర్లు లక్ష్యంగా 48 శాతం కాల్స్ ఉంటున్నాయి. 26 శాతం కాల్స్‌తో 26-35 ఏళ్ల వారు రెండో స్థానంలో ఉన్నారు. సీనియర్ సిటిజన్లకు ఎనిమిది శాతం స్పామ్ కాల్స్ మాత్రమే వచ్చాయి.
- స్పామ్ కాల్స్ ఉదయం 9 గంటలకు మొదలవుతున్నాయి. తర్వాత ఉధృతి క్రమంగా పెరుగుతూ మధ్యాహ్నం 3 గం.ల సమయానికి తారాస్థాయికి చేరుతుంది. మొత్తం స్పామ్ కాల్స్‌లో 22 శాతం కాల్స్.. రూ. 15,000-20,000 ధర శ్రేణిలోని మొబైల్స్ కలిగిన కస్టమర్లు లక్ష్యంగా ఉంటున్నాయి.
- పనిదినాల్లోనూ, వారాంతాల్లోనూ వచ్చే కాల్స్ పరిమాణంలో వ్యత్యాసం ఉంటోంది. ఆదివారాలు ఇలాంటి కాల్స్ ఏకంగా 40 శాతం తగ్గుతున్నాయి.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ మెడికల్ సర్వీస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్‌లో 97 పోస్టులు

గుంటూరు జిల్లా మంగళగిరిలో ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డ్(ఏపీఎంఎస్ఆర్‌బీ).. రెగ్యులర్ ప్రాతిపదికన సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ /సివిల్ అసిస్టెంట్ సర్జన్(జనరల్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 97. **వేతనం:** నెలకు రూ.61,960 నుంచి రూ.1,51,370.
» **విభాగాల వారీగా ఖాళీలు:** గైనకాలజీ–21, అనెస్తీషియా–10, పీడియాట్రిక్స్–06, జనరల్ మెడిసిన్–12, జనరల్ సర్జరీ–19, ఆర్థోపెడిక్స్–02, ఆప్తల్మాలజీ–05, రేడియాలజీ–04, పాథాలజీ–03, ఈఎన్‌టీ–05, డెర్మటాలజీ–02, ఫోరెన్సిక్ మెడిసిన్–02, సైకియాట్రి–02, సివిల్ అసిస్టెంట్ సర్జన్(జనరల్)–04.
» **అర్హత:**డిప్లొమా/డిగ్రీ/ఎంబీబీఎస్/పీజీ/డీఎన్‌బీ ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 13.12.2024 నాటికి ఓసీ అభ్యర్థులకు 42 ఏళ్లు, ఈడబ్ల్యూఎస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ వారికి 47 ఏళ్లు, దివ్యాంగులకు 52 ఏళ్లు, ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు 50 ఏళ్లు
» **ఎంపిక విధానం:**విద్యార్హతలు,మెరిట్ లిస్ట్, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 13.12.2024
» **వెబ్‌సైట్:** https://hmfw.ap.gov.in

నిట్ వరంగల్‌లో 56 నాన్ టీచింగ్ పోస్టులు

వరంగల్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(నిట్) డైరెక్ట్/డిప్యూటేషన్ ప్రాతిపదికన నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 56.
» **పోస్టుల వివరాలు:** గ్రూప్–ఎ: ప్రిన్సిపల్ సైంటిఫిక్/టెక్నికల్ ఆఫీసర్–03, ప్రిన్సిపల్ స్టూడెంట్స్ యాక్టివిటీ అండ్ స్పోర్ట్స్ ఆఫీసర్(ఎస్ఎఎస్)–01, డిప్యూటీ రిజిస్ట్రార్–01, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్–01, అసిస్టెంట్ రిజిస్ట్రార్–01. గ్రూప్–బి: అసిస్టెంట్ ఇంజనీర్–03, సూపరింటెండెంట్–05, జూనియర్ ఇంజనీర్–03, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్–01, స్టూడెంట్స్ యాక్టివిటీ అండ్ స్పోర్ట్స్ అసిస్టెంట్(ఎస్ఎఎస్)–01. గ్రూప్–సి: సీనియర్ అసిస్టెంట్–08, జూనియర్ అసిస్టెంట్–05, ఆఫీస్ అటెండెంట్–10, ల్యాబ్ అసిస్టెంట్–13.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్, ఎంఎస్సీ, ఎంసీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్‌దరఖాస్తులకు చివరితేది:**07.01.2025
» **వెబ్‌సైట్:** https://careers.nitw.ac.in

ఫ్యాషన్ కెరీర్‌కు కేరాఫ్.. నిఫ్ట్

ఫ్యాషన్ డిజైనింగ్ రంగంలో కెరీర్‌కు అవసరమైన నైపుణ్యాలు అందించే ఉన్నత వేదికలు.. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ(నిఫ్ట్) క్యాంపస్‌లు! వీటిల్లో అందుబాటులో ఉన్న బ్యాచిలర్, పీజీ కోర్సులు పూర్తి చేసుకుంటే.. క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో లక్షల వేతనంతో ఆఫర్లు దక్కించుకునే అవకాశముంది! నిఫ్ట్ క్యాంపస్‌ల్లో ప్రవేశం పొందేందుకు జాతీయ స్థాయిలో నిర్వహించే ఎంపిక ప్రక్రియలో.. ప్రతిభ చూపాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో.. నిఫ్ట్ 2025 నోటిఫికేషన్ వివరాలు, అందించే కోర్సులు, ప్రవేశ ప్రక్రియ, కెరీర్ అవకాశాలు తదితర సమాచారం..

» 2025 నిఫ్ట్ ఎంట్రన్స్ నోటిఫికేషన్ విడుదల
» బ్యాచిలర్, మాస్టర్ స్థాయిలో పలు ఫ్యాషన్ కోర్సులు
» నిఫ్ట్ అడ్మిషన్ టెస్ట్‌లో ప్రతిభ ఆధారంగా ప్రవేశాలు
» దేశ వ్యాప్తంగా 19 నిఫ్ట్ క్యాంపస్‌లలో 4,837 సీట్లు



ఫ్యాషన్ టెక్నాలజీకి సంబంధించి ఆధునిక నైపుణ్యాలు అందించే ఉద్దేశంతో కేంద్ర టెక్స్‌టైల్ శాఖ నిఫ్ట్ క్యాంపస్‌లను ఏర్పాటు చేసింది. ఫ్యాషన్ రంగానికి సంబంధించి ప్రొడక్షన్, డిజైన్ తదితర విభాగాల్లో.. ఈ ఇన్‌స్టిట్యూట్స్ పలు కోర్సులు అందిస్తున్నాయి. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 19 నిఫ్ట్ క్యాంపస్‌లు ఉన్నాయి. వీటిలో బ్యాచిలర్, మాస్టర్ స్థాయి కోర్సులకు సంబంధించి 4,837 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రవేశాల కోసం ప్రతి ఏటా నిఫ్ట్–అడ్మిషన్ టెస్ట్ పేరిట ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

బ్యాచిలర్ కోర్సులివే

- నిఫ్ట్ క్యాంపస్‌ల్లో బ్యాచిలర్ స్థాయిలో ఏడు కోర్సులు, పీజీ స్థాయిలో మూడు ఉన్నాయి. బ్యాచిలర్ స్థాయిలో బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ పేరుతో అందుబాటులో ఉన్న కోర్సుల వివరాలు.. యాక్సరీ డిజైన్; ఫ్యాషన్ కమ్యూనికేషన్; బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ డిజైన్; ఫ్యాషన్ ఇంటీరియర్; నిట్‌వేర్ డిజైన్; లెదర్ డిజైన్; టెక్స్‌టైల్ డిజైన్; బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ–అపెరల్ ప్రొడక్షన్.
- నిఫ్ట్ అందిస్తున్న ప్రోగ్రామ్‌లలో ప్రత్యేకమైనది.. బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ. ఫ్యాషన్ విభాగంలో టెక్నికల్ నైపుణ్యాలను అందించే ప్రత్యేక కోర్సు ఇది.
- పీజీ స్థాయిలో మాస్టర్ ఆఫ్ డిజైన్, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ స్పెషలైజేషన్లు అందుబాటులో ఉన్నాయి.

అర్హతలు

- **బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సులు:** ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- **బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ:** ఎంపీసీ గ్రూప్‌తో ఇంటర్మీడియెట్ లేదా గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్ నుంచి మూడేళ్ల డిప్లొమా ఉత్తీర్ణత ఉండాలి.
- **మాస్టర్ ఆఫ్ డిజైన్, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ కమ్యూనికేషన్:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత లేదా నిఫ్ట్ లేదా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజైన్ నుంచి అండర్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
- **మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ:** నిఫ్ట్ నుంచి బి.ఎఫ్.టెక్ ఉత్తీర్ణులు లేదా ఏఐసీటీఈ గుర్తింపు పొందిన ఇన్‌స్టిట్యూట్ నుంచి బీటెక్ ఉత్తీర్ణులు.

వయసు

2025 ఆగస్ట్ 1 నాటికి 24 సంవత్సరాలలోపు ఉండాలి. పీజీ ప్రోగ్రామ్‌లకు ఎలాంటి గరిష్ఠ వయో పరిమితి లేదు. ఆయా కోర్సుల చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

నిఫ్ట్–అడ్మిషన్ ప్రక్రియను మూడు దశల్లో నిర్వహిస్తారు. తొలి దశలో క్రియేటివ్ ఎబిలిటీ టెస్ట్ (సీఏటీ), జనరల్ ఎబిలిటీ టెస్ట్(జీఏటీ)ను నిర్వహిస్తారు. ఆ తర్వాత దశలో సిట్యుయేషన్ టెస్ట్ ఉంటుంది. చివరగా పర్సనల్ ఇంటర్వ్యూ/గ్రూప్ డిస్కషన్‌లు నిర్వహించి వాటిలో విజయం సాధిస్తే సీటు ఖరారు చేస్తారు.

తొలిదశ జీఏటీ

- తొలిదశలో జీఏటీ(జనరల్ ఎబిలిటీ టెస్ట్)ని బ్యాచిలర్, పీజీ కోర్సుల అభ్యర్థులకు నిర్వహిస్తారు. పరీక్ష ప్రశ్నల క్లిష్టత స్థాయి మాస్టర్ కోర్సుల్లో కొంత ఎక్కువగా ఉంటుంది. బీడిజైన్ జీఏటీ 100 ప్రశ్నలకు రెండు గంటల వ్యవధిలో జరుగుతుంది. అదేవిధంగా ఎండిజైన్ జీఏటీ 120 ప్రశ్నలకు రెండు గంటల వ్యవధిలో నిర్వహిస్తారు.
- జీఏటీలోనూ పలు విభాగాల నుంచి నిర్దిష్ట సంఖ్యలో ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు క్వాంటిటేటివ్ ఎబిలిటీ, కమ్యూనికేషన్ ఎబిలిటీ, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్, అనలిటికల్ ఎబిలిటీ,జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్‌కు సంబంధించిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది.

ఫ్యాషన్ టెక్నాలజీ.. ప్రత్యేకంగా

- బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ, మాస్టర్ ఫ్యాషన్ టెక్నాలజీ, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్ కోర్సులకు తొలి దశ ప్రవేశ పరీక్ష జీఏటీ ప్రత్యేకంగా నిర్వహిస్తారు. మూడు గంటల వ్యవధిలో నిర్వహించే ఈ పరీక్షలో క్వాంటిటేటివ్ ఎబిలిటీ, కమ్యూనికేషన్ ఎబిలిటీ అండ్ ఇంగ్లిష్ కాంప్రహెన్షన్, అనలిటికల్ అండ్ లాజికల్ ఎబిలిటీ విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. వీటితో పాటు ఒక కేస్ స్టడీ కూడా ఉంటుంది. మొత్తంగా ఈ పరీక్ష బి.ఎఫ్‌టెక్, ఎం.ఎఫ్‌టెక్‌లకు సంబంధించి 100 ప్రశ్నలు ఉంటాయి. బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీకి సంబంధించి జీఏటీని సెక్షన్–ఎ, సెక్షన్–బిలుగా నిర్వహిస్తారు.
- సెక్షన్–ఎలో కమ్యూనికేషన్ ఎబిలిటీ అండ్ ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ (40 ప్రశ్నలు), క్వాంటిటేటివ్ ఎబిలిటీ (20 ప్రశ్నలు), అనలిటికల్ అండ్ లాజికల్ ఎబిలిటీ (15 ప్రశ్నలు), జీకే అండ్ కరెంట్ అఫైర్స్(25 ప్రశ్నలు) ఉంటాయి.
- సెక్షన్–బిలో క్వాంటిటేటివ్ ఎబిలిటీ (15 ప్రశ్నలు), అనలిటికల్ అండ్ లాజికల్ ఎబిలిటీ (15 ప్రశ్నలు), కేస్ స్టడీ (20 ప్రశ్నలు) ఉంటాయి.
- మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీకి సంబంధించి. కమ్యూనికేషన్ ఎబిలిటీ అండ్ ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ (45 ప్రశ్నలు), కేస్ స్టడీ (25ప్రశ్నలు), క్వాంటిటేటివ్ ఎబిలిటీ (30 ప్రశ్నలు), అనలిటికల్ అండ్ లాజికల్ ఎబిలిటీ (25 ప్రశ్నలు), జీకే అండ్ కరెంట్ అఫైర్స్ (25 ప్రశ్నలు) విభాగాల నుంచి ప్రశ్నలు ఉంటాయి.
- మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్ కోర్సుకు మాత్రం కమ్యూనికేషన్ ఎబిలిటీ అండ్ ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ విభాగంలో 50 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ ఎబిలిటీ విభాగంలో 20 ప్రశ్నలు, అనలిటికల్ అండ్ లాజికల్ ఎబిలిటీలో 25 ప్రశ్నలు, జీకే అండ్ కరెంట్ అఫైర్స్‌లో 25 ప్రశ్నలు, కేస్ స్టడీ విభాగంలో 30 ప్రశ్నలు చొప్పున అడుగుతారు.

రెండో దశ సీఏటీ

మొదటి దశలో చూపిన ప్రతిభ ఆధారంగా రెండో దశలో క్రియేటివ్ ఎబిలిటీ టెస్ట్ (సీఏటీ) నిర్వహిస్తారు. అభ్యర్థుల్లోని పరిశీలనాత్మక నైపుణ్యం, సృజనాత్మకత, డిజైన్ సామర్థ్యాలను పరీక్షించే విధంగా ఈ పరీక్ష ఉంటుంది.

మూడో దశ సిట్యుయేషన్ టెస్ట్

రెండు దశల్లోనూ చూపిన ప్రతిభను ప్రామాణికంగా తీసుకుని చివరిగా సిట్యుయేషన్ టెస్ట్ నిర్వహిస్తారు. బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ అభ్యర్థులు తమలోని సృజనాత్మక ప్రతిభను చూపే విధంగా ఈ పరీక్ష ఉంటుంది. అభ్యర్థులకు నిర్దీత మెటీరియల్ అందించి ఏదైనా ఆకృతిని రూపొందించమని లేదా ఏదైనా ఒక సందర్భాన్ని పేర్కొని దానికి తగినట్లుగా ఊహా చిత్రం గీయమని అడుగుతారు.

చివరగా.. జీడీ, ఇంటర్వ్యూ

జీఏటీ, సీఏటీలలో విజయం సాధించిన అభ్యర్థులకు చివరగా గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. భావ వ్యక్తీకరణ సామర్థ్యం, ఒక అంశంపై స్పష్టత, పరిజ్ఞానం, ఆలోచన సామర్థ్యాలను పరీక్షించే విధంగా గ్రూప్ డిస్కషన్స్ ఉంటాయి. పర్సనల్ ఇంటర్వ్యూ పూర్తిగా ఫ్యాషన్ కెరీర్ పట్ల అభ్యర్థికున్న ఆసక్తి, దానికి సరితూగే తత్వాలను గ్రహించే విధంగా ఉంటుంది.

వెయిటేజీ విధానం

- తుది ఫలితాలు విడుదల చేసే క్రమంలో వెయిటేజీ విధానాన్ని అనుసరిస్తారు.
- బ్యాచిలర్ ఆఫ్ డిజైన్ కోర్సులకు సీఏటీకి 50 శాతం, జీఏటీకి 30 శాతం, సిట్యుయేషన్ టెస్ట్‌కు 20 శాతం వెయిటేజీ ఉంటుంది.
- బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సుల్లో జీఏటీ సెక్షన్–ఎకు 70 శాతం, జీఏటీ సెక్షన్–బికు 30 శాతం వెయిటేజీ ఇస్తారు.
- మాస్టర్ ఆఫ్ డిజైన్ కోర్సుకు సీఏటీకి 40 శాతం, జీఏటీకి 30 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకు 30 శాతం వెయిటేజీ కల్పిస్తారు.
- మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో జీఏటీకి 70 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకు 30 శాతం వెయిటేజీ ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2025 జనవరి 6
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** 2025, జనవరి 10 నుంచి 12 వరకు
- **ఆన్‌లైన్ ఎంట్రన్స్ టెస్ట్ తేదీ:** 2025, ఫిబ్రవరి 9
- **వివరాలకు వెబ్‌సైట్:** https://exams.nta.ac.in/NIFT

బెస్ట్ స్కోర్‌కు మార్గమిదే

క్వాంటిటేటివ్ ఎబిలిటీ

మ్యాథమెటిక్స్, అర్థమెటిక్స్ అంశాలపై పట్టు సాధించాలి. వర్క్ అండ్ టాస్క్, శాతాలు, నిష్పత్తులు, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ వర్క్ సంబంధించిన అంశాలు బాగా ప్రాక్టీస్ చేయాలి.

కమ్యూనికేషన్ ఎబిలిటీ, ఇంగ్లిష్

ఇంగ్లిష్ భాషలో ప్రాథమిక నైపుణ్యాన్ని పరీక్షించే విధంగా ప్రశ్నలు అడుగుతారు. కాబట్టి బేసిక్ గ్రామర్ అంశాలపై అవగాహన పెంచుకోవాలి.

అనలిటికల్ అండ్ లాజికల్ ఎబిలిటీ

విశ్లేషణ సామర్థ్యాన్ని, తార్కిక నైపుణ్యాన్ని పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. నిర్దిష్టంగా ఒక అంశంలో ఇమిడున్న ప్రధాన అంశాలు, వాటికి సంబంధించి అప్లికేషన్ అప్రోచ్‌తో ప్రాక్టీస్ చేయాలి.

జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నలు హైస్కూల్ స్థాయి సోషల్ సబ్జెక్ట్ నుంచి ఉంటాయి. అదే విధంగా ముఖ్యమైన తేదీలు – సందర్భాలు వంటివి కూడా అడుగుతారు. కాబట్టి అభ్యర్థులు తాజాగా జరిగిన ముఖ్యమైన సంఘటనలు సైతం తెలుసుకోవాలి.

కేస్ స్టడీ

బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ, మాస్టర్ ఆఫ్ ఫ్యాషన్ మేనేజ్‌మెంట్ కోర్సు అభ్యర్థులకు నిర్వహించే కేస్ స్టడీ.. ఒక వాస్తవ సమస్యను ఇచ్చి దానికి పరిష్కారం అడిగేలా ఉంటుంది. అభ్యర్థులకు అన్వయ దృక్పథం, సమస్యను గుర్తించే లక్షణం అవసరం.

వాన రాకడ.. ప్రాణం పోకడ తెలియదనేది సామెత. కానీ విజ్ఞానం అభివృద్ధి చెందిన తర్వాత వర్షాలు ఎప్పుడు వస్తాయో ముందే తెలుసుకుంటున్నాం. మరి అదే తరహాలో మృత్యువు ఎప్పుడు ముంచుకొస్తుందో తెలుసుకోగలిగితే.. డెత్ డే ఫలానా రోజు అని ముందే అవగతమైతే ఎలా ఉంటుంది? మరణం ఎప్పుడో తెలిసిపోతే ఆ భయంతోనే సగం చచ్చిపోతాం బాబోయ్ అని అనుకునేవాళ్ల కోసం కాకుండా.. మన జీవితంలో ఆ రోజు ఎప్పుడో తెలుసుకుందాం అనే ఔత్సాహికుల కోసం ఓ వినూత్న యాప్ అందుబాటులోకి వచ్చింది. అన్నీ ముందుగానే అంచనా వేస్తున్నాం.. మరణాన్నీ ముందే తెలుసుకోలేమా అనే ఆలోచనతో బ్రెంట్ ఫ్రాన్సన్ అనే డెవలపర్ 'డెత్ క్లాక్' పేరుతో ఈ యాప్‌ను అభివృద్ధి చేశారు. అలా అని.. దీనికి దివ్యమైన శక్తులేమీ లేవు. అది అడిగే ప్రశ్నలకు ఇచ్చే సమాధానాల ఆధారంగా సదరు వ్యక్తి ఎప్పుడు చనిపోతాడో కచ్చితంగా అంచనా వేసి చెబుతుంది అంతే. ఇందులో కృత్రిమ మేధ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) కీలకపాత్ర పోషిస్తుంది. దాదాపు 1,200 మంది ఆయుర్దాయాలపై వివిధ కోణాల్లో అధ్యయనం జరిపి దీన్ని రూపొందించారు. ఈ ఏడాది జూలైలో డెత్ క్లాక్ అందుబాటులోకి రాగా.. మూడు నెలల్లోనే 1.25 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకుని తమ చివరిరోజు గురించి తెలుసుకున్నారు.



మృత్యువు ఎప్పుడో ముందే చెబుతుంది



ఇది ఎలా పని చేస్తుందంటే ?

డెత్ క్లాక్ యాప్‌లో వయసు, లింగం, జాతి వంటి ప్రాథమిక సమాచారంతోపాటు కుటుంబ చరిత్ర, మానసిక ఆరోగ్యం, దీర్ఘకాలిక వ్యాధుల గురించి సమాధానాలు నమోదు చేయాలి. అలాగే రోజువారీ జీవనశైలి, వ్యాయామం, ధూమపానం, మద్యం అలవాట్ల గురించి అడిగే ప్రశ్నలకు జవాబివ్వాలి. ఆహారపు అలవాట్లతో పాటు నిద్రశైలి గురించీ వివరించాలి. అప్పుడు ఆ యాప్.. ఆయా వివరాల ఆధారంగా అధునాతన అల్గారిథమ్‌ల సాయంతో మరణం ఎప్పుడు సంభవిస్తుందనే విషయాన్ని కచ్చితంగా నిర్ధారించి చెబుతుందన్న మాట. ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే.. ఎంత కచ్చితమైన వివరాలు నమోదు చేస్తే, అంత కచ్చితమైన ఫలితం వస్తుంది.

దీనివల్ల ఏం ఉపయోగం ?

రేపు ఏదైనా అపాయం జరుగుతుందని ముందు తెలుసుకుంటే దాని నుంచి ఎలా తప్పించుకోవాలో ఆలోచించుకోవచ్చు.. ఆ మేరకు జాగ్రత్తలు తీసుకోవచ్చు. అలాగే మృత్యువు ఫలానారోజు పలకరిస్తుందని ముందే తెలిస్తే.. జాగ్రత్తపడే అవకాశం ఉంటుంది కదా అనేది ఈ యాప్ రూపకర్తల వాదన. డెత్ డేట్‌ను చెప్పడమే కాదు.. ఆయుర్దాయం పెంచుకునేందుకు అవసరమైన సలహాలు, సూచనలు కూడా ఈ యాప్ ఇస్తుంది. ఆరోగ్యకరమైన బరువు ఉండేలా చూసుకోవడం, ధూమపానం, మద్యపానం మానేయడం, సమతుల ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, నిద్రకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి టిప్స్ చెబుతుంది. వాటిని పాటించడం ద్వారా డెత్‌డేట్‌ను పొడిగించుకోవచ్చన్న మాట. కాగా, ఆరోగ్య స్పృహ ఉన్నవారు, ఆర్థిక ప్రణాళికదారులు డెత్ క్లాక్‌పై ఎక్కువ శ్రద్ధ చూపిస్తున్నారు. తమ చివరి తేదీని బట్టి చేయాల్సిన పనులు పక్కాగా ప్లాన్ చేసుకోవడానికి ఇది ఉపకరిస్తుందనే భావన వారిలో ఉండటమే ఇందుకు కారణం. మీకూ ఈ భావన ఉంటే ఓసారి ట్రై చేయండి. పోయేదేముంది? మహా అయితే 40 డాలర్లు (దాదాపు రూ. 3,400). ఎందుకంటారా? ఈ యాప్‌లోని అన్ని ఫీచర్లూ పని చేయాలంటే అంత మొత్తం వెచ్చించక తప్పదు మరి.

- సాక్షి సెంట్రల్ డెస్క్

యథావిధిగా గ్రూప్-2



పరీక్షలను వాయిదా వేయలేమని తేల్చిచెప్పిన హైకోర్టు

- ఏర్పాట్లన్నీ పూర్తయినందున స్టే ఇవ్వలేమని స్పష్టీకరణ
- ఆర్ఆర్‌బీ పరీక్షల దృష్ట్యా గ్రూప్-2 వాయిదా కోరుతూ పలువురి పిటిషన్
- తదుపరి విచారణ ఫిబ్రవరి 6కు వాయిదా

సాక్షి, హైదరాబాద్: ఈ నెల 15, 16 తేదీల్లో జరగనున్న గ్రూప్-2 పరీక్షలను వాయిదా వేయలేమని హైకోర్టు తేల్చిచెప్పింది. ఇప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తయినందున స్టే ఇవ్వడం సరికాదని అభిప్రాయపడింది. యథావిధిగా పరీక్షలు నిర్వహించుకోవచ్చని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌కు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఫిబ్రవరి 6కు వాయిదా వేసింది. ఈ నెల 16, 18 తేదీల్లో జరగనున్న రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డు (ఆర్ఆర్‌బీ) పరీక్షల దృష్ట్యా 16న జరగనున్న గ్రూప్-2 పేపర్-3, పేపర్-4 పరీక్షలను వాయిదా వేయాలని కోరుతూ జయశంకర్ భూపాలపల్లి జిల్లా దంపిల్లపల్లికి చెందిన రావుల జ్యోతితోపాటు మరో 21 మంది హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ అంశంపై కమిషన్‌కు నవంబర్ 25నే వినతిపత్రం సమర్పించినా ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో కోర్టుకెక్కారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ పుల్ల కార్తీక్ సోమవారం విచారణ చేపట్టారు. టీజీపీఎస్సీ తరఫు న్యాయవాది వాదిస్తూ 15, 16న జరగనున్న గ్రూప్-2 పరీక్షలకు దాదాపు 5.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని.. ఇప్పటికే పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని చెప్పారు. స్టే కోరుతున్న వారి కోసం పరీక్షలను వాయిదా వేస్తే లక్షల మంది ఇబ్బందిపడతారని నివేదించారు. ఈ వాదనలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. ఈ దశలో గ్రూప్-2 పరీక్షను నిలిపేయలేమని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ జీఏడీ ముఖ్య కార్యదర్శి, టీజీపీఎస్సీ, రైల్వే రిక్రూట్‌మెంట్ బోర్డుకు నోటీసులు జారీ చేశారు.

గ్రూప్-2 హాల్‌టికెట్లు విడుదల

గ్రూప్-2 పరీక్షల కోసం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సోమవారం హాల్‌టికెట్లను విడుదల చేసింది. కమిషన్ వెబ్‌సైట్‌లో వాటిని అభ్యర్థులకు అందుబాటులో ఉంచింది. అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కమిషన్ కార్యదర్శి ఇ.నవీన్ నికోలస్ సూచించారు. హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌లో ఏవైనా సమస్యలుంటే వాటిని పరిష్కరించేందుకు జిల్లాలవారీగా హెల్ప్‌లైన్ నంబర్లను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం అభ్యర్థులు టీజీపీఎస్సీ హెల్ప్‌లైన్ నంబర్లు 040-22445566/ 23542185/23542187కు కాల్ చేసి లేదా helpdesk@tspsc.gov.inకు ఈ-మెయిల్ చేయాలని సూచించారు. తొలిరోజే లక్ష మందికిపైగా అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు.

మహిళల కోసం రెండు బొగ్గు గనులు

అన్ని విధులు వారికే కేటాయించేలా త్వరలోనే నిర్ణయం: సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి



సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో మహిళా ఉద్యోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో అన్ని విభాగాల్లో వారిని నియమించి, ప్రత్యేకంగా వారి కోసమే రెండు బొగ్గు గనులు కేటాయించే ఆలోచన చేస్తున్నట్లు డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) వెంకటేశ్వరరెడ్డి వెల్లడించారు. కొత్తగూడెంలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. డిపెండెంట్ ఉద్యోగాల్లో ఇప్పటి వరకు సుమారు 800 మంది మహిళలు చేరగా, వారిని కార్యాలయాలకే పరిమితం చేయకుండా, యంత్రాలపై శిక్షణ ఇప్పించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తాజాగా జరిగిన ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్‌లోనూ నియమితులైన మహిళా అధికారులు గనుల్లో విధులు నిర్వర్తించేలా, రెండు గనుల్లో పూర్తిగా వారినే నియమించేలా బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో నిర్ణయం తీసుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు. హెవీ వెహికల్ లైసెన్స్ ఉన్న మహిళా ఉద్యోగులకు ఓసీల్లో డంపర్ ఆపరేటర్లుగా శిక్షణ ఇస్తామని వెల్లడించారు.

వర్షాలతో బొగ్గు ఉత్పత్తిలో వెనుకంజ

ఈ ఆర్థిక సంవత్సరంలో 35 రోజులపాటు ఎడతెరిపి లేని వర్షాలు కురవడంతో గడిచిన 8 మాసాల్లో సుమారు మూడు మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి తగ్గిందని డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. దీనిని పూడ్చుకొని, లక్ష్యాన్ని చేరుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.

చెన్నమనేని జర్మనీ పౌరుడే

మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ భారత పౌరసత్వం రద్దు సబబేనన్న హైకోర్టు

- కేంద్ర హోంశాఖ ఇచ్చిన నోటిఫికేషన్ సమర్థనీయమేనని స్పష్టీకరణ
- తప్పుడు పత్రాలతో అధికారులను, కోర్టును రమేశ్ తప్పుదోవ పట్టించారని ఆగ్రహం
- దీనికి మూల్యంగా నెలలోగా రూ. 30 లక్షల జరిమానా కట్టాలని ఆదేశం
- ఐదేళ్ల సుదీర్ఘ విచారణ అనంతరం చెన్నమనేని పిటిషన్‌ను కొట్టేస్తూ తీర్పు

సాక్షి, హైదరాబాద్: వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ జర్మనీ పౌరుడేనని హైకోర్టు తేల్చిచెప్పింది. భారత పౌరసత్వాన్ని రద్దు చేస్తూ కేంద్ర హోంశాఖ 2019లో జారీ చేసిన నోటిఫికేషన్‌ను సమర్థించింది. తప్పుడు పత్రాలతో గత 15 ఏళ్లుగా న్యాయస్థానాన్ని, అధికారులను తప్పుదోవ పట్టించారని ఆయనపై ఆగ్రహం వ్యక్తం చేసింది. జర్మనీ పౌరుడినని తెలిసినా పలు పిటిషన్లు దాఖలు చేసి కోర్టు సమయాన్ని వృథా చేశారని మండిపడింది. ఇందుకుగాను ఆయనకు హైకోర్టు చరిత్రలోనే తొలిసారిగా ఏకంగా రూ. 30 లక్షల భారీ జరిమానా విధించింది. ఇందులో ఆది శ్రీనివాస్ (ప్రస్తుత వేములవాడ ఎమ్మెల్యే, గత ఎన్నికల్లో రమేశ్ ప్రత్యర్థి)కు రూ. 25 లక్షలు, హైకోర్టు లీగల్ సర్వీసెస్ కమిటీకి రూ. 5 లక్షలు చెల్లించాలని రమేశ్‌ను ఆదేశించింది. చెల్లింపునకు నెల రోజులు గడువు విధించింది. 2009లో తొలిసారి వేములవాడ నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించింది మొదలు చెన్నమనేని భారతీయ పౌరుడా కాదా అనే వివాదం కొనసాగుతోంది. ఆయన రాజకీయ ప్రత్యర్థి ఆది శ్రీనివాస్ దీనిపై తొలి నుంచీ న్యాయపోరాటం చేస్తున్నారు. ఈ క్రమంలోనే జర్మనీ పౌరసత్వం కారణంగా రమేశ్ భారత పౌరసత్వాన్ని రద్దు చేస్తూ కేంద్ర హోంశాఖ 2019 నవంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసింది. దీన్ని సవాల్ చేస్తూ అదే సంవత్సరం ఆయన హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై ఐదేళ్లపాటు సాగిన విచారణ అనంతరం న్యాయమూర్తి జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి అక్టోబర్‌లో తీర్పు రిజర్వు చేసి సోమవారం తీర్పు వెలువరించారు.

ఆయన ఎన్నిక కూడా చెల్లదన్న ఆది శ్రీనివాస్

చెన్నమనేని ఇరుదేశాల పౌరసత్వాన్ని కలిగి ఉన్నారని అదనపు సొలిసిటర్ జనరల్ నరసింహ శర్మ, డిప్యూటీ సొలిసిటర్ జనరల్ గాడి ప్రవీణ్‌కుమార్ వాదించారు. 'రెండుచోట్ల వివిధ కేటగిరీల కింద పౌరసత్వం కలిగి ఉండటాన్ని మన చట్టాలు అనుమతించవు. విదేశీ పౌరసత్వం కలిగిన భారతీయుడు ఎన్నటికీ ఇక్కడ ఎమ్మెల్యే కాలేరు. తన పౌరసత్వ సమస్య 2009 నుంచి పెండింగ్‌లో ఉన్నా చెన్నమనేని రమేశ్ రెండు పౌరసత్వాలలో ఒకదాన్ని వదులుకోలేదు' అని వారు గుర్తుచేశారు. చెన్నమనేని రమేశ్ క్లెయిమ్ చేస్తున్న రెండు విభిన్న రకాల పౌరసత్వాలకు సంబంధించిన ఆధారాలు, పత్రాలను న్యాయమూర్తికి సమర్పించారు. రమేశ్ పౌరసత్వాన్ని కొనసాగించడం 'ప్రజాప్రయోజనాలకు అనుకూలం కాదు' అని కేంద్రం ఇచ్చిన నోటిఫికేషన్‌ను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను ఉదహరించారు. మరోవైపు ఆది శ్రీనివాస్ తరఫు న్యాయవాది రవికిరణ్‌రావు వాదిస్తూ 'ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా కార్డుతో చెన్నమనేని రమేశ్ జర్మనీకి అనేకసార్లు వెళ్లారు. జర్మనీ పౌరసత్వంతోనే ఎన్నికల్లో పోటీ చేశారు. ఆ ఎన్నిక కూడా చెల్లదు' అని పేర్కొన్నారు.

ఆ అధికారం కేంద్రానికి లేదని వాదించిన రమేశ్

మరోవైపు చెన్నమనేని రమేశ్ తరఫున న్యాయవాది రామారావు వాదిస్తూ 'చెన్నమనేని జర్మనీ పౌరసత్వాన్ని వదులుకున్నారు. జర్మనీ పాస్‌పోర్టుతో ప్రయాణించినంత మాత్రాన ఆ దేశ పౌరసత్వం ఉన్నట్లు కాదు. దేశ సార్వభౌమత్వానికి విఘాతం కలిగించిన వారి పౌరసత్వాన్ని రద్దు చేసే అధికారం కేంద్రానికి ఉంది. కానీ రమేశ్ అలాంటి చర్యలకు పాల్పడలేదు. ఆయన చేసిన సేవా కార్యక్రమాలను పరిగణనలోకి తీసుకోవాలి. చెన్నమనేని రమేశ్ పౌరసత్వ రద్దు నోటిఫికేషన్‌ను కొట్టేయాలి' అని కోరారు.

అప్పీల్‌కు వెళ్లడాన్ని పరిశీలిస్తా: చెన్నమనేని



హైకోర్టు తీర్పు తీవ్ర నిరాశపరిచిందని చెన్నమనేని రమేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. రాజకీయ జీవితంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా మిత్రులు, శ్రేయోభిలాషుల సహకారంతో ముందుకు నడిచానని.. నాలుగుసార్లు ఎన్నికల్లో గెలిచానని గుర్తుచేశారు. వరుస ఓటములను జీర్ణించుకోలేక రాజకీయ ప్రత్యర్థులు తన పౌరసత్వంపై కేసులు వేశారని చెన్నమనేని ఆరోపించారు. ఇలాంటి కేసులను గతంలోనే హైకోర్టు, సుప్రీంకోర్టులో విజయవంతంగా ఎదుర్కొన్నానని.. తాజా తీర్పుపై అప్పీల్ చేసే అంశాన్ని పరిశీలిస్తానన్నారు. ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉన్నప్పటికీ వేములవాడ అభివృద్ధికి సహకరిస్తూనే ఉంటానని పేర్కొన్నారు.

చిన్న కుటుంబాల్లోనే కలహాలు ఎక్కువ



70% గృహహింస కేసులు ఈ కుటుంబాల్లోనే..

వివాహం జరిగిన ఐదేళ్లలోపే 42 శాతం జంటల్లో మనస్పర్థలు

సీడీఈడబ్ల్యూ కౌన్సెలింగ్ సెంటర్ల ద్వారా గృహహింస కేసుల పరిష్కారానికి కౌన్సెలింగ్ ఇస్తున్నాం : మహిళా భద్రత విభాగం డీజీ శిఖాగోయల్



సాక్షి, హైదరాబాద్: 'వివాహ బంధంలో జంటల మధ్య కలహాలు ఎక్కువగా చిన్న కుటుంబాల్లోనే (న్యూక్లియర్ ఫ్యామిలీ) ఉంటున్నాయి. కుటుంబ కలహాలకు సంబంధించిన కేసుల్లో 70 శాతం చిన్న కుటుంబాల నుంచి వచ్చినవే' అని మహిళా భద్రత విభాగం డీజీ శిఖాగోయల్ తెలిపారు. 42 శాతం సమస్యలు వివాహమైన మొదటి 0-5 సంవత్సరాల్లో సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. గృహహింస కేసుల పరిష్కారం, సయోధ్య పెంచడంలో తెలంగాణ పోలీస్ మహిళా భద్రత విభాగం ఏర్పాటు చేసిన సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్ (సీడీఈడబ్ల్యూ) గణనీయమైన పురోగతిని సాధిస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటివరకు హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్ల పరిధిలోని 27 సీడీఈడబ్ల్యూ సెంటర్లలో మొత్తం 9 వేల కేసులు వచ్చాయన్నారు. కౌన్సెలింగ్ సెషన్‌ల ద్వారా 8,200 కేసులు పరిష్కరించినట్టు తెలిపారు. సీడీఈడబ్ల్యూకు వచ్చిన కేసుల్లో సేకరించిన వివరాలను విశ్లేషించగా...గుర్తించిన కీలక అంశాలు ఇలా ఉన్నాయి

- గృహహింస కేసులకు ప్రధాన కారణాలు మద్యపాన వ్యసనం (63.2 %), ఆర్థిక ఒత్తిడి (50%), అనుమానం (48 %), వివాహేతర సంబంధాలు (33%).
- పదేపదే గృహహింసకు గురవుతున్న మహిళలు 22 % మంది ఉంటున్నారు.
- గృహహింస కేసులు నమోదవుతున్న కుటుంబాల్లో ఆర్థిక సమస్యలు ఎక్కువ ఉంటున్నాయి. కేసులు నమోదైన 50% కుటుంబాలు నెలకు రూ.11,000 నుంచి రూ. 30,000 మధ్య సంపాదన కలిగినవే.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.


యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండలో పనిచేస్తున్న భవన నిర్మాణ కార్మికులు


రామన్నపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడ్లు ఎత్తుతున్న బిహార్ కార్మికులు


బొమ్మలరామారం మండలంలో ఇటుకబట్టీల్లో పనిచేస్తున్న ఒడిశా కార్మికులు

ఉపాధికి అడ్డా.. భువనగిరి గడ్డ

వలస కార్మికులకు ఉపాధి కేంద్రంగా యాదాద్రి భువనగిరి జిల్లా

- ఇతర రాష్ట్రాల నుంచి నిత్యం వలస కార్మికుల రాక
- పలు రకాల పనులు చేస్తూ ఉపాధి పొందుతున్న వైనం
- జిల్లాలో 30 వేల మందికి పైగా వలస కార్మికులు

సాక్షి, యాదాద్రి: ఒకప్పుడు వలసలకు కేంద్రమైన యాదాద్రి భువనగిరి జిల్లా ఇప్పుడు వలస కార్మికులకు ఉపాధి అడ్డాగా మారింది. ఉపాధి లేక ముంబై, భివండీ, సోలాపూర్, బెంగళూరు, ఆంధ్ర, సూరత్ వంటి పట్టణాలకు జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి నిరంతరం వలసలు సాగేవి. కానీ ఇప్పుడు వ్యవసాయం, పరిశ్రమలు, గృహనిర్మాణ రంగాలు పుంజుకోవడంతో వివిధ రకాల పనులు ఊపందుకున్నాయి. దీంతో కూలీల కొరత నెలకొనడంతో జిల్లాకు దేశంలోని పలు రాష్ట్రాల నుంచి కార్మికులు వలసవచ్చి ఉపాధి పొందుతున్నారు.

30 వేల మందికి పైగా..

ఉత్తరప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్, అసోం, ఆంధ్రప్రదేశ్, కర్ణాటకలకు చెందిన వేలమంది జిల్లాలో ఉపాధి పొందుతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి యాదాద్రి జిల్లాకు రైళ్లు, బస్సులు అందుబాటులో ఉండటంతో కార్మికులు నేరుగా చేరుకుంటున్నారు. జిల్లాలోని 17 మండలాలు, 6 మున్సిపాలిటీల్లో 30 వేలకు పైగా ఇతర రాష్ట్రాల కార్మికులు పలు రకాల పనులు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ రైస్ మిల్లులు, హోటళ్లు, భవన నిర్మాణం, ఇటుక బట్టీలు, టైల్స్, పీవోపీ, పౌల్ట్రీ, ఎయిమ్స్, కంపెనీలు, వ్యవసాయ కార్మికులుగా పనిచేస్తున్నారు. చౌటుప్పల్, బీబీనగర్ పారిశ్రామిక వాడల్లో వీరు ఎక్కువగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా రైస్‌మిల్లులు, భవన నిర్మాణ పనులు, వ్యవసాయంలో నాట్లువేయడం, పత్తి ఏరడం తదితర పనులు చేస్తున్నారు. బార్బర్ పని, హోటళ్లలో మాస్టర్‌లు, వెయిటర్‌లు, ఇలా ఒకటేమిటి అన్ని రకాల పనులు చేస్తున్నారు.


భువనగిరి పట్టణంలోని జగదేవ్‌పూర్ చౌరస్తాలో ఎదురు చూస్తున్న ఇతర రాష్ట్రాలకు చెందిన అడ్డా కూలీలు

ఒక్కో రాష్ట్రం కార్మికులది ఒక్కో ప్రత్యేకత

బిహార్, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు వలస వచ్చిన వారు జిల్లాలోని రైస్ మిల్లులు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో హమాలీ పనులు చేస్తుండగా.. ఛత్తీస్‌గఢ్ నుంచి వచ్చిన వారు భవన నిర్మాణంలో తాపీ మేస్త్రీలుగా, పార కూలీలుగా.. రాజస్తాన్ నుంచి వచ్చిన వారు హోటళ్లు, పీవోపీ, హార్డ్‌వేర్ దుకాణాల్లో పనిచేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన వారు పత్తి ఏరడం, పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన వారు పొలంలో నాట్లు వేయడం లాంటి పనులు చేసి జీవనోపాధి పొందుతున్నారు.

అధికంగా రైస్ మిల్లుల్లో..

ఒక్కో రైస్ మిల్లులో 20 నుంచి 30 మంది కార్మికులు పనిచేస్తారు. ఒక గుంపునకు ఒక ముఠామేస్త్రి కార్మికులను సూపర్‌వైజ్ చేస్తారు. అందరికంటే ముఠామేస్త్రికి కాస్త కూలి ఎక్కువగా ఉంటుంది .రైస్ మిల్లుల్లో మిల్లు డ్రైవర్, ప్లాంటు డ్రైవర్, హమాలీలుగా పని చేస్తారు. మిల్లు ప్లాంటు, డ్రైవర్లకు రోజుకు సుమారు రూ.800 కూలి పడుతుంది. మిల్లుకు వచ్చే లారీల ధాన్యం లోడింగ్, అన్‌లోడింగ్, హమాలీ కార్మికులు చేస్తారు. వీరికి రోజుకు సుమారు రూ.500 కూలి పడుతుంది. మిల్లు యజమానులు వీరికి భోజనం, వసతి కల్పిస్తారు.

అడ్వాన్స్‌లు చెల్లించి మరీ..

పలు గ్రామాల్లో గల ఇటుక బట్టీల్లో సుమారు 6,000కుపైగా ఒడిశా కార్మికులు పనిచేస్తున్నారు. నాలుగు నెలల పనుల నిమిత్తం ఒక్కొక్కరికి రూ.50 వేల అడ్వాన్స్ చెల్లించి ఇటుక బట్టీ యజమానులు పనులకు తీసుకువస్తారు. ఒక్కో వ్యక్తికి వారానికి రూ.వెయ్యి చొప్పున కిరాణా సరుకుల కోసం ఖర్చులు ఇవ్వడంతో పాటు వారు చేసిన పనులను బట్టి రూ.2 వేల నుంచి రూ.2,500 వరకు అడ్వాన్స్‌లో కటింగ్ చేస్తారు. ఒడిశా కూలీలు తాము తీసుకున్న అడ్వాన్స్‌కు సరిపోను ఈ నాలుగు నెలల కాలంలో పనులు చేస్తారు.



"బెంగాల్ నుంచి వచ్చాను

మాది పశ్చిమబెంగాల్‌లోని దక్షిణ 24 పరగణాల జిల్లా గొసాబా. మా రాష్ట్రంలో పనులు లేవు. ఉపాధికోసం భువనగిరికి వచ్చాం. తిండి, వసతి ఖర్చులు లేకుండా పనిచేసే గ్రామాల్లోనే షెల్టర్ వెతుక్కుంటున్నాం. ఒక్కొక్కరం రోజుకు రూ.1,000 దాకా సంపాదిస్తాం. దాదాపుగా రెండు నెలల పాటు పనులు చేసి తిరిగివెళ్తాం. కుటుంబ పోషణ చూసుకుని మరో సారి వస్తాం. ఇలా సంవత్సరానికి రెండు మూడుసార్లు వస్తాం. ఇక్కడ పనులకు కొరతలేదు.

– దాలీమ్‌షేక్, పశ్చిమబెంగాల్



"మూడు నెలలు ఇక్కడే

మా రాష్ట్రం ఛత్తీస్‌గఢ్‌లో సరైన ఉపాధి అవకాశాలు లేవు. ఏడాదిలో ఒక సీజన్‌లో కూడా పని దొరకదు. సాగు అంతంత మాత్రమే. అందుకే మేమంతా తెలంగాణకు వస్తున్నాం. ఇక్కడ మాకు కూలి గిట్టుబాటు అవుతుంది. ఏడాదిలో మూడు నెలలు ఇక్కడే ఉంటాం ధాన్యం ఎత్తడం, దించడం వంటి హమాలీ కూలి పని చేస్తాం. ఉప్పరి మేస్త్రీ పనికి వెళ్తాం.

– మహబూబ్ ఆలమ్, ఛత్తీస్‌గఢ్



"ఇక్కడ ఉపాధికి కొదవలేదు

ఇక్కడ ఉపాధికి కొదవ లేదు. మహారాష్ట్ర నుంచి వచ్చాం. రెండు నెలలు ఇక్కడ పని చేసుకుంటాం. రోజుకు ఖర్చులు పోను రూ.500 సంపాదిస్తాం. హమాలీ, మేస్త్రీ, ఇతర పనులు చేస్తాం. పనులు పూర్తి అయిన తర్వాత వెళ్లిపోతాం. మాకు భోజనానికి బియ్యం, ఉండటానికి ఇళ్లు, తాగునీరు, వైద్య సౌకర్యం, వసతులు పని ఇచ్చే వారే చూసుకుంటారు. ఉమ్మడి స్నేహితులతో కలిసి వస్తాం పనిచేసి డబ్బు సంపాదించుకుంటాం.

– అన్వర్, మహారాష్ట్ర



"ఇక్కడే ఆరు నెలలు ఉపాధి

మా రాష్ట్రంలో పనులు దొరకవు. తెలంగాణలో పంటలు బాగా పండుతున్నాయి. జిల్లాకు ఏటా వచ్చి రైసు మిల్లులో పనిచేస్తా. ఆరేడు నెలలపాటు ఇక్కడే ఉంటా. వారానికోసారి సేటు పైసలు ఇస్తరు. నా ఖర్చులకు ఉంచుకొని మిగిలినవి ఇంటికి పంపిస్తాను. ఇక్కడా బాగా వుంది.

– బాబులాల్, బిహార్



"రోజుకు రూ.1,000 సంపాదిస్తున్న

జీవనోపాధి కోసం ఒడిశా నుంచి యాదగిరిగుట్టకు వచ్చాం. దాదాపు సంవత్సరం అవుతోంది. ఇక్కడ బిర్యానీ హోటల్‌లో పనిచేస్తూ బతుకుతున్నాను. రోజుకి రూ.1,000 సంపాదిస్తున్నాను. ప్రస్తుతం అయితే డబ్బుల కోసం కష్టపడుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను.

– జాకీర్, ఒడిశా

తెలంగాణ పీఆర్ (సవరణ) ఆర్డినెన్స్‌పై వివరణ

సాక్షి, హైదరాబాద్ : రాష్ట్రంలో ప్రధాన పట్టణ ప్రాంత వృద్ధి సామర్థ్యాన్ని పెంచేందుకు ఓఆర్ఆర్‌ను ఆనుకొని ఉన్న 51 గ్రామాలను సమీప మున్సిపాలిటీల విలీనం చేసే అంశానికి సంబంధించి అసెంబ్లీలో మంత్రి సీతక్క వివరణ ఇచ్చారు. ఈ గ్రామాల విలీనానికి సంబంధించి కొన్నిరోజుల క్రితం తెలంగాణ పీఆర్ (సవరణ) ఆర్డినెన్స్‌ను సవరిస్తూ ఇచ్చిన ఉత్తర్వులపై సోమవారం అసెంబ్లీలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క ఆయా అంశాలను వివరించారు. ఈ ఆర్డినెన్స్ జారీచేసిన సమయంలో శాసనసభ సమావేశం లేకపోవడంతోపాటు అప్పటికి సభను నిరవధికంగా వాయిదా వేసినందున, అత్యవసరాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయాన్ని వెంటనే అమల్లోకి తీసుకురావాల్సి వచ్చిందని సీతక్క పేర్కొన్నారు. గవర్నర్ ద్వారా జారీ అయిన ఈ పీఆర్ (సవరణ) ఆర్డినెన్స్‌ను గత సెప్టెంబర్ 2న తెలంగాణ గెజిట్ అసాధారణ సంచికలో ప్రచురించినట్టు తెలియజేశారు.

అన్ని వర్గాల కోసం రేవంత్ సర్కార్ పనిచేస్తోంది

సోనియాగాంధీ పుట్టినరోజు వేడుకల్లో కాంగ్రెస్ ఎంపీలు

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఆ పార్టీ ఎంపీలు తెలిపారు. సోనియా గాంధీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రామసహాయం రఘురామిరెడ్డి, వంశీకృష్ణ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మల్లు రవి మాట్లాడుతూ సోనియాగాంధీ వల్లే ప్రత్యేక తెలంగాణ సాధ్యమైందన్నారు. ఈ విషయాన్ని ఎన్నో సార్లు కేసీఆర్ చెప్పారని, ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఆయన కుటుంబ సమేతంగా సోనియాతో ఫొటో దిగారని గుర్తుచేశారు. పదేళ్లలో కేసీఆర్ సాధించలేని అభివృద్ధి, సంక్షేమాన్ని రేవంత్‌రెడ్డి ఒక్క ఏడాదిలోనే సాధించారని కొనియాడారు. ఎంపీ చామల మాట్లాడుతూ రూ.18 వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిన ఏకైక ప్రభుత్వం మాదే అన్నారు. అధికారంలోకి వచ్చిన సంవత్సరంలోనే 55 వేల ఉద్యోగాలిచ్చిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని తెలిపారు.

సోనియా పుట్టినరోజున తెలంగాణ తల్లి ఉత్సవాలా?

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ

సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ జన్మదినం రోజు తెలంగాణ తల్లి ఉత్సవాలు జరపడం ఏంటని బీజేపీ నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రశ్నించారు. సోమవారం ఆయన తెలంగాణ అసెంబ్లీ మీడియా పాయింట్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణకు ప్రతీక అయిన బతుకమ్మను విగ్రహం నుంచి తొలగించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి.. సోనియాగాంధీని గతంలో బలిదేవతగా పోల్చారని, నేడు ఆమె మెప్పుకోసం జన్మదినం రోజు అవతరణ వేడుకగా జరుపుతున్నారని ఆరోపించారు. ఈ నిర్ణయంతో తెలంగాణ అమరవీరుల ఆత్మలు ఘోషిస్తాయని సూర్యనారాయణ మండిపడ్డారు. నిజాం నిరంకుశ పాలన నుంచి విముక్తి పొందిన సెప్టెంబర్ 17ను అధికారికంగా జరపకపోవడం వెనుక మతలబు ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు.

'ఆశవర్కర్లపై పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం'

సాక్షి, హైదరాబాద్: తమ సమస్యలు పరిష్కరించాలని నిరసన చేస్తున్న ఆశవర్కర్లపై పోలీసులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ నేత, ఉద్యోగ సంఘాల జాక్ మాజీ చైర్మన్ దేవీప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఆశ వర్కర్ల వేతనం రూ.18 వేలు చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయాలన్నారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ రోజు మహిళా ఉద్యోగులను వేధించినందుకు వారికి క్షమాపణ చెప్పాలని, ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని దేవీప్రసాద్ డిమాండ్ చేశారు.

మీ అంకితభావం మాకు స్ఫూర్తి

రాహుల్‌గాంధీతో భేటీలో ఎంపీ మల్లు రవి



సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంటులో అదానీ వ్యవహారం సహా వక్ఫ్‌బోర్డు బిల్లు విషయంలో లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా చేస్తున్న పోరాటం తమకు స్ఫూర్తినిస్తోందని రాహుల్‌గాంధీకి ఆ పార్టీ ఎంపీ మల్లు రవి తెలిపారు. సోమవారం ఢిల్లీలో రాహుల్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. రాహుల్ చేస్తున్న పోరాటాన్ని కొనియాడుతూ ఒక లేఖను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో వంద రోజుల్లో ఇచ్చిన హామీల్లో ఐదు అమలు చేశామని, రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేశామని చెప్పారు. రుణమాఫీతో 20లక్షల మందికి లబ్ధి చేకూరిందని తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న మూసీ సుందరీకరణ పనులు ప్రారంభించామని, 50వేల ప్రభుత్వ ఉద్యోగాలు అందించామని వివరించారు. రాష్ట్రంలో కులగణన ప్రారంభించడం ద్వారా చారిత్మాకమైన అడుగు పడిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం మీ మార్గదర్శకంలో విజయవంతంగా ముందుకు వెళ్తుందంటూ మల్లు రవి రాహుల్‌గాంధీకి ఇచ్చిన లేఖలో పేర్కొన్నారు.

చెన్నమనేని కేసులో హైకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్టు టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. జర్మనీ పౌరసత్వం ఉన్న రమేశ్ నిజాన్ని దాచిపెట్టి న్యాయ వ్యవస్థతో పాటు ప్రజలను మోసం చేసినందుకు రూ.30 లక్షల జరిమానా విధించడం పట్ల సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. నిజాన్ని దాచిపెట్టి ప్రజాప్రతినిధిగా చెలామణి అయిన రమేశ్ అక్రమాలపై న్యాయ పోరాటం చేసి విజయం సాధించిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను ఆ ప్రకటనలో మహేశ్‌గౌడ్ అభినందించారు.

ఫోర్జరీ సంతకంతో లేఖను సృష్టించారు

రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ సంచాలకులడి సూచన

సాక్షి, హైదరాబాద్: తన ఫోర్జరీ సంతకంతో ఓ లేఖను సృష్టించి అధికారులను, రైతులను మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని వ్యవసాయ శాఖ సంచాలకులు తెలిపారు. ప్రైమ్ మినిస్టర్ చౌదరి చరణ్‌సింగ్ కిసాన్ క్యాంటీన్ కార్డు స్కీం (పీఎంసీసీఎస్) ద్వారా రైతులకు అన్ని రకాల వస్తువులను 40 శాతం సబ్సిడీతో స్వదేశ్ చారిటబుల్ ట్రస్ట్ అనే సంస్థ ద్వారా విక్రయిస్తున్నట్లు తన సంతకంతో ఓ లేఖను సృష్టించినట్లు సోమవారం ఆయన ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ పీఎంసీసీఎస్ స్కీం ద్వారా రైతుల నమోదు కొరకు ఈ ట్రస్ట్ వారికి సహకరించవలసిందిగా జిల్లా వ్యవసాయ అధికారులకు తాను ఆదేశాలు ఇచ్చినట్లుగా పేర్కొంటూ, ఆ లెటర్‌ను వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న ఏఈఓల నుంచి జిల్లా వ్యవసాయ అధికారుల వరకు అందరికీ అందజేస్తున్నట్లు తెలిసిందని వెల్లడించారు. ఈ లేఖను రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అందజేసి, రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని చెబుతూ వారి వివరాలు నమోదు చేసుకుంటున్నట్లుగా తెలిసిందని, ఈ విషయం తన దృష్టికి రాగానే సదరు లేఖ మీద అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

నెరవేర్చని హామీలపై రేవంత్ క్షమాపణ చెప్పాలి: కాసం

సాక్షి, హైదరాబాద్: ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని ఒప్పుకుని సీఎం రేవంత్‌రెడ్డి ప్రజాక్షేత్రంలో క్షమాపణ చెప్పాలని బీజేపీ ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ కాంగ్రెస్ ప్రజాపాలన విజయోత్సవాలు జరుపుతోందని ఆయన మండిపడ్డారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లేజర్ షోలు, డ్రోన్ షోలు, ఎయిర్ షోలు, మ్యూజికల్ నైట్స్ ప్రోగ్రాంలు నిర్వహించి ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందని ధ్వజమెత్తారు. ప్రజలకు ఏం ఒరగబెట్టారనేది చెప్పకుండా.. ఇష్టానుసారంగా, వారికి తోచిన విధంగా ఉత్సవాలు జరుపుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చి వక్రభాష్యాన్ని చెప్పడాన్ని బీజేపీ వ్యతిరేకిస్తున్నదన్నారు. సోనియాగాంధీ జన్మదినానికి తెలంగాణ తల్లికి ఏం సంబంధమని కాసం ప్రశ్నించారు. తల్లిని, దేవతను వేర్వేరుగా చూపించే ప్రయత్నం చేస్తున్నదని, ఈ విగ్రహాన్ని రూపొందించేటప్పుడు ప్రతిపక్ష నేతలు, మేధావులతో చర్చించే ప్రయత్నం ప్రభుత్వం చేయలేదని విమర్శించారు.


గాంధీ భవన్‌లో కేక్ కట్ చేస్తున్న మహేశ్‌కుమార్ గౌడ్. చిత్రంలో వీహెచ్, దీపాదాస్ మున్షీ, భట్టి, పొన్నం తదితరులు

గాంధీభవన్‌లో ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు

హాజరైన భట్టి, మున్షీ, మహేశ్‌గౌడ్, వీహెచ్

సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ జన్మదినోత్సవాన్ని గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీసీసీ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేశారు. అనంతరం మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీనియర్ నేత వి.హనుమంతరావు, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్రావు, కార్పొరేషన్ చైర్మన్లు శివసేనారెడ్డి, మెట్టు సాయికుమార్, ముత్తినేని వీరయ్య వర్మ, కల్వ సుజాత, మల్‌రెడ్డి రాంరెడ్డి, టీపీసీసీ నేతలు గజ్జెల కాంతం, కొనగాల మహేశ్, ఊట్ల వరప్రసాద్, కోలా శ్రీనివాస్, గంధం రాములు తదితరులు పాల్గొన్నారు. సోనియాగాంధీ జన్మదినం సందర్భంగా గాంధీభవన్ సిబ్బందికి కాంగ్రెస్ నాయకురాలు రమ్యారావు దుస్తులు పంపిణీ చేశారు.

క్లుప్తంగా...

త్వరలో అన్నదాత సుఖీభవ అమలు

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు



పార్వతీపురం: త్వరలో అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ.20వేలు అందిస్తామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం జిల్లాలో సోమవారం నిర్వహించిన డీఆర్‌సీ సమావేశం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గడచిన ఆరు నెలల్లో ఎవరూ ఊహించని విధంగా ప్రభుత్వాన్ని గాడిలో పెట్టామన్నారు. వెంటిలేటర్‌పై నుంచి ఆక్సిజన్ పీల్చుకొనే స్థాయికి ప్రభుత్వాన్ని తీసుకువచ్చామన్నారు. ప్రజలకు వాక్ స్వాతంత్ర్యాన్ని కల్పించామని తెలిపారు. ఈ నెల 13న ధాన్యం కొనుగోళ్లపై అధికారులకు వినతిపత్రాలను అందజేస్తామని వైఎస్సార్‌సీపీ ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ఇంతవరకు ధాన్యం కొనుగోళ్లపై ఏ ఒక్క రైతూ ఫిర్యాదు చేయలేదన్నారు. రైతులు ఆధునిక పద్ధతుల్లో సేద్యం చేసేందుకు రూ.145కోట్లతో యంత్ర పరికరాలను సమకూర్చినట్టు తెలిపారు.

45 రోజుల్లో భూ సమస్యల పరిష్కారం

మంత్రి సవిత



ప్రొద్దుటూరు/కమలాపురం: భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని వైఎస్సార్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ప్రొద్దుటూరు మండలంలోని దొరసానిపల్లె గ్రామ పంచాయతీలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు మంత్రి హాజరయ్యారు. ప్రజలు ఇచ్చిన అర్జీలలో పరిష్కరించదగినవి వెంటనే పరిష్కరిస్తామని, మిగతా వాటిని 45 రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. గత ఐదేళ్లలో రాష్ట్ర వ్యాప్తంగా భూ సమస్యలు పెరిగాయని, బాధితులు తమ ప్రభుత్వానికి విన్నవించడంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వానికి లక్షా 75వేలకు పైగా వినతులు రాగా అందులో 80వేలు భూ సమస్యలపైనే ఉన్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దని అధికారులకు మంత్రి సూచించారు.

ఆప్కో వీసీఎండీగా విశ్వకు అదనపు బాధ్యతలు

సాక్షి, అమరావతి: ఆప్కో వీసీఎండీగా ప్రస్తుతం ఏపీ హస్తకళాభివృద్ధి కార్పొరేషన్ ఎండీగా ఉన్న ఎం.విశ్వకు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎస్.యువరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆప్కో వీసీఎండీగా ఉన్న ఆర్.పవనమూర్తి డిసెంబర్10 నుంచి 31 వరకు సెలవులో ఉన్నంత వరకు విశ్వ ఆప్కో వీసీఎండీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

జన్యుమార్పిడి పంటలను నిషేధించాలి

భారతీయ కిసాన్ సంఘ్ డిమాండ్

సాక్షి, అమరావతి: జన్యుమార్పిడి పంటలపై జాతీయ విధానాన్ని రూపొందించాలని సుప్రీం కోర్టు కేంద్రానికి సూచించి 4 నెలలు గడుస్తున్నా ఏ చర్యలు చేపట్టకపోవడాన్ని భారతీయ కిసాన్ సంఘ్ తీవ్రంగా తప్పుపట్టింది. జన్యుమార్పిడి పంటలపై జాతీయ విధానాన్ని రూపొందించే ప్రక్రియలో అన్ని వర్గాల వారితో విస్తృత స్థాయిలో సంప్రదింపులు జరపాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు ఉమ్మడి సహదేవ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అనుమోలు గాంధీ, రాష్ట్ర కార్యదర్శి మహేష్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు క్రాంతి కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ సంప్రదింపులలో భాగస్వామ్యం కావాలని కోరారు. 2002లో ఎలాంటి సంప్రదింపులు, ఆమోదం లేకుండా భారత్‌లో బీటీ పత్తిని ప్రవేశపెట్టారని, బీటీ పత్తిని ప్రవేశపెట్టి 23 ఏళ్లు గడిచినా జన్యుమార్పిడి పంటలకు భారత్‌లో సమగ్రవిధానం లేదని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఏ జన్యుమార్పిడి పంటల్లోనూ అధిక దిగుబడినిచ్చే జన్యువును చొప్పించలేదని, కానీ వాటిని అధిక దిగుబడి ఇచ్చేవిగా పిలవడం శాస్త్రీయ మోసమని స్పష్టమవుతుందని పేర్కొన్నారు. జన్యుమార్పిడి పంటలు భారతదేశంలోకి ప్రవేశించకుండా కేంద్ర ప్రభుత్వం నిర్ధారించాలని భారతీయ జనసంఘ్ కోరుకుంటున్నట్టు పేర్కొన్నారు.

సేవలు పంచాయతీలవి ఆదాయం ఐటీడీఏకి..

కూటమి ప్రభుత్వం తీరుతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న అరకు పర్యాటక ప్రాంత పంచాయతీలు

ముందస్తు వర్షాలు, అనుకూల వాతావరణంతో నవంబర్‌లో భారీగా పెరిగిన పర్యాటకులు

- ఒక్క ఎంట్రీ టికెట్ ద్వారానే రూ.1.43 కోట్ల కలెక్షన్
- ఆదాయం మొత్తం తీసుకుని పంచాయతీలకు వాటా చెల్లించని వైనం
- పారిశుధ్య కార్మికులకు జీతాలు చెల్లించలేకపోతున్నామని వాపోతున్న సర్పంచ్‌లు



అరకులోయ టౌన్: ముందస్తుగా కురిసిన వానలకు రైతులు త్వరితగతిన సాగు ప్రారంభించడంతో ఈ ఏడాది నవంబర్ నెలలోనే అరకులోయలో వలిసెలు విరబూశాయి. అనుకూలమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కారణంగా అరకులోయకు పర్యాటకులు పోటెత్తారు. సాధారణంగా డిసెంబర్, జనవరి నెలల్లో అరకులోయకు పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అయితే ఈ ఏడాది నవంబర్ నెలలోనే ఇక్కడి టూరిస్ట్ స్పాట్‌లన్నీ కిటకిటలాడాయి. బొర్రా గుహలు, గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానవనం, చాపరాయి జలవిహారి, అంజోడ సిల్క్‌ఫారం సందర్శనకు పర్యాటకులు ముందుగానే భారీగా తరలివచ్చారు. ఫలితంగా నవంబరు ఒకటో తేదీ నుంచి 30 వరకు 2,20,013 మంది వీటిని సందర్శించగా, రూ.1,43,72,500ల ఆదాయం వచ్చింది. దీనికి తోడు అరకులోయకు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న మాడగడ సన్‌రైజ్ వ్యూ పాయింట్ కూడా ఇటీవల బాగా ప్రాచుర్యం పొందింది. పర్యాటకులకు వంజంగి కన్నా ఇది అనుకూలంగా ఉండడంతో ఈ వ్యూ పాయింట్‌కూ డిమాండ్ పెరిగి సందర్శకుల తాకిడి పెరిగింది. ఈ వ్యూ పాయింట్ సమీపంలోనే రిసార్ట్‌లు, లాడ్జీల సౌకర్యం కూడా ఉండడంతో ఈ ప్రాంతానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇక మాడగడ వ్యూ పాయింట్ వద్ద గిరిజన సాంప్రదాయ థింసా నృత్యాలతో స్థానికులు సందర్శకులను అలరిస్తున్నారు. దీనికి తోడు అరకు రైలుకు విస్టాడోం కోచ్‌లు అమర్చడంతో కొండకోనల్లోంచి సాగే రైలు ప్రయాణం పర్యాటకులకు మధురానుభూతి మిగులుస్తోంది. దీంతో అరకు పర్యాటకానికి మరింత ఊపు వచ్చింది. అయితే పర్యాటకుల నుంచి వచ్చిన ఆదాయాన్ని ఆబగా అందుకుంటున్న కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రం ఖర్చుచేయడంలేదు. పైగా స్థానిక గ్రామపంచాయతీల ఆధీనంలో ఉన్న కొన్ని పర్యాటక ప్రాంతాలను ఐటీడీఏ పరిధిలోకి తీసుకోవడం, ఆదాయంలో పంచాయతీలకు ఇవ్వాల్సిన వాటా ఇవ్వకపోవడంతో ఆయా పంచాయతీల సర్పంచ్‌లు లబోదిబోమంటున్నారు. పర్యాటకులు పెరగడంతో పారిశుధ్యం కోసం చేయాల్సిన ఖర్చులు పెరిగాయని, ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటా నిధులు ఇవ్వకపోవడంతో పారిశుధ్య సిబ్బందికి కనీసం జీతాలు కూడా చెల్లించలేకపోతున్నామని వాపోతున్నారు.

పంచాయతీ వాటా చెల్లించాలి..



పద్మాపురం ఉద్యానవనానికి సందర్శకుల ద్వారా ఏటా రూ.లక్షల్లో ఆదాయం వస్తోంది. గతంలో గార్డెన్ బయట వాహనాల పార్కింగ్ ఆదాయం గ్రామ పంచాయతీకి వేలం ద్వారా సమకూరేది. ఇప్పుడు పాడేరు ఐటీడీఏ నిర్వహిస్తోంది. గ్రామ పంచాయతీకి రావాల్సిన వాటాను చెల్లించడంలేదు. పంచాయతీకి ఆర్థిక ఇబ్బందులు కారణంగా పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించలేకపోతున్నాం.

– పెట్టెలి సుష్మిత, సర్పంచ్, పద్మాపురం, అరకులోయ మండలం

ఆదాయం రావడంలేదు..



గతంలో పంచాయతీ ఆధీనంలో ఉన్న చాపరాయి జలవిహారిని ఇప్పుడు పాడేరు ఐటీడీఏ నిర్వహిస్తోంది. దీనివల్ల పంచాయతీ ఆదాయం కోల్పోయింది. ఇప్పుడు ప్రవేశ రుసుం ద్వారా పాడేరు ఐటీడీఏకు ఆదాయం సమకూరుతోంది. పంచాయతీకి పన్నులతోపాటు సందర్శన ద్వారా వచ్చే ఆదాయంలో పంచాయతీ వాటాను పాడేరు ఐటీడీఏ వెంటనే చెల్లించాలి.

– వంతాల వెంకటరావు, సర్పంచ్, పోతంగి, డుంబ్రిగుడ మండలం

పైనరీకి విశేష ఆదరణ



డుంబ్రిగుడ మండలం జైపూర్ రోడ్డులోని అంజోడ వద్ద ఏర్పాటుచేసిన అరకు పైనరీకి పర్యాటకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ఇక్కడ అన్ని రకాల వసతులు ఉన్నాయి. సందర్శించేందుకు దేశ విదేశాల నుంచి పర్యాటకులు వస్తున్నారు. ప్రీవెడ్డింగ్ షూట్‌లకు ఆదరణ లభిస్తోంది. పర్యాటక కేంద్రమైన అరకులోయకు ఇది మణిహారంగా చెప్పవచ్చు.

– శ్రీనివాసరావు, రేంజ్ అధికారి, అరకులోయ

ఆదాయం లేక ఆర్థిక ఇబ్బందులు..



గ్రామ పంచాయతీ 1944 యాక్ట్ ప్రకారం ప్రభుత్వం నిర్వహించే సందర్శిత ప్రాంతాలు, టూరిజం రిసార్ట్స్‌ల నుంచి వచ్చిన ఆదాయంలో 60 శాతం గ్రామ పంచాయతీకి చెల్లించాల్సి ఉంది. అయినప్పటికీ చెల్లించకపోవడంతో పారిశుధ్య నిర్వహణ, పారిశుధ్య కార్మికుల జీతాలు ఇవ్వలేని పరిస్థితి నెలకొంది.

– కేవీపీ సత్యనారాయణ, ఈఓపీఆర్‌డీ, అరకులోయ



బొర్రాకు అధిక ఆదాయం

అనంతగిరి మండలం బొర్రా గుహలను సెప్టెంబర్ నెలలో 80,450 మంది పిల్లలు, పెద్దలు సందర్శించారు. ఎంట్రీ రుసుం ద్వారా రూ.69,98,400 ఆదాయం సమకూరింది. గిరిజన మ్యూజియాన్ని 51,900 మంది సందర్శించగా రూ.30,63,820 మేర ఆదాయం వచ్చింది.




గులాబీ గార్డెన్ కేరాఫ్ పద్మాపురం..

పద్మాపురం ఉద్యానవనం కూడా పర్యాటకులను కట్టిపడేస్తుంది. ఇక్కడ సందర్శకుల సౌకర్యార్థం రిసార్ట్‌లు, ట్రీహట్‌లను నిర్మించారు. గులాబీ గార్డెన్ ఇక్కడి ప్రత్యేకత. గత నెలలో 31,300 మంది సందర్శించగా రూ.16,78,050 ఆదాయం వచ్చింది.



చాపరాయి.. సహజసిద్ధ అందాలకు నిలయం..

ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలవిహారిని గత ప్రభుత్వంలో పాడేరు ఐటీడీఏ అభివృద్ధి చేసింది. సహజసిద్ధ అందాలకు నిలయమైన ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతారు. గతనెలలో ఇక్కడకు 40,362 మంది సందర్శించగా రూ.19,07,250 ఆదాయం వచ్చింది.



ప్రీ వెడ్డింగ్ షూట్‌లకు కేంద్రం.. అరకు పైనరీ..

అంజోడాలో అటవీశాఖ నిర్వహిస్తున్న అరకు పైనరీ పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. దీనిని గత ప్రభుత్వంలో అటవీశాఖ వనంలో విహరించేలా అభివృద్ధి చేసింది. ట్రీహట్‌లు, దేవదారు వనాలు ప్రత్యేక ఆకర్షణ. నవంబరులో 16వేల మంది సందర్శించారు. రూ.7.25 లక్షల ఆదాయం వచ్చింది. ప్రీ వెడ్డింగ్ షూట్‌లకు ఇది ఎంతో ప్రఖ్యాతిగాంచింది.

బంగారు బాల్యం.. బాధ్యతతో పదిలం

అన్నమయ్య జిల్లాలో జరుగుతున్న వరుస ఘటనలే ప్రమాద హెచ్చరికలు

రాయచోటిలో విద్యార్థుల చేతిలో ఉపాధ్యాయుడు హత్యపై పెదవి విరుపు



సాక్షి రాయచోటి : భావి భారత పౌరులు.. అలాంటి చిన్నారులు చేస్తున్న వికృత చేష్టలు సమాజం ఎటుపోతుందోనన్న సందేహాలకు సమాధానం దొరకని పరిస్థితి. బాలల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఒక్క ఉపాధ్యాయులదే కాదు..సమాజంలో తల్లిదండ్రులకు కూడా ఉంటుంది. చిన్నారులు ఏం చేస్తున్నారో..ఎటు పోతున్నారో.. ఎలా వ్యవహరిస్తున్నారో చూసుకో కపోతే అనేక తప్పులకు మూల్యం చెల్లించాల్సి వస్తుంది. ఒకటి, రెండు దశాబ్దాల కిందట నాగరిక పోకడలు అంతగా లేని కాలంలో...చిన్న పిల్లలు, బాలలు తల్లిదండ్రులను అంటిపెట్టుకుని చెప్పిందే వేదంగా నడిచే పరిస్థితి ఉండేది. కాలం మారింది, కంప్యూటర్ పోకడలు పెరిగిన ప్రస్తుత కాలంలో చిన్నారులు అడిగిందే తడవుగా ఏదీ కాదనలేదన్నది ఇప్పటి పరిస్థితి. భావి భారత బాలలకు ఇది తప్పు, అది ఒప్పు అని చెప్పకపోతే భవిష్యత్‌లో ఎలాంటి తప్పుడు పనులు చేసినా అది అందరిమీద పడుతుంది. ఒకనాడు ఇంటి పని మొదలుకొని పాఠశాల ముగియగానే ఇంటికి చేరుకుని కుటుంబీకులతో తిరుగుతుండడంతో వారి ప్రవర్తన, నియమావళి తెలిసేది. ప్రస్తుతం సమాజంలో ఒకరితో ఒకరు పోటీపడుతూ ముందుకు వెళుతూ టెక్నాలజీ యుగంలో విలాసవంతానికి పోతుండడంతో అనుకోని ఘటనలు ఎదురవుతున్నాయి.

సెల్‌ఫోన్లు చూస్తున్నారంటే అప్రమత్తంగా ఉండాలి

చిన్నారులు, బాలలు (18 ఏళ్లలోపు) సెల్‌ఫోన్లు చూస్తున్నారంటే కొంచెం కనిపెట్టుకుని ఉండాలి. ఎందుకంటే ఇంటర్నెట్ ప్రపంచంలోకి వెళితే అనేక రకాల వెబ్‌సైట్లు అందుబాటులోకి వస్తాయి. పైగా సైబర్ నేరాలు పెరిగిపోయాయి. అవతలి వారు పంపిన లింక్‌పై ఒక చిన్న క్లిక్ చేస్తేనే ఖజానా ఖాళీ అవుతుంది.

పెరిగిన వింత పోకడలు

సమాజంలో చదువుకునే బాలల్లో వింత పోకడలు పెరిగిపోతున్నాయి. ప్రధానంగా సెల్‌ఫోన్లలో క్రైం స్టోరీలు చూడడం మొదలు ఇతర అనేక రకాల కారణాలతో విద్యార్థులు కూడా వేరే వ్యవహారాలకు బానిసలవుతున్నారు. ఒకరిని కొట్టినా, తిట్టినా శిక్ష కఠినంగా ఉంటుందన్న విషయం తెలియకనో, లేక ఏమౌతుందిలే అన్న ధీమాతో ఏదంటే అది చేస్తున్నారు. తల్లిదండ్రులు, గురువులకు తెలియకుండా రహస్య ప్రాంతాలను ఎంచుకుని సిగరెట్లు తాగడం, మత్తు పదార్థాలను అలవాటు చేసుకోవడం ఇలా చెడు మార్గాలవైపు పయనిస్తున్నారు. తల్లిదండ్రులు పిల్లల విషయంగా ప్రత్యేక శ్రద్ధ పెట్టకపోతే ప్రమాదాలను కొని తెచ్చుకోవడమే అవుతుంది. దీనికితోడు చెడు సావాసంతో అనవసరంగా వెళ్లి వివాదాల్లో చిక్కుకుని జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.



అదొక్కటే కాదు...అనేక రకాల అశ్లీల బొమ్మలు, లైక్‌లు, సబ్‌స్క్రైబ్‌ల కోసం రకరకాల అసత్య ప్రచారాలు జరుగుతున్న తరుణంలో చిన్నారులకు తెలియకుండా జరిగే ఒక క్లిక్‌తో ప్రమాదాన్ని కొని తెచ్చుకోవమే. అన్నింటి కంటే ప్రధానంగా ప్రతి ఒక్కరూ ఇన్‌స్టాగామ్, వాట్సాప్‌లను క్రియేట్ చేసుకుని పెద్దలకు తెలియకుండా చూసిన తర్వాత డెలీట్ చేసి ఏమి తెలియనట్లు యదావిధిగా ఫోన్‌ను అందిస్తున్నారు. సెల్‌ఫోన్‌ను తగ్గించే ప్రయత్నం చేయడంతోపాటు పుస్తకాలు అలవాటు చేయడం, ఆటల ద్వారా వారిలో వినోదం పంచడం లాంటి వాటిపై దృష్టి కేంద్రీకరించాలి.

కేసులతో జీవితాలు ఛిద్రం

అన్నమయ్య జిల్లాలో అవనసరంగా చెడు మార్గంలో పయనిస్తూ పోలీసు కేసులతో తమ జీవితాలను వారే ఛిద్రం చేసుకుంటున్నారు. రెండేళ్ల కిందట మదనపల్లె, రాజంపేట పరిధిలో మైనర్లు పలు నేరాలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కున్నారు. నెలన్నర కిందట పీలేరులో గంజాయి మత్తులో ఇద్దరు విద్యార్థులు రైలు కిందపడి చనిపోయిన నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఇంతలోనే రాయచోటిలో మందలించిన టీచర్‌పై ముగ్గురు విద్యార్థులు చితకబాదడంతో ఉపాధ్యాయుడు మృతి చెందిన సంఘటనను తలుచుకుంటేనే గగుర్పాటు కనిపిస్తోంది.

సినిమాలు, సోషల్ మీడియా ప్రభావం



విద్యార్థులలో విపరీత పోకడలకు సినిమాలు సోషల్ మీడియా అధిక ప్రభావం చూపిస్తున్నాయి. సినిమాల్లో హీరో పాత్రధారి ఉపాధ్యాయులను కించపరచడం.. హేళన చేయడం హీరోయిజంగా చూపించడం టీచర్ల పట్ల తక్కువ భావం కలిగిస్తోంది. టీచర్ మందలిస్తే విద్యార్థుల మంచికేనన్న విషయాన్ని తల్లిదండ్రులు పిల్లలకు నేర్పించకపోవడం ప్రధాన లోపం. ఆరు ఏడు తరగతుల నుంచి విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావడం ఆందోళనకరం. విపరీత పోకడలు కలిగిన, మామూలు విద్యార్థులకు భిన్నంగా వ్యవహరించే విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే కౌన్సిలింగ్ ఇవాలి.

– డాక్టర్ రాధిక, సైక్రియాటిస్ట్, జిల్లా ఆస్పత్రి, మదనపల్లె

అన్నమయ్య మార్గాన్ని అభివృద్ధి చేయాలి

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ రెడ్డి



అన్నమయ్య మార్గంలో తిరుమలకు వెళ్తున్న ఆకేపాటి

తిరుమల: తిరుమల శ్రీవారిపై ఎన్నో వేల సంకీర్తనలు రచించిన మహా భక్తుడు అన్నమయ్య నడిచిన కాలిబాటను అభివృద్ధి చేయాలని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథ రెడ్డి కోరారు. రాజంపేట నుంచి ఈనెల ఆరో తేదీ నుంచి పాదయాత్రగా అన్నమయ్య బాటలో తిరుమలకు చేరుకున్న ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. అన్నమయ్య కాలిబాటలో ఇప్పటివరకు 22వ సారి పాదయాత్ర చేశానన్నారు. అన్నమయ్య కాలిబాటను అభివృద్ధి చెయ్యాలని పాదయాత్ర చేస్తున్నానన్నారు. నాలుగు రోజులుగా వేలాదిమంది తో పాదయాత్ర చేసి తిరుమలకు చేరుకున్నామని చెప్పారు. 500 సంవత్సరాలముందు అన్నమయ్య ఈ మార్గం ద్వారా పాదయాత్ర చేసి తిరుమలకు వచ్చారని తెలిపారు. వేల సంకీర్తనలు రాసి స్వామివారి కీర్తి ప్రపంచానికి పరిచయం చేశారని పేర్కొన్నారు. ఈ మార్గం ఎప్పటికైనా కాలిబాటగా అభివృద్ధి చెందుతుందని ఆశతో పాదయాత్ర చేస్తున్నామన్నారు.

సెంట్రల్ జైల్లో మరణాలపై మెజిస్టీరియల్ విచారణ జరపాలి

విదసం సభ్యుల డిమాండ్



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విదసం సభ్యులు

మహారాణిపేట: విశాఖ సెంట్రల్ జైల్లో జులై 30న జరిగిన దళిత యువకుడు ఉప్పాడ గౌరీశంకర్ మరణంపై మెజిస్టీరియల్ విచారణ జరపాలని విదసం ఐక్య వేదిక రాష్ట్ర సమితి కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మృతుడి తల్లి నర్సయ్యమ్మతో కలిసి, కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనందపురం మండలం పేకేటి గ్రామానికి చెందిన దళిత యువకుడు ఉప్పాడ గౌరీ శంకర్ ఈ ఏడాది జులై 30న విశాఖ కేంద్ర కారాగారం మరుగు దొడ్డిలో ఉరి వేసుకున్నట్లు జైలు అధికారులు ప్రకటించి చేతులు దులిపేసుకున్నారని ఆక్షేపించారు. గౌరీ శంకర్ మరణంపై కుటుంబ సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేశారని, శవ పంచనామా సందర్భంగా పోలీసు అధికారులు వీరి గోడు పట్టించుకోలేదని ఆరోపించారు. జైల్లో జరిగిన ఈ మరణ ఉదంతంపై అంతర్గత విచారణ, మెజిస్టీరియల్ విచారణ ఇంతవరకు జరగ లేదన్నారు. ఇది ఆత్మహత్య అని జైలు అధికారులు తమకు తాముగా నిర్ధారించి కేసును మూసివేసే కుట్రకు పూనుకున్నారని విమర్శించారు. కార్యక్రమంలో వేదిక సభ్యులు సోడదాసి సుధాకర్, జాజి ఓంకార్, ఉప్పాడ రాము, రవి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

కొడవలితో పాఠశాలకు వెళ్లిన విద్యార్థి

మదనపల్లె: అమ్మాయితో మాట్లాడుతున్న విషయాన్ని ఉపాధ్యాయులకు చెప్పారన్న కోపంతో తోటి విద్యార్థులను బెదిరించేందుకు పదోతరగతి విద్యార్థి కొడవలిని పాఠశాలకు తీసుకెళ్లిన ఘటన సోమవారం అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణంలో జరిగింది. నీరుగట్టువారిపల్లె వివేకానంద మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో పదోతరగతి విద్యార్థి, అదే పాఠశాలకు చెందిన అమ్మాయితో చనువుగా మాట్లాడుతుండటాన్ని తోటి విద్యార్థులు గమనించి ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు విద్యార్థిని మందలించారు. ఇది అవమానంగా భావించిన విద్యార్థి తోటి విద్యార్థులపై కోపం పెంచుకుని, వారిని బెదిరించేందుకు సోమవారం పాఠశాలకు కొడవలిని తీసుకువచ్చాడు. ఈ విషయాన్ని గమనించిన విద్యార్థులు ఉపాధ్యాయుల దృష్టికి తెచ్చారు. వారు విచారిస్తే నిజమేనని తేలడంతో పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు పాఠశాలకు చేరుకుని విద్యార్థిని మందలించి కౌన్సిలింగ్ నిర్వహించినట్లు తెలిసింది.

ఆధ్యాత్మిక సమాచారం

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో ఒక కంపార్ట్‌మెంట్ నిండింది. ఆదివారం అర్ధరాత్రి వరకు 73,107 మంది స్వామివారిని దర్శించుకోగా 22,721 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.58 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది.

అప్పన్న సన్నిధిలో వైస్ అడ్మిరల్ దీపక్ కపూర్



సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని నేవీ లాజిస్టిక్స్ కంట్రోలర్ ఏవీఎస్ఎం వైస్ అడ్మిరల్ దీపక్ కపూర్ కుటుంబ సమేతంగా సోమవారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు అంతరాలయంలో పూజలు జరిపి, వేద ఆశీర్వచనమిచ్చారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ అందించారు.

ఏడుగంగల కొలువుకు సర్వం సిద్ధం



శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తిలో ఏడు గంగల కొలువుకు సర్వం సిద్ధమైంది. మంగళవారం రాత్రి ముత్యాలమ్మగుడి వీధిలో ఉన్న ఏడు గంగమ్మల అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు.. కుంభం వేసి పూజలు నిర్వహించనున్నారు. తర్వాత ఏడు గంగమ్మలను సిద్ధం చేసి స్థాన ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం ఆయా స్థానాల్లో గంగమ్మలు కొలువుదీర్చనున్నారు. వీటిలో పెండ్లి మండపం వద్ద పొన్నాలమ్మ, గాంధీ వీధిలో అంకమ్మ, కొత్తపేట వద్ద భువనేశ్వరి, బ్రాహ్మణవీధిలో నల్లగంగమ్మ, జయరామరావువీధి కావమ్మ, భేరివారి మండపం వద్ద ముత్యాలమ్మ, సన్నిధివీధిలో అంకాలమ్మను కొలువు దీర్చనున్నారు. తర్వాత బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గంగమ్మలను భక్తులు దర్శించుకోనున్నారు.

విద్యా సమాచారం

నేడు, రేపు కల్చరల్ ఫెస్ట్

విశాఖ విద్య: ఆంధ్రా యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 10, 11 తేదీల్లో జరగనున్న యూనివర్సిటీ కల్చరల్ ఫెస్ట్‌ను జయప్రదం చేయాలని కమిటీ వర్సిటీ కార్యదర్శి వెంకటరమణ కోరారు. ఈమేరకు సోమవారం ఏయూలోని బాస్కెట్‌బాల్ గ్రౌండ్‌లో ఫ్లాష్‌మాబ్ ప్రదర్శించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ కమిటీ కార్యదర్శి డి.వెంకటరమణ మాట్లాడుతూ విద్యార్థులందరూ రెండు రోజులపాటు జరగనున్న సాంస్కృతిక కార్యక్రమాల్లో యూనివర్సిటీలోని అన్ని విభాగాల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. పాటలు, డ్యాన్స్‌లు, స్కిట్‌లు, ఇతర కార్యక్రమాలు ప్రదర్శిస్తారన్నారు.

ఫార్మసీ కళాశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం



విశాఖ విద్య: డాక్టర్ దేవా హెచ్.పురాణం, సీనియర్ ఎగ్జిక్యూటివ్, భాగస్వామి-మేనేజింగ్ డైరెక్టర్, గ్లోబల్ లైఫ్ సైన్సెస్ కన్సల్టింగ్ ఫర్మ్, పీ-ఏ, యూఎస్ఏ-యూకే సహకారంతో ఏయూ ఫార్మసీ కళాశాల కొత్త భవనం ఆవరణలో ఏర్పాటు చేసిన జిల్ పురాణం ఇన్‌స్ట్రుమెంటేషన్, కంప్యూటర్ ల్యాబ్‌ను సోమవారం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఇ.ఎన్.ధనుంజయరావు ప్రారంభించారు. డాక్టర్ దేవా హెచ్.పురాణం ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన తాజా పరికరాలను, పునర్నిర్మించి ఆధునికీకరించి గదులను రిజిస్ట్రార్‌కు చూపించారు. ల్యాబ్ స్థాపన, ఏర్పాటు ఉద్దేశాన్ని వివరించారు. పరిశ్రమ-అకాడమియా సంబంధం ప్రాముఖ్యతపై ముఖ్యంగా ప్రస్తావించారు.

వైద్య అధ్యాపకులకు శిక్షణ



తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాల వైద్య అధ్యాపకులకు, నిరంతర వైద్య విద్య కార్యక్రమంలో భాగంగా 'బేసిక్ కోర్స్ ఇన్ మెడికల్ ఎడ్యుకేషన్' అనే అంశంపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమం సోమవారం ప్రారంభించారు. ఎస్వీ వైద్య కళాశాల మెడికల్ ఎడ్యుకేషన్ విభాగం, తమిళనాడు చెందిన వేలూరు సీఎంసీ వైద్య కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ పీఏ చంద్రశేఖరన్ పాల్గొని ప్రసంగించారు. 30 మంది వైద్య అధ్యాపకులకు వైద్యవిద్య బోధనలో నూతన పద్ధతులపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

హెల్త్

సాక్షి ఫ్లస్

మంగళవారం ॥ 10-12-2024



ఆరోగ్యంపై నిద్ర ముద్ర

ఒక వ్యక్తి తాలూకు నిద్రపోతున్న తీరుతెన్నులను పరిశీలించి అతడి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవచ్చు. నిద్ర వల్ల ఒకరికి ఉన్న లేదా రాబోతున్న సమస్యలను తెలుసుకోవచ్చు కూడా. అదెలా అని సందేహమా? ఉదాహరణకు నిద్రపోతున్నప్పుడు గుండెల్లో మంటగా అనిపించి నిద్రలేస్తే... అది ఒక తరహా ఆరోగ్య సమస్యకు సూచన కావచ్చు. లేదా గాఢమైన నిద్రల్లో అకస్మాత్తుగా చెమటలు పట్టి నిద్రమెలకువ వస్తే... అది మరో రకమైన రుగ్మతను సూచించవచ్చు. ఇలా చూసినప్పుడు నిద్ర తాలూకు ఏయే అంశాలు ఏయే రకాల సమస్యలకు సూచన కావచ్చో తెలుసుకుందాం.

నిద్రలో కాలి పిక్కల కండరాలు పట్టేస్తుంటే...

• నిద్రలో అకస్మాత్తుగా పిక్కలు పట్టేయడం ఆ వ్యక్తి తగినంత ద్రవాహారం లేదా ద్రవాలు తీసుకోకపోవడం వల్ల కావచ్చు. సరైన పోషకాహారం తీసుకోకపోవడమూ మరో కారణం కావచ్చు. • రాత్రి నిద్రలో కాళ్ల కండరాలు, పిక్కలు పట్టేసి చాలాసేపు బాధిస్తున్నాయంటే తీసుకున్న ఆహారంలో పొటాషియమ్, మెగ్నీషియమ్ వంటి లవణాలు, తగినంత ద్రవాలు లేవని అర్థం.

పరిష్కారం: ఇదేమీ పెద్ద ప్రమాదకరమైన పరిణామం కాదుగానీ... దీనివల్ల కండరాలు పనిచేయడానికి అవసరమైన పాళ్లలో మెగ్నీషియమ్ మొదలైన లవణాలు లభించడం లేదని తెలుసుకుని, అవి భర్తీ అయ్యేందుకు గుమ్మడి గింజలు, చేపలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. పొటాషియమ్ అరటిపండ్లలో ఎక్కువ. దీనికితోడు తగినంత ఉప్పు, తగినన్ని నీళ్లతోపాటు ద్రవాహారం లేదా కొబ్బరి నీళ్లు తీసుకుంటుంటే ఈ సమస్య తగ్గిపోతుంది.

నిద్రలో గుండెల్లో మంటగా అనిపిస్తుంటే...



• అది జీఈఆర్‌డీ లేదా బ్యారెట్స్ సిండ్రోమ్ వల్ల కావచ్చని అనుమానించాలి. మనలో దాదాపు సగంమందిలో ముఖ్యంగా నడివయసు పెద్దల్లో ఏదో ఒక సమయంలో ఇలా అనిపించడం సాధారణం. ఈ లక్షణం కనిపించగానే ఆందోళన కలగడం మామూలే. ఎందుకంటే చాలామందిలో నిద్రలో గుండె మంటగా, ఛాతీలో ఇబ్బందిగా అనిపించినప్పుడు దాన్ని గుండెపోటుగా అనిపించినప్పుడు కొన్ని అంశాలను జాగ్రత్తగా పరిశీలించాలి. ఛాతీలో మంట; ఒళ్లంతా చెమటలు పట్టడం, ఎడమ భుజం/ ఎడమ దవడ / ఎడమ చేతిలో నొప్పి వంటి లక్షణాలు లేకపోతే... పెద్దగా ఆందోళన పడనవసరం లేదు. కానీ ఇదే లక్షణం తరచు కనిపిస్తున్నా లేదా తమ అనుమానాన్ని నివృత్తి చేసుకుందామనిపించినా డాక్టర్‌ను సంప్రదించడమే మంచిది.

ఒకపట్టాన నిద్రపట్టక మాటిమాటికీ తేన్పులొస్తుంటే...



ఇలా జరగడమన్నది గ్యాస్ట్రో ఈసోఫేజియల్ రిఫ్లక్స్ సిండ్రోమ్ (జీఈఆర్‌డీ) కావచ్చు. నిద్రపట్టకుండా చాలాసేపు మాటిమాటికీ కడుపులోంచి తేన్పులు వస్తున్నప్పుడు చాలామంది దీన్ని గ్యాస్ సమస్యగా భావిస్తుంటారు. అయితే ఇది ఈసోఫేగస్‌లోని కింద ఉండే కణాలు మార్పు చెందడం వల్ల వచ్చే 'కాలమ్నార్ ఎపిథీలియమ్ లైన్‌డ్ లోయర్ ఈసోఫేగస్' అనే కండిషన్ వల్ల ఇలా జరుగుతుండవచ్చు. ఇక్కడి కణజాలాల్లో మార్పులు వస్తుంటే... అది కాస్తా 'బ్యారట్స్ సిండ్రోమ్' అనే దశకు చేరుకునే ప్రమాదం కూడా ఉంది. మామూలుగా మనలోని చాలామందిలో కనిపించే.... గ్యాస్‌ను పైకి ఎగజిమ్మే 'జీఈఆర్‌డీ' (గ్యాస్ట్రో ఈసోఫేజియల్ రిఫ్లక్స్ సిండ్రోమ్) అయితే పర్వాలేదు. ఒకవేళ అది బ్యారెట్స్ సిండ్రోమ్‌గా మారుతుంటే మాత్రం అప్రమత్తంగా ఉండి, చికిత్స తీసుకోవాల్సిందే. ఎందుకంటే బ్యారెట్స్ సిండ్రోమ్ ఒక్కోసారి క్యాన్సర్‌కు దారితీసే ప్రమాదమూ ఉంటుంది. కేవలం గ్యాస్ సమస్యే అయితే జీవనశైలి మార్పుల ద్వారానే దాన్ని అధిగమించవచ్చు.

గురక ఎక్కువగా వినిపిస్తుంటే...



• కాసేపు శ్వాస ఆడకపోతే మెదడుకు తగినంత ఆక్సిజన్ అందక ప్రమాదకర పరిస్థితికి దారి తీయవచ్చు. శ్వాసకు అంతరాయం కలిగించే ఈ సమస్యను 'అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ఆప్నియా సిండ్రోమ్' అంటారు. • నిద్రపోయినప్పుడు గొంతు కండరాలు పూర్తిగా రిలాక్స్ అవుతాయి. దాంతో శ్వాసనాళం ముడుచుకుపోయి, దానిలోంచి వచ్చే గాలి ప్రకంపనలకు గురై, గొంతు నుంచి శబ్దం వస్తుంది. అదే గురక. శ్వాసనాళం పూర్తిగా మూసుకుపోయిన కండిషన్ ఒక్కోసారి 10 సెకండ్లకు పైగా కొనసాగవచ్చు. ఆ పరిస్థితిని మెదడు పసిగట్టి వెంటనే నిద్రలేచేలా ఆదేశాలిస్తుంది. ఈ సమస్య ఉన్నవారు అప్పుడు మేల్కొని శ్వాస తీసుకుని మళ్లీ నిద్రలోకి జారుకుంటారు. శ్వాస అందని ఈ స్థితి నిద్రలో అనేకసార్లు వస్తుంటుంది. దాంతో నిద్రాభంగం కావడంతో దేహానికి తగినంత నిద్ర అందదు. దీనినే స్లీప్ డెఫిసిట్ అంటారు. ఈ కారణంగా పగటివేళ వారు మందకొడిగా మారిపోతారు. గురకపెట్టడాన్ని చాలామంది మంచి నిద్రగా భావిస్తారు. నిజానికి అలా గురకపెడుతున్నారంటే వాళ్లకు మంచి నిద్ర కరవవుతుందనీ, నిద్రలో తగినంత నాణ్యత లేదని అర్థం. • ఇలా రాత్రుళ్లు గురకపెడుతూ, పగటి వేళల్లో నిద్రలోకి జారిపోతూ ఉంటే వారికి 'అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ఆప్నియా సిండ్రోమ్' ఉన్నట్లు చెప్పవచ్చు. దీనివల్ల రక్తంలో ఉండాల్సిన ఆక్సిజన్ తగ్గిపోయి, మెదడుకు తగినంత ప్రాణవాయువు అందక... గుండె స్పందనల్లో మార్పులు రావడం, రక్తపోటు పెరగడం, గుండెపోటుకు దారితీయడం వంటి ప్రమాదకర పరిస్థితులు ఏర్పడవచ్చు.

పరిష్కారం: గురకపెట్టే వారికి స్థూలకాయం ఉంటే... వారు తప్పక బరువు తగ్గడానికి ప్రయత్నించాలి. ఇలాంటివారు నిద్రకు ముందు ఆల్కహాల్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ తీసుకోకూడదు. పొగతాగే అలవాటును వదిలేయాలి. నిద్రలేమితో నిద్రమాత్రలు వాడే అలవాటు ఉంటే దాన్ని పూర్తిగా మానేయాలి.

రాత్రిళ్లు నిద్రలో తీవ్రంగా చెమటలు పడుతుంటే...

• అది క్షయ (ట్యూబర్క్యులోసిస్) కావచ్చు. సాధారణంగా క్షయ వ్యాధి ఉన్నవారి శరీర ఉష్ణోగ్రత ఉదయం వేళలతో పోలిస్తే... సాయంత్రం నుంచి రాత్రి వేళల్లో మరింతగా ఎక్కువవుతుంది. ఒక్కోసారి ఈ శరీర ఉష్ణోగ్రత ఎంతగా పెరుగుతుందంటే, రాత్రివేళల్లో తీవ్రంగా చెమటలు పట్టి, పక్కబట్టలూ తడిసి వాటిని మార్చాల్సి వస్తుంది. • మైకోబ్యాక్టీరియమ్ ట్యూబర్క్యులోసిస్ బ్యాసిల్లస్ అనే సూక్ష్మక్రిమి కారణంగా క్షయ వ్యాధి వస్తుందన్న విషయం తెలిసిందే. ఇది ఊపిరితిత్తులతో పాటు మూత్రపిండాలు, వెన్నెముక, మెదడు, యుటెరస్ వంటి కీలక అవయవాలనూ ప్రభావితం చేస్తుంది. కొన్నిరోజులు మందులు వాడగానే రోగ లక్షణాలు తగ్గడంతో మనలో చాలా మంది మందులు మానేస్తారు. ఇలాంటి కేసులు చాలా ఎక్కువ. దాంతో మందులకు లొంగని 'డ్రగ్ రెసిస్టెన్స్ టీబీ' కేసులు ఎక్కువ.

పరిష్కారం: టీబీని పూర్తిగా నయమయ్యే వరకు క్రమం తప్పకుండా మందులు వాడటం తప్పని సరి.

రాత్రిళ్లు చాలాసార్లు మూత్రవిసర్జనకు వెళ్లాల్సివస్తుంటే..

• తొలుత అది డయాబెటిస్ కావచ్చేమోనని అనుమానించాలి. రక్తంలో ఎక్కువైన చక్కెరను బయటకు పంపేందుకు కిడ్నీలు ఎక్కువగా పని చేస్తుంటాయి. • మరికొందరిలో మూత్రం వచ్చినట్లు అనిపిస్తూ, అది చుక్కలు చుక్కలుగా పడుతూ, వారి వయసు యాభై దాటి ఉంటే మాత్రం 'ప్రోస్టేట్ ఎన్‌లార్జ్‌మెంట్' వల్ల అలా జరుగుతుండవచ్చు.

పరిష్కారం: అది డయాబెటిస్ వల్ల అని తేలితే... చక్కెరను నియంత్రించే మందులు వాడుతుండాలి. ఒకవేళ ప్రోస్టేట్ గ్రంథి వాపు వల్ల అని తెలిస్తే... మొదట మందులు వాడి, అప్పటికీ ప్రయోజనం లేకపోతే ఎండోస్కోపీ ద్వారా టీయూఆర్‌పీ అనే శస్త్రచికిత్స చికిత్స చేయించాల్సి వస్తుంది.

● గర్భిణులూ... వ్యాక్సిన్లు

గర్భవతులు తమ ఆరోగ్యం కోసం కొన్ని, తమకు పుట్టబోయే చిన్నారి ఆరోగ్యం కోసం మరికొన్ని వ్యాక్సిన్లు తీసుకుంటూ ఉండాలి. అయితే గర్భం రాకముందు కూడా కొన్ని వ్యాక్సిన్లు వేసుకోవాల్సి ఉంటుంది. కొందరిలో వారి వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి కూడా ఇంకొన్ని వ్యాక్సిన్లు తీసుకోవాల్సి రావచ్చు. గర్భం కోసం ప్లాన్ చేసుకునే మహిళలు, ఆపై గర్భం ధరించాక గర్భవతులు... ఇలా మహిళందరూ తాము తీసుకోవాల్సిన వ్యాక్సిన్ల గురించి తెలుసుకోడానికి ఉపయోగపడే కథనం ఇది.

కాబోయే అమ్మలకు టీకాపలా!

గర్భవతినని తెలియగానే ఆమె తనకు వచ్చేందుకు అవకాశమున్న ఇన్ఫెక్షన్ల గురించి, తాను తీసుకోవాల్సిన వ్యాక్సిన్ల గురించి అవగాహన కలిగి ఉండాలి. గర్భిణులు తీసుకోవాల్సిన వ్యాక్సిన్‌లు ఇవి...

• టెటనస్, డిఫ్తీరియా, పెర్టుసిస్ (డీపీటీ) వ్యాక్సిన్: టెటనస్ వచ్చిన బాధితుల్లో కండరాలు అసాధారణంగా ప్రవర్తిస్తాయి. డిఫ్తీరియా వస్తే గొంతులోపల వెనక భాగంలో ఒక మందపాటి పొరగా ఏర్పడి, అది శ్వాస సమస్యలకు కారణమయ్యే అవకాశం ఉంది. ఇక 'కోరింత దగ్గు' అని పిలిచే పెర్టుసిస్ అనే వ్యాధితో పాటు పైన పేర్కొన్న మరో రెండు.. అన్నీ కలిసి మూడు ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించుకోడానికి గర్భవతి విధిగా డీపీటీ వ్యాక్సిన్ తీసుకోవాలి. సంక్షిప్తంగా 'టీ-డాప్' అని పిలిచే ఈ వ్యాక్సిన్‌ను గర్భధారణ జరిగిన ప్రతిసారీ తీసుకోవాలి. గర్భధారణ తర్వాత 20 వారాలప్పుడు దీన్ని తీసుకోవాలి. ఇక 27వ వారం నుంచి 36వ వారం మధ్యలో తీసుకోవడం కూడా మంచిదే. ఇలా చేయడం వల్ల పుట్టిన చిన్నారికి సైతం ఆ వ్యాధుల నుంచి కొంతకాలం పాటు రక్షణ లభించే అవకాశం ఉంటుంది.



• ఇన్‌ఫ్లుయెంజా (ఫ్లూ) వ్యాక్సిన్: గర్భవతి విధిగా ఫ్లూ వ్యాక్సిన్ తీసుకోవాలి. నిజానికి కేవలం గర్భవతులే కాదు... ప్రజలందరూ తీసుకోవడం మంచిదే. అయితే గర్భవతుల్లో ఫ్లూ వ్యాధి చాలా ప్రమాదకరంగా పరిణమించే అవకాశం ఉంది. ప్రతి సీజన్‌లో మహిళలందరూ దీన్ని తీసుకోవడంతో పాటు, గర్భవతులైతే మరింత తప్పనిసరిగా తీసుకోవాలి. ఇక గర్భధారణ సమయంలో దీన్ని తీసుకోవడం వల్ల పిండంపై పడే దుష్ప్రభావంపై అధ్యయనాలు పెద్దగా లేవు. పైగా గర్భం ధరించి ఉన్నప్పుడు తీసుకునే ఈ వ్యాక్సిన్ బిడ్డ పుట్టాక మొదటి ఆర్నెల్లపాటూ చిన్నారికీ రక్షణ ఇస్తుందని కొందరు నిపుణుల అభిప్రాయం. కొన్ని సందర్భాల్లో ఇన్‌ఫ్లుయెంజా వ్యాక్సిన్‌ను ముక్కుతో పీల్చడం ద్వారా కూడా తీసుకోవచ్చు. కానీ ఈ తరహా ముక్కుతో పీల్చే వ్యాక్సిన్‌ను లైవ్ వైరస్‌తో తయారు చేస్తారు కాబట్టి గర్భవతులు మాత్రం పీల్చే వ్యాక్సిన్‌ను అస్సలు వాడకూడదు.

గర్భం దాల్చడానికి ముందుగానే తీసుకోవాల్సిన వ్యాక్సిన్లు...

గర్భం దాల్చాలనుకున్న మహిళలు తాము ప్రెగ్నెన్సీని ప్లాన్ చేసుకోగానే కొన్ని వ్యాక్సిన్లను తప్పక తీసుకోవాలి. అవి... మీజిల్స్, మంప్స్, రుబెల్లా, చికెన్‌పాక్స్ వ్యాక్సిన్లు. గర్భం దాల్చిన తర్వాత తీసుకుంటే ఈ వ్యాక్సిన్లు గర్భవతికి ప్రమాదకరంగా పరిణమించవచ్చు. అందుకే వీటిని ప్రెగ్నెన్సీ ప్లానింగ్ అప్పుడే తీసుకోవాలి. ఒకవేళ వ్యాధి నిరోధకత (ఇమ్యూనిటీ) పెద్దగా లేని గర్భవతికీ లేదా ఇమ్యూనిటీ చాలా బలహీనంగా ఉన్న మహిళలకు ఈ ఇన్ఫెక్షన్లు సోకితే అది చాలా ప్రమాదకారులు కావచ్చు. కాబట్టి వీటిని ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకోవాలనుకున్నప్పుడు... మరీ చెప్పాలంటే... ఇంకా గర్భం దాల్చక ముందే తీసుకోవడం మంచిది. (ఈ వ్యాక్సిన్లను రొటీన్ వ్యాక్సినేషన్‌లో భాగంగానే ఇస్తారు. ఒకవేళ అలా తీసుకోనివారు తప్పక ఈ వ్యాక్సిన్లు తీసుకోవాలి).

ఒకవేళ మీజిల్స్, మంప్స్, రుబెల్లా (ఎమ్ఎమ్ఆర్) వ్యాక్సిన్‌ను బాల్యంలో తమ రొటీన్ వ్యాక్సినేషన్ కార్యక్రమంలో తీసుకున్నారా లేదా అనే సందేహం ఉంటే ఆ విషయాన్ని తమ డాక్టర్‌తో చెప్పాలి. అప్పుడు వారు ఒక రక్తపరీక్ష ద్వారా ఆ వ్యక్తి ఎమ్ఎమ్ఆర్ వ్యాక్సిన్ తీసుకొని ఉన్నారా, లేదా అని తెలుసుకుంటారు. దాన్ని బట్టి అవసరమైతే ఆ వ్యాక్సిన్ ఇస్తారు. ఎమ్ఎమ్ఆర్ వ్యాక్సిన్ తీసుకోని మహిళలకు గర్భందాల్చాక అర్లీ ప్రెగ్నెన్సీ సమయంలో ఆ వ్యాధులు (మీజిల్స్, మంప్స్, రుబెల్లా) సోకితే గర్భస్రావం అయ్యే అవకాశాలూ ఉంటాయి. ఒకవేళ రుబెల్లా వైరస్ గానీ అర్లీ ప్రెగ్నెన్సీ సమయంలో సోకిందంటే... అది బిడ్డలో పుట్టుకతోనే వచ్చే తీవ్రమైన వ్యాధులకు కారణమవుతుంది. రుబెల్లా వైరస్ సోకడం వల్ల పుట్టిన బిడ్డలకు వినికిడి సమస్యలు, కళ్లు, గుండె, మెదడు సమస్యల వంటివి వచ్చేందుకు అవకాశాలెక్కువ. అర్లీ ప్రెగ్నెన్సీలో కాకుండా... రెండో త్రైమాసికం తర్వాతగానీ ఇవే ఇన్ఫెక్షన్లు సోకినా అవి బిడ్డపై అవి పెద్దగా ప్రభావం చూపవు.



• వారిసెల్లా (చికెన్‌పాక్స్) వైరస్ గర్భవతికి సోకవం వల్ల (ముఖ్యంగా అర్లీ ప్రెగ్నెన్సీలో) బిడ్డలో పుట్టుకతోనే ఎన్నో సమస్యలు వచ్చే అవకాశం ఉంది. ఒక చిన్న రక్తపరీక్ష ద్వారా గర్భిణి గతంలోనే చికెన్‌పాక్స్ వ్యాక్సిన్ తీసుకుని ఉన్నారో లేదో తెలుసుకోవచ్చు. కాబట్టి గర్భం దాల్చాలనుకునేవారు, ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకునే ముందరే ఈ పరీక్ష చేయించుకుని, ఒకవేళ చికెన్‌పాక్స్ వ్యాక్సిన్ తీసుకుని ఉండకపోతే ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకోడానికి నెల్లాళ్ల ముందే దాన్ని తీసుకోవడం మేలు.

• హ్యూమన్ పాపిలోమా వైరస్: హెచ్‌పీవీ అని సంక్షిప్తంగా పిలిచే ఈ వైరస్‌కు సంబంధించిన వ్యాక్సిన్‌ను అమ్మాయిలు తమ తొమ్మిదో ఏటి నుంచి 26 ఏళ్ల వయసు మధ్యలో ఎప్పుడైనా తీసుకోవచ్చు. నిజానికి ఈ వైరస్‌ను యాక్టివ్ వైవాహిక జీవితాన్ని ప్రారంభించకముందే తీసుకుంటే దీనివల్ల సర్వైకల్ క్యాన్సర్ సైతం నివారితమవుతుంది.

గర్భిణికి ఇవ్వకూడని వ్యాక్సిన్...

జోస్టర్ వ్యాక్సిన్‌ను గర్భవతికి ఎట్టిపరిస్థితుల్లోనూ ఇవ్వకూడదు. ఎందుకంటే ఇది జీవించి ఉండే వైరస్‌తో తయారు చేసే వ్యాక్సిన్. కాబట్టి దీన్ని గర్భం దాల్చినవారికి ఇవ్వరు. సాధారణంగా దీన్ని 50 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయసున్నవారికి సిఫార్సు చేస్తుంటారు. ఆ సమయానికి గర్భధారణ వయసు ఎలాగూ మించిపోతుంది కాబట్టి దీని ప్రభావం గర్భధారణపై ఉండటానికి ఆస్కారం ఉండదు. ఇవీ... గర్భవతులు, గర్భం దాల్చాలనుకునే వారితో పాటు ఇతర మహిళలూ తెలుసుకోవాల్సిన వ్యాక్సిన్లు, వాటి గురించి వివరాలు.

● సౌండ్ స్లీప్

పిల్లోలు.. పరుపు ఎలా ఉండాలంటే...



రాత్రివేళ నిద్రలో మనం చాలాసార్లు అటు పక్కకూ, ఇటు పక్కకూ తిరగాల్సి వస్తుంది. అలా పక్కకు తిరిగి పడుకున్న సమయంలో తలకూ, పడకకూ మధ్య చాలా గ్యాప్ ఉంటుంది. ఆ గ్యాప్ కారణంగా తలపై మరింత భారం పడి సుఖ నిద్ర సాధ్యం కాదు. అందుకే మంచి తలగడను ఉపయోగించడం ద్వారా ఆ గ్యాప్ లేకుండా చూసుకోవాలి. కొందరు తలగడ ఉన్నా దాని సపోర్ట్ సరిపోక మళ్లీ భుజాన్ని కూడా వాడుతుంటారు. ఇది కూడా సరి కాదు.

తలగడ ఎలా ఉండాలంటే...

• తలగడ మృదువుగా భుజాలు, తల పట్టేంత సైజులో ఉండాలి. కార్లలో ఉపయోగించే చిన్న తలగడలు పడక మీద నిద్రలో ఉపయోగించడం సరి కాదు. • తలగడను కేవలం తలకింద మాత్రమే అమరేలా కాకుండా... కొంత భాగం భుజాల కిందికీ వచ్చేలా అమర్చుకోవాలి. దీనివల్ల స్పాండిలోసిస్ కారణంగా వచ్చే మెడనొప్పి నివారితమవుతుంది. స్పాండిలోసిస్, మెడనొప్పి, భుజాల నొప్పి వంటి సమస్యలు ఉన్నవారు తమకు అనువైన తలగడను ఎంచుకొని, నిద్ర కోసం దాన్నే వాడాలి. • ఎవరి తలగడ వారికి వేరుగా ఉండాలి. • తలగడ మీద ఉండే డస్ట్‌మైట్స్ తో కొందరికి అలర్జీలూ, ఆస్తమా కూడా రావచ్చు. అందుకే తలగడను శుభ్రంగా ఉంచుకోవాలి. ఇందుకోసం ఉతికిన పిల్లోకవర్ తొడిగిన తలగడనే వాడాలి.

పడక ఎలా ఉండాలంటే...

వీపునొప్పితో బాధపడే చాలామంది పరుపు వాడకూడదని, గట్టి ఉపరితలం మీద పడుకోవాలన్న అపోహతో చెక్కబల్ల మీద పడుకుంటుంటారు. వాస్తవానికి అది మంచిది కాదు. మంచి పరుపు మీద పడుకోవడమే మంచిది. అది శరీరానికి గట్టిగా ఒత్తుకోకుండా ఉండేంత మృదువుగా ఉండాలి. అదేవిధంగా మనం అందులోకి కూరుకుపోయేటంత మెత్తగా ఉండకూడదు. గట్టి ఉపరితలం మీద పడుకుంటే ఒంట్లో చాలా భాగాలు నొక్కుకుపోయి, అలా నొక్కుకుపోయిన చోట్ల నొప్పి వచ్చే అవకాశముంటుంది. అందుకే పరుపును ఎంపిక చేసే సమయంలో అది శరీరానికి ఒత్తుకోకుండా మృదువుగా ఉండటంతో పాటు మనం కూరుకుపోకుండా ఉండే లాంటి పరుపును తీసుకోవాలి. పరుపు వాడేటప్పుడు ప్రతివారం దాన్ని తిరగవేయడం మంచిది. ఎందుకంటే ఒకేవైపు వాడుతుంటే శరీరం బరువు ఒకేచోట పడి అది తన ఎలాస్టిసిటీని కోల్పోయి, గుంటలా పడుతుంది. అందుకే మార్చి మార్చి వాడాలి. ఒక పరుపును మూడేళ్ల పాటు నిరభ్యంతరంగా వాడుకోవచ్చు. ఆ తర్వాత అవకాశముంటే మార్చడమే మంచిది.

'ఫాస్ట్'గా స్లిమ్ కాకండి!



చాలామంది టీనేజర్లు స్లిమ్‌గా ఉండాలని అనుకుంటారు. అయితే అందుకోసం తమలోని కొవ్వులను దహింపజేసుకోకుండా... కడుపు మాడ్చుకుని తమ కండరాలను (మజిల్ మాస్‌ను) కోల్పోతారు. ఇలా ఫ్యాట్‌ను కోల్పోకుండా మజిల్ మాస్‌ను కోల్పోవడం వల్ల చూడ్డానికి సన్నగా, స్లిమ్‌గా అనిపించినప్పటికీ, ఆరోగ్యపరంగా చేస్తే అది మంచి పరిణామం కాదు. అలా జరగకుండా ఉండాలంటే ఏలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం.

స్లిమ్‌గా మారి ఆరోగ్యకరమైన సన్నటి దేహాకృతిని పొందాలనుకునే వారు తాము రోజూ తీసుకునే క్యాలరీలను బాగా తగ్గించుకుంటారు. ఇందుకోసం వాటర్‌థెరపీ, ఫ్రూట్‌థెరపీ, క్యారట్ థెరపీ, జీఎమ్ డైట్ వంటి అనేక ప్రక్రియలను ఫాలో అవుతుంటారు. ఈ డైట్ రెజీమ్‌లతో తమ ఆహారంలో తీసుకోవాల్సిన పిండిపదార్థాలను బాగా తగ్గించుకుంటారు. దీనివల్ల తాము బాగా బరువు తగ్గుతున్నామని అనుకుంటుంటారు గానీ... తాము తమ కండరాల పరిమాణాన్నీ (మజిల్ మాస్)ను / కండరాల శక్తినీ కూడా కోల్పోతున్నామని గుర్తించరు. కండరాలను కోల్పోతుంటే, దాంతో పాటు ఎముక సాంద్రత (బోన్ డెన్సిటీ) ని కూడా కోల్పోతున్నారని కూడా అర్థం. ఇదెంతో ప్రమాదం.

ఆరోగ్యంగా సన్నబడాలంటే...

మంచి సౌష్ఠవంతో కూడిన శరీరాకృతిని పొందాలంటే దహించాల్సినది కొవ్వులను మాత్రమే. మన దేహపు అవసరాలకు పనికి వచ్చాక మన పొట్ట చుట్టూ పేరుకుపోయి 'సెంట్రల్ ఒబేసిటీ' ని కలిగించే కొవ్వులను మాత్రమే.

తక్కువ పోషకాలతోనే మెటబాలిజమ్ జరిగేలా దేహానికి అలవాటు చేయడమూ సరి కాదు...

కొన్నిసార్లు సన్నబడాలనే తీవ్రమైన కోరికతో చాలా తక్కువ క్యాలరీలతోనే జీవక్రియలు కొనసాగేలా దేహానికి అలవాటు చేస్తే... అప్పుడు ఆ కొద్దిపాటి ఆహారంతోనే మెటబాలిక్ యాక్టివిటీస్ అన్నీ నిర్వహించుకునే సామర్థ్యాన్ని దేహం పొందుతుంది. ఏళ్ల తరబడి అలా చేశాక కొద్దిపాటి అదనపు ఆహారం తీసుకున్నా అది శరీర బరువును విపరీతంగా పెంచేస్తుంటుంది. దీన్నే 'రెసిస్టెంట్ ఒబేసిటీ' అని అంటారు. ఈ రెసిస్టెంట్ ఒబేసిటీ వల్ల దీర్ఘకాలం పాటు చాలా చాలా అందంగా కనిపించిన హీరో, హీరోయిన్లు... కెరియర్‌కు దూరంగా ఉన్నప్పుడు కొద్ది వ్యవధిలోనే ఒకేసారి లావెక్కిపోయినట్లుగా కనిపించడం చాలామంది సెలబ్రిటీల్లో కనిపిస్తుంటుంది.

కండరాలను కోల్పోకుండానే కొవ్వులను దహించడం ఎలా?

సన్నబడి మంచి శరీరాకృతి (స్లిమ్ బాడీ) పొందాలంటే ప్రణాళికాబద్ధంగా కండరాలను (మజిల్ మాస్‌ను) కోల్పోకుండా, అదనపు కొవ్వులను మాత్రమే దహించే విధంగా, ఆరోగ్యకరంగా సన్నబడాలి. స్లిమ్‌గా ఉండాలంటూ భోజనాన్ని మానేస్తే ఒక్కోసారి అనొరెక్సియా నర్వోజా, బులీమియా లాంటి మానసిక సమస్యలూ రావచ్చు. అందుకే బాగా తింటూనే మంచి ఆరోగ్యం కోసం దేహానికి కాస్త కష్టం కలిగించే వ్యాయామాలు చేస్తుండాలి. అయితే అంతగా మంచి ఫిట్‌నెస్ లేనివారు మాత్రం దేహానికి విపరీతమైన శ్రమ కలిగించని విధంగా తేలికపాటి వ్యాయామం చేస్తూ... క్రమంగా ఫిట్‌నెస్‌ను సాధించాలి. ఆ తర్వాత స్టామినాను క్రమంగా పెంచుకుంటూ పోవాలి.

సాక్షి ప్లస్
మంగళవారం । 10-12-2024

బిజినెస్ రీల్

ఏడేళ్లలో 600 ఫాస్ట్ ఛార్జింగ్ స్టేషన్లు



హ్యుందాయ్ మోటర్స్ ప్రణాళికలు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా వచ్చే ఏడేళ్లలో ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించి సుమారు 600 పబ్లిక్ ఫాస్ట్ చార్జింగ్ స్టేషన్లను నెలకొల్పనున్నట్లు హ్యుందాయ్ మోటార్స్ ఇండియా వెల్లడించింది. 2024 డిసెంబర్ నెలాఖరు నాటికి 50 స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించింది. 2030 నాటికి భారత ఈవీ మార్కెట్ భారీ స్థాయిలో వృద్ధి చెందే అవకాశం ఉందని కంపెనీ ఫంక్షన్ హెడ్ (కార్పొరేట్ ప్లానింగ్ విభాగం) జే వాన్ రియూ తెలిపారు. చార్జింగ్ మౌలిక సదుపాయాలు సరిగ్గా లేకపోవడం వల్ల కస్టమర్లు జాతీయ రహదారులపై సుదీర్ఘ ప్రయాణాలు చేయడానికి సంకోచిస్తున్నట్లుగా తమ అధ్యయనాల్లో వెల్లడైనట్లు ఆయన వివరించారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రధాన నగరాలతో పాటు కీలక హైవేలపై కూడా చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నట్లు రియూ తెలిపారు.

వ్యాపార విస్తరణపై ఎల్అండ్‌టీ ఫైనాన్స్ దృష్టి

ముంబై: కార్యకలాపాలు ప్రారంభించి మూడు దశాబ్దాలు పూర్తయిన నేపథ్యంలో రుణ లభ్యత, ఆర్థిక అక్షరాస్యత పెంపు, వ్యాపార విస్తరణపై మరింతగా దృష్టి పెడుతున్నట్లు ఎల్అండ్‌టీ ఫైనాన్స్ ఎండీ సుదీప్త రాయ్ తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంత కస్టమర్లకు ఆర్థిక సేవలు అందించేందుకు సాంకేతికతను వినియోగించుకుంటున్నట్లు వివరించారు. ప్రస్తుతం 20 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లో 35,000 పైగా సిబ్బందితో కార్యకలాపాలు సాగిస్తున్నట్లు రాయ్ పేర్కొన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో కంపెనీ రూ. 696 కోట్ల నికర లాభం నమోదు చేసింది.

జనవరిలో భారత్ బ్యాటరీ షో

పాల్గొననున్న 100 పైగా అంతర్జాతీయ సంస్థలు

న్యూఢిల్లీ: రెండో విడత భారత్ బ్యాటరీ షో 2025 జనవరి 19 నుంచి 21 వరకు న్యూఢిల్లీలో నిర్వహించనున్నారు. ఇందులో భారత్‌తో పాటు అమెరికా, జపాన్, చైనా తదితర దేశాల నుంచి 100కు పైగా కంపెనీలు పాల్గొనున్నాయి. అధునాతన ఉత్పత్తులను ఈ షోలో ప్రదర్శించనున్నట్లు ప్రభుత్వం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. సుమారు 50 దేశాల నుంచి 5,00,000 మంది పైగా సందర్శకులు దీన్ని సందర్శించనున్నట్లు వివరించింది. ఇండియా ఎనర్జీ స్టోరేజ్ అలయన్స్ (ఐఈఎస్ఏ) ఈ మెగా కార్యక్రమానికి భాగస్వామిగా వ్యవహరిస్తోంది. ఇందులో ప్రధానంగా లిథియం అయాన్ బ్యాటరీలు, బ్యాటరీ విడిభాగాలు, టెస్టింగ్ సొల్యూషన్స్, తయారీ పరికరాలు, చార్జింగ్ మౌలిక సదుపాయాలు, బ్యాటరీ స్వాపింగ్ సొల్యూషన్స్ మొదలైన వాటిని ప్రదర్శించనున్నారు. బ్యాటరీ టెక్ పెవిలియన్, సప్లై చెయిన్ పెవిలియన్, చార్జింగ్ ఇన్‌ఫ్రా పెవిలియన్ మొదలైన ప్రత్యేక పెవిలియన్లు ఉంటాయని ఐఈఎస్ఏ ప్రెసిడెంట్ దేవి ప్రసాద్ దాష్ తెలిపారు. ఐఈఎస్ఏ జనవరి 16–17 మధ్య ఇండియా బ్యాటరీ మాన్యుఫ్యాక్చరింగ్ అండ్ సప్లై చెయిన్ సదస్సును (ఐబీఎంఎస్‌సీఎస్), జనవరి 18న ఇండియా బ్యాటరీ రీసైక్లింగ్ అండ్ రీ-యూజ్ సదస్సును నిర్వహించనున్నట్లు వివరించారు.

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
WIPRO	305.3	2.67
LT	3,954.75	2.28
SBILIFE	1,467.85	1.33
TATASTEEL	149.7	0.95
BPCL	303.05	0.9

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TATACONSUM	934.2	-4.13
HINDUNILVR	2,402.00	-3.29
TATAMOTORS	799.7	-2.09
NESTLEIND	2,229.00	-1.71
ASIANPAINT	2,392.90	-1.51

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	6,946
ఎన్ఎస్ఈ	1,06,674
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,46,521
ఎఫ్ఐఐ	+ 7,24
డీఐఐ	- 1,648

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	68.68	$ 67.02
బ్రెంట్	72.47	$ 71.12

వారమంతా..

ఐపీవోల సందడి..

లిస్టులో 11 ఇష్యూలు

- 5 మెయిన్‌బోర్డ్, 6 ఎస్ఎంఈల పబ్లిక్ ఇష్యూలు
- రూ. 18,500 కోట్ల సమీకరణలో కంపెనీలు



న్యూఢిల్లీ: ఐపీవోల జాతరతో ఈ వారమంతా మార్కెట్ సందడిగా ఉండనుంది. చిన్నా, పెద్దవి కలిపి మొత్తం 11 కంపెనీలు పబ్లిక్ ఇష్యూకి వస్తున్నాయి. రూ. 18,500 కోట్లు సమీకరించబోతున్నాయి. విశాల్ మెగామార్ట్, సాయి లైఫ్ సైన్సెస్, ఫిన్‌టెక్ సంస్థ వన్ మొబిక్విక్ సిస్టమ్స్ మొదలైనవి ఈ జాబితాలో ఉన్నాయి. మొత్తం మీద అయిదు పెద్ద సంస్థల ఇష్యూలు, ఆరు చిన్న–మధ్య తరహా సంస్థల (ఎస్ఎంఈ) ఇష్యూలు వీటిలో ఉన్నాయి. ఆరు ఎస్ఎంఈలు సుమారు రూ. 150 కోట్లు సమీకరించనున్నాయి. వివిధ రంగాలకు చెందిన సంస్థల ఐపీవోలు.. కొత్త షేర్ల జారీ, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానాల్లో ఉండనున్నాయి. ప్రస్తుత షేర్‌హోల్డర్లు తమ వాటాలను విక్రయించుకునేందుకు, సంస్థలు విస్తరణ ప్రణాళికల కోసం నిధులను సమీకరించుకునేందుకు, రుణాలను తిరిగి చెల్లించివేసేందుకు, వర్కింగ్ క్యాపిటల్ అవసరాల కోసం నిధులను సమకూర్చుకునేందుకు కంపెనీలకు ఈ ఇష్యూలు ఉపయోగపడనున్నాయి. మహారాష్ట్ర ఎన్నికలు, ఉత్తర్ ప్రదేశ్ లోక్‌సభ బై-ఎలక్షన్ల ఫలితాలతో మార్కెట్లో సానుకూల సెంటిమెంటు నెలకొందని, ఐపీవోలు విజయవంతమయ్యేందుకు ఇది దోహదపడగలదని ఆన్‌లైన్ బ్రోకరేజీ సంస్థ ట్రేడ్‌జినీ సీవోవో డి. త్రివేశ్ తెలిపారు.

2024లో ఇప్పటివరకు రూ. 1.4 లక్షల కోట్ల సమీకరణ..

ఈ ఏడాది ఇప్పటివరకు 78 మెయిన్ బోర్డ్ కంపెనీలు, పబ్లిక్ ఇష్యూల ద్వారా దాదాపు రూ. 1.4 లక్షల కోట్లు సమీకరించాయి. వీటిలో హ్యుందాయ్ మోటర్ ఇండియా, స్విగ్గీ, ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ, బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్, ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ వంటి దిగ్గజ ఇష్యూలు ఉన్నాయి. 2023లో 57 సంస్థలు రూ. 49,436 కోట్లు సమీకరించాయి. గత కొన్నాళ్లుగా ఇటు ఇష్యూయర్లు అటు ఇన్వెస్టర్లలోను ప్రైమరీ మార్కెట్లపై గణనీయంగా ఆసక్తి పెరిగింది. గడిచిన అయిదు ఆర్థిక సంవత్సరాల్లో ఐపీవో ఇన్వెస్టర్లు భారీగా లాభాలు పొందారు. 2021–2025 ఆర్థిక సంవత్సరాల మధ్యలో వచ్చిన 236 ఐపీవోలు .. రిటైల్ ఇన్వెస్టర్లకు సగటున 27 శాతం మేర లిస్టింగ్ లాభాలు అందించాయని పరిశ్రమ వర్గాలు తెలిపాయి.

ఇష్యూల వివరాలు..

- విశాల్ మెగా మార్ట్, సాయి లైఫ్ సైన్సెస్, మొబిక్విక్ ఇష్యూలు డిసెంబర్ 11న ప్రారంభమై 13న ముగుస్తాయి. ఇన్వెంచరస్ నాలెడ్జ్ సొల్యూషన్స్, ఇంటర్నేషనల్ జెమలాజికల్ ఇనిస్టిట్యూట్ ఐపీవోలు డిసెంబర్ 12న, 13న ప్రారంభమవుతాయి.
- విశాల్ మెగామార్ట్ ఐపీవో ద్వారా రూ. 8,000 కోట్లు సమీకరిస్తోంది. ఇది పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో ఉంటుంది. ప్రమోటర్ కేదారా క్యాపిటల్‌కి చెందిన సమాయత్ సర్వీసెస్ ఓఎఫ్ఎస్ కింద షేర్లను విక్రయిస్తోంది. ధర శ్రేణి ఒక్కో షేరుకు రూ. 74–78గా నిర్ణయించారు.
- సాయి లైఫ్ సైన్సెస్ ఐపీవోకి సంబంధించి ధర శ్రేణి రూ. 522 నుంచి రూ. 549 వరకు ఉంటుంది. కంపెనీ మొత్తం రూ. 3,043 కోట్లు సమీకరిస్తోంది. ఇందులో రూ. 950 కోట్ల విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా, ఓఎఫ్ఎస్ కింద ప్రమోటర్లు, ఇన్వెస్టర్ షేర్‌హోల్డర్లు, ఇతర షేర్‌హోల్డర్లు 3.81 కోట్ల షేర్లను విక్రయించనున్నారు.
- మొబిక్విక్ ఐపీవో రూ. 572 కోట్లు సమీకరిస్తోంది. ఇందుకోసం 2.05 కోట్ల షేర్లను తాజాగా జారీ చేస్తోంది. ధర శ్రేణి ఒక్కో షేరుకు రూ. 265–279 వరకు ఉంటుంది.
- ఇన్వెంచరస్ నాలెడ్జ్ సొల్యూషన్స్ ఐపీవో పూర్తిగా ఓఎఫ్ఎస్ రూపంలో ఉంటుంది. ఇష్యూ పరిమాణం రూ. 2,500 కోట్లు.



- ఇక ఎస్ఎంఈ ఐపీవోల విషయానికొస్తే ధనలక్ష్మి క్రాప్ సైన్స్ (డిసెంబర్ 9–11) టాస్ ది కాయిన్ లిమిటెడ్, జంగిల్ క్యాంప్స్ ఇండియా (రెండూ డిసెంబర్ 10–12), సుప్రీమ్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్.. పర్పుల్ యునైటెడ్ సేల్స్ (డిసెంబర్ 11–13), యశ్ హైవోల్టేజ్ (డిసెంబర్ 12–16) సంస్థలు ఉన్నాయి.

ఇంటర్నేషనల్ జెమోలాజికల్ @ 397-417

- ఈ నెల 13–17 మధ్య ఐపీవో
- రూ. 4,225 కోట్ల సమీకరణ



వజ్రాల గ్రేడింగ్ కంపెనీ ఇంటర్నేషనల్ జెమోలాజికల్ ఇన్‌స్టిట్యూట్ (ఇండియా) పబ్లిక్ ఇష్యూ ఈ నెల 13న ప్రారంభంకానుంది. 17న ముగియనున్న ఇష్యూకి రూ. 397–417 ధరల శ్రేణిని ఐజీఐ ప్రకటించింది. బ్లాక్‌స్టోన్ ప్రమోట్ చేసిన కంపెనీ 12న యాంకర్ ఇన్వెస్టర్లకు షేర్లను కేటాయించనుంది. ఇష్యూలో భాగంగా రూ. 1,475 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 2,750 కోట్ల విలువైన షేర్లను బ్లాక్‌స్టోన్ సంస్థ బీసీపీ ఏషియా–2 టాప్‌కో పీటీఈ విక్రయానికి ఉంచనుంది. తద్వారా కంపెనీ మొత్తం రూ. 4,225 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. రిటైల్ ఇన్వెస్టర్లు కనీసం 35 షేర్లకు(ఒక లాట్) దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఈ నెల 20న స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యే అవకాశముంది.

నిధుల వినియోగమిలా

ప్రమోటర్ సంస్థ నుంచి ఐజీఐ బెల్జియం గ్రూప్, నెదర్లాండ్స్ గ్రూప్‌ల కొనుగోలుకి ఈక్విటీ జారీ నిధులలో కొంతమేర ఐజీఐ వెచ్చించనుంది. మరికొన్ని నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. కంపెనీ నేచురల్ డైమండ్స్‌తో పాటు లేబ్ తయారీ డైమండ్స్, స్టడెడ్ జ్యువెలరీ, కలర్డ్ స్టోన్స్‌కు సర్టిఫికేషన్, అక్రిడిటేషన్ సంబంధిత సర్వీసులు అందిస్తోంది. రెడ్‌సీర్ నివేదిక ప్రకారం ఐజీఐ ఆదాయం(2023) రీత్యా ప్రపంచంలోనే రెండో పెద్ద స్వతంత్ర సర్టిఫికేషన్, అక్రిడిటేషన్ సర్వీసుల కంపెనీగా నిలుస్తోంది. సుమారు 33 శాతం మార్కెట్ వాటాను కలిగి ఉంది.

ముగిసిన అల్గోరాండ్ సదస్సు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రెండు రోజులు పాటు హైదరాబాద్‌లో జరిగిన అల్గోరాండ్ ఇండియా రెండో వార్షిక సదస్సు ముగిసింది. ఇందులో బ్లాక్‌చెయిన్ ఆధారిత సొల్యూషన్స్‌పై వర్క్‌షాప్‌లు, పోటీలు నిర్వహించారు. వీటిలో వందల కొద్దీ వెబ్3 డెవలపర్స్, స్టార్టప్ వ్యవస్థాపకులు, ఇన్వెస్టర్లు పాల్గొన్నారు. ఇందులో భాగంగా ఎనిమిది నగరాలవ్యాప్తంగా నిర్వహించిన రోడ్ టు ఇంపాక్ట్ కార్యక్రమాల్లో 800 మంది పైచిలుకు డెవలపర్లు, స్టార్టప్‌లు పాల్గొన్నాయి. టీ-హబ్‌లోని స్టార్టప్ ల్యాబ్ బ్యాచ్‌తో పాటు వివిధ సంస్థలు తమ ఆవిష్కరణలను ప్రదర్శించాయి. క్రియేటింగ్ ఇంపాక్ట్ పిచ్ కాంపిటీషన్‌లో టీమ్ క్యారెట్ (బెంగళూరు), టీమ్ కార్బన్ ట్రేస్ (గౌహతి), టీమ్ రిజోల్వ్ ఎడ్‌టెక్ (హైదరాబాద్) విజేతలుగా నిల్చి 20,000 డాలర్ల బహుమతులను గెల్చుకున్నాయి. భారత్‌లో బ్లాక్‌చెయిన్ విభాగం పురోగతికి ఈ సదస్సు నిదర్శనంగా నిల్చిందని అల్గోరాండ్ ఫౌండేషన్ సీఈవో స్టేసీ వార్డెన్ తెలిపారు. ఔత్సాహిక డెవలపర్లు, అంకుర సంస్థలు పలు నవకల్పనలను ఈ సదస్సులో ప్రదర్శించినట్లు అల్గోరాండ్ ఫౌండేషన్ ఇండియా కంట్రీహెడ్ అనిల్ కాకాణి తెలిపారు.



రేపటి నుంచి ఐకూ13 విక్రయాలు



న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ బ్రాండ్ ఐకూ13 విక్రయాలు డిసెంబర్ 11 నుంచి ప్రారంభం కానున్నాయి. వివో ఎక్స్‌క్లూజివ్ స్టోర్స్, ఐకూ ఈ–స్టోర్, అమెజాన్ పోర్టల్స్‌లో ఇవి మధ్యాహ్నం 12 గం.ల నుంచి అందుబాటులో ఉంటాయి. డిస్కౌంట్లు పోగా ఐకూ13 ఎఫెక్టివ్ ధర రూ. 51,999 (12 జీబీ, 256 జీబీ వేరియంట్) నుంచి రూ. 56,999 వరకు (16జీబీ, 512 జీబీ వేరియంట్) ఉంటుంది. హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంక్ క్రెడిట్/డెబిట్ కార్డులపై రూ. 3,000 ఫ్లాట్ డిస్కౌంటు పొందవచ్చు. ఎక్స్ఛేంజ్ బోనస్‌కి సంబంధించి వివో/ఐకూయేతర డివైజ్‌లపై రూ. 3,000 , వివో/ఐకూ డివైజ్‌లపై రూ. 5,000 లభిస్తుంది. ఇందులో 4 ఏళ్ల పాటు ఆండ్రాయిడ్ అప్‌డేట్స్, 5 ఏళ్ల సెక్యూరిటీ అప్‌డేట్స్ తదితర ప్రయోజనాలు పొందవచ్చు.

అనధికారిక ప్లాట్‌ఫామ్‌లపై ట్రేడింగ్ వద్దు

ఇన్వెస్టర్లకు సెబీ తాజా హెచ్చరిక

న్యూఢిల్లీ: అనధికారిక ప్లాట్‌ఫామ్‌లపై అన్‌లిస్టెడ్ పబ్లిక్ లిమిటెడ్ కంపెనీల సెక్యూరిటీలలో ట్రేడింగ్ నిర్వహించే విషయమై ఇన్వెస్టర్లను సెబీ హెచ్చరించింది. ఈ తరహా లావాదేవీలు సెక్యూరిటీస్ కాంట్రాక్టుల చట్టం 1956, సెబీ యాక్ట్ 1992కు వ్యతిరేకమని స్పష్టం చేసింది. అన్‌లిస్టెడ్ సెక్యూరిటీల్లో ట్రేడింగ్‌కు కొన్ని గుర్తింపు లేని ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌లు వీలు కల్పిస్తున్నట్లు తెలిపింది. ''అటువంటి ఎలక్ట్రానిక్ ప్లాట్‌ఫామ్‌లపై ఎలాంటి లావాదేవీలు నిర్వహించొద్దు. వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దు. ఈ తరహా ప్లాట్‌ఫామ్‌లకు సెబీ గుర్తింపు లేదు''అని తన ప్రకటనలో సెబీ వివరించింది. అనధికారిక వర్చువల్ ట్రేడింగ్, పేపర్ ట్రేడింగ్, ఫ్యాంటసీ గేమ్స్ తదతర వాటిపై లావాదేవీలకు దూరంగా ఉండాలంటూ సెబీ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేయడం గమనార్హం. లిస్టెడ్ సెక్యూరిటీలలో లావాదేవీలను గుర్తింపు పొందిన స్టాక్ ఎక్స్ఛేంజీల ద్వారానే నిర్వహించుకోవాలని సెబీ సూచించింది. గుర్తింపు పొందిన స్టాక్ ఎక్స్ఛేంజీల సమాచారాన్ని సెబీ పోర్టల్ నుంచి తెలుసుకోవచ్చు.



పిక్సెల్‌కు 24 మిలియన్ డాలర్ల నిధులు

ముంబై: గూగుల్ పెట్టుబడులున్న స్పేస్‌క్రాఫ్ట్‌ల తయారీ సంస్థ పిక్సెల్ తాజాగా సిరీస్ బీ రౌండు కింద 24 మిలియన్ డాలర్లు సమీకరించింది. ఎంఅండ్‌జీ క్యాటలిస్ట్, గ్లేడ్ బ్రూక్ క్యాపిటల్ పార్ట్‌నర్స్ వంటి కొత్త ఇన్వెస్టర్లు ఈసారి పెట్టుబడులు పెట్టిన వాటిలో ఉన్నాయి. సమీప భవిష్యత్తులో 18 కమర్షియల్ ఉపగ్రహాల అభివృద్ధి, లాంచ్‌కి ఈ నిధులు ఉపయోగపడగలవని సంస్థ తెలిపింది. తాజాగా దక్కించుకున్న నిధులతో కంపెనీ మొత్తం 95 మిలియన్ డాలర్లు సమీకరించినట్లయింది.



ద్రవ్యలోటు లక్ష్యం... గురి తప్పవద్దు

కేంద్రాన్ని కోరిన సీఐఐ ● లేదంటే ఎకానమీకి ప్రతికూలమని విశ్లేషణ



న్యూఢిల్లీ: ప్రభుత్వ ఆదాయాలు–వ్యయాలకు మధ్య నికర వ్యత్యాసం– ద్రవ్యలోటు ఏప్రిల్‌తో ప్రారంభమైన 2024–25 ఆర్థిక సంవత్సరానికి కట్టుతప్పకుండా ఉండాలని పరిశ్రమల సంఘం– సీఐఐ ప్రభుత్వానికి సూచించింది. దీనికి మించిన ''మితిమీరిన దూకుడు లక్ష్యాలు'' భారతదేశ ఆర్థిక వృద్ధిపై ప్రతికూలత చూపుతాయని హెచ్చరించింది.2024–25లో మొత్తం ద్రవ్యలోటును రూ.16,13,312 కోట్లకు కట్టడి చేయాలని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ నిర్దేశించుకున్న సంగతి తెలిసిందే. స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) విలువలో ఇది 4.9 శాతం. 2023–24లో జీడీపీలో ద్రవ్యలోటు 5.6 శాతంగా నమోదయిన సంగతి తెలిసిందే. 2025–26 ఆర్థిక సంవత్సరం నాటికి ద్రవ్యలోటును 4.5 శాతానికి కట్టడి చేయాలన్న లక్ష్యానికి కట్టుబడి ఉన్నట్లు ఆర్థికమంత్రి నిర్మాలా సీతారామన్ స్పష్టం చేస్తున్నారు. ద్రవ్యలోటు ప్రభుత్వానికి రుణ సమీకరణ మొత్తం అవసరాలను సూచిస్తుంది. ఏప్రిల్‌తో ప్రారంభమైన రానున్న 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ రూపకల్పనలో భాగంగా ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వివిధ వర్గాలతో బడ్జెట్ ముందస్తు సంప్రదింపులు ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సీఐఐ డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ రాబోయే కేంద్ర బడ్జెట్ కోసం సూచనల్లో కొన్ని...

- నెమ్మదిస్తున్న ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, పరిణామాల్లోనూ భారతదేశం వేగంగా అభివృద్ధి చెందుతోంది. స్థూల ఆర్థిక స్థిరత్వం కోసం సమర్థవంతమైన ఆర్థిక నిర్వహణ ఈ వృద్ధికి కీలకమైనది.
- రుణ–జీడీపీ నిష్పత్తులు తగిన స్థాయిల్లో కొనసాగించడానికి ద్రవ్యలోటు కట్టడి ముఖ్యమైనది.
- రాబోయే బడ్జెట్ కేంద్ర ప్రభుత్వ రుణాన్ని మధ్యకాలిక (2030–31 నాటికి) జీడీపీలో 50 శాతం కంటే తక్కువకు, దీర్ఘకాలికంగా జీడీపీలో 40 శాతానికి దిగువకు తీసుకురావడానికి మార్గదర్శకాన్ని రూపొందించాలి. ఆయా అంశాలు దేశ ఎకానమీ పురోగతికి, సావరిన్ క్రెడిట్ రేటింగ్ పెరగడానికి దోహదపడే అంశాలు.
- దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళిక సక్రమ అమలుకు కేంద్రం ఆర్థిక స్థిరత్వ రిపోర్టింగ్‌ను వెలువరించాలి. తీవ్ర ఒత్తిడి పరిస్థితులలో ఆర్థిక పరిస్థితులు, ఆర్థిక స్థిరత్వం కోసం ఔట్‌లుక్‌ను అందించడం ఇందులో భాగంగా ఉండాలి. ఆర్థిక పురోగతికి ఈ కసరత్తు చాలా ముఖ్యం.
- రిపోర్టింగ్‌లో దీర్ఘకాల (10–25 సంవత్సరాలు) ఆర్థిక స్థితిగతులను అంచనా వేయడం, ఆర్థిక వృద్ధి, సాంకేతిక మార్పు, వాతావరణ మార్పు మొదలైన అంశాల ప్రభావానికి సంబంధించిన లెక్కలు అవసరం. పలు దేశాలు ఇదే ధోరణిని అవలంభిస్తున్నాయి. బ్రెజిల్ విషయంలో ఇవి 10 సంవత్సరాలు ఉంటే, బ్రిటన్ విషయంలో 50 యేళ్లుగా ఉంది.
- రాష్ట్రాలకు సంబంధించి కూడా ద్రవ్య క్రమశిక్షణ చాలా అవసరం. రాష్ట్ర స్థాయి ఫిస్కల్ స్టెబిలిటీ రిపోర్టింగ్‌ను ఏర్పాటు చేయడానికి రాష్ట్రాలను ప్రోత్సహించడం, 12వ ఆర్థిక సంఘం సిఫార్సులను అనుసరించి మార్కెట్ నుండి నేరుగా రుణాలు తీసుకునేందుకు రాష్ట్రాలు అనుమతించడం, రాష్ట్ర ప్రభుత్వ రంగం సంస్థల ద్వారా రుణాలు తీసుకునే విషయంలో రాష్ట్రాలు కూడా హామీలను అందించడం ఇందులో ఉన్నాయి. ద్రవ్య క్రమశిక్షణను కొనసాగించే విషయంలో రాష్ట్రాలను ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం స్వతంత్ర- పారదర్శక క్రెడిట్ రేటింగ్ వ్యవస్థను రూపొందించాలి.
- రుణాలు తీసుకోవడం, ఖర్చు చేయడం వంటి అంశాలు నిర్ణయించడంలో రాష్ట్రాలకు ఎక్కువ స్వయంప్రతిపత్తిని ఇవ్వడానికి రాష్ట్రాల రేటింగ్‌ను ఉపయోగించవచ్చు. అదనంగా మూలధన వ్యయం కోసం రాష్ట్రాలకు రుణంగా ప్రత్యేక సహాయం వంటి పథకాలు రూపొందించవచ్చు.



ట్రిలియన్ డాలర్లకు ఎఫ్‌డీఐలు

- 2000 ఏప్రిల్ నుంచి 2024 సెప్టెంబర్ వరకూ
- భారత్‌కు ప్రాధాన్యమిస్తున్న విదేశీ ఇన్వెస్టర్లు
- పత్యక్ష పెట్టుబడుల జోరు

న్యూఢిల్లీ: గత దశాబ్ద కాలానికిపైగా విదేశీ పెట్టుబడులకు భారత్ కీలకంగా నిలుస్తోంది. దీంతో భారత్‌కు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐలు) భారీగా తరలివస్తున్నాయి. 2000 ఏప్రిల్ నుంచి 2024 సెప్టెంబర్ వరకూ చూస్తే ఎఫ్‌డీఐలు ట్రిలియన్ డాలర్లను అధిగమించాయి. వెరసి ప్రపంచవ్యాప్తంగా రక్షణాత్మక కీలక పెట్టుబడుల ప్రాంతంగా భారత్ నిలుస్తోంది. పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య ప్రోత్సాహక శాఖ(డీపీఐఐటీ) గణాంకాల ప్రకారం విదేశీ పెట్టుబడులలో భారత్‌కు ప్రాధాన్యం పెరుగుతోంది. ఫలితంగా ఈక్విటీలు, ఆర్జనతోపాటు ఇతర మూలధనాన్ని తిరిగి ఇన్వెస్ట్ చేయడం తదితరాల ద్వారా భారత్ ఆకట్టుకున్న ఎఫ్‌డీఐలు 1,033.4 బిలియన్ డాలర్లను తాకాయి.

మారిషస్ కీలకం

మొత్తం ఎఫ్‌డీఐలలో 25 శాతం మారిషస్ నుంచి లభించగా.. 24 శాతంతో తదుపరి సింగపూర్ నిలిచింది. ఈ బాటలో యూఎస్ వాటా 10 శాతంకాగా.. నెదర్లాండ్స్ 7 శాతం, జపాన్ 6 శాతం, యూకే 5 శాతం, యూఏఈ 3 శాతం, కేమన్ ఐలాండ్స్, జర్మనీ, సైప్రస్ 2 శాతం చొప్పున తదుపరి ర్యాంకులను ఆక్రమించాయి. విలువపరంగా బిలియన్ డాలర్లలో మారిషస్ వాటా 177.18కాగా.. సింగపూర్ 167.47, యూఎస్ 67.8గా నమోదయ్యాయి. విదేశీ పెట్టుబడులను ఆకట్టుకున్న ప్రధాన రంగాలలో సర్వీసెస్, కంప్యూటర్ సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, టెలికమ్యూనికేషన్స్, ట్రేడింగ్, కన్‌స్ట్రక్షన్ డెవలప్‌మెంట్, ఆటోమొబైల్, కెమికల్స్, ఫార్మాస్యూటికల్స్ నిలిచాయి.

2014 నుంచి స్పీడ్

వాణిజ్య శాఖ వివరాల ప్రకారం 2014 నుంచి పదేళ్లలో భారత్‌కు మొత్తం 667.4 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు తరలివచ్చాయి. అంతక్రితం దశాబ్ద కాలం (2004–2014)లో నమోదైన విదేశీ పెట్టుబడులతో పోలిస్తే ఇవి 119 శాతం అధికం. 2014–24 కాలంలో తయారీ రంగంలోకి తరలి వచ్చిన ఈక్విటీ పెట్టుబడులు 165.1 బిలియన్ డాలర్లు. ఇది అంతక్రితం పదేళ్లలో నమోదైన 97.7 బిలియన్ డాలర్లతో పోలిస్తే 69 శాతం వృద్ధి. పెట్టుబడిదారుల సానుకూల దేశంగా నిలవడం ద్వారా భారత్ విదేశీ ఇన్వెస్టర్లను ఆకట్టుకుంటోంది. సంబంధిత వర్గాలతో చర్చలు, సమావేశాల ద్వారా ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఎఫ్‌డీఐ విధానాలను సవరిస్తోంది. ఇది సానుకూల అంశంగా పెట్టుబడులను ఆకర్షిస్తోంది.

2025లోనూ

వచ్చే కేలండర్ ఏడాది(2025)లోనూ భారత్‌కు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తరలి వచ్చే అవకాశముంది. ఇందుకు పటిష్ట స్థూల ఆర్థిక గణాంకాలు, పారిశ్రామికోత్పత్తి బలిమి, పీఎల్ఐ పథకాలు ప్రభావం చూపనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సవాళ్లున్నప్పటికీ విదేశీ పెట్టుబడులకు భారత్ ఆకర్షణీయ ప్రాంతంగా నిలుస్తున్నట్లు ఆర్థికవేత్తలు పేర్కొంటున్నారు. అయితే యూఎస్‌లో విధానాల సవరణ, చైనా ఆర్థిక వ్యవస్థ పురోగతికి మద్దతుగా సహాయక ప్యాకేజీలు వంటి అంశాల కారణంగా భారత్‌కు ఎఫ్‌డీఐల రాక మందగించే వీలున్నట్లు డెలాయిట్ ఇండియా ఆర్థికవేత్త ఆర్.మజుందార్ అభిప్రాయపడ్డారు. కాగా.. ప్రస్తుతం కొన్ని రంగాలలో ఎఫ్‌డీఐలపై నిషేధం అమలవుతోంది. లాటరీ, గ్యాంబ్లింగ్, చిట్ ఫండ్స్, నిధి కంపెనీ, సిగార్ల తయారీ, పొగాకుతో తయారయ్యే సిగరెట్లు తదితర విభాగాలలో విదేశీ పెట్టుబడులను అనుమతించడంలేదు.

టీపీఎల్ విజేత హైదరాబాద్ స్ట్రయికర్స్

ముంబై: టెన్నిస్ ప్రీమియర్ లీగ్ (టీపీఎల్)లో హైదరాబాద్ స్ట్రయికర్స్ జట్టు చాంపియన్‌గా నిలిచింది. యశ్ ముంబై ఈగల్స్ జట్టుతో జరిగిన ఫైనల్లో హైదరాబాద్ స్ట్రయికర్స్ 51–44 పాయింట్లతో గెలిచి మూడోసారి ఈ టైటిల్‌ను సొంతం చేసుకుంది. హరీట్ డార్ట్, బెంజమిన్ లాక్, ఒలింపియన్ విష్ణువర్ధన్‌లతో కూడిన హైదరాబాద్ స్ట్రయికర్స్ జట్టుకు గ్రాస్‌కోర్టు జాతీయ మాజీ చాంపియన్ సురేశ్ కృష్ణ కోచ్‌గా వ్యవహరించాడు. తొలి మ్యాచ్‌గా జరిగిన మహిళల సింగిల్స్‌లో హరీట్ డార్ట్ 14–11తో జెనెప్ సోన్‌మెజ్‌పై గెలిచి హైదరాబాద్‌కు శుభారంభం అందించింది. రెండో మ్యాచ్‌గా జరిగిన పురుషుల సింగిల్స్‌లో కరణ్ సింగ్ (ముంబై) 14–11తో బెంజమిన్ లాక్‌పై గెలిచాడు. మూడో మ్యాచ్‌గా జరిగిన మిక్స్‌డ్ డబుల్స్‌లో విష్ణువర్ధన్–హరీట్ డార్ట్ ద్వయం 16–9తో జెనెప్ సోన్‌మెజ్–జీవన్ నెడుంజెళియన్ జోడీని ఓడించింది. జీవన్ నెడుంజెళియన్–కరణ్ (ముంబై)... విష్ణువర్ధన్–బెంజమిన్ లాక్ (హైదరాబాద్) జోడీల మధ్య నాలుగో మ్యాచ్‌గా జరిగిన పురుషుల డబుల్స్ పోరు 10–10తో 'టై'గా ముగియడంతో హైదరాబాద్ స్ట్రయికర్స్ జట్టుకు టైటిల్ ఖరారైంది.



'రోహిత్ ఓపెనర్‌గానే రావాలి'

గావస్కర్, రవిశాస్త్రిల సూచన

అడిలైడ్: భారత క్రికెట్ దిగ్గజాలు సునీల్ గావస్కర్, రవిశాస్త్రిలు కెప్టెన్ రోహిత్ శర్మ ఎప్పట్లాగే ఇన్నింగ్స్‌ను ఓపెన్ చేయాలని సూచించారు. అప్పుడే తనశైలి ఆటతీరును యథేచ్ఛగా ఆడతాడని వారిద్దరు భావిస్తున్నారు. 'హిట్‌మ్యాన్' తన భార్య రెండో కాన్పు కోసం తొలి టెస్టుకు గైర్హాజరయ్యాడు. అయితే 'పింక్ బాల్'తో అడిలైడ్‌లో జరిగిన డే–నైట్ టెస్టులో ఈ టాపార్డర్ బ్యాటర్ కాస్తా ఏకంగా ఆరో వరుసలో బ్యాటింగ్‌కు దిగాడు. కానీ అతను ఆర్డర్ మారడం జట్టుకు పరుగుల్ని తెచ్చే బదులు కష్టాల్ని తెచ్చిపెట్టింది. 10 వికెట్ల తేడాతో ఓడిన అడిలైడ్ పోరులో రోహిత్ రెండు ఇన్నింగ్స్‌ల్లో 3, 6 పరుగులే చేయగలిగాడు. యశస్వి జైస్వాల్‌కు జోడీగా కేఎల్ రాహుల్‌ను దింపడం సరైన నిర్ణయం కాదని రవిశాస్త్రి అన్నారు. 'హిట్‌మ్యాన్ దూకుడుగా ఆడాలంటే అతనికి ఓపెనింగ్ స్థానమే సరైంది. తన శైలి ఆటతీరు ఆవిష్కృతం కావాలంటే, యథేచ్ఛగా బ్యాటింగ్ చేయాలంటే తనకు నూటికినూరు శాతం నప్పే ఓపెనింగ్‌లో బ్యాటింగ్‌కు దిగాలి' అని మాజీ హెడ్ కోచ్ శాస్త్రి అభిప్రాయపడ్డారు. రెండో టెస్టుకు ముందు రోహిత్ మాట్లాడుతూ తనకోసం విజయవంతమైన కాంబినేషన్‌ను మార్చాలనుకోవడం లేదన్నాడు. పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో భారత్ 295 పరుగులతో ఆసీస్‌పై గెలిచింది.



షమీ మెరుపులు

17 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్‌లతో 32 నాటౌట్


చండీగఢ్‌పై 3 పరుగులతో నెగ్గి క్వార్టర్ ఫైనల్ చేరిన బెంగాల్

బెంగళూరు: ఎప్పుడూ నిప్పులు చెరిగే బంతులతో బ్యాటర్లను హడలెత్తించే అలవాటున్న పేసర్ మొహమ్మద్ షమీ ఈసారి బ్యాట్‌తో బౌలర్ల భరతం పట్టాడు. దేశవాళీ టి20 క్రికెట్ టోర్నమెంట్ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో షమీ మెరుపు ఇన్నింగ్స్ (17 బంతుల్లో 32 నాటౌట్; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఆడాడు. ఆ తర్వాత కట్టుదిట్టమైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. వెరసి చండీగఢ్ జట్టుతో సోమవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో బెంగాల్ జట్టు మూడు పరుగుల తేడాతో గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. చివర్లో షమీ ఆడిన కీలక ఇన్నింగ్స్ బెంగాల్ జట్టును కాపాడింది. తొలుత బ్యాటింగ్ చేసిన బెంగాల్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 159 పరుగులు సాధించింది. ఓపెనర్ కరణ్ లాల్ (25 బంతుల్లో 33; 1 ఫోర్, 2 సిక్స్‌లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. వృతిక్ చటర్జీ (12 బంతుల్లో 28; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు), ప్రదీప్త ప్రమాణిక్ (24 బంతుల్లో 30; 3 ఫోర్లు, 1 సిక్స్) క్రీజులో ఉన్నంతసేపూ అలరించారు. చివర్లో షమీ ఇన్నింగ్స్‌తో బెంగాల్ స్కోరు 150 దాటింది. 160 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన చండీగఢ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లు ఆడి 9 వికెట్లు నష్టపోయి 156 పరుగులు సాధించి విజయానికి చేరువై దూరమైపోయింది. బెంగాల్ బౌలర్లలో సాయన్ ఘోష్ 30 పరుగులిచ్చి 4 వికెట్లు, కనిష్క్ సేన్ 2 వికెట్లు పడగొట్టగా... షమీ, షహబాజ్ అహ్మద్‌లకు చెరో వికెట్ దక్కింది.

కాంబ్లీ తన గురించి బాధ్యతతో ఉండాలి

- అండగా ఎందరున్నా ఆరోగ్యంపై స్వీయ నియంత్రణ తప్పదు
- భారత మాజీ కెప్టెన్ కపిల్ దేవ్ సూచన





న్యూఢిల్లీ: భారత మాజీ కెప్టెన్, ఆల్‌రౌండ్ దిగ్గజం కపిల్ దేవ్ సాయానికి ఎందరు ముందుకొచ్చినా... వినోద్ కాంబ్లీ తన ఆరోగ్యం పట్ల తనే శ్రద్ధ చూపెట్టాలని సూచించాడు. 52 ఏళ్ల కాంబ్లీ గతితప్పిన జీవనశైలితో పాటు మద్యానికి బానిసై తీవ్ర అనారోగ్యం పాలయ్యాడు. కోచింగ్ లెజెండ్ రమాకాంత్ ఆచ్రేకర్ స్మారకార్థం ఇటీవల ముంబైలో జరిగిన కార్యక్రమంలో కాంబ్లీ ఓ పేషంట్‌లా కనిపించడంతో విచారం వ్యక్తం చేసిన భారత మాజీలు, దిగ్గజాలు అతని పరిస్థితి మెరుగయ్యేందుకు తమవంతు ఆర్థిక సాయం చేస్తామని ప్రకటించారు. ఆ కార్యక్రమంలో సచిన్ కూడా పాల్గొని కాంబ్లీని ఆత్మీయ ఆలింగనం చేసుకున్నాడు. భారత్‌కు తొలి వన్డే ప్రపంచకప్ (1983లో) అందించిన కపిల్ దేవ్ కూడా తాజాగా కాంబ్లీ ఆరోగ్య పరిస్థితిపై విచారం వెలిబుచ్చారు. 'మేమంతా అతనికి సాయం చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. కానీ దీనికంటే ముఖ్యం తను కూడా తన ఆరోగ్య పరిస్థితికి తగ్గట్లుగా నడుచుకోవాలి. తిరిగి ఆరోగ్యవంతుడయ్యేందుకు స్వీయ నియంత్రణ పాటించాలి. ఒక విషయం అందరూ గుర్తు పెట్టుకోవాలి. ఒక వ్యక్తి తనను తాను చూసుకోలేకపోతే మనం మాత్రం చేయగలిగేదేమీ ఉండదు' అని అన్నారు. కాంబ్లీ సహచరులే కాదు... అతని సీనియర్లు, పలువురు దిగ్గజ క్రికెటర్లు అతని దీన పరిస్థితి చూసి బాధపడుతున్నారని, అతని సన్నిహితులెవరైనా బాధ్యత తీసుకొని అతను మెరుగయ్యేందుకు చొరవ చూపించాలని, రిహాబిలిటేషన్‌కు పంపి యోగక్షేమాలు చూసుకోవాలని కపిల్ సూచించారు. సచిన్ బాల్యమిత్రుడు, క్రికెట్‌లో సమకాలికుడు అయిన కాంబ్లీ ఓ ప్రొఫెషనల్ క్రికెటర్ అన్న సంగతి మరిచి క్రమశిక్షణ లేని జీవితంతో క్రీడా భవిష్యత్తునే కాదు... తాజాగా ఆరోగ్యాన్ని పాడుచేసుకున్నాడు. తన కెరీర్‌లో 104 వన్డేలాడి 2477 పరుగులు, 17 టెస్టుల్లో 1084 పరుగులు చేశాడు. కెరీర్ ముగిశాక గాడితప్పిన జీవితం వల్ల 39 ఏళ్ల వయసులోనే అతని గుండెకు 2012లోనే శస్త్రచికిత్స జరిగింది. అయినాసరే కాంబ్లీ ఏమాత్రం మారకుండా నిర్లక్ష్యంగా ఉండటంతో ఇప్పుడు తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు.

రోహిత్‌కు అండగా నిలిచిన కపిల్

ఆస్ట్రేలియా పర్యటనలో ఫామ్ లేమీతో తంటాలు పడుతున్న కెప్టెన్ రోహిత్ శర్మను కపిల్ వెనకేసుకొచ్చారు. అతని సామర్థ్యంపై ఎవరికీ సందేహాలు అక్కర్లేదని అన్నారు. సుదీర్ఘ కెరీర్‌లో దేశానికి ఎంతో చేసిన 'హిట్‌మ్యాన్' ఇంకా తనను తాను నిరూపించుకోవడానికి ఏమీ లేదన్నారు. 'పింక్ బాల్' టెస్టులో 10 వికెట్లతో ఓడిన మ్యాచ్‌లో రోహిత్ రెండు ఇన్నింగ్స్‌లలో వరుసగా 3, 6 పరుగులే చేయడంతో వస్తున్న విమర్శల్ని కపిల్ కొట్టిపారేశారు. 'అతను ఇంకేం నిరూపించుకోవాలి. ఏళ్ల తరబడి భారత క్రికెట్‌లో చిరస్మరణీయ విజయాలకు అవసరమైన పరుగులెన్నో చేశాడు. అలాంటి క్రికెటర్ సామర్థ్యంపై ఎవరికీ ఏ సందేహం అక్కర్లేదు. నాకైతే అస్సలే డౌటు లేదు. త్వరలోనే తన ఫామ్‌ను అందిపుచ్చుకుంటాడు. ఒకట్రెండు ప్రదర్శనలతోనే ఒక కెప్టెన్ ప్రతిభను అంచనా వేయడం తగదు. ఆ నాయకుడే ఆరు నెలల క్రితం భారత్ టి20 ప్రపంచకప్ అందించాడన్న సంగతి మరిచిపోవద్దు' అని కపిల్ అన్నాడు.



దక్షిణాఫ్రికాదే టెస్టు సిరీస్

- రెండో టెస్టులోనూ శ్రీలంక పరాజయం
- 109 పరుగులతో నెగ్గిన సఫారీ జట్టు
- డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో టాప్ ర్యాంక్‌లోకి బవుమా బృందం



పోర్ట్ ఎలిజబెత్: కేశవ్ మహారాజ్ స్పిన్ మాయాజాలంలో శ్రీలంక చిక్కింది. ఫలితంగా దక్షిణాఫ్రికా రెండో టెస్టులో 109 పరుగుల తేడాతో శ్రీలంక జట్టుపై ఘనవిజయం సాధించింది. రెండు టెస్టుల సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. దక్షిణాఫ్రికా నిర్దేశించిన 348 పరుగుల విజయలక్ష్యాన్ని ఛేదించడానికి బరిలోకి దిగిన శ్రీలంక జట్టు 69.1 ఓవర్లలో 238 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 205/5తో ఆట చివరిరోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన శ్రీలంక జట్టు 33 పరుగులు జోడించి మిగతా ఐదు వికెట్లను కోల్పోయింది. దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహారాజ్ 76 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టాడు. రబడ, పీటర్సన్ 2 వికెట్ల చొప్పున తీయగా... మార్కో యాన్సెన్‌కు ఒక వికెట్ దక్కింది. డేన్ పీటర్సన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు... దక్షిణాఫ్రికా కెప్టెన్ తెంబా బవుమా 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' అవార్డు గెల్చుకున్నారు. శ్రీలంకపై సిరీస్ విజయంతో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో దక్షిణాఫ్రికా జట్టు 63.33 పాయింట్ల శాతంతో అగ్రస్థానానికి ఎగబాకింది. 60.71 పాయింట్ల శాతంతో ఆస్ట్రేలియా రెండో స్థానంలో ఉండగా... భారత జట్టు 57.29 పాయింట్ల శాతంతో మూడో స్థానానికి పడిపోయింది.

పిట్ట కొంచెం... 'గ్రాండ్‌మాస్టర్' ఖతం...

అమెరికా గ్రాండ్‌మాస్టర్‌పై 9 ఏళ్ల ఆరిత్ కపిల్ సంచలన విజయం



భువనేశ్వర్: ఢిల్లీ బాలుడు అరుదైన ఘనతకెక్కాడు. తొమ్మిదేళ్ల ఆరిత్ కపిల్ అమెరికా గ్రాండ్‌మాస్టర్ రాసెట్ జియత్‌దినోవ్‌ను కంగుతినిపించాడు. తద్వారా ఓ గ్రాండ్‌మాస్టర్‌ను ఓడించిన అతిపిన్న భారతీయుడిగా ఘనత వహించాడు. కేఐఐటీ ఇంటర్నేషనల్ ఓపెన్ టోర్నమెంట్‌లో సోమవారం జరిగిన తొమ్మిదో రౌండ్ గేమ్‌లో ఆరిత్ కపిల్... 66 ఏళ్ల జియత్‌దినోవ్‌ను కంగుతినిపించాడు. ఆరిత్ వయసు 9 ఏళ్ల 2 నెలల 18 రోజులు మాత్రమే! నిండా పదేళ్లు కూడా లేని ఈ బాలుడు 63 ఎత్తుల పాటు సాగిన క్లాసికల్ ఈవెంట్‌లో మేటి గ్రాండ్‌మాస్టర్‌కు షాకిచ్చాడు.



తెలుగు టైటాన్స్ రెయిడర్‌ను పట్టేసిన హరియాణా స్టీలర్స్ ఆటగాళ్లు

టైటాన్స్‌కు స్టీలర్స్ కళ్లెం

21 పాయింట్ల తేడాతో హరియాణా ఘనవిజయం ● 72 పాయింట్లతో అగ్రస్థానం మరింత పటిష్టం

పుణే: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో తెలుగు టైటాన్స్ జోరుకు హరియాణా స్టీలర్స్ చెక్ పెట్టింది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో హరియాణా ఏకంగా 21 పాయింట్ల తేడాతో టైటాన్స్‌ను ఓడించింది. స్టీలర్స్ 46–25 స్కోరుతో తెలుగు టైటాన్స్ జట్టును చిత్తు చేసింది. రెయిడర్ వినయ్ (7) ఆరంభం నుంచే క్రమం తప్పకుండా పాయింట్లు తెచ్చిపెట్టడంతో హరియాణా ఆధిక్యంలోకి వెళ్లింది. తర్వాత మరో రెయిడర్ శివమ్ పతారే (12) కూతలో పాయింట్ల వేగం పెంచడంతో స్కోరు అమాంతం పెరిగిపోయింది. మిగతా వారిలో ఆల్‌రౌండర్ మొహమ్మద్ రెజా (5), డిఫెండర్లు రాహుల్ (4), సంజయ్ (3) రాణించడంతో స్టీలర్స్ ఎదురులేని విజయం సాధించింది. టైటాన్స్ తరఫున స్టార్ రెయిడర్ ఆశిష్ నర్వాల్ (13) అదరగొట్టాడు. 14 సార్లు కూతకెళ్లిన ఆశిష్ రెయిడింగ్‌లో 11 పాయింట్లు చేశాడు. ప్రత్యర్థి రెయిడర్లు నిలువరించి రెండు టాకిల్ పాయింట్లు సాధించాడు. కెప్టెన్ విజయ్ మాలిక్ 5, డిఫెండర్ అంకిత్ 2 పాయింట్లు చేశారు. మొత్తం 12 జట్లు పోటీపడుతున్న ప్రొ కబడ్డీ లీగ్‌లో ఇప్పటి వరకు 18 మ్యాచ్‌లు ఆడి హరియాణా 14 మ్యాచ్‌ల్లో గెలిచింది. 4 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. 72 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతోంది. తెలుగు టైటాన్స్ జట్టు 18 మ్యాచ్‌ల్లో 10 విజయాలు, 8 పరాజయాలతో 54 పాయింట్లు సాధించి ఆరో స్థానంలో నిలిచింది. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ 30–26 స్కోరుతో పుణేరి పల్టన్‌పై గెలుపొందింది. దబంగ్ జట్టును కెప్టెన్ అశు మలిక్ (13) ముందుండి నడిపించాడు. 19 సార్లు రెయిడింగ్‌కు వెళ్లిన 13 పాయింట్లు తెచ్చి పెట్టాడు. సహచరుల్లో నవీన్ కుమార్ (4), యోగేశ్ (3), ఆశిష్ (2) స్కోరు చేశారు. పుణేరి జట్టులో అత్యధికంగా రెయిడర్ మోహిత్ గోయత్ 7 పాయింట్లు చేశాడు. మిగతా వారిలో పంకజ్ మోహితె (5), ఆకాశ్ షిండే (4), అమన్ (3) రాణించారు. దబంగ్ ఢిల్లీ 17 మ్యాచ్‌లు ఆడి 8 విజయాలు, 5 పరాజయాలు, 4 'టై'లతో కలిపి మొత్తం 56 పాయింట్లతో నాలుగో స్థానంలో ఉంది. పుణేరి పల్టన్ 18 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. 7 మ్యాచ్‌ల్లో నెగ్గి, 8 మ్యాచ్‌ల్లో ఓడింది. 3 మ్యాచ్‌లను 'టై'గా ముగించింది. 49 పాయింట్లతో ఏడో ర్యాంక్‌లో ఉంది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో గుజరాత్ జెయింట్స్‌తో జైపూర్ పింక్ పాంథర్స్ (రాత్రి 8 గంటల నుంచి), బెంగాల్ వారియర్స్‌తో బెంగళూరు బుల్స్ (రాత్రి 9 గంటల నుంచి) తలపడతాయి.



రఫ్ఫాడించిన రూథర్‌ఫర్డ్


80 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్స్‌లతో 113

బంగ్లాదేశ్ చేతిలో 11 పరాజయాల తర్వాత ఎట్టకేలకు వన్డేలో నెగ్గిన వెస్టిండీస్

బాసెటెరె (సెయింట్ కిట్స్ అండ్ నెవిస్): ఒకటి కాదు... రెండు కాదు... మూడు కాదు... ఏకంగా వరుసగా 11 వన్డే మ్యాచ్‌ల్లో బంగ్లాదేశ్ చేతిలో వెస్టిండీస్ పరాజయం పాలైంది. ఎట్టకేలకు 12వ సారి మాత్రం వెస్టిండీస్ ఈ పరాజయాల పరంపరకు బ్రేక్ వేసింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా బంగ్లాదేశ్‌తో సోమవారం జరిగిన తొలి వన్డేలో వెస్టిండీస్ జట్టు 5 వికెట్ల తేడాతో గెలిచింది. సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. బంగ్లాదేశ్ నిర్దేశించిన 295 పరుగుల లక్ష్యాన్ని వెస్టిండీస్ 47.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. 27 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడిన వెస్టిండీస్‌ను కెప్టెన్ షై హోప్ (88 బంతుల్లో 86; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), కీసీ కార్టీ (37 బంతుల్లో 21; 2 ఫోర్లు) ఆదుకున్నారు. వీరిద్దరు మూడో వికెట్‌కు 67 పరుగులు జోడించారు. కార్టీ అవుటయ్యాక షై హోప్‌తో జత కలిసిన షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ (80 బంతుల్లో 113; 7 ఫోర్లు, 8 సిక్స్‌లు) బంగ్లాదేశ్ బౌలర్ల భరతం పట్టాడు. ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. షై హోప్‌తో కలిసి నాలుగో వికెట్‌కు రూథర్‌ఫర్డ్ 99 పరుగులు జత చేయడంతో పాటు 77 బంతుల్లో సెంచరీని పూర్తి చేసుకున్నాడు. హోప్ పెవిలియన్ చేరుకున్నాక జస్టిన్ గ్రీవ్స్ (31 బంతుల్లో 41 నాటౌట్; 5 ఫోర్లు)తో కలిసి రూథర్‌ఫర్డ్ విండీస్ స్కోరు బోర్డును పరుగెత్తించాడు. వీరిద్దరు ఐదో వికెట్‌కు కేవలం 57 బంతుల్లో 95 పరుగులు జోడించారు. జట్టు స్కోరు 288 పరుగులవద్ద రూథర్‌ఫర్డ్ అవుటవ్వగా... మిగతా లాంఛనాన్ని రోస్టన్ చేజ్ (2 నాటౌట్)తో కలిసి గ్రీవ్స్ పూర్తి చేశాడు. అంతకుముందు బంగ్లాదేశ్ నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లకు 294 పరుగులు సాధించింది. తంజిద్ హసన్ (60; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ మెహదీ హసన్ మిరాజ్ (74; 6 ఫోర్లు, 1 సిక్స్), మహ్మదుల్లా (50 నాటౌట్; 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీలు చేశారు. 2018 డిసెంబర్ 14 నుంచి 2022 జూ16 మధ్యకాలంలో బంగ్లాదేశ్‌తో ఆడిన 11 వన్డేల్లోనూ వెస్టిండీస్ ఓడిపోయింది.

సిసోడియాకు స్థానచలనం

- ఇంకో సీనియర్ నేతకు కూడా
- 20 మందితో ఆప్ రెండో జాబితా
- వీరిలో 18 మంది కొత్త అభ్యర్థులే



న్యూఢిల్లీ: వచ్చే ఏడాది ఆరంభంలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు ఆమ్ ఆద్మీ పార్టీ సోమవారం 20 మంది అభ్యర్థులతో రెండో జాబితా విడుదల చేసింది. వీరిలో 18 మంది కొత్తవారే కావడం గమనార్హం. సీనియర్ నేత, మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాతోపాటు మరో నేతకు సిట్టింగ్ స్థానాలకు బదులు వేరే సీటు కేటాయించింది. సిసోడియా ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్న పట్‌పర్‌గంజ్ సీటును కొత్తగా పార్టీలో చేరిన అవధ్ ఓఝాకు ఇచ్చింది. సిసోడియాకు జంగ్‌పుర టిక్కెట్టిచ్చింది. పట్‌పర్‌గంజ్‌లో చేసిన అభివృద్ధి పనులను జంగ్‌పురలోనూ అమలు చేస్తానని సిసోడియా చెప్పారు. ఢిల్లీలో ఎక్కడినుంచైనా పోటీ చేసి, గెలిచే సామర్థ్యం సిసోడియాకు ఉందని ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ చెప్పారు. అదేవిధంగా, డిప్యూటీ స్పీకర్ రాఖీ బిర్లాను మాదిపూర్‌కు మార్చారు. ప్రస్తుతం ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న మంగోల్‌పురి నుంచి రాకేశ్ జాతవ్ ధర్మరక్షక్ పోటీ చేయనున్నారు. తాజాగా చేపట్టిన మార్పులు కష్టించేతత్వానికి, సమర్థతకు ఆప్ పెద్ద పీట వేస్తుందనేందుకు నిదర్శనమని ఆ పార్టీ నేతలు తెలిపారు. నవంబర్ 21న ఆప్ 11 మంది పేర్లతో మొదటి జాబితా విడుదల చేసింది.

మంచు కురిసే వేళలో... ఉత్తరాఖండ్ రాష్ట్రం రుద్రప్రయాగ్ జిల్లాలో కేదార్‌నాథ్ ధామ్‌లో ఈ సీజన్‌లోనే మొట్టమొదటిసారిగా సోమవారం భారీ మంచు కురిసింది. దీంతో, ఆలయ పరిసరాలు మంచుతో నిండిపోయాయి.



స్వేచ్ఛా నినాదాలతో జైలుగోడలు ప్రతిధ్వనించాయి

- నోబెల్ ప్యానెల్‌తో నర్గీస్ మహమ్మదీ



ఓస్లో, నార్వే: నోబెల్ శాంతి బహుమతి–2023 గ్రహీత, ఇరాన్‌కు చెందిన హక్కుల ఉద్యమకారిణి నర్గీస్ మహమ్మదీ తొలిసారి నోబెల్ ప్యానెల్‌తో మాట్లాడారు. అనారోగ్య రీత్యా బెయిలుపై ఉన్న ఆమెతో మాట్లాడినట్లు ఆ సంస్థ ఆదివారం వెల్లడించింది. ఈ మేరకు నోబెల్... సోషల్ మీడియాలో వీడియోను విడుదల చేసింది. తనకు నోబెల్ వచ్చిన విషయం కూడా నేరుగా తెలియలేదని, జైలులో తనతోపాటు ఉన్న మహిళ.. పురుషుల వార్డులో ఉన్న భర్తతో ఫోన్‌లో మాట్లాడగా విషయం తెలిసిందని చెప్పారు. వార్త వినగానే నమ్మలేకపోయామని, 'ఉమెన్.. లైఫ్.. ఫ్రీడమ్'నినాదాలతో జైలు ప్రతిధ్వనించిందని ఆమె గుర్తు చేసుకున్నారు. అంతేకాదు.. ఆనందంతో ఆమె 'బెల్లా చావ్'స్వేచ్ఛాగీతాన్ని కూడా ఆలపించారు. తన ఆరోగ్య సమస్యల గురించి, ఇరాన్ రాజకీయ వాతావరణం గురించి కూడా ఆమె ప్యానెల్‌కు వివరించారు. ఇన్నేళ్ల తర్వాత తొలిసారిగా తన పిల్లలతో వీడియో కాల్‌లో మాట్లాడగలిగానని తెలిపారు. ఇరాన్‌లో మహిళలకు హిజాబ్‌కు, మరణశిక్షకు వ్యతిరేకంగా పోరాడుతున్న నర్గీస్.. ఎవిన్ జైల్లో ఉన్నారు.



ఒత్తిడిలో ఉన్నారా...?

ఉద్యోగం ఉఫ్

పనిఒత్తిడి ఉందని సర్వేలో చెప్పిన వాళ్లందర్నీ తొలగించిన వైనం

అంకుర సంస్థ తీరుపై సర్వత్రా వెల్లువెత్తుతున్న విమర్శలు

సంస్థలో సరదాగా అంతర్గత సర్వే అంటే ప్రతి ఒక్క ఉద్యోగి ఖచ్చితంగా స్పందిస్తారు. సర్వేలో అడిగే ప్రశ్నలు వివాదాస్పదమైనవికాకుండా సాధారణంగా ఉంటే ఏ ఉద్యోగి అయినా స్వేచ్ఛగా, నిర్మొహమాటంగా సమాధానమిస్తారు. తమ అభిప్రాయాలను సంస్థ యాజమాన్యంతో పంచుకుంటారు. అలా ఉద్యోగులు చెప్పిన విషయాలే తమ ఉద్యోగం ఊడటానికి కారణమని సదరు ఉద్యోగులు తెల్సుకుని షాక్‌కు గురయ్యారు. ఉద్యోగుల్ని తొలగించే ఉద్దేశ్యం ఉంటే నేరుగా ఆ ఉద్యోగులకు చెప్పాలిగానీ ఇలా సర్వే వంకతో ఉద్యోగం నుంచి తొలగించడమేంటని నెటిజన్లు తీవ్రంగా విమర్శిస్తున్నారు. నోయిడా కేంద్రంగా పనిచేసే ఒక అంకుర సంస్థ చేసిన నిర్వాకం ఇప్పుడు సర్వత్రా చర్చనీయాంశమైంది.

యస్ అని చెబుతున్నారా?

పనివేళల్లో పని కారణంగా మీరు ఒత్తిడికి గురి అవుతున్నారా? అంటూ 'యస్‌మేడమ్'అనే అంకురసంస్థ తన ఉద్యోగులతో అంతర్గత ఈమెయిల్ సర్వే చేపట్టింది. ఈ సంస్థ ఇంటి వద్ద హెయిర్ కటింగ్, మసాజ్, ఇతరత్రా బ్యూటీ, వెల్‌నెస్ సేవలను అందిస్తోంది. ఈ సర్వేలో భాగంగా చాలా మంది ఉద్యోగులు తమ తమ అభిప్రాయాలను నిర్మొహమాటంగా చెప్పేశారు. వీటిని సేకరించిన సంస్థ.. ఒత్తిడిగా ఫీల్ అవుతున్నాం అని సమాధానం చెప్పిన వారందరినీ తొలగిస్తున్నట్లు వాళ్లకు విడిగా ఈమెయిల్ సందేశాలు పంపింది. ఇతర ఉద్యోగులకు వివరణ సందేశాలు పంపింది. ''ఒత్తిడి ఉందా అని మేం అడిగిన ప్రశ్నకు సమాధానం ఇచ్చి సర్వేలో పాల్గొన్నందుకు ధన్యవాదాలు. మీ స్పందనకు మేం చాలా విలువ ఇస్తున్నాం. పనిచేసేటప్పుడు ఒక్కరు కూడా ఒత్తిడిగా ఫీల్ అవ్వకూడదు అనేది సంస్థ సిద్ధాంతం. ఈ మేరకు ఉద్యోగుల విషయంలో సంస్థ ఒక కఠిన నిర్ణయం తీసుకుంది. తదుపరి వివరాలు త్వరలో తెలియజేస్తాం''అని కంపెనీ పేర్కొంది. కంపెనీ మానవవనరుల విభాగ సారథి అషు అరోరా ఝా పేరిట వచ్చిన ఈమెయిల్ సందేశాలను చూసి సదరు ఉద్యోగులు అవాక్కయ్యారు. ''ఒత్తిడిగా ఉందని చెబితే పిలిచి మాట్లాడి సమస్యకు పరిష్కారం చూపాలిగానీ ఇలా ఏకంగా ఉద్యోగం ఊడపీకేస్తారా? అంటూ జాబ్ కోల్పోయిన ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం, ఆవేదన వ్యక్తంచేశారు. సర్వేలో 'యస్'అని చెప్పిన దాదాపు 100 మందిని సంస్థ తొలగించిందని తెలుస్తోంది. ఇండిగో డిజిటల్ మార్కెటింగ్ అసోసియేట్ డైరెక్టర్ శితిజ్ డోగ్రా చేసిన ఒక పోస్ట్‌తో ఈ 'ఉద్యోగుల ఉద్వాసన పర్వం'వెలుగులోకి వచ్చింది. ''నిజాయతీగా సమాధానం చెబితే సంస్థ ఇలాంటి మతిలేని నిర్ణయం తీసుకుంటుందా?''అని చాలా మంది నెటిజన్లు సంస్థ నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఘటనపై ఆలిండియా ఎంప్లాయీ అసోసియేషన్ స్పందించింది. ''కార్మిక వ్యవస్థలోని లోపాలను కొన్ని సంస్థలు పూర్తిగా దుర్వినియోగం చేస్తున్నాయి. ఉద్యోగులకు జీతభత్యాలు ఇచ్చే స్తోమత లేకపోతే ముందుగా అసలు ఉద్యోగాల్లోకి తీసుకోకండి. ఆరోగ్యకరమైన ఉద్యోగ వాతావరణాన్ని కల్పించలేకపోతే ఎవరికీ ఉద్యోగం ఇవ్వకండి. పిచ్చిపిచ్చి కారణాలు చెప్పి ఉద్యోగులను మానసికంగా వేధించకండి''అని వ్యాఖ్యానించింది. ''హేతుబద్ధత లోపించిన అనైతిక నిర్ణయం ఇది. ఉద్యోగుల సంఖ్య తగ్గించుకునేందుకు సంస్థలు ఇలాంటి చవకబారు నిర్ణయాలు తీసుకుంటారని ఇప్పుడే చూస్తున్నాం. ఉద్యోగులు పనిసమయాల్లో ఒత్తిడిగా ఫీల్ అయ్యారో లేదో తెలీదుగానీ ఈ వార్త తెల్సి నిజంగా చాలా ఒత్తిడికి గురై ఉంటారు. ఇది అందరూ ఒత్తిడిగా ఫీల్ అయ్యే ఘటన''అని పలువురు పెదవి విరిచారు.

- నోయిడా

లోనూ పాయె,

కోడీ పాయె

బ్యాంక్ రుణం కోసం ఉన్న కోళ్లను అమ్ముకున్న పౌల్ట్రీ రైతు

బ్యాంక్ లోను ఆశ చూపి రూ.39వేల విలువైన నాటు కోళ్లను తినేసిన బ్యాంక్ మేనేజర్

ఉన్నంతలో చక్కగా నడుస్తున్న వ్యాపారాన్ని మరింత విస్తరించాలని ఏ వ్యాపారికైనా ఉంటుంది. కోళ్ల వ్యాపారం చేసే పౌల్ట్రీ రైతు రూప్‌చంద్ మన్హార్‌కు అదే ఆలోచన వచ్చింది. వ్యాపార విస్తరణ కోసం బ్యాంక్ రుణం ఇవ్వాలంటూ బ్యాంక్ గడప తొక్కాడు. రుణం రాకపోగా లంచం, అదనంగా నాటు కోడి మాంసం రూపంలో బ్యాంక్ మేనేజర్ దగ్గర నిలువునా మోసపోయిన వైనం ఛత్తీస్‌గఢ్‌లోని మస్తూరీ గ్రామంలో ఇటీవల చోటుచేసుకుంది. బాధితుడు తెలిపి వివరాలు విని స్థానికులు సైతం విస్తుపోయారు.

అప్పిస్తాగానీ నాటు కోళ్లు తీసుకురా..

లోన్ కోసం బ్యాంకు గడప తొక్కిన ఓ గ్రామస్తునితో బ్యాంక్ మేనేజర్ 'డీల్' చేసిన విధానమిది! ఛత్తీస్‌గఢ్‌లోని సర్గావాన్‌కు చెందిన రూప్‌చంద్‌కు సొంతంగా కోళ్ల ఫారముంది. దాని విస్తరణకు రూ.12 లక్షల రుణం కోసం మస్తూరీలోని భారతీయ స్టేట్ బ్యాంక్ శాఖ కార్యాలయానికి వెళ్లి రూప్‌చంద్ దరఖాస్తు చేసుకున్నారు. రుణం మంజూరుచేయాలంటే లంచం ఇవ్వాలని అక్కడి మేనేజర్ సుమన్ కుమార్ చౌదరి డిమాండ్ చేశాడు. రూ.12 లక్షల రుణంలో 10 శాతం అంటే ఒక లక్షా 20వేల రూపాయలను తనకు లంచంగా ఇవ్వాలని సూచించాడు. చేసేదిలేక రూప్‌చంద్ తన కోళ్ల ఫాంలో పెంచుతున్న కోళ్లను రెండు నెలల్లో విడతలవారీగా అమ్మేసి వచ్చిన సొమ్మును లంచంగా ముట్టచెప్పాడు. అయినాసరే ఆ మేనేజర్ ఆశ తీరలేదు. మేనేజర్‌కు నాటు కోళ్ల కూర అంటే పిచ్చి. దీంతో నాటు కోళ్ల మాంసం తీసుకొస్తే లోను దరఖాస్తు ఫైల్‌ను ముందుకు కదిలిస్తానని షరతు పెట్టాడు. చేసేదిలేక రూప్‌చంద్ సమీప గ్రామానికి వెళ్లి ప్రతి శనివారం నాటు కోడిని కొని మేనేజర్‌కు ఇచ్చిరావడం మొదలెట్టాడు. నాటు కోడిని కొన్న ప్రతిసారీ బిల్లును తన వద్ద అట్టిపెట్టుకుని మీకోసం ఇంత ఖర్చు చేస్తున్నానని, త్వరగా లోను మంజూరుచేయాలని మేనేజర్‌ను వేడుకున్నాడు. వారం వారం బిల్లు పెరిగి అది ఏకంగా రూ.38,900 చేరుకుంది. నాటు కోళ్ల బిల్లు ఇస్తానని మాట ఇచ్చిన మేనేజర్ ఎంతకీ ఇవ్వకపోవడం, రుణం మంజూరుకాకపోవడంతో రూప్‌చంద్ సహనం చచ్చిపోయింది. లోను సంగతి ఏమైందని మేనేజర్‌ను నిలదీసినా చలనం లేకపోవడంతో నేరుగా జిల్లా కలెక్టర్ వద్దకు వెళ్లి తన గోడు వెళ్లబోసుకున్నాడు. నాటు కోళ్ల కొనుగోళ్లకు సంబంధించిన రూ.38,000 బిల్లులను చూపించాడు. న్యాయం చేయాలని వేడుకున్నాడు. రుణమైనా ఇప్పించాలని, లేదంటే తన కమిషన్, నాటుకోళ్లకు వెచ్చించిన వ్యయం తిరిగి ఇప్పించాలని కలెక్టర్‌ను వేడుకున్నాడు. బ్యాంక్ బ్రాంచ్ వద్ద ఆమరణ నిరాహార దీక్షకు కూర్చుంటానని శపథం చేశాడు. బ్యాంక్ రుణం ఇప్పించకపోతే పురుగుల మందు తాగుతానని, లేదంటే పెట్రోల్ పోసుకుని ఆత్మాహుతి చేసుకుంటానని బెదిరించాడు. ఈ వ్యవహారం ఇప్పుడు స్థానికంగా హాట్‌టాపిక్ అయ్యింది. మేనేజర్‌పై ఇంకా ఎలాంటి శాఖాపర చర్యలు తీసుకోలేదు.





- సాక్షి, నేషనల్ డెస్క్

రైతుల రోడ్ల దిగ్బంధంపై పిటిషన్ కొట్టివేత

న్యూఢిల్లీ: పంజాబ్‌లో రైతుల ఆందోళనల కారణంగా జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రయాణాలకు అంతరాయం కలుగుతోందని, రైతులను ఒప్పించి రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఈ అంశం ఇప్పటికే న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉందని, ఒకే అంశంపై పదేపదే వచ్చే పిటిషన్లపై విచారణ చేపట్టలేమని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ మన్మోహన్‌ల ధర్మాసనం స్పష్టం చేసింది. 'విస్తృతమైన ఈ అంశం ఇప్పటికే మా పరిశీలనలో ఉంది. సమాజం పట్ల బాధ్యత కలిగింది మీరొక్కరే కాదు. ఇలాంటి పిటిషన్లను మళ్లీ వేయకండి. కొందరు పబ్లిసిటీ కోసం, మరికొందరు గ్యాలరీలో ఉండి తమాషా చూసేందుకు పిటిషన్లు వేస్తున్నారు. ఒకే అంశంపై వచ్చే ఇలాంటి పిటిషన్లను మేం విచారించలేం'అని పంజాబ్‌కు చెందిన పిటిషనర్, సామాజిక కార్యకర్త గౌరవ్ లూత్రానుద్దేశించి పేర్కొంది.

మహిళా ఆర్మీ అధికారికి సుప్రీంలో ఊరట

న్యూఢిల్లీ: మహిళా సైనికాధికారికి పర్మినెంట్ కమిషన్ మంజూరు చేస్తూ సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. పర్మినెంట్ కమిషన్‌ను మంజూరు చేసిన అధికారుల జాబితా నుంచి ఈమె పేరును పొరపాటున చేర్చలేదని పేర్కొంటూ ఈ మేరకు పిటిషనర్‌కు ఊరట కల్పించింది. ఆగ్రాలోని ఆర్మీ డెంటల్ కార్ప్స్‌లో లెఫ్టినెంట్ కల్నల్‌గా నియమితురాలైన పిటిషనర్‌కు మిగతా మహిళా అధికారులతోపాటుగా పర్మినెంట్ ప్రయోజనాలను అధికారులు తిరస్కరించారు. ఈ నిర్ణయాన్ని ఆమె లక్నోలోని ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ట్రిబ్యునల్ ప్రాంతీయ శాఖలో సవాల్ చేశారు. అక్కడ చుక్కెదురుకావడంతో దీంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై సోమవారం విచారణ చేపట్టిన జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం.. ఈ విషయంలో అధికారులు అసమంజసమైన విధానాలను అనుసరించారని పేర్కొంది.

రాజ్యాంగంపై చర్చలో మోదీ సమాధానం!

న్యూఢిల్లీ: రాజ్యాంగంపై పార్లమెంట్‌లో జరిగే చర్చలో భాగంగా డిసెంబర్ 14వ తేదీన లోక్‌సభలో ప్రధాని మోదీ సమాధానం ఇస్తారని పార్లమెంట్ వర్గాలు సోమవారం వెల్లడించాయి. రాజ్యాంగాన్ని ఆమోదించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా పార్లమెంట్‌లో రాజ్యాంగంపై చర్చ జరగాలని విపక్షాలు డిమాండ్‌చేయడం తెల్సిదే. విపక్షాలు పలు అంశాలపై పట్టుబట్టిన నేపథ్యంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ 13న లోక్‌సభలో, రాజ్యసభలో హోం మంత్రి అమిత్‌షా 16న చర్చను మొదలుపెట్టనున్నారు.

అధ్యక్షుడు యూన్‌పై ప్రయాణ నిషేధం

దక్షిణ కొరియా న్యాయ శాఖ వెల్లడి

సియోల్: దక్షిణ కొరియాలో గత వారం మార్షల్ లా విధించేందుకు దారి తీసిన పరిస్థితులపై ఉన్నతస్థాయి కమిటీ విచారణ వేగవంతమైంది. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ విదేశీ ప్రయాణాలపై న్యాయ శాఖ నిషేధం విధించింది. మార్షల్ లాకు దారి తీసిన పరిణామాలపై విచారణ చేపట్టిన కమిటీ ఎదుట న్యాయ శాఖ అధికారి బె సంగ్–అప్ హాజరై.. పోలీసులు, అవినీతి నిరోధక విభాగాల విజ్ఞప్తి మేరకు యూన్ విదేశాలకు వెళ్లకుండా నిషేధం విధించామన్నారు. యూన్‌ను అవసరమైతే అరెస్ట్ చేస్తామని పోలీసులు ప్రకటించారు. అయితే, యూన్‌ను అదుపులోకి తీసుకునేందుకు, ఆయన కార్యాలయంలో సోదాలు జరిపేందుకు అధ్యక్ష కార్యాలయం అధికారులు అనుమతించే అవకాశం లేదని పరిశీలకులు అంటున్నారు.

ఫ్యూన్ పక్కా ప్లాన్.. రూ.10 కోట్ల మోసం

మధ్యప్రదేశ్‌లో ఆరుగురి అరెస్ట్



నామ్‌దేవ్

భోపాల్: మధ్యప్రదేశ్‌లో ఘరానా మోసం చోటుచేసుకుంది. ప్రభుత్వ విత్తన ధ్రువీకరణ కార్యాలయంలో ప్యూన్‌గా పనిచేసే వ్యక్తి, బ్యాంకు అధికారులు ఇతరులతో కలిసి నకిలీ పత్రాలతో రూ.10 కోట్లను తన బ్యాంకు ఖాతాలో జమ చేయించుకున్నాడు. ఈ మొత్తంతో భూమి కొనుగోలు చేసి ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకుని సగానికి సగం సబ్సిడీ కొట్టేయాలని పథకం పన్నాడు. అనుకోకుండా పోలీసులకు దొరికిపోవడంతో ఈ బాగోతం బట్టబయలైంది. మధ్యప్రదేశ్ విత్తన ధ్రువీకరణ విభాగంలో ప్యూన్‌గా పనిచేసే బ్రిజేంద్ర దాస్ నామ్‌దేవ్ ఈ మొత్తం వ్యవహారంలో కీలకంగా ఉన్నాడు. ఇతడు నాలుగు నెలల క్రితం అక్కౌంటింగ్ అసిస్టెంట్‌గా పనిచేసే దీపక్ పాంటీ సాయంతో విత్తన ధ్రువీకరణ విభాగానికి సంబంధించిన ఫోర్జరీ పత్రాలు, సీళ్లను తయారు చేశాడు. వీటిలో నామ్‌దేవ్ తనను డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారిగా, విత్తన ధ్రువీకరణ విభాగం హెడ్‌గా పేర్కొన్నాడు. బ్యాంక్ మేనేజర్ నోయెల్ సింగ్‌తో కుమ్మక్కై నామ్‌దేవ్ ఎకౌంట్‌లో రూ.10 కోట్లు డిపాజిట్ చేయించారు. ఆ మొత్తాన్ని 50 వేర్వేరు బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఇవన్నీ నకిలీ పత్రాలతో తెరిచినవే. ఈ ఖాతాదారుల్లో శైలేంద్ర ప్రధాన్, అతడి పరిచయస్తులైన మరికొందరు ఉన్నారు. వీరంతా జమ అయిన డబ్బును విత్ డ్రా చేసుకుని, తమకివ్వాల్సిన కమిషన్ పోను మిగతాది నామ్‌దేవ్ ముఠాకు ఇచ్చేశారు. నామ్‌దేవ్ ముఠా సభ్యులు ఈ డబ్బుతో రూ.6.40 కోట్లు, రూ.1.25 కోట్లు పెట్టి రెండు చోట్ల ప్లాట్లు కొన్నారు. జాతీయ పశుసంవర్థక శాఖ పథకాన్ని వాడుకుని ఈ భూముల్లో వేర్వేరు ప్రాజెక్టులను ప్రారంభించాలనేది ఈ ముఠా పథకం. ప్రభుత్వ పథకంలో రూ.5 కోట్ల రుణం తీసుకుంటే అందులో సగం వరకు సబ్సిడీ పొందొచ్చు. ఇలా రూ.10 కోట్ల పెట్టుబడితో 50 శాతం సబ్సిడీ పొందాలనేది వీరి ప్లాన్. అయితే, నామ్‌దేవ్ తీరుపై అనుమానం వచ్చిన విత్తన ధ్రువీకరణ అధికారి సుఖ్‌దేవ్ ప్రసాద్ సెప్టెంబర్ 14వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అధికారులు దీనిపై దర్యాప్తునకు సిట్ ఏర్పాటు చేశారు.తెలిసిన నామ్‌దేవ్, నోయెల్ సింగ్‌లు తమ ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసుకుని, కుటుంబాలతో సహా పరారయ్యారు. అయితే, పోలీసులుదీపక్ పాంటీ, ధనంజయ్ గిరి, శైలేంద్ర ప్రధమ్‌లను అరెస్ట్ చేశారు. అరెస్ట్ నుంచి తప్పించుకునేందుకు నామ్‌దేవ్ ఇతరుల ఫోన్లతో వేర్వేరు చోట్ల నుంచి ఫోన్లు చేసేవాడు. పత్రికలు, మీడియా ద్వారా పోలీసుల చర్యలను ఎప్పటికప్పుడు ఫాలో అయ్యేవాడు. చివరికి రెవాలో ఉండగా సిట్ సభ్యులకు నామ్‌దేవ్ దొరికిపోయాడు. రూ.10 కోట్లు పంపిన 50 బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు.

బోనెక్కనున్న నెతన్యాహూ

- ఇజ్రాయెల్ ప్రధానిపై పలు ఆరోపణలు
- నేడు కోర్టులో విచారణకు హాజరు



జెరుసలేం: ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహూ మంగళవారం కోర్టులో జరిగే విచారణకు హాజరు కానున్నారు. లంచాలు తీసుకోవడం, అక్రమాలు, అధికార దుర్వినియోగానికి సంబంధించి మూడు వేర్వేరు ఆరోపణలు ఎదుర్కొంటున్న నెతన్యాహూ మొదటిసారిగా కోర్టు బోనెక్కనున్నారు. గాజాలో హమాస్‌పై పోరాటం కొనసాగుతుండగా, యుద్ధ నేరాల ఆరోపణలపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు నెతన్యాహూకు అరెస్ట్ వారెంట్లు జారీ చేసిన నేపథ్యంలో స్వయంగా కోర్టుకు హాజరు కావాల్సి రావడం నెతన్యాహూకు ఇబ్బందికర పరిణామమేనని పరిశీలకులు అంటున్నారు. టెల్‌అవీవ్‌లోని కోర్టు భూగర్భ చాంబర్‌లో విచారణ జరగనుంది.



అతిపెద్ద ముగ్గు

దీనిని ప్రపంచంలోనే అతిపెద్ద రంగవల్లిగా భావిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన శిఖ ఆర్ట్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన బృందం ఈ ముగ్గు వేసి అందరి ప్రశంసలు అందుకుంది.

భారత నౌకాదళంలోకి ఐఎన్‌ఎస్ తుషిల్

న్యూఢిల్లీ: రష్యా తయారీ గైడెడ్ మిస్సైల్ ఫ్రిగేట్ ఐఎస్ఎస్ తుషిల్ భారత నావికాదళంలో చేరింది. రష్యా తీరప్రాంత నగరం కలినిన్‌గ్రాడ్‌లో సోమవారం ఈ మేరకు జరిగిన కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, నేవీ చీఫ్ అడ్మిరల్ డీకే త్రిపాఠీ పాల్గొన్నారు. ఐఎన్ఎస్ తుషిల్ రాకతో హిందూ మహా సముద్రంలో చైనాకు దీటుగా భారత నావికాదళం కార్యాచరణ సన్నద్ధత మరింత పెరిగినట్లయిందని నేవీ తెలిపింది. 2016లో నాలుగు స్టెల్త్ ఫ్రిగేట్‌లను నిర్మించేందుకు రష్యాతో కేంద్రం 2.5 బిలియన్ డాలర్ల విలువైన ఒప్పందం కుదుర్చుకుంది. నాలుగు ఫ్రిగేట్లలో రెండింటిని రష్యాలో, మరో రెండింటిని భారత్‌లో నిర్మించాల్సి ఉంటుంది. ఫ్రిగేట్ల నిర్మాణం కలినిన్‌గ్రాడ్‌లో మకాం వేసిన భారత నిపుణుల బృందం పర్యవేక్షిస్తుంది. ఆధునీకరించిన క్రివాక్–3 తరగతికి చెందిన ఫ్రిగేట్ పొడవు 125 మీటర్లు, బరువు 3,900 కిలోలు.

సోనియా గాంధీ 78వ బర్త్‌డే



న్యూఢిల్లీ: కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ సోమవారం 78వ పుట్టిన రోజు జరుపుకున్నారు. కాంగ్రెస్ చీఫ్ ఖర్గే సహా పలువురు పార్టీ ప్రముఖులు ఆమెకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. సోనియా బడుగు వర్గాల ప్రజల ఆశాదీపం అనీ, ఆమె ప్రజా జీవితం కోట్లాది మందికి ఆదర్శప్రాయమని ఖర్గే పేర్కొన్నారు. సోనియాకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన ప్రధాని మోదీ.. ఆమె సంపూర్ణ ఆయురారోగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యురాలిగా, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్ పర్సన్‌గా ఆమె కొనసాగుతున్నారు.

కెనడాలో భారత సంతతి యువకుని మృతి

ఎడ్మొంటన్: కెనడాలో భారత సంతతికి చెందిన యువకుడు మృతి చెందాడు. కెనడాలోని ఎడ్మొంటన్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్న 20 ఏళ్ల హర్షన్‌దీప్ సింగ్ ఓ ముఠా కాల్చి చంపింది. సీసీటీ ఫుటేజీ ఆధారంగా ఇద్దరు వ్యక్తులను ఎడ్మొంటన్ పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత ఓ అపార్ట్‌మెంట్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ వారం రోజుల్లో ఇది రెండో హత్య. ఆదివారం కెనడాలోని ఒంటారియోలో లాంబ్టన్ కాలేజీలో బిజినెస్ మేనేజ్మెంట్ చదువుతున్న 22 ఏళ్ల గురసిస్ సింగ్‌ను రూమ్‌మేట్ కత్తితో పొడిచి చంపాడు.

త్వరలోనే జమిలి ఎన్నికల బిల్లు

ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో తీసుకొచ్చేందుకు కేంద్రం ప్రయత్నాలు

న్యూఢిల్లీ: లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు జరిపేందుకు ఉద్దేశించిన 'ఒకే దేశం–ఒకే ఎన్నిక'బిల్లును ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో, లేదా తదుపరి సెషన్ ప్రవేశపెట్టేందుకు కేంద్రం ప్రయత్నాలు ముమ్మరం చేసిందని సమాచారం. ఈ విధానంపై అధ్యయనానికి మాజీ రాష్ట్రపతి కోవింద్ సారథ్యంలో ఏర్పాటైన కమిటీ ఇచ్చిన సిఫారసులను కేబినెట్ ఆమోదించడం ఈ విధానాన్ని ముందుకు తీసుకువచ్చేందుకు కేంద్రం కృతనిశ్చయంతో ఉన్నట్లు చెప్పకనే చెబుతోంది. బిల్లుపై విస్తృత ఏకాభిప్రాయం సాధించేందుకు, చర్చ జరిగేందుకు వీలుగా సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)కి పంపాలని కేంద్రం యోచిస్తోందని విశ్వసనీయ వర్గాలంటున్నాయి. అన్ని రాజకీయ పార్టీలకు ప్రాతినిధ్యం ఉండే జేపీసీలో అయితే సవివర చర్చ జరుగుతుందని, అందరి ఆమోదం లభిస్తుందని భావిస్తోంది. బిల్లుపై సంబంధిత ఇతర అన్ని వర్గాలనూ దీనిపై చర్చకు ఆహ్వానించాలని ప్రభుత్వం అనుకుంటోంది.

భారతదేశం.. రాష్ట్రాల యూనియన్

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

భారత భూభాగం - భారత యూనియన్

రాష్ట్రాల ఏర్పాటు-పునర్ వ్యవస్థీకరణ

భారత దేశంలో సమాఖ్య వ్యవస్థ ఉంది. కేంద్ర, రాష్ట్రాలు రాజ్యాంగ పరంగా అధికార విభజన సూత్రం ఆధారంగా పనిచేస్తాయి. సమాఖ్య, రాష్ట్రాల ఏర్పాటు, పునర్ వ్యవస్థీకరణ తదితర అంశాలను ఒకటో భాగంలో ప్రకరణలు 1 నుంచి 4 వరకు ప్రస్తావించారు.

భారత భూభాగం

ప్రకరణ-1

ఈ ప్రకరణ ప్రకారం, భారత భూభాగం అంటే రాష్ట్రాల సరిహద్దులు, కేంద్రపాలిత ప్రాంతాలు, కేంద్ర ప్రభుత్వం సముపార్జించిన ఇతర భూభాగాలు ఉంటాయి.

భారత భూభాగం అనే భావన విస్తృతమైంది. భారత సార్వభౌమాధికారం ఏ విధంగా విస్తరించి ఉంటుందో తెలుపుతుంది. భారత సార్వభౌమాధికారం భౌగోళిక ప్రాంతాలకే పరిమితం కాదు. భారత సముద్ర ప్రాదేశిక జలాలు 12 నాటికల్ మైళ్ల వరకు, విశిష్ట ఆర్థిక మండళ్లు 200 నాటికల్ మైళ్ల వరకు, అలాగే భారత అంతరిక్ష సరిహద్దులకూ సార్వభౌమాధికారం వర్తిస్తుంది.

భారత యూనియన్

ఇందులో రాష్ట్రాలు మాత్రమే ఉంటాయి. రాష్ట్రాలు సమాఖ్యలో అంతర్భాగంగా ఉంటూ నిర్ణీత అధికారాలను కలిగి ఉంటాయి. ఈ పదం కేంద్ర రాష్ట్ర సంబంధాలను సూచిస్తుంది.

రాష్ట్రాల సమ్మేళనం

భారత రాజ్యాంగం, ఒకటో ప్రకరణలో భారతదేశాన్ని రాష్ట్రాల యూనియన్‌గా పేర్కొంది. సమాఖ్య అనే పదాన్ని ఎక్కడా ప్రస్తావించలేదు. కెనడా సమాఖ్యను స్ఫూర్తిగా తీసుకుని యూనియన్ అనే పదాన్ని రాజ్యాంగంలో చేర్చారు.

భారత సమాఖ్య అమెరికాలా రాష్ట్రాల మధ్య ఒప్పందం ద్వారా ఏర్పడలేదు. అలాగే కెనడా మాదిరిగా ఏకకేంద్ర రాజ్యం సమాఖ్యగా విభజితమవలేదు. భారత సమాఖ్య ఒక ప్రత్యేక పద్ధతిలో ఏర్పడింది.

కేంద్ర రాష్ట్రాల మధ్య ఒప్పందం లేదు. కాబట్టి యూనియన్ నుంచి రాష్ట్రాలు విడిపోలేదు. అమెరికా సమాఖ్యలో ప్రారంభంలో రాష్ట్రాలకు కేంద్రం నుంచి విడిపోయే హక్కు ఉండేది. అయితే ఆ హక్కును తర్వాత రద్దు చేశారు.

కాబట్టి భారత సమాఖ్యను విచ్ఛిన్నం కాగల రాష్ట్రాల, అవిచ్ఛిన్న యూనియన్ (ఇన్ డెస్ట్రక్టిబుల్ యూనియన్ ఆఫ్ డెస్ట్రక్టిబుల్ స్టేట్స్)గా పేర్కొంటారు. అమెరికాను ఇన్‌డెస్ట్రక్టిబుల్ యూనియన్ ఆఫ్ ఇన్‌డెస్ట్రక్టిబుల్ స్టేట్స్‌గా పేర్కొంటారు.

ప్రకరణ-2

ఈ ప్రకరణ ప్రకారం పార్లమెంటు ఒక చట్టం ద్వారా కొత్త ప్రాంతాలను చేర్చుకోవచ్చు, ఇతర దేశాలకు బదిలీ చేయవచ్చు. ఈ అధికారం భారత భూభాగంలో లేని అంశాలకు వర్తిస్తుంది. ఈ అధికారం పార్లమెంటుకు సంబంధించినదైనా అంతర్జాతీయ ఒప్పందాలకు లోబడి ఉంటుంది.

వివరణ..

విదేశీ భూభాగాలను భారతదేశంలో చేర్చుకున్నప్పుడు పార్లమెంటు ప్రత్యేక మెజారిటీతో రాజ్యాంగ సవరణ చేయాలి.

ఉదాహరణ: 1961లో గోవాను భారత్‌లో కలిపినప్పుడు 12వ రాజ్యాంగ సవరణ చేశారు. అలాగే పాండిచ్చేరికి సంబంధించి 1962లో 14వ రాజ్యాంగ సవరణ చేశారు. 1975లో 36వ రాజ్యాంగ సవరణ ద్వారా సిక్కింను భారత రాష్ట్రంగా చేర్చుకున్నారు.

ప్రకరణ-3

ఇందులో కింది అంశాలు ఉన్నాయి.

- కొత్త రాష్ట్రాన్ని ఏర్పాటు చేయడం.
- రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలను కలిపి నూతన రాష్ట్రం ఏర్పాటు.(ఆంధ్ర రాష్ట్రం, హైదరాబాద్ కలయికతో 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు). అలాగే రాష్ట్రాన్ని విడగొట్టి కొత్త రాష్ట్రం ఏర్పాటు చేయడం. (2014 జూన్‌లో ఏర్పడిన తెలంగాణ)
- రాష్ట్ర విస్తీర్ణాన్ని పెంచవచ్చు.
- రాష్ట్ర విస్తీర్ణాన్ని తగ్గించవచ్చు.
- రాష్ట్ర సరిహద్దులను సవరించవచ్చు.
- రాష్ట్రాల పేర్లను మార్చవచ్చు.

రాష్ట్రాల ఏర్పాటు - ప్రక్రియ- పద్ధతి

ప్రకరణ 3లో పేర్కొన్న అన్ని అంశాలకు ఒకే ప్రక్రియ ఉంటుంది.

- పై అంశాలకు సంబంధించిన బిల్లును పార్లమెంటులోని ఏ సభలోనైనా ప్రవేశపెట్టవచ్చు.

వివరణ..

రాష్ట్ర పునర్ వ్యవస్థీకరణ బిల్లులో ఆర్థిక వనరుల పంపకాలు ఉంటే అది స్పెషల్ కేటగిరీ బిల్లు అవుతుంది. అలాంటి సందర్భాల్లో బిల్లును లోక్‌సభలోనే ప్రతిపాదించాలి. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు విషయంలో ఈ వివాదాన్ని గమనించవచ్చు.

- పై బిల్లులను రాష్ట్రపతి పూర్వ అనుమతితోనే ప్రవేశపెట్టాలి.
- ఈ షరతును 1955లో అయిదో రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చారు.
- సంబంధిత బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి ముందే ప్రభావితమవుతున్న రాష్ట్ర శాసనసభల అభిప్రాయాన్ని రాష్ట్రపతి కోరతారు.
- సంబంధిత రాష్ట్ర శాసనసభ రాష్ట్రపతి సూచించిన నిర్ణీత సమయంలోనే తమ అభిప్రాయాన్ని తెలపాలి.
- రాష్ట్ర శాసనసభలు వ్యక్తీకరించిన అభిప్రాయాలను పార్లమెంటు పరిగణలోకి తీసుకోవచ్చు లేదా తీసుకోకపోవచ్చు.

వివరణ..

1966లో పంజాబ్ నుంచి హర్యానా రాష్ట్రాన్ని ఏర్పాటు చేసినప్పుడు పంజాబ్‌లో రాష్ట్రపతి పాలన, విధానసభ సుప్తచేతనావస్థలో ఉండటం వల్ల పునర్‌వ్యవస్థీకరణ బిల్లును రాష్ట్ర శాసనసభ అభిప్రాయానికి నివేదించలేదు. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ బిల్లును శాసనసభ తిరస్కరించింది.

- పార్లమెంటు ఉభయసభలు సంబంధిత బిల్లును సాధారణ మెజారిటీతో వేర్వేరుగా ఆమోదించాలి. ఉభయసభల మధ్య ప్రతిష్టంభన ఏర్పడితే, సంయుక్త సమావేశానికి ఆస్కారం లేదు. బిల్లు వీగిపోతుంది.
- బిల్లును రాష్ట్రపతి తప్పని సరిగా ఆమోదించాలి. పునఃపరిశీలనకు అవకాశం లేదు.
- రాష్ట్రపతి ఆమోదం తెలిపితే బిల్లు చట్టంగా మారుతుంది. దీంతో ప్రక్రియ పూర్తి అవుతుంది.
- కొత్త రాష్ట్రం ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుందనేది కేంద్ర ప్రభుత్వం ప్రకటిస్తుంది. దీన్ని అపాయింటెడ్ డేట్ అంటారు.

ప్రకరణ-4

ఈ ప్రకరణ సంబంధిత తదుపరి పరిణామాలను వివరిస్తుంది. ప్రకరణ 2, 3 ప్రకారం ఏదైనా సవరణ చేసినప్పుడు 1, 4 షెడ్యూల్‌లో పేర్కొన్న అంశాలను కూడా తదనుగుణంగా మార్చాలి. దీనికోసం పార్లమెంటు ప్రత్యేక చట్టం చేయాల్సిన అవసరం లేదు. ప్రకరణ 2, 3 ప్రకారం ఏ సవరణ చేసినా, తదనుగుణంగా 1, 4 షెడ్యూల్‌లోని అంశాలు కూడా మార్పునకు గురవుతాయి.

వివరణ

ప్రకరణ 2, 3 ప్రకారం ఏ సవరణ చేసినా దాన్ని రాజ్యాంగ సవరణగా పరిగణించరు. ఈ అంశాన్ని ప్రకరణ 4(2)లో స్పష్టంగా పేర్కొన్నారు. రాష్ట్రాల ఏర్పాటు, పునర్వ్యవస్థీకరణ, ఇతర అంశాలకు రాజ్యాంగ సవరణ తప్పనిసరి కాదు.

వివాదాలు- సుప్రీంకోర్టు తీర్పులు

బెరుబారి యూనియన్ వివాదం-1960

ప్రకరణ 3 ప్రకారం, రాష్ట్రాల సరిహద్దును కుదించే అధికారం పార్లమెంటుకు ఉంది. అయితే ఒక రాష్ట్ర భూభాగాన్ని ఇతర దేశాలకు బదిలీ చేసే అధికారం ఉందా? అనే వివాదం తలెత్తింది. దీనికి సంబంధించి రాష్ట్రపతి సుప్రీంకోర్టు సలహాను కోరారు. ఈ వివాదంలో సుప్రీంకోర్టు తీర్పు చెబుతూ, రాష్ట్ర భూభాగాన్ని ఇతర దేశాలకు బదిలీ చేయాలంటే ప్రకరణ 368 ప్రకారం పార్లమెంటు ప్రత్యేక మెజారిటీతో రాజ్యాంగ సవరణ చేయాలని పేర్కొంది. అయితే, అంతర్గతంగా బదిలీ చేసేందుకు సాధారణ మెజారిటీ సరిపోతుంది.

గమనిక: బెరుబారి అనేది పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని ఒక ప్రాంతం. 9 చదరపు మైళ్ల విస్తీర్ణంతో ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఒక ఒప్పందం ద్వారా పాకిస్తాన్‌కు కొంత భాగాన్ని బదిలీ చేసింది.



బాబూలాల్ మారాండి వర్సెస్ ముంబై స్టేట్ కేస్ (1960)

రాష్ట్రాల పునర్‌వ్యవస్థీకరణ బిల్లును ఒక్క పర్యాయం మాత్రమే సంబంధిత రాష్ట్ర శాసనసభల అభిప్రాయానికి నివేదిస్తారు. ఒక వేళ ఆ బిల్లులో తర్వాత చేసిన మార్పులకు సంబంధించి మరోసారి రాష్ట్ర పరిశీలనకు పంపాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. **ఉదాహరణ:** తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం జిల్లాలోని పోలవరం కింది 7 ముంపు మండలాలను ఆంధ్రప్రదేశ్‌కు బదలాయించడం.

స్టేట్ ఆఫ్ పంజాబ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1982)

భారత రాజ్యాంగం నిర్ణీతమైన సమాఖ్య వ్యవస్థను ఏర్పరచలేదు. నిర్మాణపరంగా సమాఖ్య అయినప్పటికీ ఇది సమాఖ్య, ఏక కేంద్ర ప్రభుత్వాల మిశ్రమంగా పేర్కొంది.

ముళ్ల పెరియార్ పర్యావరణ వివాదం (2006)

నదీజలాల పంపిణీ విషయంపై చట్టాలను చేసే అధికారం రాష్ట్ర శాసనసభకు ఉండదు. ఈ అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉంటుందని సుప్రీంకోర్టు ఈ కేసులో తీర్పు చెప్పింది.

భాషా ప్రయుక్త రాష్ట్రాలు

దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి రెండు రకాల రాజకీయ భాగాలు ఉండేవి.

1. నేరుగా బ్రిటిష్ ప్రభుత్వ నియంత్రణలో ఉన్న భాగాలు.
2. బ్రిటిష్ సార్వభౌమాధికారం కింద పనిచేసే సంస్థానాలు (స్వదేశీ సంస్థనాలు).

ఆనాడు దేశంలో 552 స్వదేశీ సంస్థానాలు ఉండేవి. బ్రిటిషువారు ప్రకటించిన విలీన ఒప్పందం ప్రకారం 549 స్వదేశీ సంస్థానాలు భారత యూనియన్‌లో విలీనం అయ్యాయి కానీ హైదరాబాద్, జునాగఢ్, కశ్మీర్ సంస్థానాలు విలీనాన్ని వ్యతిరేకించాయి. కశ్మీర్ భారత్‌లో విలీన ఒప్పందం ద్వారా అంతర్భాగం అయింది. ప్రజాభిప్రాయం ద్వారా జునాగఢ్ భారత్‌లో కలిసిపోయింది. ప్రజాభిప్రాయం ద్వారా కలిసిన మొదటి, చివరి సంస్థానం ఇదే. హైదరాబాద్ సంస్థానాన్ని 1948 సెప్టెంబర్ 17న ఆపరేషన్ పోలో అనే పోలీసు చర్య (సైనిక చర్య) ద్వారా విలీనం చేశారు.

1950 నాటికి రాజ్యాంగం ప్రకారం నాలుగు రకాల రాష్ట్రాలు అమలులో ఉండేవి. వీటిని పార్ట్-ఎ, బి, సి, డిగా వర్గీకరించారు. పార్ట్-ఎలో బ్రిటిష్ పాలిత గవర్నర్ ప్రావిన్స్‌లు 9 ఉండేవి. పార్ట్-బిలో శాసనసభ కలిగిన స్వదేశీ సంస్థానాలు 9, పార్ట్-సిలో చీఫ్ కమిషనర్ ప్రాంతాలు 10, పార్ట్-డిలో అండమాన్ నికోబార్ దీవులు ఉండేవి.

నేపథ్యం..

భాషా ప్రాతిపదికన రాష్ట్రాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ స్వాతంత్ర్యోద్యమ కాలంలోనే ఉండేది. ఈ డిమాండు మొట్టమొదటి సారి తెరపైకి తెచ్చింది తెలుగువారే.

గమనిక: స్వాతంత్ర్యం రాక ముందు భాషా ప్రాతిపదికన ఏర్పడిన మొదటి రాష్ట్రం ఒడిశా.

- 1913లో బాపట్లలో జరిగిన ఆంధ్రమహాసభ ప్రత్యేక ఆంధ్ర ఏర్పాటుకు డిమాండ్ చేసింది.
- 1927లో కాంగ్రెస్ సమావేశం భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును సమర్థిస్తూ తీర్మానం చేసింది.
- 1931లో జరిగిన రెండో రౌండ్ టేబుల్ సమావేశానికి గాంధీ హాజరైన సందర్భంలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర డిమాండుపై చర్చించాలని భోగరాజు పట్టాభి సీతారామయ్య ప్రతిపాదించారు.

1937లో రాయలసీమ, ఆంధ్ర నాయకుల మధ్య కాశీనాథుని నాగేశ్వరరావు నివాసంలో ఒక ఒప్పందం కుదిరింది. కాశీనాథుని నివాసం పేరు శ్రీబాగ్ కాబట్టి దీన్ని శ్రీబాగ్ ఒప్పందం అంటారు. స్వాతంత్ర్యానంతరం రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ఏర్పాటు చేసే సందర్భంలో మద్రాసు, ఆంధ్ర నాయకుల మధ్య తలెత్తిన వివాదాలు ప్రత్యేక ఆంధ్ర ఏర్పాటుకు బలమైన కారణాలుగా చెప్పొచ్చు.

థార్ కమిషన్ -1948

భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుపై పరిశీలనకు రాజ్యాంగ పరిషత్తు 1948లో ఉత్తరప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి ఎస్.కె.థార్ నాయకత్వంలో ఇద్దరు సభ్యులతో (పన్నాలాల్, జగత్ నారాయణ్ లాల్) ఒక కమిషన్‌ను నియమించింది. ఈ కమిషన్ కేవలం భాషా ప్రాతిపదిక పైన రాష్ట్రాలు ఏర్పాటు చేయడాన్ని తిరస్కరించింది. పరిపాలనా సౌలభ్య ప్రాతిపదికపైనే రాష్ట్రాలను ఏర్పాటు చేయాలని సూచించింది.

జె.వి.పి. కమిటీ

థార్ కమిషన్ నివేదికకు వ్యతిరేకంగా చెలరేగిన ఆందోళనను విరమింపజేయడానికి అఖిల భారత కాంగ్రెస్ కమిటీ 1948 డిసెంబర్‌లో జవహర్‌లాల్ నెహ్రూ, వల్లభ్‌భాయ్ పటేల్, పట్టాభి సీతారామయ్య సభ్యులుగా ఒక కమిటీని నియమించింది. ఈ కమిటీ కూడా దేశం మొత్తం మీద రాష్ట్రాల పునర్‌నిర్మాణాన్ని వాయిదా వేయాలని, ఆంధ్ర రాష్ట్రాన్ని మాత్రం దానికి మినహాయింపుగా భావించాలని నివేదించింది.

1952 ఆగస్టు 15 నుంచి 35 రోజుల పాటు గొల్లపూడి సీతారామయ్య శాస్త్రి ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. 35 రోజుల తర్వాత ఆచార్య వినోబా భావే అతడి నిరాహారదీక్షను విరమింపజేశారు.

1952 అక్టోబర్ 19 నుంచి మద్రాసులో బులుసు సాంబమూర్తి ఇంట్లో పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ఆమరణ నిరాహారదీక్ష చేపట్టారు. దీక్ష 50వ రోజుకు చేరుకున్న సందర్భంగా మద్రాసును సందర్శించిన జవహర్‌లాల్ నెహ్రూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటుకు హామీ ఇచ్చారు.

కానీ పొట్టి శ్రీరాములు తన దీక్షను కొనసాగించారు. 58వ రోజున డిసెంబర్ 15న ఆయన అమరుడయ్యారు. పొట్టి శ్రీరాములు మృతితో హింసాత్మక సంఘటనలు చెలరేగాయి. దీంతో 1952 డిసెంబర్ 19న పార్లమెంటులో నెహ్రూ ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర ఏర్పాటును ప్రకటించారు.

విద్య, ఉద్యోగ సమాచారం

సీఎస్ఐఆర్-సీఈఈఆర్ఐలో 11 పోస్టులు

పిలానీ(రాజస్థాన్)లోని సీఎస్ఐఆర్-సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్(సీఈఈఆర్ఐ) టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 11.
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో డిప్లొమా, బీఎస్సీ(హానర్స్) (ఫిజిక్స్ /ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/కంప్యూటర్ సైన్స్ /ఇన్‌స్ట్రుమెంటేషన్/అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ సైన్స్/ఫిజికల్ సైన్స్, డేటా సైన్స్/సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 09.01.2025 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.56,916.
» **ఎంపిక విధానం:** ట్రేడ్ టెస్ట్, రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 10.12.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.01.2025
» **వెబ్‌సైట్:** https://www.ceeri.res.in

పీజీసీఐఎల్, గురుగ్రామ్‌లో 71 ఆఫీసర్ ట్రైనీ పోస్టులు


గురుగ్రామ్‌లోని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పీజీసీఐఎల్) దేశవ్యాప్తంగా ఉన్న పీజీసీఐఎల్ రీజియన్/కార్యాలయాల్లో వివిధ విభాగాల్లో ఆఫీసర్ ట్రైనీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 71.
» **విభాగాలు:** ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్, సోషల్ మేనేజ్‌మెంట్, హెచ్ఆర్, పీఆర్.
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో సంబంధిత విభాగంలో ఫుల్‌టైం డిప్లొమా, డిగ్రీ, ఎంబీఏ, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. యూజీసీ నెట్-2024 స్కోరు తప్పనిసరిగా ఉండాలి.
» **గరిష్ఠ వయో పరిమితి:** 24.12.2024 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
» **పే స్కేల్:** నెలకు ట్రైనింగ్ సమయంలో రూ.40,000, ట్రైనింగ్ పూర్తి చేసుకున్నాక రూ.50,000 నుంచి రూ.1,60,000.
» **ఎంపిక విధానం:** యూజీసీ నెట్ డిసెంబర్ 2024 స్కోర్, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ల వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామ్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 04.12.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**24.12.2024.
» **వెబ్‌సైట్:** www.powergrid.in

మోతాదుకు మించితే విషతుల్యం!

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

రసాయన శాస్త్రం



ఔషధాల వాడకానికి సంబంధించి 'సొంత వైద్యం' చాలా ప్రమాదకరమైంది. తప్పనిసరిగా వైద్యుడి సిఫారసు మేరకే మందులు వాడాలి. అంతేకాకుండా వైద్యుడు సూచించిన మోతాదు కంటే అధిక పరిమాణంలో ఔషధాలను వాడితే అవి విషతుల్యమయ్యే ప్రమాదం ఉంటుంది. 'సైడ్ ఎఫెక్ట్'లు కనిష్ఠ స్థాయిలో ఉండేవిధంగా ఔషధాలను రూపొందిస్తారు.

ఔషధాలు (డ్రగ్స్)

మానవులు, జంతువుల్లో జీవక్రియలను ప్రభావితం చేసి, వ్యాధులను నయం చేయడానికి ఉపయోగించే రసాయన కారకాలనే ఔషధాలు అంటారు. సాధారణ పరిభాషలో వీటిని మందులుగానూ వ్యవహరిస్తారు. వ్యాధులను గుర్తించడానికి, నయం చేయడానికే కాకుండా నిరోధించడానికి ఉపయోగించేవాటిని కూడా ఔషధాలుగా పేర్కొంటారు. వ్యాధులు లేదా రోగాల చికిత్సకు రసాయన పదార్థాలను ఉపయోగించే ప్రక్రియను 'కెమోథెరపీ (Chemotherapy)' అంటారు.

జీవిలోకి ప్రవేశించిన ఔషధాలు జీవాణువులైన కార్బోహైడ్రేట్లు, లిపిడ్‌లు, ప్రోటీన్లు, న్యూక్లియిక్ ఆమ్లాల లాంటి వాటితో చర్య జరుపుతాయి. ఈ జీవాణువులనే లక్ష్య అణువులు (Target Molecules) అంటారు. ఔషధాలు వరణాత్మకంగా (Selective).. అంటే కేవలం ఆశించిన లక్ష్య అణువులతో మాత్రమే చర్యలో పాల్గొంటాయి. ఇతర లక్ష్య అణువులను ప్రభావితం చేయవు. ఇవి ఆశించిన ప్రదేశంలోనే పనిచేస్తాయి.

వివిధ రకాల ఔషధాలు

బాధా నివారిణులు (Analgesics): ఏ విధమైన ఇతర రకాల నరాల వ్యవస్థకు సంబంధించిన రుగ్మతలను కలిగించకుండా నొప్పిని లేదా బాధను మాత్రమే తగ్గించే ఔషధాలను ఎనాల్జెసిక్‌లు అంటారు. ఇవి రెండు రకాలు.

అవి:

1. **నాన్-నార్కోటిక్ ఎనాల్జెసిక్‌లు:** దురలవాట్లకు (Addiction) లోను చేయని ఎనాల్జెసిక్‌లు. వీటినే నాన్-నార్కోటిక్ ఎనాల్జెసిక్‌లు అంటారు.

ఉదా: ఐబూప్రోఫెన్, ఆస్పిరిన్, పారాసెటమాల్.

- ఎనాల్జెసిక్‌లకు జ్వర తీవ్రతను తగ్గించే గుణం ఉండటం వల్ల యాంటీ పైరెటిక్‌లుగా కూడా పనిచేస్తాయి.
- ఆస్పిరిన్ (ఎసిటైల్ సాలిసిలికామ్లం) ప్రోస్టాగ్లాండిన్‌లు (కణజాలాల్లో వచ్చే మంటలు, తద్వారా వచ్చే నొప్పులకు కారణమైనవి) అనే రసాయన పదార్థాల ఉత్పత్తి వేగాన్ని తగ్గించి బాధా నివారిణిగా పనిచేస్తుంది. దీనికి రక్తాన్ని పలచన చేసే గుణం (Blood thinner) కూడా ఉంది. అందువల్ల ఆస్పిరిన్ రక్తం గడ్డకట్టకుండా చూసి, గుండెపోటు నివారణకు దోహదపడుతుంది.

2. **నార్కోటిక్ ఎనాల్జెసిక్‌లు:** ఓపియమ్ పాపీ (నల్లమందు) నుంచి గ్రహించే మార్ఫిన్ రకానికి చెందిన రసాయనాలు దురలవాట్లకు గురి చేసేవి (Addictive)గా ఉంటాయి. సాధారణంగా వీటిని శస్త్ర చికిత్సల అనంతరం కలిగే బాధలు, గుండెకు సంబంధించిన నొప్పి, కేన్సర్‌తో అవసాన దశలో ఉండే రోగికి కలిగే బాధలు, ప్రసవ సమయంలో నొప్పిని తగ్గించడానికి ఉపయోగిస్తారు. వీటిని ఔషధ మోతాదులో సేవిస్తే బాధను తగ్గించి, నిద్రను ప్రోత్సహిస్తాయి.అధిక మొత్తంలో సేవిస్తే మైకం, అపస్మారక స్థితి, మూర్ఛకు దారితీసి చివరికి మరణం కూడా సంభవించే ప్రమాదం ఉంటుంది.

యాంటీ బయాటిక్‌లు: సూక్ష్మజీవుల పెరుగుదలను నిరోధించేవి లేదా వాటిని నాశనం చేసే వాటిని యాంటీబయాటిక్‌లు అంటారు.

ఎరిత్రోమైసిన్, టెట్రాసైక్లిన్, క్లోరాంఫెనికాల్ లాంటివి సూక్ష్మజీవుల పెరుగుదలను నిరోధిస్తాయి. పెన్సిలిన్, ఆఫ్లోక్సాసిన్ మొదలైనవి సూక్ష్మజీవులను నాశనం చేస్తాయి.

ఆమ్ల విరోధులు (Antacids): హైడ్రోక్లోరికామ్లం ఉదరంలో ఆహారం జీర్ణమవడానికి తోడ్పడుతుంది. ఒక వేళ జీర్ణకోశంలో ఈ ఆమ్లం అధికంగా ఉత్పత్తి చెందితే అది ప్రకోపానికి (Irritation) లేదా నొప్పికి దారితీస్తుంది. ఇంకా తీవ్రస్థాయిలో జరిగితే జీర్ణకోశంలో పుండ్లు (అల్సర్లు) ఏర్పడతాయి. రానిటిడిన్, ఒమిప్రజోల్, పెంటాప్రజోల్ లాంటివి ఈ ఆమ్ల ఉత్పత్తిని నియంత్రిస్తాయి. ఉత్పత్తి అయిన ఆమ్లాన్ని తటస్థీకరించేవి - సోడియం బై కార్బోనేట్ (బేకింగ్ సోడా), మెగ్నీషియం హైడ్రాక్సైడ్, అల్యూమినియం హైడ్రాక్సైడ్ మొదలైనవి.

యాంటీ సెప్టిక్‌లు (చీము నిరోధులు): గాయాలు, కోతలు, అల్సర్‌లు అయినప్పుడు జీవ కణాలకు పూతగా పూసే పదార్థాలే యాంటీ సెప్టిక్‌లు. యాంటీ బయాటిక్‌ల మాదిరిగా వీటిని నోటితో మింగకూడదు.

ఉదా: అయోడిన్ టింక్చర్, స్పిరిట్ (ఇథైల్ ఆల్కహాల్), ఫినాల్ ద్రావణం, డెట్టాల్ (క్లోరోక్సైలినాల్, టెర్పినియోల్‌ల మిశ్రమం), బిథియోనాల్, క్లోరిన్ జలద్రావణం, అయొడోఫాం.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో నాడీ సంబంధమైన వ్యాధి కానిది?
   1) స్పృహ కోల్పోవడం
   2) మానసిక ఆందోళన
   3) పక్షవాతం
   4) జీర్ణకోశంలో పుండ్లు (అల్సర్లు)
2. జీర్ణకోశంలో పెప్సిన్, హైడ్రోక్లోరికామ్లాల ఉత్పత్తిని ప్రేరేపించే రసాయనం?
   1) హిస్టమీన్ 2) రెనిటిడీన్
   3) ఎడ్రినలిన్ 4) మార్ఫీన్
3. అధిక ఆమ్ల వ్యాధి (Acidity) చికిత్సకు ఉపయోగించే ఔషధం?
   1) సిమెటిడిన్ 2) రెనిటిడిన్
   3) ఓమిప్రజోల్ 4) పైవన్నీ
4. కిందివాటిలో ఆమ్ల విరోధిగా పనిచేసేది ఏది?
   1) సోడియం బైకార్బోనేట్
   2) అల్యూమినియం హైడ్రాక్సైడ్
   3) మెగ్నీషియం హైడ్రాక్సైడ్
   4) పైవన్నీ
5. చిన్న పిల్లలకు ఆమ్ల విరోధిగా ఉపయోగించే మిల్క్ ఆఫ్ మెగ్నీషియా అనేది?
   1) మెగ్నీషియం హైడ్రాక్సైడ్
   2) అల్యూమినియం హైడ్రాక్సైడ్
   3) రానిటిడీన్ 4) ఓమీప్రజోల్
6. కిందివాటిలో యాంటీ హిస్టమీన్ ఏది?
   1) వేలియం 2) పారాసిటమాల్
   3) బ్రోమ్‌ఫెనిరమీన్ 4) ఆస్పిరిన్
7. నిద్ర తెప్పించే (హిప్నాటిక్) ఔషధం?
   1) సెరటోనిన్ 2) వేలియం
   3) క్లోరోడయజీపాక్సైడ్ 4) పైవన్నీ
8. కిందివాటిలో నార్కోటిక్ నొప్పి నివారిణి ఏది?
   1) మార్ఫీన్ 2) ఆస్పిరిన్
   3) పారాసెటమాల్ 4) పైవన్నీ
9. కిందివాటిలో ఎనాల్జెసిక్ ఏది?
   1) పారాసెటమాల్ 2) ఆస్పిరిన్
   3) ఐబూప్రోఫెన్ 4) పైవన్నీ
10. రక్తాన్ని పలచన చేసే గుణం ఉన్న ఔషధం (Blood thinner) ఏది?
    1) పారాసెటమాల్ 2) ఆస్పిరిన్
    3) మార్ఫీన్ 4) కొడీన్
11. కెమోథెరపీ అంటే?
    1) కీళ్లు వాచేలా కొట్టడం
    2) ఔషధాలను ఉపయోగించి వ్యాధులు నయం చేయడం
    3) ఫిజియోథెరపీ
    4) యోగా ద్వారా వ్యాధులు నయం చేయడం
12. ఎసిటైల్ సాలిసిలికామ్లం అని దేన్నంటారు?
    1) ఆస్పిరిన్ 2) పారాసెటమాల్
    3) క్లోరోక్విన్ 4) పెన్సిలిన్
13. సింకోనా చెట్టు బెరడు నుంచి సంగ్రహించే ఔషధం?
    1) క్వినైన్ 2) మార్ఫీన్
    3) నికోటిన్ 4) కెఫీన్
14. కిందివాటిలో సరైన వాక్యం ఏది?
    1) పారాసెటమాల్ అధిక మోతాదులో వాడితే కాలేయం దెబ్బతింటుంది
    2) ఆస్పిరిన్ అధికంగా వాడితే అల్సర్‌లు ఏర్పడతాయి
    3) మిథైల్ సాలిసిలేట్ మూత్రవర్ధకంగా పనిచేస్తుంది
    4) పైవన్నీ సరైనవే
15. కిందివాటిలో బాధా నివారిణిగా పనిచేస్తూ జ్వరాన్ని తగ్గించే గుణం ఉన్న ఔషధం కానిది?
    1) పారాసెటమాల్ 2) ఆస్పిరిన్
    3) కెఫీన్ 4) మార్ఫీన్
16. ఎలర్జీని తగ్గించే గుణం ఉన్న ఔషధాలను ఏమంటారు?
    1) ఎనాల్జెసిక్‌లు 2) ట్రాంక్విలైజర్‌లు
    3) యాంటీ హిస్టమీన్‌లు
    4) యాంటీ బయాటిక్‌లు
17. హెరాయిన్ అనే మత్తుమందును దేన్ని ఎసిటైలేషన్ చేసి రూపొందిస్తారు?
    1) మార్ఫీన్ 2) కెఫీన్
    3) నికోటిన్ 4) సాలిసిలికామ్లం
18. కిందివాటిలో ఆల్కలాయిడ్ కుటుంబానికి చెందని డ్రగ్ ఏది?
    1) మార్ఫీన్ 2) ఆస్పిరిన్
    3) నికోటిన్ 4) కెఫీన్
19. కిందివాటిలో సరికాని జత?
    1) టీ - కెఫీన్
    2) పొగాకు - నికోటిన్
    3) సింకోనా - క్వినైన్
    4) పెన్సిలియం బూజు - క్లోరాంఫెనికాల్
20. కిందివాటిలో సరికాని జత?
    1) పెన్సిలిన్: యాంటీ బయాటిక్
    2) డెట్టాల్: యాంటీ సెప్టిక్
    3) వేలియం: ట్రాంక్విలైజర్
    4) క్లోరోక్విన్: ఎనాల్జెసిక్
21. క్షయ వ్యాధి నివారణకు ఉపయోగించే ఔషధం ?
    1) టెట్రాసైక్లిన్ 2) పెన్సిలిన్
    3) క్లోరోక్విన్ 4) స్ట్రెప్టోమైసిన్
22. మలేరియా నివారణకు వాడే ఔషధం?
    1) క్లోరోక్విన్ 2) పెన్సిలిన్
    3) ఆస్పిరిన్ 4) వేలియం
23. మత్తు మందులకు అలవాటు పడిన వారు అవి దొరకకపోతే సేవించేది ఏది?
    1) డెట్టాల్ 2) పురుగులమందు
    3) దగ్గు మందు 4) ఎండ్రిన్
24. కిందివాటిలో గర్భ నిరోధక ఔషధం (యాంటీ ఫెర్టిలిటీ డ్రగ్) ఏది?
    ఎ. నారిథింద్రోన్
    బి. ఇథైనైల్ ఈస్ట్రాడయోల్
    సి. క్లోరామ్‌ఫెనికాల్
    1) ఎ, బి 2) బి, సి
    3) ఎ, సి 4) ఎ, బి, సి
25. కిందివాటిలో దోమల నియంత్రణకారి?
    1) డెట్టాల్ 2) పైరిత్రిన్
    3) ఈథర్ 4) ఆలిటేమ్
26. కిందివాటిలో సరికాని జత ఏది?
    1) కనుపాప విస్ఫారణం: అట్రోపిన్
    2) స్థానిక మత్తు మందు: ఈథర్
    3) గుండె జబ్బు: నైట్రో గ్లిజరిన్
    4) మలేరియా: నికోటిన్
27. పెన్సిలిన్‌ను కనుగొన్న శాస్త్రవేత్త?
    1) అలెగ్జాండర్ ఫ్లెమింగ్
    2) ఖొరానా 3) సాల్వర్‌సన్
    4) సి.వి. రామన్

సమాధానాలు

1) 4; 2) 1; 3) 4; 4) 4; 5) 1; 6) 3; 7) 4; 8) 1; 9) 4; 10) 2; 11) 2; 12) 1; 13) 1; 14) 4; 15) 3; 16) 3; 17) 1; 18) 2; 19) 4; 20) 4; 21) 1; 22) 1; 23) 3; 24) 1; 25) 2; 26) 4; 27) 1.

మొదటి రిపబ్లిక్ డే ఏ రోజు అవుతుంది?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

మెంటల్ ఎబిలిటీ

క్యాలెండర్

క్యాలెండర్ చాప్టర్ నుంచి ప్రతి పోటీ పరీక్షలో 2 – 5 వరకు ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది.

గమనిక: ఈ చాప్టర్‌లోని ప్రశ్నలు సాధించాలంటే బేసి రోజులను గుర్తించడం తెలిస్తే చాలు.

బేసి దినాలు గుర్తించడం

క్యాలెండర్‌లో రెండు రకాల సంవత్సరాలుంటాయి.

- సాధారణ సంవత్సరంలో 365 రోజులు అంటే 52 వారాలు + 1 రోజు. ఆ మిగిలిన ఒక రోజునే 'బేసిదినం' అంటాం.

గమనిక: ఆదివారం నుంచి శనివారం వరకు ఏడు రోజులు ఉంటాయి. కాబట్టి ఇచ్చిన రోజులను 7తో భాగిస్తే వచ్చిన శేషాన్ని 'బేసి దినాలు'గా గుర్తించాలి.

- లీపు సంవత్సరంలో 366 రోజులు అంటే 52 వారాలు + 2 బేసి దినాలు ఉంటాయి.

గమనిక: లీపు సంవత్సరంలో ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి.

లీపు సంవత్సరాన్ని గుర్తించడం

- ఇచ్చిన ఏడాదిలోని చివరి రెండు అంకెల(అంటే ఒకట్లు, పదుల స్థానం)ను 4 నిశ్శేషంగా భాగిస్తే అది లీపు సంవత్సరం. లేకపోతే సాధారణ సంవత్సరం.

శతాబ్దంలోని లీపు సంవత్సరం గుర్తించడం

- శతాబ్దాలన్నీ లీపు సంవత్సరాలు కావు. ఏదైనా ఒక శతాబ్దాన్ని 400 నిశ్శేషంగా భాగిస్తే అది లీపు సంవత్సరం.

ఉదా: 400, 800, 1200, 1600, 2000 లీపు సంవత్సరాలు. కానీ 500, 600, 1100, 1500, 1700, 1800, 1900 లీపు సంవత్సరాలు కావు.

శతాబ్దం చివరి రోజు వచ్చే వారాలను కనుక్కోవడం

- వంద సంవత్సరాల్లో ఐదు బేసిదినాలు ఉంటాయి. అంటే 76 సాధారణ సంవత్సరాలు + 24 లీపు సంవత్సరాలు ఉంటాయి.

76×1 బేసిదినం + 24×2 బేసిదినాలు
= 76+48 = 124 రోజులు.
124 రోజులను 7తో భాగిస్తే 5 శేషం వస్తుంది.

క్యాలెండర్ చాప్టర్ నుంచి ముఖ్యంగా అడిగే ప్రశ్నలు

- ఒక సంవత్సరం ఇచ్చినప్పుడు దానికి సమానమైన సంవత్సరం మళ్లీ ఎప్పుడు పునరావృతమవుతుంది.
- తేదీని ఇస్తే వారాన్ని, వారాన్ని ఇస్తే తేదీని కనుక్కోవడం.
- ఒక లీపు సంవత్సరం ఇచ్చినప్పుడు అలాంటి లీపు సంవత్సరం మళ్లీ ఎప్పుడొస్తుందో గుర్తించడం.
- ఒక సంవత్సరం, తేదీ, వారం ఇచ్చినప్పుడు, మరో ఏడాదిలో అదే తేదీ లేదా వారం ఎప్పుడొస్తుందో కనుక్కోవడం.



కాబట్టి 100 ఏళ్లలో ఐదు బేసి దినాలు ఉంటాయి. అంటే ఆ రోజు శుక్రవారం.
200 ఏళ్లలో 5×2 = 10ని 7తో భాగిస్తే 3 బేసి దినాలు అంటే బుధవారం.
300 సంవత్సరాల్లో 5×3=15ను 7తో భాగిస్తే 1 బేసిదినం అంటే సోమవారం. 400 సంవత్సరాల్లో 0 బేసిదినాలు అంటే ఆదివారం.

శతాబ్దం చివరి రోజున శుక్రవారం, బుధవారం, సోమవారం, ఆదివారం వస్తాయి.

లీపు సంవత్సరంలో జనవరి, జూలై.. సాధారణ సంవత్సరంలో జనవరి అక్టోబర్ నెలలకు ఒకే విధమైన క్యాలెండర్ ఉంటుంది.కింద ఇచ్చిన కోడ్స్ సహాయంతో క్యాలెండర్ సమస్యలకు సులభంగా సమాధానాలు గుర్తించవచ్చు.

గమనిక: బేసి దినాలను కోడ్స్‌గా రాశాం.

వీటిని జ్ఞాపకం ఉంచుకోవడానికి టిప్స్

- శతాబ్దపు కోడ్‌లను గమనిస్తే 6, 4, 2, 0 పునరావృతం అవుతున్నాయి.
- నెలకోడ్‌లను 12 అంకెల మొబైల్ నెంబర్‌గా గుర్తుపెట్టుకోవాలి.

అది 033 614, 625 035

ఒక తేదీ ఇచ్చి అది ఏ వారమో గుర్తించడానికి కోడ్

తేది + నెలకోడ్ + సంవత్సరం + లీపు సంవత్సరం + శతాబ్దం కోడ్

ఉదా: 22-04-1984 ఏ వారం అవుతుంది?

సాధన: పైన ఇచ్చిన కోడ్ ప్రకారం అన్నింటిని కూడాలి.
22 + 6 + 84 + 21 + 0 = 133
133ను 7తో భాగిస్తే శేషం సున్నా.
అంటే కోడ్ ప్రకారం ఆదివారం అవుతుంది.
తేది = 22, ఏప్రిల్ నెలకోడ్ = 6,
సంవత్సరం = 84,
లీపు సంవత్సరాలు 84/4 = 21
శతాబ్దం కోడ్ = 0
అన్నింటిని కూడితే 133 వస్తుంది.

పై విధంగా ప్రాక్టీస్ చేస్తే తక్కువ సమయంలో కచ్చితత్వంతో సమాధానాన్ని గుర్తించగలం.

సమానమైన క్యాలెండర్‌ను గుర్తించడం

ఉదా:

1. **2003 లాంటి క్యాలెండర్ మళ్లీ ఏ సంవత్సరంలో పునరావృతం అవుతుంది?** (ఎస్ఐ-2012)
ఎ) 2006 బి) 2013 సి) 2012 డి) 2014
జవాబు (డి)

సాధన: ఇచ్చిన సంవత్సరం నుంచి బేసి దినాలను లెక్కిస్తూ పోతే ఎక్కడైతే బేసి దినాల మొత్తం 7 అవుతుందో అది సమానమైన క్యాలెండర్ అవుతుంది. ఒకవేళ బేసిదినాల మొత్తం 7 కాకపోతే 14 వరకు లెక్కించాలి.
2003-1, 2004-2 (లీపు సంవత్సరం)
2005-1, 2006-1
2007-1, 2008-2 (లీపు సంవత్సరం)

నెల - కోడ్	
జనవరి - 0	జూలై - 6
ఫిబ్రవరి - 3	ఆగస్టు - 2
మార్చి - 3	సెప్టెంబర్ - 5
ఏప్రిల్ - 6	అక్టోబర్ - 0
మే - 1	నవంబర్ - 3
జూన్ - 4	డిసెంబర్ - 5

శతాబ్దం - కోడ్	
1600-1699→6	2000-2099→6
1700-1799→4	2100-2199→4
1800-1899→2	2200-2299→2
1900-1999→0	2300-2399→0

శతాబ్దం - కోడ్	
1600-1699→6	2000-2099→6
1700-1799→4	2100-2199→4
1800-1899→2	2200-2299→2
1900-1999→0	2300-2399→0

శతాబ్దం - కోడ్	
ఆదివారం - 0	గురువారం - 4
సోమవారం - 1	శుక్రవారం - 5
మంగళవారం - 2	శనివారం - 6
బుధవారం - 3	

2007 వరకు బేసిదినాల మొత్తం = 6
2008 వరకు = 8
కాబట్టి 14 వచ్చే వరకు చూద్దాం.
2009-1 2010-1 2011-1
2012-2 2013-1
2013 వరకు బేసి దినాల మొత్తం = 14
కాబట్టి 2014 జవాబు అవుతుంది.
అంటే 2003 లాంటి క్యాలెండర్ 2014లో వస్తుంది.

తేలిక పద్ధతి:

కోడ్: 6 11 11

స్టెప్1: ముందుగా ఇచ్చిన సంవత్సరానికి ముందు, వెనుక లీపు సంవత్సరాలను గుర్తించాలి.

2000 2001 2002 2003 *2004*
\+ \+ \+
6 11 11
....
2014
....

స్టెప్ 2: వాటికి మధ్య ఉన్న సంవత్సరాలకు 6, 11, 11లను కలిపితే వాటికి సమాన క్యాలెండర్ వస్తుంది.

స్టెప్ 3: మన ప్రశ్నలోని 2003కు 11ను కలిపితే 2014 సమాధానం వచ్చింది.

గమనిక: అడిగిన ప్రశ్నలోని సంవత్సరం లీపు సంవత్సరం అయితే + 28తో కూడాలి.

ఉదా: 2000 లాంటి లీపు సంవత్సరం 2028లో వస్తుంది.

మాదిరి ప్రశ్నలు

1. **12 ఫిబ్రవరి, 1991 ఏ వారం అవుతుంది?**
ఎ) సోమవారం బి) మంగళవారం
సి) బుధవారం డి) గురువారం
సాధన: తేది + నెలకోడ్ + సం. + లీపు సం. + శతాబ్దం కోడ్‌ను ఉపయోగించాలి.
12 + 3 + 91 + 22 + 0 = 128
(91/4 = 22 లీపు సంవత్సరాలు)
128ను 7తో భాగిస్తే శేషం 2.
కాబట్టి మంగళవారం అవుతుంది.

2. **కిందివాటిలో లీపు సంవత్సరం ఏది?**
ఎ) 1500 బి) 1700 సి) 1800 డి) 1600
సాధన: ఇచ్చినవన్నీ శతాబ్దాలు కాబట్టి శతాబ్దాన్ని 400తో భాగించాలి. అప్పుడు శేషం సున్నా వస్తే అది లీపు సంవత్సరం అవుతుంది.
400)1600(4
1600
0
శేషం సున్నా
కాబట్టి 1600 మాత్రమే లీపు సంవత్సరం.

3. **1992లో మొదటిరోజు ఏ వారం?**
ఎ) మంగళవారం బి) బుధవారం
సి) గురువారం డి) నిర్ణయించలేం
సాధన:
1992లో మొదటిరోజు అంటే జనవరి 1
కోడ్ ప్రకారం
1 + 0 + 92 + 23 + 0 =116
116ను 7 తో భాగిస్తే శేషం 4.
అంటే గురువారం అవుతుంది.

4. **మొదటి శతాబ్దంలోని జనవరి 1 ఏ రోజు అవుతుంది?**
ఎ) మంగళవారం బి) సోమవారం
సి) బుధవారం డి) గురువారం
సాధన: క్యాలెండర్‌లోని మొత్తం సమస్యలు, కోడ్‌లు వీటన్నింటినీ 1 - జనవరి - 01 సంవత్సరం సోమవారం నుంచి మొదలైనట్లు గానే తీసుకున్నారు.
గమనిక: క్యాలెండర్‌లో మొదటి ఆదివారం 7వ తేది అవుతుంది.
కాబట్టి 1 - జనవరి - 01న సోమవారం అవుతుంది.
కోడ్ ప్రకారం తేదీ + నెలకోడ్ + సంవత్సరం + లీపు సంవత్సరం + శతాబ్దం కోడ్
1 + 0 + 1 + 0 + 6 = 8
8ను 7తో భాగిస్తే శేషం 1.
అంటే సోమవారం అవుతుంది.

5. **ఒక సంవత్సరంలో ఎన్ని నెలలు సమాన క్యాలెండర్ కలిగి ఉంటాయి?**
ఎ) జనవరి, జూన్ బి) జనవరి, ఏప్రిల్
సి) జనవరి, మార్చి డి) నిర్ణయించలేం
సాధన: జవాబు నిర్ణయించలేం (డి)
ఎందుకంటే ఒక సంవత్సరం అని అడిగారు. కానీ అది సాధారణ సంవత్సరమా లీపు సంవత్సరమా ఇవ్వలేదు.

6. **11 - జనవరి - 1996 రోజు ఏ వారం అవుతుంది?**
ఎ) బుధవారం బి) గురువారం
సి) శుక్రవారం డి) శనివారం
సాధన: కోడ్ ప్రకారం
11 + 0 + 96 + 24 + 0 = 131
131ను 7తో భాగిస్తే శేషం 5 అంటే శుక్రవారం.
కానీ ఇచ్చిన ప్రశ్నలో 1996 లీపు సంవత్సరం. 1996లో జనవరి నెలలోని తేది అడిగారు. ఇది మార్చి నెలకు ముందు కాబట్టి 131-1= 130ను 7తో భాగించాలి.
అప్పుడు శేషం = 4 అంటే గురువారం అవుతుంది.
శుక్రవారం అనేది తప్పు జవాబు.
గమనిక: ఇచ్చిన ప్రశ్న లీపు సంవత్సరంలోని జనవరి లేదా ఫిబ్రవరిలో ఉంటే బేసిదినాల నుంచి 1ని తీసివేసి మిగిలిన దినాలను 7తో భాగించాలి.

7. **1 మార్చి 1996 రోజు ఏ వారం?**
సాధన:
1 + 3 + 96 + 24 + 0 = 124
124ను 7తో భాగిస్తే 5 శేషం అంటే శుక్రవారం 1996 లీపు సంవత్సరం అయినప్పటికీ బేసి దినాల నుంచి '1' తీసివేయలేదు. ఎందుకంటే కనుక్కోవాల్సింది మార్చి నెలలోని తేది.
ఫిబ్రవరిలో 29 రోజులు ఉంటాయి. కాబట్టి జనవరి, ఫిబ్రవరిలో అడిగిన ప్రశ్నకు బేసి దినాల నుంచి '1' తీసివేయాలి.

8. **2001 జనవరి 1 సోమవారం అయితే ఈ సంవత్సరంలో చివరిరోజు ఏ వారం?**
ఎ) సోమవారం బి) మంగళవారం
సి) బుధవారం డి) గురువారం
సాధన: 2001 సాధారణ సంవత్సరం = 52 వారాలు + 1 బేసి దినం కాబట్టి సోమవారమే అవుతుంది.

9. **మన మొదటి రిపబ్లిక్ డే ఏ రోజు అవుతుంది?**
ఎ) శుక్రవారం బి) శనివారం
సి) గురువారం డి) మంగళవారం
సాధన:
మన మొదటి రిపబ్లిక్ డే 26 జనవరి 1950
కోడ్ ప్రకారం 26 + 0 + 50 + 12 + 0 = 88
88ను 7తో భాగిస్తే శేషం 4 వస్తుంది.
అంటే గురువారం అవుతుంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. **ఒకవేళ జనవరి 1, 2007 సోమవారం అయితే జనవరి 1, 2008 ఏ రోజు అవుతుంది? (గ్రూప్-2, 2008)**
ఎ) ఆదివారం బి) సోమవారం
సి) బుధవారం డి) మంగళవారం
సమాధానం: డి

2. **భారత స్వాతంత్ర్య దినోత్సవం 1996లో శుక్రవారం అయితే 2000 సంవత్సరంలో ఏ వారం అవుతుంది? (వీఆర్‌వో-2012)**
ఎ) బుధవారం బి) గురువారం
సి) శుక్రవారం డి) శనివారం
సమాధానం: ఎ

Learn to live and live to learn



BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q. No.1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. She didn't (1)/ even take the trouble (2)/ to find out how to (3)/ spelling my name. (4)/ No error (5)
2. The escaped prisoners (1)/ were eventually trapped (2)/ in an underground garage (3)/ as recaptured. (4)/ No error (5)
3. He was (1)/ weakly, (2)/ cowardly and (3)/ treacherous. (4)/ No error (5)
4. The director transposes (1)/ Shakespeare's play (2)/ to 16th century Venice (3)/ to present day England. (4)/ No error (5)
5. We need to (1)/ ensure a smooth transition (2)/ between the old system (3)/ and new. (4)/ No error (5)
6. I think you'll have to (1)/ tweak these figures (2)/ a little before you shown (3)/ them to the boss.(4)/ No error (5)
7. These days it seemed (1)/ we must all submit (2)/ to the tyranny (3)/ of the motor car. (4)/ No error (5)
8. The political situation remains (1)/ highly unstable in many remote areas (2)/ even though the curfew (3)/ is lifted. (4)/ No error (5)
9. If society (1)/ is to exist as a unity, (2)/ its members may have (3)/ shared values. (4)/ No error (5)
10. The universal geriatric problems (1)/ projected in the movie (2)/ catched the attention of (3)/ the people across the world. (4)/ No error (5)

Directions (Q. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. The ceremony was transmitted ____ by satellite to ____ 50 countries.
1) open; above
2) online; around
3) streaming; almost
4) live; over
5) latest; approximately
12. The police reforms will ensure greater ____ and ____.
1) law; care 2) security; safe
3) transparency; accountability
4) trepidation; tumult
5) flexibility; reach
13. She had set a ____ for him and he had walked straight into it.
1) goal 2) objective
3) vision
4) mission 5) trap
14. A restaurant has to ____ the tricky path between maintaining ____ and keeping prices down.
1) treat; quantity
2) meet; demand
3) tread; quality
4) expect; stock
5) maintain; inventory
15. The aircraft is designed to ____ turbulent conditions.
1) withstand 2) resist
3) change 4) modify
5) oversea

Directions (Q. No. 16 - 20): Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? Mark (5) No correction required as your answer, if there is no error.

16. The city's crime rate is a serious <u>turn down</u> to potential investors.
1) Turn on 2) turn in
3) turn off 4) turn up
5) no correction required
17. The rise in violent crime <u>will may go</u> unchecked.
1) must go 2) would go
3) must not go
4) shall go
5) No correction required
18. Planes passed <u>overhead</u> with unceasing regularity.
1) over sky 2) over and above
3) outcast 4) over flown
5) No correction required
19. My son's 13 but he's <u>younger</u> for his age.
1) youngest 2) youth
3) older 4) young
5) No correction required
20. When the needle enters the red zone the engine is <u>indicator</u> hot.
1) too 2) much
3) becomes 4) left
5) No correction required

Directions (Q. No. 21-25): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in **bold** to help you locate them while answering some of the questions.

For decades, Chinese economic policymakers have drawn praise for keeping their economy growing strongly through **turbulence**, such as the Asian financial crisis of 1997-1998 and the worldwide financial tumult of 2008. But investors have begun to lose faith in Beijing's economic management. As China's economy slowed, the government decided to **deploy** the stock market to ease the pain. State-run media talked up stocks, and individual investors responded by buying shares and igniting a 150 per cent run-up in the Shanghai Composite stock index in the year through June. The hope was that Chinese companies could issue shares into a rising market and use the proceeds to **shrink** debts. But the stock bubble burst June 12. Shanghai stocks plummeted 37 per cent. The government sought futilely to intervene, suspending trading in hundreds of companies and banning big investors from selling stakes for six months. The intervention undermined Beijing's pledge to give market forces a bigger say in the economy and left policymakers looking clumsy and ineffectual.

On August 12, China surprised investors by marking down the value of its currency, the yuan. The government said it was responding to market forces: Investors had signaled that the yuan was overvalued. But skeptics worried that the devaluation was a desperate move to jolt the economy - a sign that the economy was weaker than thought. The move followed a report that exports had plunged in July. A cheaper yuan gives Chinese companies a price advantage in foreign markets. Since the devaluation, China has intervened to keep the yuan from falling too fast, confusing markets and renewing doubts about Beijing's commitment to market forces.

Chinese economic statistics have long been viewed as **dubious**. Premier Li Keqiang once acknowledged that the statistics on economic output were "man-made" and worthless. China watchers tended to shrug off the uncertainty as long as it was clear that the economy was **booming**. But now there's concern about what's really happening. Economists are looking at alternative measures of economic performance, such as electricity consumption. The London firm Consensus Economics asked several economists for forecasts based on the unconventional measures. These forecasters saw the Chinese economy growing just 5.3 per cent in the year up to the fourth quarter of 2015. Conventional forecasts have the economy growing closer to 7 per cent.

21. The Chinese economic policy makers have drawn praise during
1) The government's intervention which suspended trading
2) Selling of stock prices and upkeeping the market value
3) Undermining the value of the stock and trading stopped by the government
4) Tough times like Asian financial crisis and the worldwide financial tumult
5) individual investors responded by buying shares and igniting a 150 per cent run-up
22. What led the investors to lose faith in the Beijing's economy?
1) Praise for keeping their economy growing strongly through turbulence
2) State-run media boosted the sales by investing in more stocks
3) The government suspending trading in hundreds of companies and banned big investors from selling stakes for six months
4) Chinese companies issued shares into a rising market
5) individual investors bought shares and reinvested
23. The effect of government's intervention
1) Damaged the promise to give the market forces a bigger say in the economy
2) policy makers looked cooperative and favourable
3) effective measures to curb the slowdown boosted confidence
4) stock brokers had visualized a steady decline
5) there is an uprise in the sale of stocks
24. Devaluation of the currency
1) Was to respond to the stock and inventory
2) was in response to market forces
3) was a desperate move to jolt the economy
4) Was to respond positively to international market
5) To bring back the faith in the international trade
25. The result of devaluation of Yuan as stated in the passage is
1) exports had plunged after the move of devaluation
2) in confusing markets and renewing doubts about Beijing's commitment
3) to surprise investors by marking down the value of its currency
4) to go for alternative measures of economic performance
5) to burst the bubble of uncertainity prevalent in the minds of the investors

Directions (Q. No. 26-28): Choose the word which is MOST SIMILAR in meaning to the word given from the five options.

26. **Turbulence**
1) Turmoil 2) Stability
3) Confident 4) Organize
5) Segregate
27. **Deploy**
1) Cluster 2) Entangle
3) Install 4) Huddle
5) Disperse
28. **Booming**
1) Thriving 2) Striving
3) Demotivated 4) Annoyed
5) Provoked

Directions (Q. No. 29-30): Choose the word which is MOST OPPOSITE in meaning to the word given from the five options.

29. **Shrink**
1) Shrivel 2) Contract
3) Microscope 4) Minimize
5) Nurture
30. **Dubious**
1) Hesitant 2) Whisper
3) Summarize 4) Certain
5) Unsure

Directions (Q. No. 31-33): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. Both humans and animals learn to live and live to learn.
B. According to scientific research animals not only learn from their own mistakes, but they can learn by observing their peers messing up.
C. Making mistakes is a fundamental part of every cognitive process, whether solving a math problem, making important decisions, or trying to convey meaning in a foreign language.
D. In the animal world, avoiding blunders may dramatically improve one's chances of survival.
E. Human beings, however have a unique skill: the ability to process and mistakes.
F. Making mistakes and learning from them is not simply a human skill.

31. What is the FIFTH sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F
32. What is the THIRD sentence after rearrangement?
1) A 2) B 3) D 4) F 5) E
33. What is the LAST sentence after rearrangement?
1) A 2) B 3) D 4) E 5) F

Answers

1) 4	2) 4	3) 2	4) 3	5) 4
6) 3	7) 1	8) 5	9) 3	10) 3
11) 4	12) 3	13) 5	14) 3	15) 1
16) 3	17) 3	18) 5	19) 4	20) 1
21) 4	22) 3	23) 1	24) 2	25) 1
26) 1	27) 3	28) 1	29) 5	30) 4
31) 1	32) 2	33) 4		